సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 128

మంగళవారం 29-7-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'సంక్షేమ పథకాల అమలే సర్కారు పని తీరుకు కొలమానం'



'దివ్య'మైన విజయం...

మహిళల ప్రపంచకప్ చెస్ టైటిల్ నెగ్గిన దివ్య దేశ్‌ముఖ్. ఈ ఘనత సాధించిన తొలి భారతీయ క్రీడాకారిణిగా రికార్డు. ఫైనల్లో భారత్‌కే చెందిన స్టార్ ప్లేయర్ కోనేరు హంపిపై విజయం. గ్రాండ్‌మాస్టర్ (జీఎం) టైటిల్ హోదా కూడా ఖాయం చేసుకున్న దివ్య. స్వర్ణ పతకంతోపాటు 50 వేల డాలర్ల ప్రైజ్‌మనీ సొంతం.

- వివరాలు 14లో



..ఎందుకు హాజరయ్యారు?

అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మపై సర్వోన్నత న్యాయస్థానం ప్రశ్నల వర్షం కురిపించింది. - 6లో



ఎస్ఐఆర్‌పై స్టే ఇవ్వలేం..

ఓటరు జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)పై ఇప్పటికిప్పుడు మధ్యంతర స్టే ఇవ్వలేమని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. - 6లో



31న జస్టిస్ ఘోష్ నివేదిక!

'కాళేశ్వరం'పై విచారణ నిర్వహించిన జస్టిస్ పీసీ ఘోష్ విచారణ కమిషన్ ఈనెల 31న నివేదిక సమర్పించనున్నట్టు తెలిసింది. - 12లో



సోమవారం ఏఎస్‌జీ ఆధ్వర్యంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కలసిన.. కొత్త జడ్జీలుగా నియామకమైన చలపతిరావు, రామకృష్ణారెడ్డి, మొహియుద్దీన్, గాడి ప్రవీణ్‌కుమార్

హైకోర్టుకు నలుగురు కొత్త జడ్జీలు

- సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సులకు రాష్ట్రపతి ఆమోదం
- జడ్జీలుగా మొహియుద్దీన్, చలపతిరావు, రామకృష్ణారెడ్డి, ప్రవీణ్‌కుమార్
- న్యాయవాదుల కోటా నుంచి నలుగురికి దక్కిన అవకాశం
- 30కి చేరిన న్యాయమూర్తుల సంఖ్య.. ఇంకా 12 ఖాళీలు

2 లో

నిమిష ప్రియ మరణశిక్ష రద్దు!

- కాంతపురం ఏపీ అబూబకర్ ముస్లియార్ కార్యాలయం ప్రకటన
- అధికారికంగా ధ్రువీకరించని భారత విదేశాంగ శాఖ




సనా: భారతీయ నర్సు నిమిష ప్రియకు ఎట్టకేలకు మరణశిక్ష నుంచి విముక్తి లభించింది. యెమెన్‌లో మరణశిక్ష ఎదుర్కొంటున్న ఆమెకు గతంలో విధించిన మరణశిక్షను శాశ్వతంగా రద్దుచేసినట్టు భారత గ్రాండ్ ముఫ్తీ, సున్నీ మత ప్రబోధకుడు కాంతపురం ఏపీ అబూబకర్ ముస్లియార్ కార్యాలయం ప్రకటించింది. ఈ మేరకు సోమవారం అర్ధరాత్రి ఆయన కార్యాలయం ఒక ప్రకటన విడుదలచేసింది. అయితే భారత విదేశాంగ శాఖ నుంచి ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు. ఆమెకు మరణశిక్ష రద్దుచేయాలంటూ వస్తున్న అభ్యర్థనలను పరిశీలించేందుకు యెమెన్ రాజధాని సనా సిటీలో ఒక అత్యున్నత స్థాయి సమావేశం జరిగింది. ఈ భేటీలో ఉత్తర యెమెన్ అధికారులు, అంతర్జాతీయ దౌత్య ప్రతినిధులు పాల్గొన్నట్టు స్థానిక మీడియాలో కథనాలు వెలువడ్డాయి.



సభలో సిందూరం

ఆపరేషన్ సిందూర్‌పై పార్లమెంట్‌లో కొనసాగిన రభస

పాక్ కాళ్ల బేరానికి వచ్చినందుకే ఆపరేషన్ ఆపేశామన్న రాజ్‌నాథ్ సింగ్



లోక్‌సభలో మాట్లాడుతున్న రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్

పాక్ మళ్లీ తోక జాడిస్తే మళ్లీ సిందూర్ మొదలవుతుందన్న రక్షణ మంత్రి

- ప్రభుత్వ వివరణను తప్పుబడుతూ విపక్షాల నినాదాలు
- కాంగ్రెస్‌పై విరుచుకుపడిన హోంమంత్రి అమిత్ షా
- ప్రశ్నల వర్షం కురిపించిన కాంగ్రెస్
- బిహార్‌లో ఓటర్ల జాబితా సవరణపై చర్చ చేపట్టాలని రాజ్యసభలో పట్టుబట్టిన విపక్ష సభ్యులు
- పార్లమెంట్ మకర ద్వారం ముందు ఆందోళన

ఆపరేషన్ సిందూర్, పహల్గాం ఉదంతంపై ప్రభుత్వం వివరణనిచ్చే యత్నం.. దానికి అడుగడుగునా అడ్డుతగులుతూ విపక్షాల నినాదాలు.. సోమవారం పార్లమెంట్ ఉభయసభలూ అట్టుడికాయి. రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ లోక్‌సభలో ప్రభుత్వ వాదనను బలంగా వినిపించారు. రాజ్‌నాథ్ ప్రసంగాన్ని విపక్ష సభ్యులు అడ్డుకోవడంతో కేంద్ర హోం మంత్రి అమిత్ షా జోక్యం చేసుకుని కాంగ్రెస్‌పై నిప్పులు చెరిగారు. దీంతో సభలో ఒక్కసారిగా ఆగ్రహావేశాలు భగ్గుమన్నాయి. ఓవైపు ఆపరేషన్ సిందూర్‌పై చర్చ జరుగుతుండగానే బిహార్‌లో ఓటర్ల జాబితా సమగ్ర సవరణపైనా చర్చ జరపాలంటూ విపక్ష సభ్యులు రాజ్యసభలో పట్టుబట్టారు. దీంతో సభ పలుమార్లు వాయిదాపడి చివరకు అర్ధాంతరంగా ముగిసి మంగళవారానికి వాయిదాపడింది.

6 లో

> ఆపరేషన్ 'సిందూర్' ముమ్మాటికీ చరిత్రాత్మక సైనికచర్య. యుద్ధరంగంలో తమ ధైర్యసాహసాలను ప్రదర్శించిన ధైర్యవంతులైన సైనికులందరికీ నా సెల్యూట్. కేవలం 22 నిమిషాల్లో 9 కీలక ఉగ్రస్థావరాలపై మెరుపుదాడి చేసి మన సత్తా చాటాం. పాక్ మళ్లీ తోక జాడిస్తే మళ్లీ సిందూర్ మొదలవుతుంది.
>
> - రాజ్‌నాథ్‌సింగ్, రక్షణశాఖ మంత్రి

'పహల్గాం' ఉగ్రదాడి మాస్టర్‌మైండ్ హతం



- ఆపరేషన్ మహదేవ్..
- మరో ఇద్దరు ముష్కరులు కూడా..
- మట్టుబెట్టిన ఎలైట్ కమెండోలు
- మరో ఉగ్ర ముఠా కోసం వేట

6 లో

బీసీ కోటాపై ఢిల్లీకి..

5, 6, 7 తేదీల్లో హస్తిన కేంద్రంగా కార్యాచరణ



- 42 శాతం రిజర్వేషన్ల సాధనకు కేంద్రంపై ఒత్తిడి.. రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం
- వివరాలు వెల్లడించిన మంత్రి పొన్నం ప్రభాకర్
- 5న పార్లమెంటులో కాంగ్రెస్ పార్టీ ఎంపీల ద్వారా వాయిదా తీర్మానం
- 6న మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల చలో ఢిల్లీ.. జంతర్ మంతర్ వద్ద ధర్నా
- 7న రాష్ట్రపతితో భేటీ..బీసీ రిజర్వేషన్ల పెంపు బిల్లుల ఆమోదానికి విజ్ఞప్తి

- వివరాలు 3లో

ఎట్టి పరిస్థితుల్లోనూ ముందుకే..!

- స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల పెంపుపై కేబినెట్‌లో విస్తృత చర్చ
- ఆగస్టు 7 వరకు పోరాటం.. ఆ తర్వాత నిర్ణయం తీసుకోవాలనే అభిప్రాయం
- పట్టణ గృహ నిర్మాణ పాలసీపై కూడా చర్చ
- నల్లగొండ జిల్లా సాగునీటి ప్రాజెక్టుల సవరించిన అంచనాలకు ఆమోదం

3 లో

భూకంపం వస్తోంది.. జాగ్రత్త..!



ఆండ్రాయిడ్ ఫోన్లలో 'ప్రకంపనల' హెచ్చరిక

- 5 ఏళ్ల కిందటే అందుబాటులోకి తెచ్చిన గూగుల్
- 98 దేశాల్లో 79 కోట్ల మందికి అలర్ట్స్ జారీ
- ప్రపంచవ్యాప్తంగా 250 కోట్ల ఫోన్లలో ఏఈఏ

ఫోన్ అంటే కాల్స్, మెసేజెస్, వినోదమేనా? అంతకు మించి.. చూడ్డానికి చిన్న పరికరమే కావొచ్చు కానీ కొన్ని సందర్భాల్లో ప్రాణాలను కాపాడే సంజీవని కూడా. అవును మీరు చదువుతున్నది నిజమే. భూకంప కేంద్రం నుంచి తీవ్రత చుట్టుపక్కల ప్రాంతాలకు విస్తరించేలోపే.. విపత్తు రాబోతోందని యూజర్లను హెచ్చరించే వ్యవస్థ ఆండ్రాయిడ్ ఫోన్లలో ఉంది. మొబైల్‌లోని యాక్సిలరేషన్ సెన్సార్ల ఆధారంగా పనిచేసే ఈ వ్యవస్థ ప్రపంచంలో భూకంప ప్రభావిత ప్రాంతాలలో నివసించే ప్రజలకు సందేశాల రూపంలో హెచ్చరిస్తోంది.

- సాక్షి, స్పెషల్ డెస్క్

ఆండ్రాయిడ్ ఎర్త్‌క్వేక్ అలర్ట్ (ఏఈఏ) వ్యవస్థను ఆండ్రాయిడ్ ఆపరేటింగ్ సిస్టమ్‌ను అభివృద్ధి చేసిన టెక్నాలజీ దిగ్గజం గూగుల్ 2020 నుంచి ఆండ్రాయిడ్ ఫోన్లలో పరిచయం చేసింది. ప్రాథమిక (ప్రైమరీ వేవ్స్), ద్వితీయ (సెకండరీ వేవ్స్) భూకంప తరంగాలను ఈ వ్యవస్థ గుర్తిస్తుంది. ఏఈఏ సిస్టమ్ ఇప్పటి వరకు 98 దేశాలలో భూకంప ప్రభావిత ప్రాంతాలలో నివసించే ప్రజలకు హెచ్చరికలను పంపింది. ఇప్పటి వరకు 18,000 పైచిలుకు భూకంప సంఘటనలకు సంబంధించి 79 కోట్లకుపైగా అలర్ట్స్ జారీ చేసింది. ఈ వ్యవస్థ ఇప్పుడు నెలకు సగటున 60 హెచ్చరికలను పంపుతోంది. దాదాపు 1.8 కోట్ల మంది కనీసం ఒక హెచ్చరికనైనా అందుకుంటున్నారు. ప్రపంచవ్యాప్తంగా 250 కోట్ల మంది ఆండ్రాయిడ్ యూజర్లకు ఈ సేవలు అందుబాటులో ఉన్నాయి. గూగుల్, యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా బర్కిలీ సీస్మాలజీ ల్యాబొరేటరీ మూడు సంవత్సరాలుగా ఈ వ్యవస్థ పనితీరు, పద్ధతులను వివరిస్తూ డేటాను విడుదల చేశాయి.

సెకన్ల ముందు హెచ్చరిక..

భూకంపం వచ్చే కొన్ని సెకన్ల ముందు యూజర్లకు ఏఈఏ హెచ్చరిక సందేశాన్ని పంపుతుంది. భూకంప తీవ్రత సాధారణంగా ఉండే అవకాశం ఉంటే 'మీరు జాగ్రత్త' అని, ముప్పు తీవ్రరూపం దాల్చే అవకాశం ఉంటే ఆడియో రూపంలో వార్నింగ్‌తోపాటు పారాహుషార్ అంటూ హెచ్చరిస్తుంది. భూ ప్రకంపనలను గుర్తించడానికి ఫోన్‌లోని యాక్సిలెరోమీటర్ సాయంతోనే భూ ప్రకంపనలను ఈ వ్యవస్థ గుర్తిస్తుంది. భూకంప తరంగాలు ఫోన్‌ను చేరగానే ఆ సమాచారాన్ని గూగుల్ సర్వర్లకు పంపుతుంది. ఒక ప్రాంతంలోని ఇతర ఫోన్ల నుంచి కూడా ఇలాంటి సమాచారమే వస్తే భూకంపం సంభవించినట్టు గూగుల్ నిర్ధారిస్తుంది. అత్యంత తీవ్రంగా భూమి కంపించకముందే ప్రభావిత ప్రాంతంలో.. ఆండ్రాయిడ్ ఫోన్‌ను వాడుతున్న వారికి ఈ వ్యవస్థ హెచ్చరికలను పంపుతుంది. భూకంప తరంగాల కంటే వేగంగా హెచ్చరికలను ప్రసారం చేయడానికి ఏఈఏ కాంతి వేగాన్ని ఉపయోగిస్తుంది.

కోట్లాది మందికి..

2023 నవంబర్‌లో ఫిలిప్పీన్స్‌లో 6.7 తీవ్రతతో భూకంపం సంభవించినప్పుడు.. భూకంపం ప్రారంభమైన 18.3 సెకన్ల తర్వాత ఈ వ్యవస్థ మొదటి హెచ్చరికను పంపింది. అత్యంత తీవ్ర ప్రకంపనలు సంభవించిన భూకంప కేంద్రానికి దగ్గరగా ఉన్నవారికి 15 సెకన్లపాటు మెసేజులు పంపారు. దూరంగా ఉన్నవారికి, తక్కువ ప్రకంపనలు వచ్చిన ప్రాంత యూజర్లకు ఒక నిమిషంపాటు అలర్ట్స్ జారీ చేశారు. ఇలా మొత్తంగా 25 లక్షల మందిని అప్రమత్తం చేశారు. 2023 నవంబర్‌లో నేపాల్‌లో 5.7 తీవ్రతతో భూకంపం వచ్చినప్పుడు కోటి మందికిపైగా హెచ్చరికలు అందాయి. 2025 ఏప్రిల్‌లో టర్కీలో భూమి కంపించడం ప్రారంభమైన 8 సెకన్ల తర్వాత మొదటి అలర్ట్ జారీ అయింది. ఈ ఘటనలో 1.1 కోట్ల మందికిపైగా ఈ సందేశాలు అందుకున్నారు.

యూఎస్‌తో మొదలు..

ఏఈఏ వ్యవస్థ తొలుత 2020లో యూఎస్‌లో మొదలైంది. 2021లో న్యూజిలాండ్, గ్రీస్‌లో, ఆ తర్వాత మిగిలిన దేశాలకు విస్తరించారు. ఈ వ్యవస్థ హెచ్చరించిన సంఘటనల్లో 2023లో టర్కీ–సిరియా (రిక్టర్ స్కేల్‌పై తీవ్రత 7.8), ఫిలిప్పీన్స్ (6.7), నేపాల్ (5.7), 2025 ఏప్రిల్‌లో టర్కీలో 6.2 తీవ్రతతో సంభవించిన భూకంపాలు ఉన్నాయి. ఇప్పటివరకు గుర్తించిన సంఘటనలలో 2,000 కంటే ఎక్కువ తీవ్ర భూకంపాలు ఉన్నాయి. ఇక ఏఈఏ బృందం 2023 ఫిబ్రవరి–2024 ఏప్రిల్ మధ్య 15 మందిని సర్వే చేస్తే.. 79% మంది ఈ హెచ్చరికలు చాలా ఉపయోగకరంగా ఉన్నాయని తెలిపారు. భూకంపం రాకముందే హెచ్చరిక అందుకున్నట్టు 5.4 లక్షల మంది చెప్పడం విశేషం.



అలర్ట్స్ అందుకోవాలంటే వినియోగదారులు వైఫై లేదా సెల్యులార్ డేటా కనెక్టివిటీని కలిగి ఉండాలి. ఆండ్రాయిడ్ ఎర్త్‌క్వేక్ అలర్ట్, లొకేషన్ సెట్టింగ్స్ రెండూ ఆన్‌లో ఉండాలి.

భూకంప తీవ్రత సాధారణంగా ఉండే అవకాశం ఉంటే 'మీరు జాగ్రత్త' అని, ముప్పు తీవ్రరూపం దాల్చే అవకాశం ఉంటే ఆడియో రూపంలో వార్నింగ్‌తోపాటు పారాహుషార్ అంటూ హెచ్చరిస్తుంది.

అలర్ట్ ఎప్పుడు వచ్చిందంటే..

15 లక్షల మందిని ఏఈఏ బృందం సర్వే చేస్తే మూడింట ఒక వంతు మందికిపైగా.. భూకంపం రావడానికంటే ముందే తమకు మెసేజ్ వచ్చిందని చెప్పారు.

36% మంది	28% మంది	23% మంది
భూకంపం తమ వరకు రాకముందే..	భూకంప సమయంలో	భూకంపం సంభవించిన తరువాత..

ఆ మూడు మంత్రి పదవులు బీసీలకే ఇవ్వాలి

- సీఎం రేవంత్‌రెడ్డికి బీజేపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్ర మంత్రివర్గంలో ఖాళీగా ఉన్న మంత్రి పదవులను బీసీలకే ఇవ్వాలని బీజేపీ రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య సీఎం రేవంత్‌రెడ్డిని డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ బీసీ కాదనడానికి ఆయన ఏమైనా తహసీల్దారా? లేదా రెవెన్యూ ఇన్‌స్పెక్టరా? అని ప్రశ్నించారు. ప్రధాని మోదీని, బీసీలను అవమానించేలా రేవంత్ చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. సోమవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో కృష్ణయ్య విలేకరులతో మాట్లాడారు. బీసీలకు బీజేపీ సరైన గుర్తింపు ఇవ్వడం లేదని సీఎం చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టారు. ఒక బీసీని ప్రధాని చేసిన ఘనత బీజేపీదేనని గుర్తుచేశారు. కాంగ్రెస్ పాలనలో ఒక్క బీసీనైనా ప్రధానిని చేశారా? అని ప్రశ్నించారు. ప్రధాని మోదీ, బీజేపీలపై రేవంత్‌రెడ్డి బురదజల్లే ప్రయత్నం మానుకోవాలని హితవు పలికారు. ఇటీవల తెలంగాణలో ఇన్ఫర్మేషన్ కమిషనర్లను నియమిస్తే వారిలో ఒక్క బీసీ కూడా లేరన్నారు. రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయకుంటే తీవ్ర పరిణామాలుంటాయని కృష్ణయ్య హెచ్చరించారు.



ఈ అప్పులు, హామీల అమలు ఎందుకు సార్! రాష్ట్రాన్నే దత్తత ఇచ్చేస్తే పోలా!!

హైకోర్టుకు నలుగురు కొత్త జడ్జీలు

సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సులకు రాష్ట్రపతి ఆమోదం

- జడ్జీలుగా మొహియుద్దీన్, చలపతిరావు, రామకృష్ణారెడ్డి, ప్రవీణ్‌కుమార్
- న్యాయవాదుల కోటా నుంచి నలుగురికి దక్కిన అవకాశం
- మొత్తంగా 30కి చేరిన న్యాయమూర్తుల సంఖ్య.. ఇంకా 12 ఖాళీలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ హైకోర్టుకు నలుగురు కొత్త న్యాయమూర్తులను నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గౌస్ మీరా మొహియుద్దీన్, సుద్దాల చలపతిరావు, వాకిటి రామకృష్ణారెడ్డి, గాడి ప్రవీణ్‌కుమార్ నియామకానికి రాష్ట్రపతి ఆమోదం తెలిపారు. సుప్రీంకోర్టు కొలీజియం ఈ నెల 3న వీరి పేర్లను సిఫార్సు చేసిన విషయం తెలిసిందే. ఈ సిఫార్సులకు ఆమోదం తెలుపుతూ కేంద్ర ప్రభుత్వం సోమవారం గెజిట్ జారీ చేసింది. దీంతో వీరు అదనపు న్యాయమూర్తులుగా త్వరలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. కొత్త జడ్జీలుగా నియమితులైన నలుగురు అసిస్టెంట్ సొలిసిటర్ జనరల్ నరసింహశర్మతో కలసి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రస్తుతం హైకోర్టులో 26 (సీజేతో కలిపి) మంది న్యాయమూర్తులున్నారు. ఈ నలుగురి ప్రమాణం స్వీకారం తర్వాత ఆ సంఖ్య 30కి చేరనుంది. ఇంకా 12 పోస్టులు ఖాళీగా ఉంటాయి. కాగా, సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసిన జస్టిస్ అభిషేక్‌రెడ్డి, జస్టిస్ కన్నెగంటి లలిత, జస్టిస్ సుమలత బదిలీపై ఇక్కడికి రావాల్సి ఉంది. ఈ బదిలీలకు కేంద్రం ఇంకా ఆమోదం తెలుపలేదు. అలాగే తడకమళ్ల వినోద్‌కుమార్‌ను మద్రాస్ హైకోర్టుకు బదిలీ చేసిన విషయం తెలిసిందే.

సుద్దాల చలపతిరావు..



చలపతిరావు 1971, జూన్ 25న జనగాంలో జన్మించారు. 1998, మార్చి 26న న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. న్యాయవాది వై.రామారావు వద్ద 1998 నుంచి 2004 వరకు జూనియర్‌గా పనిచేశారు. 2004 నుంచి స్వతంత్ర ప్రాక్టీస్ ప్రారంభించారు. రంగారెడ్డి, సిటీ సివిల్ కోర్టులతోపాటు హైకోర్టులో సివిల్, క్రిమినల్ సహా అన్ని విభాగాల కేసులు వాదించారు. జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ స్టాండింగ్ కౌన్సిల్‌గా 2022 నుంచి విధులు నిర్వహిస్తున్నారు.

వాకిటి రామకృష్ణారెడ్డి



రామకృష్ణారెడ్డి 1970, సెప్టెంబర్ 14న జన్మించారు. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం కొండమడుగు స్వగ్రామం. వీరిది వ్యవసాయ కుటుంబం. తండ్రి సర్పంచ్‌గా, జెడ్పీటీసీగా సేవలందించారు. తల్లి గృహిణి. బీకామ్ ఎల్ఎల్‌బీ పూర్తిచేసి 1998లో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. న్యాయవాది ఎ.అనంతసేన్‌రెడ్డి వద్ద జూనియర్‌గా పనిచేశారు. 2005 నుంచి స్వతంత్ర ప్రాక్టీస్ ప్రారంభించారు. రంగారెడ్డి, సికింద్రాబాద్, సిటీ సివిల్ కోర్టుతోపాటు తెలంగాణ, ఏపీ హైకోర్టుల్లో వాదనలు వినిపించారు. రాజ్యాంగ, సివిల్, క్రిమినల్, రెవెన్యూ, ట్యాక్స్, ఫ్యామిలీ, కంపెనీ లా విభాగాల్లో సమర్థుడిగా పేరు పొందారు. 2016–17లో తొలి తెలంగాణ హైకోర్టు అడ్వొకేట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈడీ స్టాండింగ్ కౌన్సిల్ విధులు నిర్వహిస్తున్నారు.

గౌస్ మీరా మొహియుద్దీన్..



గౌస్ 1969, జూలై 15న జన్మించారు. హైదరాబాద్‌లోని బాలానగర్‌కు చెందిన వారు. తండ్రి మహమ్మద్ ఇస్మాయిల్ హెచ్ఎంటీ మేనేజర్‌గా పనిచేశారు. వెంకటేశ్వర యూనివర్సిటీ పరిధిలోని నెల్లూరు వీఆర్ న్యాయ కళాశాల నుంచి న్యాయ విద్య పూర్తి చేశారు. ఉస్మానియా వర్సిటీలో ఎల్ఎల్ఎం చదివారు. 1993 మార్చి 17న న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. ఉమ్మడి బార్ కౌన్సిల్, తెలంగాణ బార్ కౌన్సిల్‌కు స్టాండింగ్ కౌన్సిల్‌గా విధులు నిర్వర్తించారు. సివిల్, రాజ్యాంగంతోపాటు పలు విభాగాల్లో సమర్థ వాదనలు వినిపించారు.

గాడి ప్రవీణ్‌కుమార్...



ప్రవీణ్‌కుమార్ 1971, ఆగస్టు 28న జన్మించారు. నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ స్వస్థలం. కాకతీయ వర్సిటీ నుంచి ఎల్ఎల్‌బీ పూర్తి చేశారు. ఉస్మానియా వర్సిటీలో ఎంఏ, ఎల్ఎల్ఎం చదివారు. 1998, నవంబర్ 12న న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. హైకోర్టు, అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్స్, లేబర్ కోర్టులో పలు కేసులు వాదించారు. రాజ్యాంగం, సర్వీస్ మ్యాటర్, లేబర్ లా, క్రిమినల్ లా.. వంటి పలు విభాగాల్లో సమర్థుడిగా పేరు తెచ్చుకున్నారు. ప్రస్తుతం హైకోర్టులో డిప్యూటీ సొలిసిటర్ జనరల్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

ఏపీ హైకోర్టులో శాశ్వత న్యాయమూర్తులుగా నలుగురు

జస్టిస్ హరినాథ్, జస్టిస్ కిరణ్మయి, జస్టిస్ సుమతి, జస్టిస్ విజయ్ పేర్లను సిఫారసు చేసిన సుప్రీంకోర్టు కొలీజియం



జస్టిస్ హరినాథ్



జస్టిస్ కిరణ్మయి



జస్టిస్ జగడం సుమతి



జస్టిస్ న్యాపతి విజయ్

సాక్షి, అమరావతి: ఏపీ హైకోర్టులో అదనపు న్యాయమూర్తులుగా ఉన్న జస్టిస్ నూనెపల్లి హరినాథ్, జస్టిస్ మండవ కిరణ్మయి, జస్టిస్ జగడం సుమతి, జస్టిస్ న్యాపతి విజయ్‌లను శాశ్వత న్యాయమూర్తులుగా నియమించాలని సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ గవాయ్ నేతృత్వంలో జరిగిన కొలీజియం సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేశారు. సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసులకు రాష్ట్రపతి ఆమోదముద్ర వేసి నియామక ఉత్తర్వులు జారీచేసిన తరువాత ఈ నలుగురు న్యాయమూర్తులు కూడా శాశ్వత న్యాయమూర్తులుగా ప్రమాణం చేస్తారు. ప్రస్తుతం హైకోర్టులో శాశ్వత న్యాయమూర్తులు 20 మంది ఉన్నారు. ఈ నలుగురితో ఆ సంఖ్య 24కి చేరుతుంది. మరో ఐదుగురు అదనపు న్యాయమూర్తులుగా కొనసాగుతారు. వీరు కూడా 2026–27లో శాశ్వత న్యాయమూర్తులు అవుతారు. జస్టిస్ హరినాథ్, జస్టిస్ కిరణ్మయి, జస్టిస్ సుమతి, జస్టిస్ విజయ్‌లు 2023 అక్టోబరు 21న హైకోర్టు అదనపు న్యాయమూర్తులుగా నియమితులైన విషయం తెలిసిందే.

త్వరలో ఒకటే స్టాంపు పేపర్!

- రూ.20, రూ.50 ఎన్‌జేఎస్ పేపర్ల రద్దు యోచన
- అన్నింటికీ రూ.100 స్టాంపు పేపరే వాడకం
- కొన్ని వర్గాలకు, కొన్ని పనుల్లో 'స్టాంపు'మినహాయింపు
- బూట్ పద్ధతిలో చేపట్టే పనులపై 0.5 శాతం స్టాంపు డ్యూటీ
- సరికొత్త విధానంపై రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు



సాక్షి, హైదరాబాద్: సరికొత్త స్టాంపుల విధానాన్ని అమల్లోకి తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ప్రస్తుతం ఉన్న నాన్ జ్యుడీషియల్ స్టాంపు పేపర్లలో రూ.20, రూ.50 విలువగల పేపర్లను రద్దుచేయాలని యోచిస్తున్నట్లు తెలిసింది. బహుళ ప్రయోజనకరంగా ఉపయోగించే నాన్ జ్యుడీషియల్ స్టాంపు పేపర్ల (ఎన్‌జేఎస్) విధానంతోపాటు అనేక అంశాల్లో మార్పులు చేస్తూ కొత్త స్టాంపుల విధానాన్ని అమల్లోకి తెచ్చేందుకు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కసరత్తు మొదలుపెట్టింది. కొత్త విధానంలో స్టాంపు డ్యూటీ విధింపు, మినహాయింపుల్లో కూడా మార్పులు రానున్నాయి. కొత్త పాలసీ ప్రభుత్వ పరిశీలనలో ఉందని, చర్చల అనంతరం దీనికి తుదిరూపు ఇస్తారని రిజిస్ట్రేషన్ల శాఖ వర్గాల ద్వారా తెలిసింది.

లాభం లేదు.. భారమే అధికం

రాష్ట్రంలో ప్రస్తుతం రూ.20, రూ.50, రూ.100 స్టాంపు పేపర్లు అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వం లైసెన్సులు జారీ చేసిన స్టాంపు వెండార్లతోపాటు రిజిస్ట్రేషన్ల శాఖ వీటిని ప్రజలకు అందుబాటులో ఉంచుతోంది. రూ.50 వేల విలువ వరకు జరిగే లావాదేవీలకు రూ.20.. రూ.లక్ష లోపు లావాదేవీలకు రూ.50.. రూ.లక్ష కంటే ఎక్కువ విలువ ఉండే లావాదేవీలకు రూ.200 చొప్పున (రూ.100 స్టాంపు పేపర్లు రెండు) స్టాంపు పేపర్లను ఉపయోగిస్తున్నారు. పలు రకాల అఫిడవిట్లు, డిక్లరేషన్లు, ఒప్పంద పత్రాలు, సేల్‌డీడ్‌లు, కంపెనీల మధ్య ఒప్పందాలు తదితర అనేక లావాదేవీల్లో వీటిని ఉపయోగిస్తుంటారు. ప్రస్తుతం భౌతికమైన స్టాంపు పేపర్లతోపాటు ఆన్‌లైన్ ఫార్మాట్ (ఫ్రాంకింగ్)లో ఈ స్టాంపు పేపర్లు అందుబాటులో ఉంటున్నాయి. వీటిని నాసిక్‌లోని ముద్రణాలయం నుంచి దిగుమతి చేసుకోవాల్సి ఉంటుంది. అయితే, వీటి నిర్వహణ, సీలింగ్, పేపర్, రవాణా లాంటి ఖర్చులు కలిపితే రూ.20, రూ.50 స్టాంపులను ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వానికి వాటి విలువ కంటే ఎక్కువ ఖర్చవుతోందని, స్టాంపు వెండార్లకు ఇచ్చే 5 శాతం కమీషన్ కలిపితే వీటి అమ్మకాల వల్ల ప్రభుత్వంపై అధిక భారం పడుతోందని రిజిస్ట్రేషన్ల శాఖ వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో రూ.20, రూ.50 స్టాంపు పేపర్లను రద్దు చేయాలని, రూ.100 విలువైన పేపర్లను మాత్రమే అందుబాటులో ఉంచాలని ప్రభుత్వం భావిస్తోంది. అంతేకాకుండా స్టాంపు పేపర్ల సరఫరా నుంచి ప్రభుత్వం పూర్తిగా తప్పుకుని ఫ్రాంకింగ్ విధానంలో మాత్రమే ముందుకెళ్లేలా కొత్త పాలసీలో పెట్టాలని యోచిస్తున్నట్లు తెలిసింది. ప్రతి లావాదేవీకి రూ.100 స్టాంపు పేపర్లు కొనుగోలు చేయడం విద్యార్థులు, రైతులు వంటి వర్గాలకు భారమవుతుందని భావించి.. ఆయా వర్గాలు ప్రభుత్వ భాగస్వామ్యం ఉన్న కార్యక్రమాల్లో ఇచ్చే అఫిడవిట్లు, డిక్లరేషన్లను మాత్రం ఉచితంగా ఇచ్చేలా పాలసీలో మార్పులు తేవాలనే ప్రతిపాదనను కూడా పరిశీలిస్తున్నారు.

కొందరికి మినహాయింపు: స్టాంపు డ్యూటీ విషయంలోనూ కొత్త పాలసీలో మార్పులు తేవాలని ప్రభుత్వం భావిస్తోంది. భూములు లేదా ఆస్తులను మహిళల పేరిట రిజిస్ట్రేషన్ చేస్తే స్టాంపు డ్యూటీలో 1 శాతం మినహాయింపు ఇవ్వాలని యోచిస్తోంది. కాంట్రాక్టు పనులకు ప్రస్తుతం గరిష్టంగా రూ.200 స్టాంపు డ్యూటీ విధిస్తుండగా ఇకపై 'బూట్' పద్ధతిలో నిర్వహించే కాంట్రాక్టు పనులకు స్టాంపు డ్యూటీని విధించాలని, మొత్తం పని విలువలో 0.5 శాతాన్ని డ్యూటీ కింద వసూలు చేయాలని, ఈ మొత్తం గరిష్టంగా రూ.20 లక్షల వరకు ఉండేలా కొత్త పాలసీలో ప్రతిపాదనలు సిద్ధమవుతున్నట్టు సమాచారం.

పార్లమెంట్‌లో తెలంగాణ

గోదావరి–బనకచర్లపై తెలంగాణ అభ్యంతరం

- ప్రాజెక్టుపై రాష్ట్రాల అభిప్రాయాల తర్వాతే నిర్ణయం
- రాజ్యసభలో మరోసారి స్పష్టం చేసిన కేంద్ర జలశక్తి శాఖ

సాక్షి, న్యూఢిల్లీ: గోదావరి నీటిని పోలవరం ద్వారా బనకచర్లకు మళ్లించే ప్రతిపాదిత ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరాలు తెలిపిందని కేంద్ర జలశక్తి శాఖ మరోసారి స్పష్టం చేసింది. కాంగ్రెస్ ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ అడిగిన ప్రశ్నకు కేంద్ర జలశక్తి శాఖ సహాయ మంత్రి రాజ్‌భూషణ్ చౌదరి రాజ్యసభలో సోమవారం లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ప్రస్తుతానికి 'పోలవరం–బనకచర్ల లింక్ ప్రాజెక్టు'కొరకు ఏ పనులూ ప్రారంభించలేదని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేవలం సెంట్రల్ వాటర్ కమిషన్‌కు తాత్కాలిక అధ్యయన నివేదికను మాత్రమే సమర్పించినట్లు కేంద్రమంత్రి తెలిపారు. అంతేగాక పోలవరం–బనకచర్ల లింక్ ప్రాజెక్టుపై తెలంగాణ రాష్ట్రం వ్యతిరేకత వ్యక్తం చేసిన విషయాన్ని కేంద్రం గమనించిందని, సంబంధిత అధికారులతో పాటు కో–బేసిన్ రాష్ట్రాల అభిప్రాయాలపై సంపూర్ణ సంప్రదింపుల నేపథ్యంలో ప్రాజెక్టు టెక్నో–ఎకనామిక్ అప్రైజల్ ప్రక్రియ కొనసాగుతోందని కేంద్ర జలశక్తి శాఖ వెల్లడించింది.

బుద్ధవనంలో డిజిటల్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్

తెలంగాణ పర్యాటకరంగ అభివృద్ధికి మద్దతు ఇచ్చేందుకు కేంద్రం కట్టుబడి ఉందని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ తెలిపారు. స్వదేశ్ దర్శన్ 2.0లో భాగంగా చేపట్టిన చాలెంజ్ ఆధారిత గమ్యస్థాన అభివృద్ధి (సీబీడీడీ) ఉప పథకం కింద తెలంగాణలో రెండు ప్రధాన ప్రాజెక్టులను కేంద్ర పర్యాటక శాఖ మంజూరు చేసిందన్నారు. నల్లగొండ జిల్లాలోని బుద్ధవనంలో డిజిటల్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్, కామారెడ్డి జిల్లాలోని నిజాంసాగర్ వద్ద ఎకోటూరిజం ప్రాజెక్టులకు కేంద్రం ఆమోదం తెలిపిందని చెప్పారు. బుద్ధవనంలో నిర్మించబోయే డిజిటల్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ద్వారా తెలంగాణలో బౌద్ధ పర్యాటక రంగాన్ని ప్రోత్సహించే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. మరోవైపు నిజాంసాగర్ ప్రాజెక్టు ద్వారా వాటర్ స్పోర్ట్స్, ప్రకృతి ప్రదేశాల పరిరక్షణ, పర్యాటకులకు ఆకర్షణగా నిలుస్తున్న అవకాశాలు పెరగనున్నాయని తెలిపారు. ఈ రెండు ప్రాజెక్టులకు కలిపి రూ. 34.83 కోట్లు మంజూరు చేశామని బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ అడిగిన ప్రశ్నకు సోమవారం లోక్‌సభలో కేంద్రమంత్రి షెకావత్ ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు.

హైదరాబాద్‌లో ఖేలో ఇండియా–2026?

ఖేలో ఇండియా గేమ్స్ 2026 హైదరాబాద్‌లో నిర్వహించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆసక్తి చూపిందని కేంద్ర యువజన, క్రీడల మంత్రి డా.మన్‌సుఖ్ మాండవీయ తెలిపారు. అయితే, ఖేలో ఇండియా గేమ్స్ నిర్వహణకు అవసరమైన మౌలిక వసతులు, హోటల్ వసతులు, రవాణా సౌకర్యాలు తదితర అంశాల ఆధారంగా జాతీయ స్థాయిలో నిర్ణయం తీసుకుంటారని కేంద్రమంత్రి పేర్కొన్నారు. అందువల్ల ప్రస్తుతం తెలంగాణకు ఖేలో ఇండియా గేమ్స్ 2026 నిర్వహించే అర్హత లభిస్తుందా అనే దానిపై తేల్చలేమన్నారు. కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు సోమవారం లోక్‌సభలో కేంద్రమంత్రి లిఖితపూర్వక సమాధానం ఇస్తూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం కేంద్రానికి రూ.100 కోట్ల విలువైన ప్రతిపాదనలు సమర్పించినట్టు తెలిపారు. కాగా భవిష్యత్తులో భారత్ ఒలింపిక్ గేమ్స్‌కు ఆతిథ్యమివ్వాలన్న ప్రయత్నాల్లో భాగంగా – 2036 ఒలింపిక్స్‌లో కనీసం రెండు ఈవెంట్లను తెలంగాణలో జరిపేలా కేంద్రం జోక్యం చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం కోరిందని కేంద్ర మంత్రి తెలిపారు.

తెలంగాణకు సీఆర్ఐఎఫ్ నిధులు మంజూరు చేయండి

- కరీంనగర్–జగిత్యాల రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించండి
- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి బండి సంజయ్ విజ్ఞప్తి



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో పలు రోడ్ల విస్తరణ పనులకు సంబంధించి ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉన్నాయని, దీనిని దృష్టిలో పెట్టుకుని వెంటనే సెంట్రల్ రోడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (సీఆర్ఐఎఫ్) నిధులను విడుదల చేయాలని కోరుతూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ కేంద్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కోరారు. ఈ మేరకు సోమవారం ఢిల్లీలో నితిన్ గడ్కరీని కలిసి సంజయ్ వినతి పత్రం అందజేశారు. తన పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పెండింగ్‌లో ఉన్న రోడ్ల ప్రతిపాదనలను కేంద్ర మంత్రికి అందజేశారు. మొత్తం రూ.113 కోట్లతో కూడిన సీఆర్ఐఎఫ్ ప్రతిపాదనలను గడ్కరీకి సమర్పించారు. సానుకూలంగా స్పందించిన గడ్కరీ త్వరలోనే తెలంగాణకు సీఆర్ఐఎఫ్ నిధుల విడుదలపై తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

కరీంనగర్–జగిత్యాల పనులు ప్రారంభించండి...

దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కరీంనగర్–జగిత్యాల రోడ్డు విస్తరణ పనులను వెంటనే ప్రారంభించాలని గడ్కరీని బండి సంజయ్ కోరారు. పనుల ప్రతిపాదనలకు ఆమోదం, టెండర్ ప్రక్రియను ప్రారంభిస్తామని అధికారులు హామీ ఇచ్చి నెలలు దాటుతున్నా నేటికీ టెండర్ ప్రక్రియ ప్రారంభం కాలేదన్నారు. వెంటనే సంబంధిత శాఖ ఉన్నతాధికారులను పిలిపించిన గడ్కరీ అందుకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. వెంటనే టెండర్ ప్రక్రియను పూర్తి చేసి పనులకు శ్రీకారం చుడతామని హామీ ఇచ్చారు.

కేంద్ర మంత్రికి ప్రతిపాదనలు...

- కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలంలోని బావుపేట–ఖాజీపూర్ రోడ్డులో భాగంగా మానేరు నదిపై హైలెవల్ బ్రిడ్జ్ నిర్మాణం
- గన్నేరువరం మండలంలోని గుండ్లపల్లి–పోతూర్ రోడ్డు విస్తరణ
- చందుర్తి నుంచి మోత్కురావుపేట వరకు (కి.మీ 5/0 నుంచి 8/450 వరకు), కిస్టంపల్లి వరకు రోడ్డుపై వంతెన నిర్మాణం
- శంకరపట్నం మండలంలోని అర్కాండ్ల (గ్రామం) నుంచి కన్నాపూర్ (గ్రామం) వరకు వరద కాలువపై హైలెవల్ బ్రిడ్జ్ నిర్మాణం

తెలంగాణలో రూ.78,944 కోట్ల ముద్రా రుణాలు

- లోక్‌సభలో కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో ప్రతిష్టాత్మకంగా అమలవుతున్న ప్రధానమంత్రి ముద్రా యోజన (పీఎంఎంవై) కింద ఇప్పటివరకు 80.86 లక్షల రుణ ఖాతాల ద్వారా రూ.78,944 కోట్లకు పైగా రుణాలు మంజూరయ్యాయని కేంద్ర ఆర్థిక శాఖ తెలిపింది. చిన్న, అతి చిన్న వ్యాపారవేత్తలు, స్టార్టప్‌లు, మహిళా పారిశ్రామికవేత్తలు ఈ పథకం ద్వారా లబ్ధిపొందినట్లు బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సోమవారం లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయమంత్రి పంకజ్ చౌదరి సమాధానమిచ్చారు. అత్యధికంగా హైదరాబాద్ జిల్లాలో రూ.20,565 కోట్లు, రంగారెడ్డి జిల్లాలో రూ.6,614 కోట్లు, నల్లగొండ రూ.3,109 కోట్లు, నిజామాబాద్ రూ.3,254 కోట్లు, ఖమ్మం రూ.3,315 కోట్లు, కరీంనగర్ రూ.3,192 కోట్లు, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో రూ.3,209 కోట్లతో పాటు నల్లగొండ, వరంగల్ (అర్బన్), సంగారెడ్డి, సూర్యాపేట, మెదక్ జిల్లాల్లో కూడా గణనీయంగా ప్రధానమంత్రి ముద్రా రుణాలు మంజూరయ్యాయి. ముద్రా పథకాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రజలలో అవగాహన కలిగించేలా ప్రచార కార్యక్రమాలు, గ్యారంటీ పథకం, బ్యాంకుల్లో ముద్రా నోడల్ అధికారుల నియామకం వంటి పలు చర్యలు కేంద్రం తీసుకుందని కేంద్రమంత్రి తెలిపారు.

జల విద్యుత్ వివాదంపై సుప్రీం విచారణ

- ఆగస్టు 19కి వాయిదా వేసిన ధర్మాసనం

సాక్షి, న్యూఢిల్లీ: ఏపీ, తెలంగాణ మధ్య జల విద్యుత్ వివాదంపై విచారణను సుప్రీంకోర్టు ఆగస్టు 19కి వాయిదా వేసింది. తెలంగాణ ప్రభుత్వం అనుమతులు లేకుండా విద్యుదుత్పత్తి చేస్తోందంటూ.. 2021లో కేంద్రానికి ఏపీ ఫిర్యాదు చేసింది. అదే ఏడాది జూలై 14న సుప్రీంలో పిటిషన్ వేసింది. తెలంగాణ సర్కారు జారీ చేసిన జీవో 34ను రద్దు చేయాలని కోరుతూ గతేడాది సెప్టెంబర్ 7న ఏపీ సుప్రీంలో మరో పిటిషన్ దాఖలు చేసింది. ఆ రెండు పిటిషన్లపై సోమవారం విచారించిన సుప్రీంకోర్టు తదుపరి విచారణను ఆగస్టు 19కి వాయిదా వేసింది.

క్లుప్తంగా...

బీసీల ఓట్ల కోసమే కాంగ్రెస్, బీజేపీ డ్రామాలు

మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: రిజర్వేషన్ల పెంపు పేరిట.. బీసీల ఓట్ల కోసం కాంగ్రెస్, బీజేపీ డ్రామాలు ఆడుతున్నాయని మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. ముస్లిం రిజర్వేషన్లను సాకుగా చూపుతూ.. బీసీ రిజర్వేషన్ల పెంపునకు బీజేపీ అడ్డుపడుతోందన్నారు. ఆయన తెలంగాణ భవన్‌లో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఓబీసీ వర్గాల వెనుకబాటుతనంపై దేశ వ్యాప్తంగా చర్చ జరుగుతున్న నేపథ్యంలో.. కేంద్ర ప్రభుత్వం కూడా కులగణనకు ఒప్పుకోవడాన్ని గుర్తు చేశారు. బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఆర్డినెన్స్ గవర్నర్ ఆమోదానికి నోచుకోలేదన్నారు. మరోవైపు అసెంబ్లీ ఆమోదించిన బిల్లులు రాష్ట్రపతి వద్ద ఏ దశలో ఉన్నాయో తెలియడం లేదన్నారు. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం ఆర్డినెన్స్, బిల్లులంటూ కాంగ్రెస్ ప్రభుత్వం నాటకాలు ఆడుతోందని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ విమర్శించారు.

పదేళ్లపాటు బీసీల కోసం మాట్లాడారా?

ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



సాక్షి, హైదరాబాద్: పదేళ్ల పాటు అధికారంలో ఉన్న కేటీఆర్ లేదా ఆయన తండ్రి కేసీఆర్.. ఎప్పుడైనా బీసీల గురించి మాట్లాడారా? అని చొప్పదండి కాంగ్రెస్ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రశ్నించారు. బీఆర్ఎస్‌తోనే బీసీలకు న్యాయం జరుగుతుందని కేటీఆర్ బొంకుతున్నారని విమర్శించారు. సత్యం సోమవారం సీఎల్పీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. నిజంగా బీఆర్ఎస్‌కు బీసీలపై చిత్తశుద్ధి ఉంటే 42 శాతం రిజర్వేషన్ల అమలు కోసం కేంద్రంపై పోరాటం ఎందుకు చేయడం లేదన్నారు. ఆ పని చేసేందుకు తమతో ఎందుకు కలిసి రావడం లేదని నిలదీశారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీసీల రిజర్వేషన్ల కోసం చిత్తశుద్ధితో అలుపెరగని పోరాటం చేస్తున్నారని చెప్పారు. రేవంత్ వెంటే బీసీలు నడుస్తారనే భయంతో కేటీఆర్ నోటికొచ్చిన అబద్ధాలు చెబుతున్నారని ఆరోపించారు.

రేవంత్, మంత్రులు నా ఫోన్ ట్యాప్ చేయిస్తున్నారు

బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



బంజారాహిల్స్ (హైదరాబాద్): ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభుత్వం సిట్‌ను పావుగా వాడుకుంటోందని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో సోమవారం ఆయన జూబ్లీహిల్స్‌లోని సిట్ ముందు హాజరై వాంగ్మూలం ఇచ్చిన అనంతరం మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు తన ఫోన్ ట్యాప్ చేయిస్తున్నట్లు ఆయన సిట్‌కు ఫిర్యాదు చేశారు. డార్క్ వెబ్‌సైట్‌లో టూల్స్ ఉపయోగించి ప్రైవేటు వ్యక్తులతో ఫోన్ ట్యాప్ చేయిస్తున్నట్లుగా ఆరోపించారు. గతంలో బీఆర్ఎస్ ఫోన్ ట్యాపింగ్ చేస్తున్నదని, కేసీఆర్ తన ఫోన్ ట్యాప్ చేయిస్తున్నాడని పంజగుట్ట పోలీస్ స్టేషన్‌లో ప్రవీణ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నమోదైంది. పంజగుట్ట పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్‌పై సిట్ అధికారులు ప్రవీణ్‌కుమార్ నుంచి వాంగ్మూలం తీసుకున్నారు. తన యాపిల్ మొబైల్‌కు అలర్ట్ మెసేజ్ రావడంతో గతంలో ఫిర్యాదు చేశానని ఆయన వెల్లడించారు. ఫోన్ ట్యాపింగ్‌ను బీఆర్ఎస్ రాజకీయంగా వాడుకోలేదన్నారు. అయితే అప్పుడు బీఆర్ఎస్ ప్రభుత్వం, కేసీఆర్‌పై తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేసిన ప్రవీణ్‌కుమార్ తాజాగా సిట్ ముందు బీఆర్ఎస్‌కు అనుకూలంగా స్టేట్‌మెంట్ ఇవ్వడమే కాకుండా సీఎం రేవంత్‌రెడ్డిపై ఫిర్యాదు చేయడం గమనార్హం.

చట్టం అందరికీ ఒకేలా అమలు చేయాలి: బాల్క సుమన్



సాక్షి, హైదరాబాద్: చట్టం అందరికీ ఒకేలా అమలు చేయాలని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ వ్యాఖ్యానించారు. సోమవారం ఆయన బీఆర్ఎస్ నేతలు చిరుమళ్ల రాకేశ్ కుమార్, పల్లె రవికుమార్, తుంగ బాలు, లీగల్ సెల్ ప్రతినిధులతో కలిసి మీడియాతో మాట్లాడారు. తామిచ్చిన ఫిర్యాదులపై పోలీసులు చర్యలు తీసుకోవడంలేదని, అదే బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా ఎవరు ఫిర్యాదు చేసినా స్పందిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ తెచ్చిన పార్టీగా శాంతిభద్రతలు బాగుండాలని కోరుకుంటామని, ఇకనైనా పోలీసులను చట్టానికి లోబడి పని చేయించాలని డీజీపీని కోరుతున్నామన్నారు. బీఆర్ఎస్వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ భార్యపై పోలీసులు హత్యాయత్నం కేసు పెట్టారని కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై జూబ్లీహిల్స్ ఎస్‌హెచ్‌ఓ ఖండిస్తూ ఓ ప్రకటన విడుదల చేశారన్నారు. జూబ్లీహిల్స్ పోలీసులు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని సుమన్ విమర్శించారు. కేటీఆర్ మాట్లాడిన దాంట్లో తప్పేమీ లేదని, రాష్ట్రంలో కొందరు పోలీసులు సీఎం రేవంత్‌కు ప్రైవేటు సైన్యంగా పనిచేస్తున్నారని ఆరోపించారు.

బీసీ కోటాపై ఢిల్లీకి

- 5, 6, 7 తేదీల్లో హస్తిన కేంద్రంగా కార్యాచరణ
- 42 శాతం రిజర్వేషన్ల సాధనకు కేంద్రంపై ఒత్తిడి
- రాష్ట్ర మంత్రివర్గ భేటీలో నిర్ణయం
- వివరాలు వెల్లడించిన మంత్రి పొన్నం ప్రభాకర్



మీడియాతో మాట్లాడుతున్న పొన్నం. చిత్రంలో వాకిటి, సురేఖ

సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో, విద్యా, ఉద్యోగావకాశాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం వచ్చే నెల 5, 6, 7 తేదీల్లో ఢిల్లీ వెళ్లి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. ఆగస్టు 6న రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మె ల్సీలు, ప్రజా ప్రతినిధులందరితో చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహించాలని, జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహించాలని తీర్మానించింది. 7న ముఖ్యమంత్రితో పాటు మంత్రు లు, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్సీలు దాదాపు 200 మంది ప్రతినిధులు రాష్ట్రపతిని కలిసి బిల్లుల ఆమోదం కోరుతూ వినతి పత్రం అందజేయాలని నిర్ణయించింది. ప్రస్తుతం పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్నందున బీసీల రిజర్వేషన్ల బిల్లు ల ఆమోదంలో జరుగుతున్న జాప్యానికి నిరసన తెలిపేందుకు ఆగస్టు 5న పార్లమెంటులో కాంగ్రెస్ పార్టీ ఎంపీల ద్వారా వాయిదా తీర్మానం ఇవ్వాలని తీర్మానించింది. ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం సచివాలయంలో సమావేశమైన మంత్రివర్గం ఆయా అంశాలపై సుదీర్ఘంగా చర్చించి ఈ మేరకు కార్యాచరణను సిద్ధం చేసింది.

బీసీ మంత్రుల విలేకరుల సమావేశం..

బీసీలకు స్థానిక సంస్థల్లో అలాగే విద్యా, ఉద్యోగావకాశాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రతిపాదించిన రెండు బిల్లులను గత మార్చి 17న రాష్ట్ర శాసనసభ, మార్చి 18న శాసనమండలి ఆమోదించాయి. ఈ రెండు బిల్లులను మార్చి 22న రాష్ట్ర గవర్నర్ ఆమోదం కోసం ప్రభుత్వం పంపించగా, ఆయన మార్చి 30న రాష్ట్రపతి ఆమోదానికి పంపించారు. అయితే రాష్ట్రపతి వీటిపై ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా పెండింగ్‌లో ఉంచారు. మరోవైపు 3 నెలల్లోపు స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తి చేయాలని ఇటీవల ఆదేశించిన రాష్ట్ర హైకోర్టు.. ఈ నెలాఖరులోపు రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి చేయాలంటూ గడువు విధించింది. బీసీ రిజర్వేషన్ల పెంపు బిల్లులతో స్థానిక సంస్థల ఎన్నికలు ముడిపడి ఉండడంతో వాటి సాధన కోసం ఢిల్లీ వెళ్లి ఒత్తిడి పెంచాలని, రాష్ట్రపతిని కలిసి విజ్ఞప్తి చేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. కాగా కేబినెట్ భేటీ తర్వాత..బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్.. సహచర బీసీ మంత్రులు కొండా సురేఖ, వాకిటి శ్రీహరితో కలిసి సచివాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి క్లుప్తంగా వివరాలు వెల్లడించారు.

కేసీఆర్ తీరని ద్రోహం చేశారు

'లోక్‌సభ, రాజ్యసభల్లో ప్రతిపక్ష నేతలతో పాటు 100 మందికి పైగా కాంగ్రెస్ పార్టీ ఎంపీలు, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అందరూ కలిసి రాష్ట్రపతి వద్దకు వెళ్తారు. తెలంగాణలోని బీసీ మేధావులు, కుల సంఘాల నాయకులు కూడా ఢిల్లీకి తరలిరావాలి. గతంలో పదేళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ రిజర్వేషన్లు 50 శాతానికి మించవద్దనే నిబంధనను 2018లో తెచ్చిన పంచాయతీరాజ్ చట్టంలో పొందుపరిచి బీసీలకు తీరని ద్రోహం చేశారు. ఈ చట్టం బీసీల రిజర్వేషన్ల పెంపునకు ప్రధాన అడ్డంకిగా మారింది. రిజర్వేషన్లపై 50 శాతం సీలింగ్‌ను ఎత్తివేసేందుకు పంచాయతీరాజ్ చట్ట సవరణ కోసం ఆర్డినెన్స్ తీసుకురావాలని గత జూలై 10న జరిగిన మంత్రివర్గ సమావేశంలో తీర్మానించి, 14న గవర్నర్ ఆమోదం కోసం పంపించాం. ఆ ఆర్డినెన్స్ ఫైలును సైతం రాష్ట్రపతి పరిశీలనకు గవర్నర్ పంపించినట్లు ప్రభుత్వానికి సమాచారం అందింది. ఈ నేపథ్యంలో బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన రెండు బిల్లులు, ఆర్డినెన్స్‌ను తక్షణమే ఆమోదించాలని రాష్ట్రపతికి విజ్ఞప్తి చేయటంతో పాటు ఆగస్టు 5, 6, 7 తేదీల్లో జాతీయ స్థాయిలో అవసరమైన కార్యాచరణ చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయించింది..'అని పొన్నం ప్రభాకర్ తెలిపారు.

రవాణా శాఖ చెక్ పోస్టులు రద్దు

రవాణా శాఖకు సంబంధించి రాష్ట్రంలో ఉన్న అంతర్రాష్ట్ర చెక్ పోస్టులను రద్దు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. రాష్ట్ర సరిహద్దుల్లో ఇలాంటివి మొత్తం 15 చెక్ పోస్టులు ఉన్నాయి. అయితే జాతీయ రహదారులపై రవాణాకు ఇబ్బంది లేకుండా చెక్ పోస్టులను తొలిగించాలని కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలకు సూచించింది. ఈ నేపథ్యంలో ఇకపై సిబ్బందితో కాకుండా వాహన్, అడ్వాన్స్‌డ్ సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షణ కొనసాగనుంది.

అన్నిచోట్లా మైక్రో బ్రూవరీస్

కోర్ తెలంగాణ అర్బన్ సిటీ ఏరియాతో పాటు రాష్ట్రంలోని అన్ని మున్సిపల్ కార్పొరేషన్లలో మైక్రో బ్రూవరీస్ ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. మైక్రో బ్రూవరీస్ చట్టానికి పలు సవరణలు చేస్తూ నిర్ణయం తీసుకుంది.

బీజేపీ నేతలు సహకరించాలి

'బిల్లులు, ఆర్డినెన్స్ రాష్ట్రపతి ఆమోదించేలా రాష్ట్రంలోని కేంద్రమంత్రి బండి సంజయ్, బీజేపీ ఎంపీలు కె.లక్ష్మణ్, అరవింద్, ఈటల రాజేందర్, కృష్ణయ్య, ఎమ్మెల్యే పాయల్ శంకర్ ప్రయత్నించాలి. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కూడా బిల్లులకు ఆమోదముద్ర పడేలా సహకరించాలి. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని ప్రస్తావిస్తూ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారు. అయితే రిజర్వేషన్లపై 50 శాతం పరిమితి విధిస్తూ సుప్రీంకోర్టు ఇందిరా సాహ్నీ కేసులో ఇచ్చిన తీర్పులోనే.. శాస్త్రీయ సమాచారం ఆధారంగా ఆ పరిమితి దాటవచ్చని కూడా పేర్కొంది. పక్కాగా నిర్వహించిన సర్వే ఆధారంగానే మేము బీసీ రిజర్వేషన్ల పెంపుపై నిర్ణయం తీసుకున్నాం. వాస్తవానికి ఈడబ్ల్యూఎస్ కోటాతోనే 50 శాతం క్యాప్ పోయింది. ఇప్పుడు 64 శాతం రిజర్వేషన్లు అమల్లో ఉన్నాయి. బీసీ సంఘం నేత ఆర్.కృష్ణయ్య నాయకత్వం వహించి ఢిల్లీకి రావాలి. ఆయన ఈ విషయంలో మౌనం వీడాలి. రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ ఇస్తే మంచిది. లేకుంటే సామ, భేద, దాన దండోపాయాలను ఉపయోగిస్తాం..'అని మంత్రి చెప్పారు.

ఎట్టి పరిస్థితుల్లోనూ ముందుకే..!

- స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల పెంపుపై కేబినెట్‌లో విస్తృత చర్చ
- ఆగస్టు 7 వరకు పోరాటం.. ఆ తర్వాత స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలనే అభిప్రాయం
- పట్టణ గృహ నిర్మాణ పాలసీపై కూడా చర్చించిన మంత్రిమండలి
- నల్లగొండ జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల సవరించిన అంచనాలకు ఆమోదం

సాక్షి, హైదరాబాద్: వెనుకబడిన వర్గాలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించే విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ ముందుకే వెళ్లాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. ఈ విషయంలో ప్రభుత్వ చిత్తశుద్ధి ఏంటో ప్రజలకు అర్థమవుతోందని, ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని బీసీ వర్గాల ప్రజలు విశ్వసించడం లేదని అభిప్రాయపడింది. సోమవారం జరిగిన కేబినెట్ సమావేశంలో బీసీలకు రిజర్వేషన్లు కల్పించేందుకు అసెంబ్లీ ఆమోదించిన బిల్లులు, మంత్రిమండలి ఆమోదించిన ఆర్డినెన్స్ అమల్లోకి రావడానికి ఉన్న అవకాశాలపై మంత్రిమండలి విస్తృతంగా చర్చించింది.

హైకోర్టును మరింత గడువు కోరే యోచన

జాతీయ స్థాయిలోని రాజకీయ పార్టీల సహకారం తీసుకుని కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని నిర్ణయించిన మంత్రివర్గం.. ఆగస్టు 7వ తేదీ తర్వాత మరింత స్పష్టంగా ముందుకెళ్లాలని నిర్ణయించింది. ఢిల్లీ వెళ్లి రాష్ట్రపతిని కలిసి వచ్చిన అనంతరం అవసరమైతే 10వ తేదీ తర్వాత మరో మారు మంత్రివర్గం సమావేశమై చర్చించాలనే నిర్ణయానికి వచ్చారు. కేంద్రం నుంచి వచ్చే స్పందనను బట్టి స్థానిక ఎన్నికల విషయంలో హైకోర్టును మరికొంత గడువు కోరాలనే చర్చ కూడా వచ్చినట్టు సమాచారం.

హౌసింగ్ పాలసీ ఎలా?

రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో అమలు చేయాల్సిన హౌసింగ్ పాలసీ గురించి కూడా మంత్రిమండలి చర్చించింది. ఈ విషయంలో ఎదురవుతున్న సమస్యల గురించి మంత్రులు తమ అభిప్రాయాలను వెల్లడించినట్టు సమాచారం. ముఖ్యంగా జీహెచ్ఎంసీ పరిధిలో జీ ప్లస్ 3 విధానం అమలులో ఎదురవుతున్న ఇబ్బందులను కూడా చర్చించిన కేబినెట్.. ఈ పాలసీ గురించి స్పష్టమైన నోట్ తయారు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించింది. నల్లగొండ జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల గురించి కూడా కేబినెట్ చర్చించింది. బుగ్గమాదారం, ముక్త్యేశ్వరపురం లిఫ్టులతో పాటు మరి కొన్నింటికి సవరించిన అంచనాలకు ఆమోదం తెలిపినట్లు తెలిసింది.

సీతారామ అంచనాలు పెంపు

రూ 13,058 కోట్ల నుంచి రూ.19,325 కోట్లకు..

- పెంపు ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం
- రూ.718 కోట్లతో ములుగు జిల్లాలో మొడికుంట వాగు ప్రాజెక్టు
- దేవాదుల మూడో దశ రెండో ప్యాకేజీ రూ.1,395.17 కోట్లకు పెంపు



శరవేగంగా పనులు

సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి ఖమ్మం జిల్లా వరప్రదాయినిగా చెబుతున్న సీతారామ ఎత్తిపోతల పథకం అంచనా వ్యయాన్ని రూ.13,057 కోట్ల నుంచి రూ.19,325 కోట్లకు పెంచేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు సవరణ అంచనాలకు ఆమోదం తెలపాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు సోమవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ప్రతిపాదించగా.. చర్చ అనంతరం మంత్రివర్గం ఆమోదం తెలిపింది. వాస్తవానికి గతంలో జరిగిన ఒక కేబినెట్ సమావేశంలోనే ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం పెంపు ప్రతిపాదనలపై చర్చ జరిగినా.. మంత్రుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తం కావడంతో నాటి ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శితో ప్రతిపాదనలపై పునఃసమీక్ష జరిపించాలని నిర్ణయం తీసుకున్నారు. తాజాగా ప్రాజెక్టు అంచనాల సవరణకు ఆమోదం తెలపడంతో సీఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి మంత్రి తుమ్మల ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. సీతారామ ప్రాజెక్టుతో లక్షలాది ఎకరాల బీడు భూముల రూపురేఖలు మారనున్నాయని పేర్కొన్నారు.

సీతారామ ప్రాజెక్టు ద్వారా ఖమ్మం, కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల్లోని 11 నియోజకవర్గాల పరిధిలోని 31 మండలాల్లో 3,29,000 ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగునీటి సరఫరాతోపాటు 3,45,000 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరగాల్సి ఉంది. ప్రాజెక్టు ప్రధాన కాల్వ తవ్వకం 104 కిలోమీటర్ వరకు ఇప్పటికే పూర్తయింది. పంట కాల్వల ఆధునీకరణ, మరమ్మతులు త్వరలో చేపట్టనున్నారు. సత్తుపల్లి ట్రంకు, పాలేరు లింకు కాల్వ 60 కి.మీ.ల వరకు పూర్తయింది. మిగిలిన 125 కి.మీ.ల పనులను ఈ ఏడాది పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 8 డి్స్ట్రిబ్యూటరీ ప్యాకేజీల పనులకు టెండర్లు ఆహ్వానించారు. 6 నెలల్లో భూసేకరణ ప్రక్రియ ముగిస్తే డి్స్ట్రిబ్యూటరీల పనులను చేపట్టి రెండేళ్లలో పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ప్యాకేజీ-9లోని యాతలకుంట టన్నెల్‌ను పూర్తిచేసి 120 చెరువులకు ఈ ఏడాది డిసెంబర్ లోగా, జూలూరుపాడు టన్నెల్ పూర్తిచేసి 2026 చివరి నాటికి పాలేరుకు నీటి సరఫరా చేయాలని నిర్ణయించారు. ప్రాజెక్టు డీపీఆర్‌కు ఇటీవల కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ)లోని టెక్నికల్ అడ్వైయిజరీ కమిటీ (టీఏసీ) ఆమోదం తెలిపింది.

రూ.718 కోట్లతో మొడికుంటవాగు ప్రాజెక్టు

ములుగు జిల్లా వాజేడు మండలంలో 13 వేల ఎకరాలకు సాగు నీరు అందించేందుకు రూ.718 కోట్ల అంచనాలతో మొడికుంటవాగు ప్రాజెక్టు నిర్మించాలనే ప్రతిపాదనకు కేబినెట్ ఓకే చెప్పింది. ఏఐబీపీ-పీఎంకేఎస్‌వై పథకం కింద ఈ ప్రాజెక్టును చేర్చాలని కేంద్రానికి గతంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపింది. ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతలను గామన్ ఇండియా కంపెనీకి అప్పగించగా, తర్వాత ఆ ఒప్పందాన్ని రద్దు చేశారు. రూ.527.66 కోట్లతో మొదట ప్రాజెక్టు అంచనాలను రూపొందించగా, తాజాగా రూ.718.6 కోట్లకు ఆమోదం తెలిపారు. నిర్మల్ జిల్లా మామడ మండలం పొంకల్ గ్రామంలోని సదర్‌మాట్ బరాజ్ అంచనాలను రూ.676.59 కోట్లకు పెంచాలన్న మరో ప్రతిపాదనను కూడా మంత్రివర్గం ఆమోదించింది. సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలం బుగ్గ మాదారం గ్రామంలో ముక్త్యేశ్వరపురం మేజర్, గనపవరం మేజర్, ముక్త్యాల బ్రాంచ్ కెనాల్‌లోని చివరి ఆయకట్టుకు నీరందించడానికి రూ.394.10 కోట్లతో రాజీవ్‌గాంధీ ఎత్తిపోతల పథకం నిర్మాణానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. నిర్మాణ పనులను ఇప్పటికే ప్రారంభించగా కేబినెట్ ర్యాటిఫికేషన్ ద్వారా ఆమోదం లభించింది. దేవాదుల ఎత్తిపోతల పథకం మూడో దశ కింద చేపట్టిన రెండో ప్యాకేజీ పనుల అంచనాలను రూ.1,395.17 కోట్ల పెంచేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

31 నుంచి మీనాక్షి పాదయాత్ర

- ఆరు నియోజకవర్గాల్లో శ్రమదానం, ప్రజలతో ముఖాముఖి
- పీసీసీ చీఫ్‌తో కలిసి ప్రతిరోజూ స్థానిక నేతలతో సమావేశాలు
- స్థానిక ఎన్నికలకు కేడర్ సమాయత్తం.. ప్రభుత్వ పథకాల ప్రచారం
- పరిగిలో షురూ.. వర్ధన్నపేటలో ముగింపు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ క్షేత్రస్థాయిలో ప్రజల చెంతకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. రాష్ట్రంలోని ఆరు ఉమ్మడి జిల్లాల్లో రోజుకో అసెంబ్లీ నియోజకవర్గం చొప్పున ఆరు రోజుల పాటు టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి పాదయాత్ర చేయనున్నారు. ఈ మేరకు షెడ్యూల్ కూడా ఖరారైంది. ఈ నెల 31వ తేదీన పరిగి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ప్రారంభమయ్యే పాదయాత్ర ఆందోల్ , ఆర్మూర్, ఖానాపూర్, చొప్పదండిల మీదుగా ఆగస్టు 5వ తేదీన వర్ధన్నపేట వరకు సాగనుంది. యాత్రలో భాగంగా ప్రతిరోజూ శ్రమదానం, స్థానిక నేతలతో సమావేశాలు ఏర్పాటు చేసేలా టీపీసీసీ షెడ్యూల్ రూపొందించింది. యాత్రను సమన్వయం చేసేందుకు ఐదుగురు సభ్యులతో కమిటీని కూడా ఏర్పాటు చేసింది.

ద్విముఖ వ్యూహం

మీనాక్షి పాదయాత్ర షెడ్యూల్‌ను కాంగ్రెస్ పార్టీ ద్విముఖ వ్యూహంతో ఖరారు చేసింది. ఏఐసీసీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జైబాపూ, జైభీం, జై సంవిధాన్ కార్యక్రమ అమలుతో పాటు స్థానిక ఎన్నికలకు కేడర్‌ను సమాయత్తం చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. జైబాపూ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో శ్రమదానాలు చేయాలని, అక్కడే పార్టీ కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించాలని ఏఐసీసీ నిర్దేశించింది. ఈ నేపథ్యంలోనే ప్రతిరోజూ ఉదయాన్నే శ్రమదానం చేయడం, ఆ తర్వాత స్థానిక పార్టీ నాయకులతో సమావేశం కావడం, అనంతరం నడక ప్రారంభించి రోజుకు 10 కిలోమీటర్లు తిరిగేలా షెడ్యూల్‌ను రూపొందించారు. ఈ 10 కిలోమీటర్ల పరిధిలో వచ్చే గ్రామాల్లోని ప్రజలతో మీనాక్షి మాట్లాడనున్నారు. తద్వారా ప్రభుత్వ కార్యక్రమాల అమలు స్థితిగతులు ఆమె దృష్టికి వస్తాయని, అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఆమె ప్రజలకు వివరిస్తారని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర: టీఆర్ఆర్

సోమవారం గాంధీభవన్‌లో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్‌తో కలిసి పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డి విలేకరులతో మాట్లాడారు. మీనాక్షి నటరాజన్ పాదయాత్ర దశల వారీగా రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతుందని చెప్పారు. జూలై 31 పరిగి నియోజకవర్గంలోని రంగాపూర్‌లో సాయంత్రం 5 గంటలకు పాదయాత్ర ప్రారంభమవుతుందని వెల్లడించారు. కాగా, ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్‌లతో పాటు పీసీసీ నేతలు కేతూరి వెంకటేశ్, జూలూరు ధనలక్ష్మి, పులి అనిల్‌కుమార్‌లతో పాదయాత్ర సమన్వయ కమిటీ ఏర్పాటు చేస్తూ పీసీసీ ఉత్తర్వులు జారీ చేసింది.

నేడు నేతలతో కీలక భేటీలు

మీనాక్షి నటరాజన్ సోమవారం హైదరాబాద్ చేరుకున్నారు. మంగళవారం ఉదయం 10:30 గంటల నుంచి ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఉమ్మడి జిల్లాల వారీగా టీపీసీసీ నియమించిన ఇన్‌చార్జ్‌లతో ఆమె సమావేశం కానున్నారు. పీసీసీ చీఫ్‌తో పాటు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు పాల్గొననున్నారు. ప్రతి జిల్లా నాయకత్వంతో విడివిడిగా సమావేశం కానున్న మీనాక్షి.. పార్టీ సంస్థాగత నిర్మాణం, స్థానిక సంస్థల ఎన్నికలు, కార్పొరేషన్ డైరెక్టర్లు, సభ్యులు, ఇతర నామినేటెడ్ పదవులకు సంబంధించి జరుగుతున్న కసరత్తుపై చర్చిస్తారని పీసీసీ వర్గాలు వెల్లడించాయి.



జైపాల్‌రెడ్డి పోరాటం-వ్యక్తిత్వం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులు

తెలంగాణ సాధనలో జైపాల్‌రెడ్డి పాత్ర కీలకం

జైపాల్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా పలువురు నివాళులు

ఖైరతాబాద్ (హైదరాబాద్): తెలంగాణ రాష్ట్ర సాధనలో, హైదరాబాద్ అభివృద్ధిలో మాజీ కేంద్ర మంత్రి, దివంగత జైపాల్‌రెడ్డి పాత్ర ఎంతో ఉందని పలువురు ప్రశంసించారు. జైపాల్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా సోమవారం నెక్లెస్ రోడ్డులో ఆయన స్మారకం వద్ద నివాళులు అర్పించారు. మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ పుష్పగుచ్ఛం ఉంచి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జైపాల్‌రెడ్డి ఎనలేని కృషి చేశారని, కేంద్ర ప్రభుత్వం ఆయనకు భారతరత్న ఇవ్వాలన్నారు. మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ జైపాల్‌రెడ్డి విద్యార్థి నాయకుడి నుంచి జాతీయ స్థాయి నాయకుడిగా ఎదిగారని చెప్పారు. శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ జైపాల్‌రెడ్డి నేటితరానికి ఆదర్శనీయమని అన్నారు. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ స్ఫూర్తి స్థల్‌వద్ద నివాళులు అర్పించారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, పలువురు రాజకీయ నాయకులు జైపాల్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జైపాల్‌రెడ్డి పోరాటం, వ్యక్తిత్వంపై ప్రచురించిన పుస్తకాన్ని మంత్రులు ఆవిష్కరించారు.

ఈ కులగణన రాజ్యాంగబద్ధ ప్రక్రియ కాదు

బీజేపీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణన రాజ్యాంగబద్ధంగా జరిగిన ప్రక్రియ కాదని, ఇది కేవలం గణాంకాల సేకరణ మాత్రమేనని బీజేపీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు అన్నారు. ఈ ప్రక్రియ రాజ్యాంగబద్ధ సంస్థల ద్వారా కాకుండా ప్రభుత్వమే స్వయంగా నిర్వహించిందన్నారు. కులగణన వివరాలను ప్రభుత్వం ఇప్పటికీ బయటపెట్టకపోవడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని చెప్పారు. బీజేపీ కులగణనకు వ్యతిరేకం కాదని, అయితే అది శాస్త్రీయంగా, రాజ్యాంగబద్ధంగా జరగాలని అన్నారు. సోమవారం బీజేపీ కార్యాలయంలో ఓబీసీ మోర్చా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రధాని మోదీ తీసుకున్న కీలక నిర్ణయం మేరకు అధికారికంగా జనగణనలో భాగంగా కులగణనను చేర్చడం వల్ల దేశంలోని వివిధ సామాజిక వర్గాల గణాంకాలు స్పష్టంగా వెలుగులోకి వస్తాయన్నారు. ఈ లెక్కల ఆధారంగా ఎవరు అభివృద్ధిలో ఉన్నారు.. ఎవరు వెనుకబడ్డారు? ఎవరికెలాంటి సంక్షేమ పథకాలు అవసరమో నిర్ణయించడానికి మార్గం లభించే అవకాశం ఉందన్నారు. కాగా, రాంచందర్‌రావు మంగళవారం ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ (మానుకోట) జిల్లాల్లో, బుధవారం ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు.

- కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతీ పనిని అట్టహాసంగా ప్రారంభించి.. ఆ తర్వాత గాలికి వదిలేస్తోందని బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ విమర్శించారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ఏదో ఒక ఆశ్రమ పాఠశాలలో వందలాది మంది విద్యార్థులు విషాహారం తిని ఆసుపత్రుల పాలవడం దారుణమన్నారు.



మనపై మనకు ఆసక్తి లేకపోతే బయటి వాళ్లు కూడా మనల్ని భరించలేరు.
అప్పుడు జీవితం మరింత రసహీనంగా మారిపోతుంది.
- ఆర్థర్ షోపెన్‌హావర్

సాక్షి

మంగళవారం, 29 జూలై 2025

'కార్పొరేట్' విద్యపై కొరడా!

ప్రచండమైన పోటీ, పరిమిత అవకాశాలూ అందరినీ భయపెడుతున్నాయి. ముఖ్యంగా తమ పిల్లల భవిష్యత్తు ఏమవుతుందోనన్న బెంగతో ఏం చేస్తున్నామో, ఎటు పోతున్నామో... చివరికది ఎటు దారితీస్తుందో తెలియనంతగా తల్లిదండ్రులు భయాందోళనల్లో మునిగిపోతున్నారు. వాటిని పిల్లలకూ అంటిస్తున్నారు. విద్యావ్యాపారంలో తలమునకలైన సంస్థలు దీన్ని ఎంచక్కా ఉపయోగించుకుంటున్నాయి. పర్యవసానంగా పిల్లలపై ఒత్తిళ్లు పెరిగి, బెంగ ఎక్కువై ఆత్మహత్యే శరణ్యమనుకుంటున్నారు. తరాలు మారుతున్నా వదలని ఈ జాడ్యంపై ప్రభుత్వాలు దృష్టిపెట్టని నేపథ్యంలో సర్వోన్నత న్యాయస్థానం ఎన్నదగిన నిర్ణయం తీసుకుంది. విద్యార్థుల్ని పీకల దాకా పోటీలో ముంచి, వారిపై మానసిక ఒత్తిళ్లను పెంచి విద్యలోని ప్రాణధాతువునే వికృతీకరిస్తున్న తీరు ఇకపై కొనసాగనీయరాదంటూ శుక్రవారం కోచింగ్ కేంద్రాలతోసహా అన్ని విద్యాసంస్థలనూ హెచ్చరించింది. అవాంఛనీయమైన ఈ ధోరణిని అడ్డుకోవటానికి ప్రతి విద్యాసంస్థ తప్పనిసరిగా పాటించాల్సిన 15 అంశాలతో కూడిన మార్గదర్శకాలను జారీచేసింది. పిల్లల మార్కుల ఆధారంగా వర్గీకరించి బోధించే విధానాన్ని నిలిపివేయాలనటం మొదలుకొని కౌన్సెలర్లు, సైకాలజిస్టుల నియామకం వరకూ అందులో విలువైనవెన్నో వున్నాయి.

ఆత్మహత్యలనేవి అన్నివేళలా వ్యక్తుల నిర్ణయమే కావొచ్చు... కానీ వాటిని ప్రేరేపిస్తున్న వ్యవస్థ మాటేమిటని ప్రశ్నించాడు ఫ్రెంచ్ తత్వవేత్త, రచయిత ఆల్బర్ట్ కామూ. మూలాన్ని గుర్తించకుండా, దాన్ని దుంపనాశనం చేయకుండా ఏ సమస్యా దానంతటదే మాయం కాదు. కేంద్రంలో రాజీవ్ గాంధీ హయాంలో విడుదలైన నూతన జాతీయ విద్యావిధానం విద్య ప్రైవేటీకరణకు బీజం వేసింది మొదలు మన విద్యావ్యవస్థ వెర్రితలలు వేస్తోంది. చదువులో వెనకబడివున్నామనే ఆత్మన్యూనతతో కొందరూ, తమకొచ్చిన మార్కుల్నీ/ర్యాంకునూ చూపించి తరగతి గదిలో టీచర్ ఎగతాళి చేశారనీ, దండించారనీ మరికొందరూ...పరీక్షలో ఉత్తీర్ణత సాధించగలమో లేదో అనే ఆందోళనతో ఇంకొందరూ ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ప్రభుత్వాలు కేసులు పెడతాయి. మళ్లీ మరొకటి జరగనంతవరకూ అంతా సవ్యంగా వున్నట్టే కనబడుతుంది. ఇది చర్విత చర్వణంగా కొనసాగుతూనేవుంది. యాదృచ్ఛికమే కావొచ్చుగానీ... సుప్రీంకోర్టు తాజా మార్గదర్శకాలకు దారితీసిన ఉదంతం విశాఖలోనే జరిగింది. జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష (నీట్) కోసం విశాఖ విద్యాసంస్థలో చేరిన బెంగాల్ బాలిక భవనంపై నుంచి పడి మరణించిన ఉదంతంపై సీబీఐ విచారణ కోరుతూ దాఖలైన పిటిషన్‌లో ధర్మాసనం ఈ ఆదేశాలిచ్చింది. ఆమె ప్రమాదవశాత్తూ మరణించిందని ఒకసారి, గుండెపోటుతో మరణించిందని మరోసారి, ఆత్మహత్య చేసుకుందని ఇంకోసారి ఆ విద్యాసంస్థ బుకాయించింది. ఈ రోగం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలం నుంచీ ప్రతి కార్పొరేట్ విద్యాసంస్థకూ వుంది. కన్నవాళ్లకు కనీసం పిల్లల మరణకారణాన్ని నిజాయతీగా చెప్పాలని కూడా ఆ సంస్థలు అనుకోవు. ధర్మాసనం వెల్లడించిన గణాంకాలు విస్తుగొలుపుతాయి. 2022లో మన దేశంలో 1.7 లక్షలకుపైగా ఆత్మహత్యలు నమోదైతే అందులో ఏడు శాతంపైగా - అంటే 13,404 మరణాలు విద్యార్థులకు సంబంధించినవి. జీవితం రంగులమయ ప్రపంచంగా దర్శనమిచ్చి, ఆకాశమే హద్దుగా భావించి దూసుకుపోవాల్సిన వయసులో పిల్లలు ఇంత బేలగా, ఆత్మవిశ్వాసం పూర్తిగా కోల్పోయి తనువు చాలిస్తున్న వైనం సమాజానికంతకూ సవాల్.

చదువంటే తెలియనిది తెలుసుకోవటం, అవసరమైనప్పుడల్లా ప్రశ్నించి సందేహనివృత్తి చేసుకోవటం. సృజనాత్మకంగా ఆలోచించటం. నేటి విద్యావ్యవస్థ వాటన్నిటినీ చంపేసింది. పోటీ తత్వాన్ని ప్రతిష్ఠించింది. బట్టీపట్టడం మినహా మరేమీ లేకుండా చేసింది. పర్యవసానంగా ఎంతో ఇష్టంతో చదవాల్సిన విద్య కాస్తా పెను భారంగా, ఎంతకూ అర్థంకాని ప్రహేళికగా అఘోరిస్తోంది. తమను అన్నివిధాలా రుద్దుతూ, పరుగులు పెట్టిస్తూ బలవంతంగా మెదళ్ల లోకి ఎక్కించి 'మంచి ఫలితాలు' రాబట్టి ముమ్ముందు మరింత వ్యాపారం చేసుకోవాలని తాపత్రయపడే విద్యాసంస్థలొకవైపూ... తమ ఎదుగుదలపై కోటి ఆశలు పెట్టుకున్న తల్లిదండ్రులొక వైపూ విద్యార్థులకు ఊపిరి సలపనివ్వట్లేదు. ఆ ప్రస్థానంలో ఓటమి ఎదురయ్యేసరికి ఆ లేత హృదయాలు తట్టుకోలేకపోతున్నాయి. అర్ధాంతరంగా తనువు చాలించటం మినహా మరే మార్గమూ లేదని నిర్ణయానికొస్తున్నాయి.


అంతక్రితం వరకూ ఇంటర్ స్థాయి నుంచి మొదలయ్యే పోటీతత్వం కార్పొరేట్ సంస్థల పుణ్యమా అని ప్రాథమిక విద్యకు కూడా పాకింది. ఈ దుస్థితి మారాలన్నదే సుప్రీంకోర్టు సంకల్పం. అయితే కనీసం స్వేచ్ఛగా కదలటానికైనా సావకాశంలేనంతగా ఇరుకైన స్థలాల్లో కార్పొరేట్ విద్యాసంస్థలు నడవటానికి ఎడాపెడా అనుమతులిచ్చే చోట పిల్లలకు క్రీడల్లో, జీవన నైపుణ్యాల్లో, వ్యక్తిత్వవికసనంలో శిక్షణనివ్వాలన్న ధర్మాసనం మార్గదర్శకాలు సక్రమంగా అమలవుతాయా? లాభాపేక్షే ధ్యేయంగావున్నచోట అదనంగా కౌన్సెలర్లకూ, సైకాలజిస్టులకూ చోటిస్తారా? టీచర్లపై ఊపిరాడనీయనంత భారంవేస్తున్న సంస్థలు పిల్లలతో ఎలా మెలగాలో వారికి శిక్షణనిప్పిస్తాయా? పిల్లలు తమ బాధల్ని చెప్పుకోవటానికి అవసరమైన వ్యవస్థల్ని అందుబాటులోకి తెస్తాయా? డబ్బు ఎరవేసి ఎంతటి మహోన్నత ఆశయాలనైనా చాపచుట్టేయగలిగే కార్పొరేట్ సంస్థలు ఈ మార్గదర్శకాలను ఉల్లంఘించిన పక్షంలో ఎలాంటి చర్యలుంటాయో చెబితే తప్ప ఇదంతా చక్కబడదు. ఆ దిశగా ప్రభుత్వాలు చర్యలు తీసుకునేలా సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలివ్వాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు శ్రావణ మాసం, తిథి: శు.పంచమి రా.12.43 వరకు, తదుపరి షష్ఠి. నక్షత్రం: ఉత్తర రా.8.33 వరకు, తదుపరి హస్త, వర్జ్యం: తె.5.38 నుండి 7.12 వరకు (తెల్లవారితే బుధవారం), దుర్ముహూర్తం: ఉ.8.12 నుండి 9.04 వరకు, తదుపరి రా.10.59 నుండి 11.43 వరకు. అమృతఘడియలు: ప.12.55 నుండి 2.36 వరకు, నాగ పంచమి

సూర్యోదయం : 5.40
సూర్యాస్తమయం : 6.31
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

తెలివి కన్నా ఎంపిక ముఖ్యం



ప్రిన్స్‌టన్! ప్రతిష్ఠాత్మకమైన ప్రైవేట్ ఐవీ లీగ్ రిసెర్చ్ యూనివర్శిటీ! యూఎస్‌లోని న్యూజెర్సీలో ఉన్న 278 ఏళ్ల నాటి ఈ ప్రిన్స్‌టన్ విశ్వవిద్యాలయ 2010 సంవత్సరపు పట్టభద్రుల బ్యాచ్‌ని ఉద్దేశించి ఆ ఏడాది మే నెలలో **అమెజాన్ సంస్థాపకుడు జెఫ్ బెజోస్** ఉత్తేజ పూరితమైన ప్రసంగం చేశారు. పుట్టుకతో మనకున్న వరాలతోనా, లేక మనం ఎంచుకునే మార్గాలతోనా ఎలా ముందుకు సాగటం?... అనే ఆలోచనను తన ప్రసంగం ద్వారా - జీవితంలోకి ప్రవేశించబోతున్న ఆ గ్రాడ్యుయేట్‌లలో - రేకెత్తించారు జెఫ్ బెజోస్. ఏనాటికీ పాత పడని ఆనాటి ఆయన ప్రసంగం... సంక్షిప్తంగా!

చిన్నప్పుడు వేసవి సెలవులకు తాతయ్య, నానమ్మ దగ్గరకి టెక్సాస్ వెళ్లేవాడిని. వారికక్కడ పెద్ద కమతం ఉంది. గాలి మరలు బిగించడంలో, పశువులకు టీకాలు వేయటంలో, ఆ వ్యవసాయ క్షేత్రంలో ఇతర చిన్నా చితక పనులు చేయడంలో సాయపడేవాడిని. మా తాతయ్య, నానమ్మ ఒక సేవా కార్యక్రమాల కారవాన్ క్లబ్‌లో సభ్యులుగా ఉండేవారు. వారికో చైతన్య రథం లాంటిది ఉండేది. దానిలో అన్నపానాలకు, స్నానానికి, విశ్రమించేందుకు సదుపాయాలుండేవి. మా తాతయ్య కారుకి దాన్ని తగిలించేవాళ్లం. అందరూ కలసి దానిలో అమెరికా, కెనడాలలో పర్యటిస్తూ ఉండేవాళ్లం. సాధారణంగా వేసవిలో నేను వారితో కలిసేవాడిని. తాతయ్య, నానమ్మ అంటే నాకు ప్రేమ. ఒక రకమైన ఆరాధన. వారితో కలసి తిరిగేందుకు ఆశగా ఎదురు చూస్తూండే వాడిని.

ప్రతిదీ నాకు లెక్కే!

1

నాకు పదేళ్లప్పుడు చేసిన ఒక ప్రయాణం బాగా గుర్తుంది. తాతయ్య కారు నడుపుతూంటే, నానమ్మ ఆయన పక్క సీట్లో కూర్చుంది. నేను వెనక సీట్లో దొర్లుతున్నా. ఈ ప్రయాణాల్లో ఆమె ఒకటే దమ్ము కొడుతూ ఉండేది. నాకు ఆ సిగరెట్ల వాసన గిట్టేది కాదు. అప్పట్లో నోటితో లెక్కలు కట్టేందుకు వచ్చిన ఏ అవకాశాన్నీ నేను వదులుకునేవాడిని కాను. పెట్రోల్ ఎన్ని కిలోమీటర్లకు సరిపోతుందో లెక్కవేయడం నుంచి సరుకులపై ఖర్చులను అంచనా వేయడం వరకు... పనికొచ్చేవీ, పనికిరానివీ అన్నీ లెక్కలు కడుతూండేవాడిని. ధూమపానం చేయగల హాని గురించి అంతకు ముందు నేనొక అడ్వర్టయిజ్‌మెంట్ చూశాను. ఇపుడు పూర్తి వివరాలు గుర్తు లేవు కానీ, ''సిగరెట్ పొగ లోపలికి పీల్చినప్పుడల్లా మీ ఆయుర్దాయంలో కొన్ని నిమిషాలు హరించుకుపోతాయి'' అని ఆ అడ్వర్టయిజ్‌మెంట్‌లో పేర్కొన్నట్లు మాత్రం గుర్తుంది. పొగ పీల్చి నప్పుడల్లా రెండు నిమిషాల ఆయుర్దాయం తగ్గిపోతుందని చెప్పారనుకుంటా.

> "జెఫ్! నీ బుర్ర అసామాన్యం. కొన్ని క్లిష్టమైన లెక్కలు వేశావు. ఏడాదిలో ఎన్ని నిమిషాలుంటాయో గణించి, కొన్ని భాగహారాలు చేసి భలే అంచనాకు వచ్చావు" అని తాతయ్య నా భుజం తడతారు అనుకున్నా. అలాంటిదేమీ జరగలేదు. "జెఫ్! ఏదో ఒక రోజు, తెలివితేటలు చూపడం కన్నా దయతో మసలడం చాలా కష్టమని గ్రహిస్తావు" అన్నారు!

నానమ్మ కళ్లు చెమర్చాయి!

నానమ్మ రోజుకు ఎన్ని సిగరెట్లు కాలుస్తుందో అంచనా వేశా. ప్రతి సిగరెట్టుకు ఎన్నిసార్లు పొగని లోపలికి పీలుస్తారో లెక్కగట్టా. నేను సహేతుకమైన అంచనాకే వచ్చానని అనిపించిన తర్వాత, ముందుకు వంగి నానమ్మ భుజాన్ని తట్టి చాలా గొప్పగా ''ప్రతి రెండు నిమిషాలకి ఒకసారి పొగని పీల్చావనుకుంటే, నీ ఆయుర్దాయంలో తొమ్మిదేళ్లు తగ్గిపోయినట్లు లెక్క'' అన్నాను. దానిపై, నానమ్మ స్పందన నాకు బాగా గుర్తుంది. నా తెలివితేటలకి, అంకగణిత సామర్థ్యానికి నన్ను అభినందిస్తారనుకున్నా. ''జెఫ్ నీ బుర్ర అసామాన్యం. కొన్ని క్లిష్టమైన లెక్కలు వేశావు. ఏడాదిలో ఎన్ని నిమిషాలుంటాయో గణించి, కొన్ని భాగహారాలు చేసి భలే అంచనాకు వచ్చావు'' అని తాతయ్య నా భుజం తడతారు అనుకున్నా. అలాంటిదేమీ జరగలేదు. మా నానమ్మ కళ్లు చెమర్చాయి. కన్నీటి చుక్కలు రాలుతున్నాయి. నానమ్మ ఏడుస్తూంటే, వెనక సీట్లో కూర్చున్న నాకు ఏం చేయాలో తెలియలేదు. అంతవరకు మౌనంగా డ్రైవ్ చేస్తున్న తాతయ్య, కారుని నెమ్మదిగా రోడ్డు పక్కగా ఆపి, దిగి, వెనక డోర్ తెరిచారు. నేనూ దిగి ఆయనతో అడుగులు వేయాలన్నట్లు ఆయన నుంచి ఓ చూపు.

''జెఫ్! దయగా ఉండు!''

కారు వెనుక తగిలించిన రథం పక్క నుంచున్న నా వంక ఓ క్షణం మౌనంగా చూసి తాతయ్య ''జెఫ్! ఏదో ఒకరోజు, తెలివితేటలు చూపడంకన్నా, దయతో మసలడం చాలా కష్టమని గ్రహిస్తావు'' అన్నారు!

వరాలు ముఖ్యం కాదు!

ఈరోజు నేను వరాలు-ఎంపికల మధ్యనున్న తేడా గురించి మీకు చెప్పాలనుకుంటున్నా. తెలివి తేటలు మనిషికి ఒక వరం.

2

దయను మాత్రం ఎంచుకోవలసిన విషయం. వరాలను తీసుకోవడం తేలిక. వాటిని ఎవరైనా ఇస్తారు. ఎంపికల విషయం వచ్చినప్పుడే కష్టమవుతుంది. మనం జాగ్రత్తగా లేకపోతే ఎవరైనా వరాలతో మనల్ని మభ్య పెట్టవచ్చు. అలాంటి ప్రలోభాలకు లోనైతే, బహుశా, అది ఎంపికల విషయం వచ్చేసరికి మనకు విఘాతంగా పరిణమిస్తుంది. మీరంతా అనేక వరాలతో నిండిన బృందం. యుక్తితో, సామర్థ్యంతో కూడిన మెదడు మీ అందరికీ ఉండడం వాటిలో ఒకటి. అందులో నాకెలాంటి సందేహం లేదు. ఎందుకంటే, అడ్మిషన్ సంపాదించడానికే మిగిలిన వారితో మీరు పోటీపడి తీరాలి. మీలో తెలివితేటలున్నట్టు కనిపించకపోతే అడ్మిషన్ల డీన్ మిమ్మల్ని లోపలకు అడుగుపెట్టనివ్వరు.

'ఎంపిక'లోనే... మీ శక్తి!

వింతలు విశేషాల గడ్డపై తిరుగాడే మీకు మీ శక్తి యుక్తులు బాగా ఉపయోగపడతాయి. మనుషులమైన మనం, మనల్నే ఆశ్చర్యపరచే పనులు చేస్తూంటాం. కాలుష్య రహిత ఎనర్జీ ఉత్పాదక మార్గాల లాంటి వాటిని కనుగొంటాం. కణాల గోడల లోపలకి ప్రవేశించి, మరమ్మతులు చేయగల మెషీన్లను పరమాణువుల లాంటి చిన్న వాటితో కూర్పు చేస్తాం. మానవాళి చేస్తున్న పరిశోధనల ఫలితంగా ఇటువంటి వార్తలు వెలువడటం ఆశించదగ్గదే కావచ్చు కానీ, ఈ నెలలో మనం నిజంగానే, ఒక అసాధారణమైన వార్తను విన్నాం. జీవన వనరులను, ఆలోచనలను సమ్మిళితం సాధించాం. రానున్న కాలంలో లైఫ్‌ని ఇలా సింథసైజ్ చేయడమే కాదు, కోరుకున్న ప్రత్యేకాంశాలతో దాన్ని ఇంజనీర్ చేయగలుగుతాం. మానవ మెదడును అర్థం చేసుకోగల స్థితిని కూడా మీరు చూడగలుగుతారని నాకు నమ్మకం ఉంది. ఇపుడు మనలో చాలా మంది భావిస్తున్నట్లుగానే, గతించిన కాలాలకు చెందిన జ్యూల్స్ వర్న్, మార్క్ ట్వైన్, గెలీలియో, న్యూటన్ వంటి ఉత్సుకత కలిగిన వ్యక్తులు సజీవంగా ఉండాలని కోరుకుని ఉంటారు. ఒక నాగరికతగా మనకు అనేక శక్తి యుక్తులున్నాయి. ఇపుడు నా ముందు కూర్చున్న మీలో కూడా అనేక మందికి గొప్ప శక్తి సామర్థ్యాలుండవచ్చు. ఈ వరాలను మీరు ఎలా వినియోగించుకుంటారు? ఉన్నవాటిని చూసుకుని గర్వపడతారా లేక మీరు ఎంచుకున్న వాటిపట్ల గర్వపడతారా?

సక్సెస్ కావచ్చు, కాకపోవచ్చు!

అమెజాన్ ప్రారంభించాలనే ఆలోచన నాకు కొన్నేళ్ల క్రితం తట్టింది. వెబ్ వినియోగం ఏటా 2300 శాతం చొప్పున వృద్ధిచెందుతోందనే వాస్తవాన్ని గమనించాను. అంత వేగంగా మరోటి వృద్ధి చెందడాన్ని నేను కనలేదు. వినలేదు. లక్షలాది పుస్తకాలతో భౌతిక ప్రపంచంలో ఒక పుస్తక భాండాగారాన్ని నిర్వహించడం సాధ్యం కానిపని. అటువంటిది అసంఖ్యాక పుస్తకా లతో ఒక ఆన్‌లైన్ బుక్ స్టోర్‌ను నిర్మించడమన్న ఆలోచనే నాలో ఎంతో ఉత్సుకత రేపింది. అప్పటికి నాకు 30 ఏళ్లు నిండాయి. పెళ్లయి ఏడాది అయింది. ఉద్యోగం వదిలేద్దామనుకుంటున్నానని, ఈ కొత్త వ్యాపారం చేపడతానని నా భార్య మెకంజీకి చెప్పాను. అది ఫలించవచ్చు, ఫలించకపోవచ్చునని కూడా చెప్పేశా. ఎందుకంటే, చాలా భాగం అంకుర సంస్థల తీరు అలానే ఉంది. తర్వాత ఏమవుతుందో నాకూ తెలియదు. ఈ ప్రిన్స్‌టన్ విద్యాలయం నుంచే పట్టభద్రురా లైన మెకంజీ ఇప్పుడిక్కడ రెండవ వరుసలో కూర్చొనుంది. ధైర్యంగా అడుగు ముందుకు వేయాల్సిందిగా ఆమె నా వెన్ను తట్టింది.

3

టైమ్ తీసుకుని ఆలోచించాలి!

నూనూగు మీసాల బాలుడిగా ఉన్నప్పుడే సిమెంట్ నిండిన టైర్లతో ఆటోమేటిక్ గేట్ క్లోజర్ కనిపెట్టా. సోలార్ కుక్కర్ తయారు చేశా. అది గొప్పగా ఏమీ పనిచేయలేదనుకోండి. అల్యూమినియం ఫాయిల్ రూపొందించా. వంటగదిలో వాడే బేకింగ్ అలారమ్‌లు తయారు చేశా. ఎప్పుడూ ఏదో ఒకటి కొత్తది కనిపెట్టాలని నా అభిలాష. మెకంజీ దానికి అడ్డు చెప్పకుండా ప్రోత్సహిస్తూ వచ్చింది. అప్పటికి, న్యూయార్క్ నగరంలో ఒక ఫైనాన్షియల్ సంస్థలో కొందరు మెరికలతో కలసి, ఒక ప్రతిభావంతుడైన బాస్ కింద పనిచేస్తున్నా. ఆ బాస్ అంటే నాకు చాలా ఆరాధనా భావం. ఆయన వద్దకు వెళ్లి, ఇంటర్‌నెట్‌లో పుస్తకాలు అమ్మే కంపెనీని ప్రారంభించాలని అనుకుంటున్నట్లు చెప్పా. ఇద్దరం మాట్లాడుకుంటూ సెంట్రల్ పార్క్‌లో చాలాసేపు నడిచాం. నా మాటలు శ్రద్ధగా ఆలకించిన ఆయన ''అది గొప్ప ఐడియాగానే కనిపిస్తోంది. కానీ, గొప్ప ఉద్యోగం లేని ఎవరికైనా అది మరింత గొప్ప ఐడియాగా భాసిస్తుందేమో చూడు'' అన్నారు. ఆలోచించుకుని తుది నిర్ణయం తీసుకునేందుకు 48 గంటల గడువు నిచ్చారు. ఆయన మాటల్లోనూ వాస్తవం ఉందనిపించింది. కానీ, కష్టమని తోచినా, అడుగు ముందుకేయడానికే నిర్ణయించుకున్నా. ఏదైనా ప్రయత్నించి, విఫలమైతే బాధపడడం అన్నది నాకెప్పుడూ లేదు. అసలు, ప్రయత్నించి చూడకపోతేనే, అది నన్ను వెంటాడుతూ ఉంటుంది! ఎంతో ఆలోచించిన మీదట, అంత సురక్షితం కాని మార్గాన్నే ఎంచుకున్నా. కానీ, దానికి నేను గర్వపడుతూనే ఉంటా.

మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి!

రేపు మీరు నిజంగానే కొత్త జీవితానికి శ్రీకారం చుట్టబోతున్నారు. మీ భవితవ్యాన్ని మీరే రాసుకో బోతున్నారు. మీకున్న ప్రతిభా సంపత్తులను మీరు ఎలా వినియోగించుకుంటారు? ఎటువంటి మార్గాన్ని ఎంచుకుంటారు? స్తబ్ధుగా ఉంటూ ఎలా జరిగితే అలా జరుగుతుంది అనుకుంటారా? లేక దేనిమీద ప్రీతి ఉందో ఆ పనులు చేస్తారా? ఉన్నవాటిని పట్టుకుని వేలాడ తారా? లేక కొత్తదనం చూపేందుకు ప్రయత్ని స్తారా? సాఫీగా సాగిపోయే జీవితాన్ని ఎంచుకుంటారా? లేక సేవ, సాహసాలతో నిండినదాన్నా? మిమ్మల్ని విమర్శించినపుడు నీరసించిపోతారా? లేక మీరు నమ్మినదాన్ని అనుసరించి ముందుకు సాగుతారా? తప్పు చేస్తే ఊకదంపుడుతో సమర్థించుకుంటారా? లేక క్షమాపణ కోరతారా? ప్రేమలో పడినపుడు ఎవరన్నా నిరాకరించినా మీ హృదయాన్ని కాపాడుకుంటారా? లేక భావోద్రేకాలతో వ్యవహరిస్తారా? సురక్షితంగా వ్యవహరించడం మంచిదనుకుంటారా? లేక కొద్దిగా సాహసంతో వ్యవహరిస్తారా? కఠిన పరిస్థితులు ఎదురైనప్పుడు విరమించుకుంటారా? లేక విడువకుండా శ్రమిస్తారా? మీరు నిరాశా వాదా? లేక నిర్మాతా? ఇతరులను పణంగా పెట్టి తెలివి తేటలు ప్రదర్శిస్తారా? లేక దయతో వ్యవహరిస్తారా?

4


> కష్టమని తోచినా, అడుగు ముందుకేయడానికే నిర్ణయించుకున్నా. ఏదైనా ప్రయత్నించి, విఫలమైతే బాధపడడం అన్నది నాకెప్పుడూ లేదు. అసలు, ప్రయత్నించి చూడక పోతేనే, అది నన్ను వెంటాడుతూ ఉంటుంది. ఎంతో ఆలోచించిన మీదట, అంత సురక్షితం కాని మార్గాన్నే ఎంచుకున్నా. కానీ, దానికి నేను గర్వపడుతూనే ఉంటా.

నేనొక జోస్యం చెప్పే సాహసం చేస్తా. 80 ఏళ్ల వయసులో మీరు ప్రశాంత జీవితం గడుపుతూ ఒకసారి సింహావలోకనం చేసుకున్నప్పుడు, అర్థవంతమైన మీ ఎంపికలే మీ జీవిత సంగ్రహం అవుతాయని మరచిపోకండి. మన ఎంపికలే మనల్ని రూపుకట్టిస్తాయి. మీ జీవితాన్ని ఒక విజయవంతమైన గాథగా మీరే తీర్చిదిద్దుకోండి. థ్యాంక్యూ అండ్ గుడ్ లక్! ◆

వైజ్ఞానిక వేగుచుక్కలు-27

పరిశోధనా దార్శనికురాలు

క్యాన్సర్ వ్యాధికీ, వైరస్‌కూ ఉన్న సంబంధాన్ని తొలుత తన పరిశోధన ద్వారా వెలికి తీశారామె. అంతేకాదు కుష్ఠువ్యాధి వ్యాక్సిన్ తయారీకి దోహదపడేలా కృషి చేసిన బయో మెడికల్ పరిశోధకురాలు కూడా. ఆమే... కమల్ రణదివే! ఈ కృషికిగాను భారత ప్రభుత్వం నుంచి 1982లో పద్మభూషణ్ గౌరవాన్ని పొందారామె. మనదేశంలో తొలి టిష్యూ కల్చర్ ప్రయోగశాలను ప్రారంభించడమే కాకుండా; భారతీయ మహిళాశాస్త్రవేత్తల సంఘాన్ని ఏర్పాటు చేసిన తొలితరం పరిశోధనా దార్శనికురాలిగా నిలిచారు. 1917 నవంబర్ 8న పుణే పట్టణంలో జన్మించారు.1939లో గణిత శాస్త్రం బోధించే జేటీ రణదివెతో వివాహం జరిగి బొంబాయి తరలి వెళ్లారు. తర్వాత తండ్రి ప్రోద్బలంతో పుణే అగ్రికల్చరల్ కాలేజీలో 1943లో ఎమ్మెస్సీ పూర్తి చేశారు. బొంబాయిలో వాళ్ళ ఇంటికి దగ్గరలో టాటా మెమోరియల్ హాస్పిటల్ ఉండడంతో వారికి వీఆర్ ఖనోల్కర్ పరిచయమయ్యారు. ఆయన సలహాతో ఆ ఆస్పత్రి లేబరేటరీలో రీసెర్చ్ స్కాలర్‌గా చేరారు. ఖనోల్కర్ పర్యవేక్షణలో బొంబాయి యూనివర్సిటీ నుంచి 1950లో పీహెచ్‌డీ పట్టా పొందారు. రాక్ ఫెల్లర్ ఫౌండేషన్ నుంచి పోస్ట్ డాక్టొరల్ రీసెర్చ్ ఫెలోషిప్ రావడంతో ఆమె బాల్టిమోర్ (అమెరికా) లోని జాన్స్ హాప్కిన్స్ యూనివర్సిటీలో పరిశోధనకు చేరి టిష్యూ కల్చర్ టెక్నిక్స్‌కు సంబంధించి విశేషమైన నైపుణ్యం సాధించారు.



కమల్ రణదివే

భారతదేశం తిరిగి వచ్చి, అంతకు ముందు పని చేసే సంస్థలోనే కొనసాగారు. తన పరిశోధనాగురువు ఖనోల్కర్‌కు తోడ్పడి 'ఇండియన్ క్యాన్సర్ రీసెర్చ్ సంస్థ' ప్రారంభం కావడానికి సహకరించారు. కణాల స్థాయిలో క్యాన్సర్ వ్యాధి ఏయే కారణాలతో సంభవిస్తుంది, దాని రోగ ప్రక్రియ ఎలా సాగుతుందో శోధించారు. హార్మోన్లకూ, ట్యూమర్ వైరస్‌కూ మధ్య జరిగే చర్యలూ; వీటికీ క్యాన్సర్ రాకకూ ఉన్న సంబంధం ఏమిటో తొలుత వివరించిన శాస్త్రవేత్త కమల్ రణదివే. బ్రెస్ట్ క్యాన్సర్ వారసత్వంగా సంక్రమించే విషయాన్ని తెలియజేప్పిన తొలి శాస్త్రవేత్త ఈమె. క్యాన్సర్, కుష్ఠు వ్యాధులకు సంబంధించి ఆమె సుమారు 200 పరిశోధనా పత్రాలు రాశారు.

అలాగే బొంబాయి విశ్వవిద్యాలయంలో అప్లైడ్ బయాలజీ కోర్సు ప్రారంభం కావడానికి కూడా ఆమె కృషి చేశారు. 1973లో స్త్రీలలో, పిల్లల్లో సైన్స్ దృష్టి, పరిజ్ఞానం పెంపొందడానికి ఉద్దేశించిన 'ఇండియన్ ఉమెన్ సైంటిస్ట్స్ అసోసియేషన్' అనే స్వచ్ఛంద సంస్థ ఏర్పడడానికి ఆమె 12 మంది తన సహోద్యోగులతో కలసి దోహదపడ్డారు. ఉత్కృష్టమైన పరిశోధన, ఉన్నతమైన జీవితం కోసం అనునిత్యం శ్రమించిన కమల్ రణదివే తన 83వ ఏట 2001 ఏప్రిల్ 11న కన్నుమూశారు.

– డా॥ నాగసూరి వేణుగోపాల్ । ఆకాశవాణి మాజీ ఉన్నతాధికారి

వలస కార్మికుల వెల లేని శ్రమ!

రియాక్టర్ల పేలుళ్లు, రసాయనాల లీకేజీలు, షార్ట్ సర్క్యూట్స్, అగ్ని ప్రమాదాలు ఇవన్నీ కూడా పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు సరిగ్గా లేకనే తరచూ జరుగుతున్నాయి. వీటన్నింటికీ ప్రధాన కారణం పరిశ్రమ యాజమాన్యాల తీవ్ర నిర్లక్ష్యమే. గడచిన ఐదేళ్లలో 600కు పైగా జరిగిన పారిశ్రామిక ప్రమాదాల్లో 1,116 మంది మృత్యువాత పడ్డారు, ఇంకా ఎంతో మంది క్షతగాత్రులై జీవచ్ఛవాలుగా బతుకు లీడుస్తున్నారని నేషనల్ క్రైమ్ రికార్డ్ బ్యూరో రిపోర్ట్ తెలియజేస్తోంది.

ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో పాశమైలారం పారిశ్రామిక ప్రాంతంలో 'సిగాచి' పరిశ్రమలో జరిగిన పేలుడు ప్రమాదంలో 46 మంది మృత్యువాత పడ్డారు. ఇంకా పదుల సంఖ్యలో ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్నారు. కనీస భద్రత లేని పరిస్థితుల్లోనే కార్మికులు పనిచేసినట్లు, యాజమాన్యపు తీవ్ర నిర్లక్ష్యం ఈ ప్రమాదానికి ప్రధాన కారణమని ఇప్పటివరకు అందిన సమాచారం ప్రకారం తెలుస్తోంది. ఈ ప్రమాదంపై నిపుణుల కమిటీ ఇచ్చిన నివేదిక సిగాచి కంపెనీ సరైన రక్షణ చర్యలు తీసుకోలేదని తేల్చింది. రాష్ట్ర వ్యాప్తంగా ఇండస్ట్రియల్ మేనేజ్మెంట్ అథారిటీలను ఏర్పాటు చేయాలనే సూచనను కూడా కమిటీ చేసింది. అంతేకాదు ఆ యా కంపెనీల్లో పని చేసే వలస కార్మికుల వివరాలు కార్మిక శాఖ దగ్గర ముందే ఉండాలనే కీలక సూచన చేయడం అభినందించదగ్గ అంశం.



◆ పర్మినెంట్ కార్మికుల కంటే 7 రెట్లు అధికంగా వలస కార్మికులు ఉన్నట్లు జాతీయ శాంపిల్ సర్వే ఆర్గనైజేషన్ గణాంకాలను బట్టి తెలుస్తోంది.

పారిశ్రామిక, వ్యవసాయ, నిర్మాణ రంగంలో వలస కార్మికులు లేనిదే పనులు జరగని పరిస్థితి ఈనాడు దేశంలో ఉంది. దేశ నిర్మాణంలో వీరిదే కీలక పాత్ర. స్థూల జాతీయోత్పత్తిలో 10% వలస కార్మికుల శ్రమ నుంచే వస్తుందని లెక్కలు చెబుతున్నాయి. ఇలాంటి వలస కార్మికుల పరిస్థితి నేడు అత్యంత దయనీయంగా మారింది.

పర్మినెంట్ కార్మికుల కంటే ఏడు రెట్లు అధికంగా వలస కార్మికులు ఉన్నట్లు జాతీయ శాంపిల్ సర్వే ఆర్గనైజేషన్ వెల్లడించిన గణాంకాల మాట. ముఖ్యంగా పరిశ్రమలలో పనులకు కుదిరిన వలస కార్మికులను బానిసల కంటే దారుణంగా పరిశ్రమల యజమానులు ఉపయోగించుకుంటున్నారు. అతి తక్కువ వేతనాలు ఇచ్చి, భద్రత లేని పని ప్రదేశాల్లో అధిక గంటలు పనిచేయిస్తూ ఉత్పత్తులను పెంచుకుంటున్నారు.

రసాయన, ఔషధ పరిశ్రమలోనే ఎక్కువగా ప్రమాదాలు జరగటానికి కారణం నిపుణులను నియమించుకోవలసిన చోట వారిని కాదని తక్కువ వేతనాలకు దొరికే వలస కార్మికులను నియమించుకోవడమే. వీరికి తక్కువ నైపుణ్యాలు ఉండటంతో నిర్వహణ లోపాలు జరిగి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎన్ని ప్రమాదాలు జరిగినా పరిశ్రమల యాజమాన్యాలను అధికారులు దోషులుగా ఎప్పుడూ నిలపలేదు, వారికి శిక్షలు పడింది కూడా లేదు. ప్రమాదం జరిగిన ప్రతిసారీ కార్మికుల నిర్లక్ష్యం మూలంగానే ప్రమాదం జరిగిందనే నెపం వారి మీదనే వేస్తూ యాజమాన్యాలు తప్పించుకుంటున్నాయి. ఇక ప్రమాదాల్లో చిక్కుకొని మరణించినవారికీ, క్షతగాత్రులుగా మిగిలిన వారికీ చెల్లించే పరిహారం విషయంలో కూడా వలస కార్మికులకు తీరని నష్టం జరుగుతోంది.

వలస కార్మికులు ప్రతి ఏటా పెరుగుతూనే ఉన్నారు. ఈ వలసలను నివారించాలంటే ఆ యా ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను మెరుగుపర్చాలి. కానీ అలాంటి ఆలోచనలు పాలకులు చేయడం లేదు. రానున్న ఐదేండ్లలో భారతదేశంలో 70 శాతం కొలువులు నగరాలలోనే పోగుబడనున్నాయని ప్రపంచ బ్యాంక్ తాజా నివేదిక వెల్లడిస్తోంది. దీంతో చదువుకున్న వారూ, చదువుకోని వారూ గ్రామాలను వదిలి నగరాలకు వలస వెళ్లే సంఖ్య మరింత పెరగనుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వాలు వలస కార్మికుల సంక్షేమానికి తగిన చట్టాలు చేసి తమ వంతు బాధ్యతను నెరవేర్చాలి.

– పి.వి. రావు । సీనియర్ జర్నలిస్ట్

భక్తుడికై భగవంతుడి చింత

సుయోధనుడు కోరినట్లుగా ధర్మరాజును ప్రాణాలతో పట్టుకోవాలనే ప్రయత్నంలో ద్రోణుడు పద్మవ్యూహం పన్నాడు. అభిమన్యుడు పద్మవ్యూహాన్ని ఛేదించుకుని లోపలికెళ్ళాడు. అనేక మంది వీరులను సంహరించాడు. చేత విల్లు ఉండగా అభిమన్యుడిని జయించడం అసాధ్యమని ద్రోణుడు చెప్పడంతో, వేరే మార్గం లేదని, ముందు నుంచి మిగతా వీరులందరూ ఒక్క పెట్టున మీద పడి ఎదుర్కొనగా, వెనుకగా వెళ్ళి కర్ణుడు అభిమన్యుడి విల్లును విరిచాడు. అదే అదనుగా ద్రోణుడు అశ్వాలను, కృపుడు సారథిని కూల్చేశారు. చివరకు దుశ్శాసనుడి కొడుకుతో జరిగిన గదాయుద్ధంలో ప్రాణాలు పోగొట్టుకుని ఇరువురూ నేలకొరగడంతో పద్మవ్యూహం ముగిసింది.

జ్యోతిర్మయం

మరురోజు సూర్యుడు అస్తమించే లోపల అభిమన్యుడి మరణానికి కారణమైన సైంధవుడిని హతమారుస్తానని ప్రతిజ్ఞ చేశాడు అర్జునుడు. అలా చేయలేకపోతే గాండీవంతో సహా అగ్నిలో దూకుతానని ఆ ప్రతిజ్ఞలో భాగంగా చెప్పాడు. 'తనతో ముందుగా ఒక్కమాటైనా చెప్పకుండా, తనను సంప్రదించ కుండా, నెరవేర్చడానికి కఠినమైన ప్రతిజ్ఞను ఎందుకు చేశావని' అర్జునుడిని అడిగి బాధపడ్డాడు శ్రీకృష్ణుడు. 'ఎందుకు అంత సందేహిస్తావు? నేను ఎలాగైనా నా ప్రతిన నెరవేర్చుకుంటాను, చూస్తూవుండు!' అన్నాడు అర్జునుడు. అయితే అది ఎంత కష్టం కానున్నదో తెలిసిన శ్రీకృష్ణుడిని, ఆ రాత్రి పడుకున్న తరువాత కూడా ఆ చింత వేధించిందని ద్రోణపర్వం, ద్వితీయాశ్వాసంలోని ఈ క్రింది పద్యం చెప్పింది.

ఆ. సెజ్జయందు మేను సేర్చి యర్జునకార్య
చింత బలుకకుండి కొంతవడికి
బవ్వళించె గురునృపాలక! జలశాయి
దారకుండు గొలిచి యూరకుండ.

పక్క మీద పడుకుని, 'అర్జునుడు తన ప్రతిజ్ఞను నెరవేర్చుకునేలా చేయడం ఎలా?' అన్న చింతలో శ్రీకృష్ణుడు ఆలోచిస్తూ గడిపి కాసేపటికి నిదురపోయాడు. శ్రీకృష్ణుడు ఇంతగా చింతామగ్నుడైన సందర్భం మరొకటి మహాభారతం మొత్తంలో కనపడదు.

– భట్టు వెంకటరావు

క్లుప్తంగా...

సిగాచి మృతులకు పరిహారం

- ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఫహీమ్

సాక్షి, హైదరాబాద్: 'సిగాచి'ప్రమాదంలో మృతులు, క్షతగాత్రులకు రాష్ట్ర ప్రభుత్వం తరపున సాయం అందిస్తున్నామని తెలంగాణ ఫుడ్స్ కార్పొరేషన్ చైర్మన్ ఎం.ఎ.ఫహీమ్ చెప్పారు. ఇప్పటివరకు 46 కుటుంబాలకు రూ.లక్ష చొప్పున ఐదుగురికి రూ.10 లక్షల చొప్పున పరిహారం అందిందని వివరించారు. ప్రమాదం జరిగిన రోజే ఆరోగ్య శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి, అధికారులు అక్కడికి వెళ్లి సహాయక చర్యలను పర్యవేక్షించారని స్పష్టం చేశారు. అబద్ధాలు ఆడటమే ధ్యేయమైన బీఆర్‌ఎస్ నేతలు.. తప్పుడు సమాచారంతో ప్రజలను మభ్య పెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. జస్టిన్ అనే వ్యక్తి కుటుంబానికి ఇంకా పరిహారం ఇవ్వలేదని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆ కుటుంబంతో మాట్లాడించారని, కానీ జస్టిన్ తండ్రికి ప్రభుత్వం తరపున పరిహారం అందినట్టు కలెక్టర్ దగ్గర ఆధారాలున్నాయన్నారు.

ఆగస్టు 3 వరకు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు

- మావోయిస్టు పార్టీ



కొత్తగూడెం ప్రధాన రహదారిపై కరపత్రాలు

చర్ల: ఈనెల 28 నుంచి ఆగస్టు 3 వరకు నిర్వహిస్తున్న అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను విజయవంతం చేయాలని మావోయిస్టు పార్టీ పిలుపునిచ్చింది. ఈ మేరకు పార్టీ భద్రాద్రి కొత్తగూడెం – అల్లూరి సీతారామరాజు జిల్లాల డివిజన్ కమిటీ పేరుతో.. భద్రాద్రి జిల్లా చర్ల మండలం ఆర్.కొత్తగూడెం, దానవాయిపేట గ్రామాల్లో సోమవారం బ్యానర్లు, కరపత్రాలు వెలిశాయి. కగార్ ఆపరేషన్‌ను ప్రజా ఉద్యమాల ద్వారా ఓడించాలని పార్టీ కోరింది. ప్రధాని మోదీ నాయకత్వంలోని బీజేపీ సర్కారు 2047 నాటికి బ్రాహ్మణీయ హిందూ రాజ్యాన్ని స్థాపించాలని లక్ష్యంగా పెట్టుకుందని ఆరోపించింది. దశాబ్దాల పోరాటంతో సాధించిన తెలంగాణలోనూ ప్రజలకు ప్రాథమిక హక్కులు లేవని విమర్శించింది. అందరినీ మోసగించిన బీఆర్‌ఎస్‌ను ప్రజలు తరిమికొట్టారని, ఇప్పుడు ఆరు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ప్రజా సమస్యలు గాలికొదిలి అవినీతి, అక్రమాలకు పాల్పడుతోందని ఆరోపించింది.

తేజేశ్వర్ హత్య కేసులో ముగిసిన నిందితుల కస్టడీ



నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్న పోలీసులు

గద్వాల క్రైం: ప్రైవేట్ సర్వేయర్ తేజేశ్వర్ హత్య కేసులో నిందితులైన ఏ–1 తిరుమలరావు, ఏ–2 ఐశ్వర్య అలియాస్ సహస్రను గద్వాల కోర్టు అనుమతితో ఈ నెల 26న రెండు రోజులపాటు కస్టడీలోకి తీసుకొని విచారించిన పోలీసులు.. గడువు ముగియడంతో సోమవారం కోర్టులో తిరిగి హాజరుపరిచారు. దీంతో కోర్టు జ్యుడీషియల్ రిమాండ్‌కు ఆదేశించడంతో పోలీసులు వారిని రిమాండ్‌కు తరలించారు. రెండు రోజుల విచారణలో నిందితులు పొంతనలేని సమాధానాలతో కేసు దర్యాప్తును గందరగోళంలోకి నెట్టే ప్రయత్నం చేశారని గద్వాల సీఐ శ్రీను పేర్కొన్నారు. అందువల్ల వారిని మరోసారి కస్టడీకి ఇవ్వాలని కోర్టును కోరతామన్నారు.

శ్రీవిద్యను కోర్టులో హాజరుపరిచాం

- హైకోర్టుకు ప్రభుత్వం నివేదన.. పిటిషన్ డిస్పోజ్

సాక్షి, హైదరాబాద్: మావోయిస్టు శ్రీవిద్యను ట్రయల్ కోర్టు ముందు ప్రవేశపెట్టామని, న్యాయమూర్తి ఆదేశాలతో జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించామని హైకోర్టుకు ప్రభుత్వం నివేదించింది. పిటిషన్‌లో విచారణ అవసరం లేదని భావించిన ఉన్నత న్యాయస్థానం విచారణ ముగించింది. (డిస్పోజ్) తన కూతుర్ని పోలీసులు అక్రమంగా నిర్బంధించారంటూ శ్రీవిద్య తండ్రి సుధాకర్ శర్మ హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. వెంటనే తన కూతుర్ని న్యాయస్థానం ముందు హాజరుపరిచేలా ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ మౌషుమి భట్టాచార్య, జస్టిస్ మధుసూదన్ రావు ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. శ్రీవిద్యపై ఎఫ్ఐఆర్ నమోదుకావడంతో మియాపూర్ కోర్టులో హాజరుపరిచామని ప్రభుత్వం తరపున స్పెషల్ జీపీ స్వరూప్ ఊరిళ్ల చెప్పారు. కోర్టు ఆదేశంతో ఈనెల 25న జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించామన్నారు. లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలవాలని మావోయిస్టులకు ప్రభుత్వం అవకాశం ఇచ్చినా వినియోగించుకోలేదని తెలిపారు. న్యాయస్థానం ఎదుట హాజరు పరిచినందుకు విచారణ ముగించాలని పిటిషనర్ తరఫు న్యాయవాది విజ్ఞప్తి చేశారు.

బతుకు లేదు.. బాసట లేదు

- సిగాచీ పేలుడు దుర్ఘటనకు రేపటితో నెల రోజులు
- బాధిత కుటుంబాలకు ఇప్పటికీ అందని పరిహారం
- 54 మంది మృతుల్లో 23 కుటుంబాలకే నామమాత్రంగా పరిహారం
- మరణ ధ్రువీకరణ పత్రాల జారీలోనూ తీవ్ర జాప్యం



సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: నెల క్రితం సిగాచీ పరిశ్రమ పేలుడు దుర్ఘటనలో మరణించిన కార్మికుల కుటుంబాల పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది. కుటుంబాన్ని పోషించేవారిని కోల్పోయిన ఈ బాధితులకు ప్రమాదం జరిగి నెల రోజులు గడుస్తున్నా పరిహారం అందలేదు. సంగారెడ్డి జిల్లా పాశమైలారంలో జూన్ 30న జరిగిన ఘోర ప్రమాదంలో 54 మంది మరణించారు. ఇందులో ఎనిమిది మంది మృతదేహాలు కూడా లభించలేదు. పేలుడు ధాటికి వారి శవాలు కాలిబూడిదైపోయి ఉంటాయని అధికారులు నిర్ధారించి, వారిని కూడా మృతుల జాబితాలో చేర్చారు. 46 మంది మృతదేహాలను కుటుంబసభ్యులకు అందించారు. బాధిత కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం ఇప్పిస్తామని నాడు ప్రభుత్వం ప్రకటించింది. వారం రోజుల్లో ఈ మొత్తాన్ని అందజేస్తామని సిగాచీ పరిశ్రమ యాజమాన్యం పత్రికా ప్రకటన విడుదల చేసింది.

నామమాత్రం పరిహారంతో సరి..

ఆచూకీ లభించని 8 మంది కుటుంబాలకు ఈ నెల 9న రూ.15 లక్షల చొప్పున చెక్కులు పంపిణీ చేశారు. మరణించిన 46 మందిలో 15 మంది కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పంపిణీ చేసి చేతులు దులుపుకున్నారు. మిగిలినవారికి ఇంతవరకు పరిహారం అందించలేదు. ప్రమాదం జరిగి రేపటికి నెల అవుతుంది. ఇప్పటికీ మృతులకు పూర్తిస్థాయిలో మరణ ధ్రువీకరణ పత్రాలు జారీ చేయలేదు. మృతదేహాలు లభించిన 46 మందిలో 38 మందికే డెత్ సర్టిఫికేట్లు ఇచ్చారు. ఆచూకీ లభించకుండా పోయిన వారికి డెత్ సర్టిఫికేట్ జారీ చేయడంలో నిబంధనలు అడ్డు వస్తున్నాయి. మరోవైపు కొందరు బాధితులకు పోలీసు పంచనామా కాపీలు కూడా రాకపోవడంతో ఇన్సూరెన్స్ వంటివి క్లెయిమ్ చేసుకోవడంలో ఇబ్బందులు పడుతున్నారు.

కొడుకు లేడు.. పరిహారం లేదు



ఈ వ్యక్తి పేరు రాందాస్. ఆయన కుమారుడు జస్టిన్ సిగాచీ పేలుడు ఘటనలో కనిపించకుండా పోయాడు. జస్టిన్‌కు ఒక చెల్లి, ఒక అక్క ఉన్నారు. జస్టిన్ పనిచేస్తేనే ఈ కుటుంబానికి ఇల్లు గడిచేది. ఇప్పుడు జస్టిన్ లేకపోవడంతో వారి పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది. ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించి తమను ఆదుకోవాలని రాందాస్ కన్నీరు మున్నీరవుతున్నాడు.

రెండు నెలలకే జీవితం తలకిందులు..



మధ్యప్రదేశ్‌లోని సాత్నా జిల్లాకు చెందిన ఈ మహిళ పేరు సంజూదేవి. ఈమె భర్త చోటేలాల్ సిగాచీ దుర్ఘటనలో మరణించాడు. రెండు నెలల క్రితమే పెళ్లి అయిన సంజూదేవి భర్తను కోల్పోవడంతో దిక్కుతోచని స్థితిలో పడిపోయింది. నెల రోజులైనా తనకు ఎక్స్‌గ్రేషియా డబ్బులు అందకపోవడంతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తోంది.

ఉద్యోగమైనా ఇప్పించండి..



నా భార్య రుక్సానాఖతుం సిగాచీ పేలుడులో మృతి చెందింది. ఆర్థిక సహాయం రూ.పది లక్షల చెక్కును అందించారు. మిగతాది ఇప్పటికీ ఇవ్వలేదు. ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాం. వెంటనే పరిహారం చెల్లించాలి. ఉద్యోగ అవకాశమైనా కల్పించాలి.

– మెనుద్దీన్‌ఖాన్, బీహార్

రెండురోజుల్లో మళ్లీ పరిహారం పంపిణీ చేస్తాం..

15 కుటుంబాలకు ఇప్పటికే రూ.పది లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా పంపిణీ చేశాం. మిగిలిన వారికి కూడా రెండు రోజుల్లో ఇస్తాం. ఈ వారంలోగా ఒక్కొక్కరికి మొత్తం రూ.25 లక్షల వరకు అందేలా చూస్తాం. 46 మందిలో 38 మందికి డెత్ సర్టిఫికెట్లు ఇచ్చాం. ఎనిమిది మందికి పెండింగ్‌లో ఉన్నాయి.

– బి.చంద్రశేఖర్, అదనపు కలెక్టర్, సంగారెడ్డి.

'సిగాచి'తో సీఎం లాలూచీ

- మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపణ
- 54 మంది మృతిచెందినా యాజమాన్యాన్ని ఎందుకు అరెస్టు చేయట్లేదని నిలదీత
- బాధిత కుటుంబాలకు వెంటనే పరిహారం చెల్లించకుంటే పోరాటం చేస్తామని హెచ్చరిక
- సిగాచి బాధితులతో కలిసి సంగారెడ్డి కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేత



సిగాచి బాధితులతో కలిసి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌తో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: సిగాచి పరిశ్రమలో జరిగిన పేలుడు ఘటనలో 54 మంది మృతి చెంది నెల రోజులు గడుస్తున్నప్పటికీ యాజమాన్యాన్ని ప్రభుత్వం ఇప్పటివరకు ఎందుకు అరెస్టు చేయలేదని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. పరిశ్రమలో పాత యంత్రాల కారణంగానే ప్రమాదం జరిగిందని బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదైనప్పటికీ ఆ కంపెనీ యాజమాన్యాన్ని ఎందుకు కాపాడుతున్నారని నిలదీశారు. యాజమాన్యంతో సీఎం రేవంత్‌రెడ్డి లాలూచీ పడ్డారని ఆరోపించారు. సోమవారం సిగాచి బాధితులతో కలిసి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, నేతల బృందం సంగారెడ్డి కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందించింది. అనంతరం హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. మృతుల కుటుంబాలకు రూ. కోటి చొప్పున పరిహారం చెల్లిస్తామని సీఎం రేవంత్ బిల్డప్ ఇచ్చారని.. 15 రోజుల్లో పరిహారమంతా చెల్లిస్తామని యాజమాన్యం కూడా ప్రెస్‌నోట్ విడుదల చేసిందని హరీశ్ గుర్తుచేశారు. కానీ నెల రోజులు గడుస్తున్నా బాధిత కుటుంబాలకు పరిహారం అందలేదన్నారు. ప్రమాదంలో ఆచూకీ గల్లంతైన వారికి వెంటనే మరణ ధ్రువీకరణ పత్రాలను అందించి పరిహారం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కార్మికులకు రూ. 50 లక్షల చొప్పున పరిహారం చెల్లించి ఆదుకోవాలన్నారు. లేనిపక్షంలో బాధితుల పక్షాన పోరాటం చేస్తామని.. టెంట్ వేసి నిరసన తెలుపుతామని హెచ్చరించారు.

నూనె డబ్బాల్లో శవాలను ప్యాక్ చేశారు..

పేలుడు అనంతరం చెల్లాచెదురుగా పడిన మృతుల శరీర భాగాలను నూనె డబ్బాల్లో ప్యాక్ చేశారని హరీశ్‌రావు ఆరోపించారు. బాధితులు కన్నీళ్ల మధ్య నెల మాసికం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన విషయంలో ప్రభుత్వ స్పందన బాధ్యతారాహిత్యంగా ఉందని విమర్శించారు. హరీశ్‌రావు వెంట ఆ పార్టీ ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, సునీతారెడ్డి, కొనింటి మాణిక్‌రావు, మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, నేతలు మల్కాపురం శివకుమార్ తదితరులు ఉన్నారు.

ఆ ఆస్తులన్నీ నా కుమారుడివే..?

- కస్టడీలో మాజీ ఈఎన్సీ మురళీధర్‌రావు వెల్లడి
- కీలక వివరాలు సేకరించిన ఏసీబీ



సాక్షి, హైదరాబాద్: ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్టయిన ఇరిగేషన్ మాజీ ఇంజనీర్ ఇన్ చీఫ్ (ఈఎన్సీ) మురళీధర్‌రావు.. ఏసీబీ కస్టడీలో పలు కీలక వివరాలు వెల్లడించారు. చాలావరకు ఆస్తులు తన కుమారుడి సంపాదనతోనే కూడబెట్టినట్టు ఏసీబీ అధికారులకు చెప్పినట్టు విశ్వసనీయంగా తెలిసింది. అక్రమార్జనపైనే ఏసీబీ అధికారులు లోతుగా ఆరా తీశారు. కోర్టు అనుమతితో ఈనెల 23 నుంచి ఏసీబీ అధికారులు మురళీధర్‌రావును కస్టడీకి తీసుకుని విచారిస్తున్నారు. ఆదివారంతో ఆయన కస్టడీ ముగిసింది. కాగా, ఈనెల 15న ఏసీబీ అధికారులు మురళీధర్ రావుపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేయడం తెలిసిందే. ఏకకాలంలో హైదరాబాద్‌లోని మురళీధర్ రావు ఇంటితో పాటు.. కరీంనగర్, జహీరాబాద్ సహా మొత్తం 12 చోట్ల ఏసీబీ అధికారులు సోదాలు చేశారు. స్థిర, చరాస్తులతో పాటు పెద్ద మొత్తంలో బ్యాంకు డిపాజిట్లకు సంబంధించిన కీలకపత్రాలను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు బినామీల పేరుతో ఉన్న ఆస్తులను గుర్తించారు. ఐదు రోజుల కస్టడీలో మురళీధర్ రావు ఆస్తులపైనే ఏసీబీ అధికారులు కీలక వివరాలు సేకరించే ప్రయత్నం చేశారు. మొదట ఏసీబీ అధికారులకు సహకరించకపోయినా.. వరుసగా ఆస్తుల పత్రాలు, ఇతర కీలక పత్రాలను ముందుంచి ప్రశ్నించడంతో ఆయన సమాధానం ఇచ్చినట్టు తెలిసింది. ఐదు రోజుల విచారణలో భాగంగా సేకరించిన సమాచారం ఆధారంగా.. కేసు దర్యాప్తును మరింత ముమ్మరం చేసేందుకు ఏసీబీ అధికారులు సిద్ధమవుతున్నారు.

కుటుంబ కలహాలతో కక్ష

- అత్తను నరికి చంపిన అల్లుడు
- పీఎస్‌లో లొంగిపోయిన నిందితుడు



వజ్రమ్మ

మద్దూరు (హుస్నాబాద్): అల్లుడు వేట కొడవలితో అత్తను నరికి చంపాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా మద్దూరు మండలంలోని మర్మాముల గ్రామ శివారు బంజెరలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన జంగిలి వజ్రమ్మ (55)కు భర్త యాదగిరి, కుమార్తె భవాని ఉన్నారు. భవానిని ఎనిమిదేళ్ల కిందట మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన జక్కుల మహేశ్‌కు ఇచ్చి పెళ్లి చేశారు. వీరికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. వజ్రమ్మ, భర్త యాదగిరి, కుమార్తె భవాని, అల్లుడు మహేశ్‌తో కలిసి కొన్నేళ్లుగా హైదరాబాద్‌లోని బోయిన్‌పల్లి అంజయ్యనగర్‌లో నివాసం ఉంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో వజ్రమ్మ, కూతురు, అల్లుడి మధ్య కుటుంబ కలహాలు నెలకొన్నాయి. వీటిని పరిష్కరించుకునేందుకు ఈనెల 22న స్వగ్రామమైన బంజెరకు వచ్చి పెద్ద మనుషుల సమక్షంలో వాటిని పరిష్కరించుకున్నారు. 26న భవానిని ధర్మారంలోని ఆమె అత్తగారింటికి పంపించారు. కుటుంబ కలహాలను మనసులో ఉంచుకున్న అల్లుడు మహేశ్ తన తమ్ముడైన హరీశ్‌ను వెంటబెట్టుకుని బైక్‌పై మధ్యాహ్నం బంజెరకు వెళ్లారు. గ్రామంలో ఓ ఇంటి వద్ద కనిపించిన అత్త వజ్రమ్మపై మహేశ్, హరీశ్ తమ వెంట తెచ్చుకున్న వేట కొడవలితో విచక్షణారహితంగా నరికి చంపారు. నిందితులు ఘటనా స్థలం నుంచి పారిపోయి నేరుగా పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయారు. ఘటనా స్థలాన్ని హుస్నాబాద్ సీఐ కొండ శ్రీను, ఎస్సై షేక్ మహబూబ్, నవీన్ సందర్శించి వివరాలు సేకరించారు. మృతురాలి భర్త యాదగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ఫోన్‌లో యువకుడితో మాట్లాడుతోందని..

- అక్కను చంపిన తమ్ముడు



రుచిత

కొత్తూరు: సెల్‌ఫోన్‌లో మాట్లాడొద్దని ఎన్నిసార్లు చెప్పినా వినకపోవడంతో ఆవేశానికి లోనైన ఓ తమ్ముడు అక్క గొంతు నులిమి చంపేశాడు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం పెంజర్లలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రాఘవేంద్ర, సునీత దంపతులకు రుచిత (21), రోహిత్ (20) వైష్ణవి (18) సంతానం. పెద్ద కూతురు రుచిత ఇటీవలే డిగ్రీ పూర్తి చేసి, ఎంబీఏలో చేరేందుకు సిద్ధమవుతోంది. రుచిత ఇదే గ్రామానికి చెందిన దినేశ్ అనే యువకుడిని ప్రేమిస్తోంది. ఈ విషయంలో పలుమార్లు ఇరు కుటుంబాల మధ్య గొడవలు జరగ్గా, ఒకరితో ఒకరు మాట్లాడకూడదని తీర్మానించుకున్నారు. తల్లిదండ్రులు పని నిమిత్తం ఉదయాన్నే బయటకు వెళ్లగా.. ఉదయం 11 గంటలకు తమ్ముడు రోహిత్ ఇంటికి వచ్చాడు. ఈ సమయంలో రుచిత ఫోన్‌లో దినేశ్‌తో మాట్లాడటాన్ని గమనించి అక్కతో వాగ్వాదానికి దిగాడు. ఇరువురి మధ్య మాటామాటా పెరిగి, ఆగ్రహానికి గురైన రోహిత్ గొంతు నులిమి సోదరిని హత్య చేశాడు. అనంతరం కొడిచర్లలో ఉన్న బంధువులకు ఫోన్ చేసి, అక్కకు శ్వాస ఆడటం లేదని, కిందపడిపోయిందని చెప్పాడు. వారు వచ్చి పరిశీలించగా అప్పటికే రుచిత చనిపోయింది. గ్రామస్తుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు దినేశ్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని షాద్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. దినేశ్ కారణంగానే తన కూతురు చనిపోయిందని, మృతురాలి తండ్రి రాఘవేంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ నర్సింహారావు తెలిపారు.

సొంత ఊరు లేదు.. కొత్త ఊరు రానివ్వరు

- ములుగు జిల్లాలో గోదావరి ముంపు గ్రామం కొండాయి ప్రజల అవస్థ
- అడ్డుకున్న అటవీ శాఖ అధికారులు, దొడ్ల గ్రామస్తులు



దొడ్ల వద్ద ధర్నా చేస్తున్న ముంపువాసులకు నచ్చజెబుతున్న అడిషనల్ కలెక్టర్ మహేందర్ జీ

ఏటూరునాగారం: ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని గోదావరి ముంపు గ్రామం కొండాయి ప్రజలు సొంత గ్రామంలో ఉండలేక, పొరుగు గ్రామస్తులు రానివ్వక దిక్కు తోచని స్థితిలో పడిపోయారు. అధికారులు ఈ గ్రామాన్ని ఖాళీ చేయాలని చెప్పటంతో సోమవారం గ్రామస్తులు ఊరు ఖాళీ చేసి జంపన్నవాగు దాటి దొడ్ల అటవీ ప్రాంతంలో గుడిసెలు వేసుకున్నారు. సుమారు 25 కుటుంబాలు కర్రలు, కవర్లతో తాత్కాలికంగా గుడిసెలు నిర్మించుకున్నారు. విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు వాటిని తొలగించి ప్రభుత్వం కేటాయించిన స్థలాల్లో మాత్రమే గుడిసెలు వేసుకోవాలని స్పష్టంచేశారు. మరోవైపు దొడ్ల గ్రామస్తులు సైతం కొండాయి ప్రజలు ఇక్కడికి రావద్దని అడ్డుకున్నారు. కాగా, కొండాయి వద్ద కూలిపోయిన వంతెనను పరిశీలించేందుకు వచ్చిన ఎఫ్‌సీడీఏ కమిషనర్ శశాంకను సోమవారం కొండాయి ప్రజలు అడ్డుకుని తమకు పక్కా ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దొడ్ల గ్రామ ప్రజలు కూడా శశాంకను అడ్డుకుని కొండాయి గ్రామస్తులకు వేరేచోట భూమి కేటాయించాలని నిరసన తెలిపారు.

పండ్ల కింద గంజాయి రవాణా

- రూ.5 కోట్ల విలువైన 935 కిలోల గంజాయి పట్టుకున్న ఈగల్ టీం
- ఒడిశా నుంచి మహారాష్ట్రకు తరలిస్తున్న ముఠా.. ముగ్గురి అరెస్టు

సాక్షి, హైదరాబాద్: పోలీసులకు దొరక్కుండా పండ్ల ట్రేల కింద గంజాయిని దాచి రాష్ట్ర సరిహద్దులు దాటిస్తున్న అంతర్రాష్ట్ర ముఠా గుట్టును రట్టు చేసింది ఈగల్ (ఎలైట్ యాక్షన్ గ్రూప్ ఫర్ డ్రగ్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్) టీం. పక్కా సమాచారంతో స్పెషల్ ఆపరేషన్ చేపట్టిన బృందం రూ.5 కోట్ల విలువ చేసే 935.611 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుంది. ఒడిశా నుంచి ఆంధ్రప్రదేశ్ మీదుగా మహారాష్ట్రకు గంజాయిని తరలిస్తున్న ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్టు ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఠాలోని కీలక నిందితుడు పవార్ కుమార్‌తోపాటు సమాధాన్ కంటిల్ బిసే, వినాయక్ బాబా సాహెబ్ పవార్‌లను అరెస్టు చేసినట్టు వెల్లడించారు. ఈ నెల 26న (శనివారం) తెల్లవారుజామున బాటసింగారం పండ్ల మార్కెట్ సమీపంలో రీజినల్ నార్కోటిక్స్ కంట్రోల్ సెంటర్ (ఆర్ఎన్‌సీసీ) ఖమ్మం, రాచకొండ నార్కోటిక్స్ సిబ్బందితో కలిసి ఈగల్ బృందం ఈ ఆపరేషన్ చేపట్టినట్టు పేర్కొన్నారు. టాటా ఐషర్ వాహనంలో పండ్ల ట్రేల కింద గంజాయిని దాచి స్మగ్లర్లు రవాణా చేశారు. శనివారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో అడ్డుకుని తనిఖీ చేయగా.. పండ్ల ట్రేల కింద 455 ప్యాకెట్లలో దాచిన గంజాయి పట్టుబడింది. నిందితులపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

సభలో సిందూరం

ఆపరేషన్ సిందూర్‌పై వాడీవేడీ చర్చ

- పార్లమెంట్‌లో సోమవారం కొనసాగిన రభస
- బిహార్‌లో ఓటర్ల జాబితా సవరణపై చర్చ చేపట్టాలని రాజ్యసభలో పట్టుబట్టిన విపక్షసభ్యులు
- పార్లమెంట్ మకర ద్వారం ముందు విపక్షాల ఆందోళనలు

న్యూఢిల్లీ: పహల్గాం ఉదంతం, ఆపరేషన్ సిందూర్‌పై తక్షణం చర్చ జరపాలన్న విపక్షాల డిమాండ్లకు తలొగ్గి సోమవారం వివరణలతో చర్చను మొదలెట్టిన అధికార పక్షం, ప్రభుత్వ వివరణను తీవ్రంగా తప్పుబడుతూ విపక్షసభ్యులు చేసిన నినాదాలతో పార్లమెంట్ ఉభయసభలు దద్దరిల్లాయి. ప్రభుత్వం తరఫున రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్, విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్‌లు లోక్‌సభలో సుదీర్ఘంగా మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వాదనను బలంగా వినిపించారు. ఇదేసమయంలో జైశంకర్ ప్రసంగాన్ని విపక్ష సభ్యులు అడ్డుకోవడం, అడ్డుకున్నందుకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా జోక్యం చేసుకుని కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించడంతో సభలో ఆగ్రహావేశాలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. ఓవైపు ఆపరేషన్ సిందూర్‌పై చర్చ జరుగుతుండగానే బిహార్‌లో ఓటర్ల జాబితా సమగ్ర సవరణపైనా చర్చ జరపాలని విపక్ష సభ్యులు రాజ్యసభలో పట్టుబట్టారు. దీంతో సభ పలుమార్లు వాయిదాపడి చివరకు అర్ధాంతరంగా ముగిసి మంగళవారానికి వాయిదాపడింది.

తొలుత లోక్‌సభలో ఆపరేషన్‌సిందూర్‌పై చర్చపై రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడారు. ''ఆపరేషన్ సిందూర్ అనేది ముమ్మాటికీ చరిత్రాత్మకమైన సైనిక చర్య. ఉగ్రవాదంపై అత్యంత ప్రభావవంతమైన భారత విధానాన్ని ఈ ఆపరేషన్ ప్రపంచానికి చాటింది. యుద్ధరంగంలో తమ ధైర్యసాహసాలను ప్రదర్శించిన ధైర్యవంతులైన సైనికులందరికీ నా సెల్యూట్. పాక్ పౌరులకు, వారి ఆస్తులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా పక్కా ప్రణాళికతో ఈ ఆపరేషన్‌కు పథకరచన చేశారు. కేవలం ఉగ్రవాదులకే భారీ నష్టం చేకూర్చాం. కేవలం 22 నిమిషాల్లో 9 కీలక ఉగ్రస్థావరాలపై మెరుపుదాడి చేసి మన సత్తా చాటాం. ఊహించని మెరుపుదాడితో చేష్టలుడిగిన పాక్ డైరెక్టర్స్ జనరల్ ఆఫ్ మిలటరీ ఆపరేషన్స్(డీజీఎంఓ) స్వయంగా ఫోన్ చేసి తమకు ఉద్రిక్తతలను పెంచే ఉద్దేశ్యంలేదని స్పష్టంచేశారు. ఆలోపు పాక్ జరిపిన డ్రోన్, క్షిపణి దాడులను మన ఎస్–400 గగనతల రక్షణ వ్యవస్థలు విజయవంతంగా నిర్వీర్యంచేశాయి. మన దాడులకు ప్రతీగా పాక్ జరిపిన దాడుల్లో భారత్‌లో ఏ ఒక్క కీలక స్థావరం, ఆయుధాగారం దెబ్బ తినలేదు. ఉగ్రవాదుల స్థావరాలు, వాళ్లకు మద్దతిచ్చేవాళ్లను అంతం చేసేందుకే ఆ ఆపరేషన్. లక్ష్యం నెరవేరిన కారణంగానే ఆపరేషన్ సిందూర్‌ను ఆపేశాం. ఇందులో ఎవరి బలవంతం, ప్రోద్బలం, ప్రమేయం లేవు. బయటిశక్తుల (అమెరికా, ట్రంప్) కారణంగానే పాక్‌పై మనం దాడులను ఆపేశామనడంలో వాస్తవం లేదు. భారత వాయుసేన అసాధారణ దాడులు, సరిహద్దు వెంట ఆర్మీ దీటైన జవాబుకు తోడు నావికాదళం దాడులకు దిగొచ్చన్న భయాలతో పాక్ కాళ్లబేరానికొచ్చింది'' అని రాజ్‌నాథ్ స్పష్టం చేశారు. ''మమ్మల్ని విపక్షాలు అడగదల్చుకుంటే ఆపరేషన్ సిందూర్ విజయవంతమైందా? అని ఒక్కటే ప్రశ్న వేయాలి. అందుకే మేం అవును అని సూటి సమాధానం చెప్తాం. పాక్ దాడుల్లో మన సైనికులెవరూ వీరమరణం పొందలేదు. ఏ పరీక్షలోనైనా ఫలితమే ముఖ్యం. పరీక్ష రాసేటప్పుడు పెన్సిల్ విరగడము, కలం కనిపించకుండా పోవడమూ సాధారణం. పరీక్షలో ఉత్తీర్ణత సాధించడమే ముఖ్యం. ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యాలను సైనికదళాలు 100 శాతం కచ్చితత్వంతో సాధించాయి. పాక్‌తోగానీ మరే ఇతర దేశంతోగానీ ఎప్పుడూ విజయవంతమైన ప్రభుత్వాల సారథ్యంలో స్నేహాన్నే భారత్ కోరుకుంటోంది. గతంలో భారత్ 'లాహోర్ బస్సు యాత్ర' బాషలో మాట్లాడితే ధూర్త పాక్‌కు బోధపడలేదు. వాళ్లకు అర్థమయ్యేలా ఈసారి మేం 'బాలాకోట్ దాడి' భాషలో మాట్లాడాం. భారత్ ఏ దేశంతోనైనా కరచాలనం కోసం స్నేహహస్తమే అందిస్తుంది. చేతిని మెలిపెట్టాలని చూస్తేమాత్రం ఆ చేతినే విరిచేస్తుంది. పౌరుల ప్రాణాలకు హాని తలపెట్టాలని చూస్తే భారత్ ఏ స్థాయిలో విరుచుకుపడుతుందో ఆపరేషన్ సిందూర్ కళ్లకుకట్టింది. భారత్‌ను ఏనాటికీ ఓడించలేమని పాక్ పాలకులకు అర్థమైంది. అందుకే ఉగ్రవాదాన్ని పెంచిపోషిస్తున్నారు. కానీ అది వాళ్లనే మింగేస్తోంది. అమాయక పాక్ ప్రజలనూ చంపేస్తోంది. ఆపరేషన్ ముగియలేదు. పాక్ మళ్లీ తోక జాడిస్తే మళ్లీ సిందూర్ మొదలవుతుంది'' అని రాజ్‌నాథ్ అన్నారు.

పాక్ కాళ్లబేరానికి వచ్చింది



వాణిజ్య అంశాల్లో సిందూర్ ప్రస్తావన రాలేదు: జైశంకర్



ఆపరేషన్ సిందూర్‌పై లోక్‌సభలో చర్చ సందర్భంగా విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ మాట్లాడారు. ''ఆపరేషన్ సిందూర్ వేళ ట్రంప్, మోదీ మధ్య ఎలాంటి ఫోన్ సంభాషణ జరగలేదు. అమెరికాతో వాణిజ్యానికి, ఈ ఆపరేషన్‌కు సంబంధం లేదు. ది రెసిస్టెంట్ ఫ్రంట్‌ను అంతర్జాతీయ ఉగ్రసంస్థగా ప్రకటించడంలో విజయంసాధించిన భారత దౌత్యానికి కృతజ్ఞతలు చెప్పాల్సిందే. మనం పాక్ నడిబొడ్డులోని బహావల్పూర్, మురిద్కేలోని స్థావరాలను నేలమట్టంచేయగలమని ఎవరైనా ఊహించారా?. పహల్గాం దాడిని బ్రిక్స్, క్వాడ్ కూటములేకాదు ఎన్నో దేశాలు ఖండించాయి. పాక్‌పై దాడిచేశాక దాడులను ఆపాలని పాక్ నుంచే అభ్యర్థన వచ్చింది. కానీ మేం పాక్ డైరెక్టర్స్ జనరల్ ఆఫ్ మిలటరీ ఆపరేషన్స్(డీజీఎంఓ) నుంచి అభ్యర్థన వస్తేనే ఆపుతామని చెప్పాం'' అన్నారు.

ప్రతిపక్షాలపై అమిత్ షా ఆగ్రహం..



విదేశాంగ మంత్రి జైశంకర్ ప్రసంగిస్తుంటే విపక్ష సభ్యులు పదేపదే అడ్డుతగిలారు. హోం మంత్రి అమిత్ షా జోక్యంచేసుకుని కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. ''ఆపరేషన్ సిందూర్‌పై మంత్రి జైశంకర్ చేసిన ప్రకటనను కాంగ్రెస్ సభ్యులు అస్సలు విశ్వసించట్లేరు. బయటివాళ్ల (ట్రంప్) చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్‌కు నమ్మకం ఎక్కువ. మీ పార్టీలో విదేశీయుల అభిప్రాయాలకు ఎంతటి విలువుందో ఇప్పుడే తెలుస్తోంది. మీ అభిప్రాయాలను పార్లమెంట్‌పై రుద్దకండి. విదేశీయులను నమ్మినందుకే మీరు విపక్షంలో కూర్చున్నారు. ట్రంప్ వంటి విదేశీయుల మాటలను ఇలాగే నమ్ముతూ పోతే మీరు ఇలాగే మరో 20 సంవత్సరాలు విపక్షంలోనే ఉండిపోతారు'' అని వ్యాఖ్యానించారు.

ప్రశ్నలు కురిపించిన కాంగ్రెస్

చర్చలో కాంగ్రెస్ తరఫున లోక్‌సభలో ఉపనేత గౌరవ్ గొగోయ్ మాట్లాడుతూ ప్రభుత్వంపై ప్రశ్నలు సంధించారు. ''పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను తిరిగి స్వాధీనం చేసుకునే ఉద్దేశం మోదీ సర్కార్‌కు లేనట్లుంది. నిజంగా తిరిగి హస్తగతం చేసుకునే ఆలోచనే ఉంటే హఠాత్తుగా ఆపరేషన్ సిందూర్‌ను ఎందుకు ఆపాల్సి వచ్చింది?. ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు పీఓకేను స్వాధీనంచేసుకుంటాం?. పాక్, భారత్ పరస్పర సైనిక చర్యలకు ముగింపు పలికింది తానేనని ట్రంప్ 26 సార్లు ప్రకటించుకోవాల్సిన అవసరం ఏమొచ్చింది?. భారత్, పాక్ యుద్ధం ఆపితేనే వాణిజ్యం కొనసాగిస్తానని ట్రంప్ అమెరికా వాణిజ్య కత్తిని చూపి బెదిరించారా?. ఇంట్లో చొరబడి మరీ చంపుతామని ఇప్పటికి ఎన్నోసార్లు మోదీ అదే డైలాగ్‌లు కొడుతున్నారు. మరి సిందూర్ పరిసమాప్తంకాలేదని, పాక్ దాడిచేస్తే మళ్లీ మొదలవుతుందని వాళ్లే చెబుతున్నారు. అలాంటప్పుడు సిందూర్ విజయవంతమైందని ఎలా అంటారు? యుద్ధం చేయడం తమ విధానం కాదంటారు? మరి సిందూర్‌వేళ చేసిందేంటి? వాళ్ల అధీనంలోని భూభాగాన్ని స్వాధీనంచేసుకోవడానికి సిందూర్ చేయలేదంటున్నారు. మరి దేని కోసం చేసినట్లు? సిందూర్ వేళ ఎన్ని యుద్ధవిమానాలను కోల్పోయాం?'' అని గొగోయ్ ప్రశ్నించారు.



డిప్యూటీ చైర్మన్‌కు 26 నోటీసులు

బిహార్ ఓటర్ల జాబితా అంశంతోపాటు ఇతర రాష్ట్రాల్లో బెంగాలీ వలసకూలీలు వివక్షను ఎదుర్కొనే పలు అంశాలపై రాజ్యసభలో చర్చించాలంటూ డిప్యూటీ చైర్మన్ హరివంశ్‌కు మొత్తం 26 వాయిదా తీర్మానాలు వచ్చాయి. వీటన్నింటినీ ఆయన తోసిపుచ్చారు. జోరీఅవర్ సెషన్‌ను మొదలుపెట్టాలని నామినేటెడ్ సభ్యురాలు సుధామూర్తిని హరివంశ్ కోరగానే విపక్షసభ్యులు ఆందోళన పెంచారు. ఓటు చోరీని ఆపాలి అని నినాదాలుచేశారు. దీంతో మధ్యాహ్నం సెషన్‌లోపే సభ రెండుసార్లు వాయిదాపడింది. తర్వాత సభ మొదలైనా మళ్లీ ఇదే పునరావృతమైంది. దీంతో సభను మధ్యాహ్నం రెండు గంటలకు వాయిదావేశారు. తర్వాత సభ మొదలైనా విపక్షసభ్యులు వెల్‌లోకి దూసుకొచ్చి నినాదాలిస్తూ సభ జరక్కుండా అడ్డుకున్నారు. దీంతో చేసేదిలేక సభను మంగళవారానికి వాయిదావేశారు.

ఆపరేషన్ మహదేవ్
పహల్గాం ఉగ్రదాడి మాస్టర్‌మైండ్ హతం

మరో ఇద్దరు ముష్కరులు కూడా • మట్టుబెట్టిన ఎలైట్ కమెండోలు

- సమీపంలో నక్కిన మరో ఉగ్ర ముఠా
- భీకరంగా కొనసాగుతున్న ఎన్‌కౌంటర్
- భారీగా అదనపు బలగాల మోహరింపు

శ్రీనగర్: 'పహల్గాం' గాయానికి ప్రతీకారం మొదలైంది. దేశమంతటా ఆగ్రహావేశాలు రగిల్చిన ఆ దాడికి పాల్పడ్డ ఉగ్ర ముష్కరులకు కౌంట్‌డౌన్ మొదలైంది. పహల్గాం దాడి సూత్రధారి అయిన ఉగ్ర ముష్కరుడు హషీం మూసా అలియాస్ సులేమాన్ అలియాస్ ఆసిఫ్‌ను భద్రతా దళాలు సోమవారం మట్టుబెట్టాయి. జమ్మూ కశ్మీర్‌లో శ్రీనగర్ శివార్లలోని అటవీ ప్రాంతంలో 'ఆపరేషన్ మహదేవ్' పేరిట జరిపిన భీకర ఎన్‌కౌంటర్‌లో సులేమాన్‌తో పాటు మరో ఇద్దరు ఉగ్రవాదులను ఎలైట్ పారా కమెండో దళాలు కాల్చిపారేశాయి. వారిని జిబ్రాన్, హంజా అఫ్గానీగా గుర్తించారు. జిబ్రాన్ గతేడాది సోనామార్గ్‌లో టన్నెల్ ప్రాజెక్టు పనులు చేస్తున్న సిబ్బందిని పొట్టన పెట్టుకున్న ఉగ్ర ముఠా సభ్యుడని అధికార వర్గాలు వెల్లడించాయి. ఎన్‌కౌంటర్ ప్రాంతం నుంచి ఒక ఎం4 కార్బైన్, రెండు ఏకే రైఫిళ్లు, మందుగుండు, గ్రెనేడ్లు తదితరాలు స్వాధీనం చేసుకున్నారు. ముష్కరుల మృత దేహాలను బలగాలు స్థానిక పోలీసులకు అప్పగించాయి. ఈ ముష్కరులకు సన్నిహితులైన మరో ఉగ్ర ముఠా సభ్యులు సైతం ఎన్‌కౌంటర్ ప్రాంతానికి సమీపంలోనే నక్కినట్టు బలగాలకు సమాచారం అందింది. దాంతో సమీప ప్రాంతాలన్నింటినీ దిగ్బంధించి జల్లెడ పడు తున్నారు. 'ఆపరేషన్ మహదేవ్' ఇంకా ముమ్మరంగా కొనసాగుతున్నట్టు సైనిక, స్థానిక పోలీసు వర్గాలు స్పష్టం చేశాయి. ఇందుకోసం భారీ సంఖ్యలో అదనపు బలగాలను మోహరించారు. సైన్యం, భద్రతా బలగాలు, కశ్మీర్ పోలీసు విభాగ సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకున్నారు. ఆపరేషన్ మహదేవ్ ఇప్పట్లో ముగి యబోదని కశ్మీర్ జోన్ ఐజీ వీకే బిర్దీ స్పష్టం చేశారు.



హషీం మూసా

కునుకు తీస్తుండగానే...

హషీం మూసా. అలియాస్ అబూ సులేమాన్. అలియాస్ ఆసిఫ్. పాక్ ప్రేరేపిత ఉగ్ర సంస్థ లష్కరే తయిబా టాప్ కమాండర్. పహల్గాం ఉగ్ర దాడి సూత్రధారి. ఆపరేషన్ మహదేవ్‌లో మన బలగాలు మట్టుబెట్టిన ముగ్గురు ముష్కరుల్లో అతి ముఖ్యుడు. అయితే ఇంతటి విజయం అంత తేలిగ్గా ఏమీ లభించలేదు. ఇందుకోసం సైన్యం అవిశ్రాంతంగా శ్రమించింది. సీఆర్‌పీఎఫ్, జమ్మూ కశ్మీర్ పోలీస్‌తో కలిసి ఏకంగా 14 రోజుల పాటు కలిసికట్టుగా, నిర్విరామంగా వేట సాగించింది. చివరికి శ్రీనగర్ శివార్లలోని అటవీ ప్రాంతంలో మూసా ముఠా ఆనుపానులు కనిపెట్టి ముప్పేట దాడి చేసింది. రెప్పపాటులో దాని కథ ముగించింది. జమ్మూ కశ్మీర్‌లోని లిద్వాస్ ప్రాంతంలోని చినార్ కార్ప్స్ సైనిక విభాగం ఈ ఆపరేషన్‌ను ఆద్యంతం పర్యవేక్షించింది. అనంతరం ఘటనా స్థలిలో తీసిన డ్రోన్ ఫుటేజీని విడుదల చేసింది. అందులో ముగ్గురు ముష్కరుల మృతదేహాలు కనిపిస్తున్నాయి. వీరంతా లష్కరే, పాక్‌కే చెందిన మరో ఉగ్ర ముఠా జైషే మహ్మద్‌కు చెందిన ఉగ్రవాదులేనని తేలింది. పహల్గాం ఉగ్ర దాడి తమ పనేనని లష్కరే ప్రకటించుకోవడం తెలిసిందే. ఈ ముగ్గురిలో ముఖ్యుడైన మూసా దాడి సమయంలో తీరిగ్గా కునుకు తీస్తూ ఉండటం ఈ ఉదంతం మొత్తంలో కొసమెరుపు!

అలా ఉచ్చు బిగించారు...

నిజానికి ఆపరేషన్ మహదేవ్ రెండు రోజులుగా కొనసాగుతోంది. దట్టమైన దాచిగాం అడవుల లోతట్టు ప్రాంతం నుంచి అందని అనుమానాస్పద సిగ్నల్స్, కమ్యూనికేషన్‌తో బలగాలు అప్రమత్తమయ్యాయి. వాటి ఆధారంగానే అనుమానితుల జాడను కనిపెట్టగలిగాయి. ఆ వెంటనే సైనిక బృందాలు, ప్రత్యేక బలగాలు (ఎలైట్ ఫోర్సెస్) రంగంలోకి దిగి రెండు రోజులుగా పరిసరాలను జల్లెడ పడుతూ వచ్చాయి. ఆ క్రమంలో ఒక చెట్టు కింద తాత్కాలిక గుడారంలో విశ్రమిస్తున్న ముగ్గురు ఉగ్రవాదులను యాదృచ్ఛికంగా గుర్తించాయి. దాడిని ఏ మాత్రమూ ఊహించని ముష్కరులు టెంట్లో తీరిగ్గా కునుకు తీస్తూ కనిపించారు. సైనికులు వెంటనే తూటాల వర్షం కురిపించి వారిని హతమార్చారు. ఆపరేషన్‌ను పర్యవేక్షించిన అత్యున్నత స్థాయి అధికారి ఒకరు ఈ మేరకు ధ్రువీకరించారు.

రూపం మార్చుకున్న మూసా

ఎట్టి పరిస్థితుల్లోనూ భద్రతా దళాలకు చిక్కొద్దనే ఉద్దేశంతో మూసా తన రూపాన్ని వీలైనంతగా మార్చుకున్నట్టు నిఘా వర్గాలు తెలిపాయి. ఆ క్రమంలో అతడు భారీగా బరువు కోల్పోయాడన్నారు.

కమిటీ ముందు ఎందుకు హాజరయ్యారు?

- దర్యాప్తు కమిటీ నివేదిక మీకు అనుకూలంగా రావొచ్చని ఆశించారా?
- ముందే సుప్రీంకోర్టును ఎందుకు ఆశ్రయించలేదు?
- కాలిన కరెన్సీ నోట్ల ఉదంతంలో జస్టిస్ వర్మపై సుప్రీంకోర్టు సూటి ప్రశ్నలు

న్యూఢిల్లీ: సగం కాలిన కరెన్సీ నోట్ల కట్టలు అధికారిక నివాసప్రాంగణంలో బయటపడిన ఉదంతంలో అభిశంసనను ఎదుర్కొంటున్న అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మపై సర్వోన్నత న్యాయస్థానం ప్రశ్నల వర్షం కురిపించింది. న్యాయం కోసం ఇప్పుడు కోర్టు గడప తొక్కిన మీరు అప్పుడెందుకు కోర్టును ఆశ్రయించలేదని జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మాసిహ్‌లతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం సూటి ప్రశ్నవేసింది. కరెన్సీ నోట్లు బయల్పడిన ఉదంతానికి సంబంధించి హైకోర్టు న్యాయ మూర్తులతో కూడిన దర్యాప్తు కమిటీ ఇచ్చిన తుది నివేదికను చెల్లనిదిగా ప్రకటించాలంటూ యశ్వంత్ వర్మ పెట్టుకున్న పిటిషన్‌ను సోమవారం సుప్రీంకోర్టు బెంచ్ విచారించింది. ఈ సందర్భంగా జస్టిస్ వర్మకు ధర్మాసనం పలు ప్రశ్నలు సంధించింది. ''మీరు తప్పు చేయలేదని భావిస్తే ఆ దర్యాప్తు కమిటీని ముందుగానే సవాల్‌చేయాల్సింది. మీరు అసలు ఆ కమిటీ ఎదుట విచారణకు ఎందుకు హాజరయ్యారు?. సగం కాలిన కరెన్సీలను చూపిస్తున్న వీడియోను తొలగించాలని కోరేందుకే కోర్టుకొచ్చారా?. దర్యాప్తు కమిటీ విచారణ మొత్తం పూర్తయ్యేదాకా మీరెందుకు వేచి చూశారు?. ఒకవేళ కమిటీ నివేదిక మీకు అనుకూలంగా రావొచ్చని ముందుగానే భావించారా?'' అని జస్టిస్ వర్మను ధర్మాసనం పలు ప్రశ్నలు అడిగింది. ఈ సందర్భంగా జస్టిస్ వర్మ తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదించారు. ''ఆరోజు దొరికిన కట్టలకొద్దీ నగదు ఎవరిదో తెల్సుకునేందుకే వర్మ ఆ కమిటీ ఎదుట విచారణకు హాజర య్యారు. విచారణకు హాజరైనంత మాత్రాన తప్పు ఒప్పుకుని విచారణకు వచ్చారని ముందస్తు అంచనాకు కోర్టు రాకూడదు'' అని సిబల్ వాదించారు.

పిటిషన్ ఇలాగేనా వేసేది?

ఈ విచారణ జరుగుతున్నంతసేపు ధర్మాసనం ఎక్కడా వర్మ పేరు ప్రత్యక్షంగా ప్రస్తావించకుండా ఎక్స్‌ఎక్స్‌ఎక్స్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసుగానే పేర్కొంది. ఇలా పిటిషన్ వేయడంపై కోర్టు అభ్యంతరం వ్యక్తంచేసింది. ''పిటిషన్ ఇలాగేనా వేసేది?. ఒకరకంగా సుప్రీంకోర్టు మీదనే కేసు వేసినట్లుగా ఉంది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకే ఆ దర్యాప్తు కమిటీ ఏర్పడిందికదా?'' అని ధర్మాసనం సిబల్‌కు గుర్తుచేసింది. దీనిపై సిబల్ వివరణ ఇచ్చారు. 124వ అధికరణంలోని ''ఎస్టాబ్లిష్‌మెంట్ అండ్ కాన్‌స్టిట్యూషన్ ఆఫ్ సుప్రీంకోర్టు' ప్రకారం జడ్జి పేరును బహిరంగ కేసు విచారణలో ప్రస్తావించకూడదు కదా. అయినా ఆ నివేదికను అభిశంసనకు ప్రాతిపదికగా తీసుకోకూడదు'' అని సిబల్ వాదించారు. దీనిపై కోర్టు అభ్యంతరం వ్యక్తంచేసింది. ''ఈ కేసులో ఏదైనా నోటీసులు జారీచేయాలంటే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎవరికి పంపాలి?. ఈ జడ్జిని నియమించిన రాష్ట్రపతికా? లేదంటే ఈ మేరకు సలహాలు ఇచ్చిన ప్రధాని సారథ్యంలోని మంత్రిమండలికా? అందుకే ఒకే ఒక్క పేజీలో బుల్లెట్ పాయింట్లతో కేసులో అవతలి పార్టీ ఎవరో స్పష్టంగా పేర్కొని తీసుకుని రండి'' అని సిబల్‌ను కోర్టు ఆదేశించింది. కేసు రేపటికి వాయిదావేసింది.



ఎస్‌ఐఆర్‌పై స్టే ఇవ్వలేం

ఓటరు ఐడీ, ఆధార్‌ను పరిగణనలోకి తీసుకోండి: సుప్రీం

న్యూఢిల్లీ: బిహార్ అసెంబ్లీ ఎన్నికల వేళ ఎన్నికల కమిషన్ చేపట్టిన ఓటరు జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్)పై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ ప్రక్రియపై ఇప్పటికిప్పుడు మధ్యంతర స్టే ఇవ్వలేమని తేల్చి చెప్పిన అత్యున్నత న్యాయస్థానం.. ఓటరు జాబితా సవరణకు ఆధార్‌తోపాటు ఓటరు గుర్తింపు కార్డును పరిగణనలోకి తీసుకోవాలని ఈసీకి ఉత్తర్వులు జారీ చేసింది. ఈ రెండు ధ్రువీకరణలను వాస్తవమైనవిగా భావిస్తున్నామంది. 'రేషన్ కార్డులకు సంబంధించి చూస్తే వీటిని తేలిగ్గా ఫోర్జరీ చేయొచ్చు. కానీ, ఆధార్, ఓటర్ కార్డులను వాస్తవమైనవిగా భావించొచ్చు. ఈ రెండు ధ్రువీకరణలను అనుమతించండి'అని జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చిల ధర్మాసనం తెలిపింది. ఈ కేసులో తుది విచారణను ఈ నెల 29వ తేదీన చేపడతామని తెలిపింది. పిటిషనర్ అసోసియేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫామ్స్ అనే ఎన్‌జీవో తరఫున సీనియర్ లాయర్ గోపాల్ శంకరనారాయణన్ వాదనలు వినిపించారు. ఇప్పటికిప్పుడే మధ్యంతర జాబితాను ఖరారు చేయవద్దని, ఆగస్టు ఒకటో తేదీన ఈసీ ముసాయిదా ఓటరు జాబితా ప్రకటించకుండా మధ్యంతర స్టే ఇవ్వాలని కోరారు. అయితే, దీనివల్ల మొత్తం ఎస్ఐఆర్ ప్రక్రియే నిలిచిపోతుందని పేర్కొన్న ధర్మాసనం ఆయన వాదనను తోసిపుచ్చింది. 'న్యాయస్థానం అధికారాన్ని తక్కువగా చూడకండి. ఈ ప్రక్రియ చట్ట వ్యతిరేకమని తేలిన పక్షంలో మీ వాదనను అంగీకరిస్తాం. అప్పుడే ఎస్ఐఆర్ ప్రక్రియ ఆసాంతంగా రద్దు చేసేస్తాం'అని ధర్మాసనం కరాఖండిగా చెప్పింది. బిహార్‌లో చేపట్టిన ఎస్ఐఆర్‌కు ఆధార్‌తోపాటు ఓటరు ఐడీని అంగీకరించాలంటూ ఈసీని ఈ నెల 10వ తేదీన జరిగిన విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఆదేశించడం తెల్సిందే. ఈ మేరకు ప్రాథమికంగా అంగీకరిస్తూ ఈసీ దాఖలు చేసిన అఫిడవిట్‌ను సోమవారం ధర్మాసనం పరిశీలించి, పై వ్యాఖ్యలు చేసింది. ఆధార్, ఓటరు కార్డును అంగీకరిస్తూ ఈసీ అఫిడవిట్ వేసినప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు వేరుగా ఉన్నాయని ఈ సందర్భంగా లాయర్ శంకరనారాయణన్ తెలపగా.. ఎస్ఐఆర్ కోసం అంగీకరిస్తున్న 11 ధ్రువీకరణలతోపాటు ఆధార్, ఓటరు ఐడీ కూడా ఉంటాయని జస్టిస్ సూర్య కాంత్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఈసీ తరఫున సీనియర్ లాయర్ రాకేశ్ ద్వివేది..ఆధార్ పౌరసత్వానికి రుజువు కాదని, అదేవిధంగా, ఓటరు ఐడీని ఓటరు సవరణ ప్రక్రియలో నమ్మకమైందిగా భావించలేమన్నారు. ఓటరు ఐడీని పరిగణనలోకి తీసుకుంటే ఈ మొత్తం ప్రక్రియతో ఎటువంటి లాభం ఉండదని పేర్కొన్నారు. స్పందించిన ధర్మాసనం.. 'ఈ ప్రపంచంలో ఏ ధ్రువీకరణ పత్రాన్నైనా ఫోర్జరీ చేయొచ్చు. ఫోర్జరీ కేసుల విషయాన్ని ఈసీ చూసుకోవాలి. అన్ని పేర్లను తొలగించడానికి బదులుగా అందరినీ జాబితాలో చేర్చేలా చూడాలి.

డిసెంబర్‌లో రోబోట్ సహిత అంతరిక్ష నౌక ప్రయోగం

ఇస్రో చైర్మన్ నారాయణన్ వెల్లడి

సాక్షి, చెన్నై: రోబోట్‌తో కూడిన మొదటి అంతరిక్ష నౌకను డిసెంబర్‌లో ప్రయోగించనున్నామని ఇస్రో చైర్మన్ నారాయణన్ తెలిపారు. చెన్నై విమానాశ్రయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈనెల 30వ తేదీన శ్రీహరి కోట నుంచి నాసా సహకారంతో ఇస్రో నిషార్ ఉపగ్రహాన్ని ప్రయోగించనున్నట్లు ఆయన చెప్పారు. ఇందులోని ఎస్–బ్యాండ్ సింథటిక్ యాక్సిలేటర్ పూర్తిగా దేశీయంగా తయారు కాగా, మరో ఎల్‌బ్యాండ్ సింథటిక్ యాక్సిలేటర్ అమెరికాలో తయారైందని వివరించారు. సింథటిక్ ఎపర్చర్ రాడార్(ఎస్ఏఆర్) ఉపగ్రహం 24 గంటలు అన్ని వాతావరణ పరిస్థితుల్లోనూ భూమికి సంబంధించి చక్కటి ఫొటోలను తీస్తుందన్నారు. సహజ వనరులు, కొండ చరియలు విరిగి పడే విపత్తులను గుర్తిస్తుందన్నారు. ఇది 12 రోజులకోసారి మొత్తం భూమి చిత్రాన్ని తీసి భారత్‌తోపాటు అన్ని దేశాలతో పంచుకుంటుందన్నారు. మానవ రహిత రోబోట్‌తో కూడిన అంతరిక్ష నౌకను శ్రీహరికోటలో సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. 2027లో మానవ సహిత అంతరిక్ష యాత్రపై దృష్టి పెట్టనున్నామన్నారు. దీనికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా ఆమోదం తెలిపారని, చంద్రయాన్ –4 పనులు చురుగ్గా జరుగుతున్నాయని, చంద్రయాన్–5 పైనా ఇక దృష్టి పెడుతామని నారాయణన్ పేర్కొన్నారు.

షావోలిన్ గురువుపై చైనా విచారణ

బీజింగ్: ప్రపంచవ్యాప్తంగా పేరున్న షావోలిన్ టెంపుల్ అధిపతి షి యోంగ్ జిన్‌పై చైనా ప్రభుత్వం దర్యాప్తు చేపట్టింది. లంచాలు తీసుకోవడం, పలువురు మహిళలతో అనైతిక సంబంధాలు నెరపడం, అక్రమ సంతానాన్ని కలిగి ఉండటం వంటి ఆరోపణలను ఆయనపై మోపిందని టెంపుల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. వివిధ విభాగాలు దర్యాప్తు చేపట్టాయంది. దాదాపు 1,500 ఏళ్ల చరిత్ర కలిగిన షావోలిన్ టెంపుల్ సెంట్రల్ చైనాలోని హెనాన్ ప్రావిన్స్‌లో ఉంది. ప్రపంచవ్యాప్తంగా ఏటా వేలాదిగా శిష్యులు ఇక్కడికి వచ్చి మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందుతుంటారు.

షి యోంగ్ జిన్ ఈ షావోలిన్ టెంపుల్ అధిపతిగా 1999 నుంచి కొనసాగుతున్నారు. షావోలిన్ టెంపుల్ పేరును అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లిన ఘనత సొంతం చేసుకున్న ఈయనకు సీఈవో మాంక్ అనే పేరూ ఉంది. షి హయాంలోనే షావోలిన్ టెంపుల్ చైనా వెలుపల కూడా స్కూళ్లను ప్రారంభించింది. సన్యాసుల బృందాలు షావోలిన్ కుంగ్‌ఫూ విన్యాసాల్లో పాల్గొనడం మొదలైంది. 'షి యోంగ్‌జిన్ చర్యలు తీవ్రమైనవి, బౌద్ధ వర్గం, సన్యాసుల ప్రతిష్టను తీవ్రంగా దెబ్బతీసేలా ఉన్నాయి'అని బుద్ధిస్ట్ అసోసియేషన్ ఆఫ్ చైనా ఒక ప్రకటనలో పేర్కొంది.

గాజాలో కరువు వాస్తవమే

నెతన్యాహూతో ఏకీభవించను: ట్రంప్

స్కాట్లాండ్: గాజాలో కరువు పరిస్థితులున్న విషయం వాస్తవమేనని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొన్నారు. కరువు లేదంటూ ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ చేసిన వ్యాఖ్యలతో తాను ఏకీభవించడం లేదన్నారు. 'టీవీల్లో చూస్తే తెలుస్తుంది. అక్కడున్న చిన్నారులు ఎంత ఆకలితో ఉన్నారో... అక్కడ నిజంగానే కరువుంది. దీనిని దాచిపెట్టలేం 'అని స్కాట్లాండ్‌లో పర్యటిస్తున్న ట్రంప్ సోమ వారం పేర్కొన్నారు. గాజా ప్రాంతంలో అమెరికా ఆహార కేంద్రాలను ఏర్పాటు చేస్తుందని, చిన్నారుల పొట్ట నింపుతుందని చెప్పారు. ప్రజలు స్వేచ్ఛగా సంచరించే చోట, సరిహద్దులు లేని చోట తాము అవాంతరాలు కల్పించబోమన్నారు. గాజా లో హమాస్ చేయలేనిది ఎంతో చేయగలమన్నారు. 'బందీలందరినీ హమాస్ ఎక్కడ దాచిందో తెలిసిన ఇజ్రాయెల్ హమాస్‌తో ఒప్పందం కష్టమంటోంది. అదే సమయంలో, చిట్టచివరి 20 మంది బందీలను హమాస్ రక్షణ కవచాలుగా భావిస్తోంది. అందుకే, వారిని విడుదల చేయడం లేదు'అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

గాజాలో 17 టన్నుల ఆహారం జారవేత

యూఏఈ వైమానిక దళం విమానాలు రెండో రోజు సోమవారం గాజాలోని పాలస్తీనియన్లకు 17 టన్నుల ఆహార పదార్థాలను జారవిడిచాయని జోర్డాన్ తెలిపింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం 19 టన్నుల ఆహార పదార్థాలను ఒక ట్రక్కు కింద లెక్క. అంటే ట్రక్కు కంటే తక్కువ ఆహారాన్ని విడిచినట్లేనని ఐరాస పాలస్తీనా శరణార్థి విభాగం చీఫ్ ఫిలిప్ తెలిపారు. ఆదివారం 25 టన్నుల ఆహార ప్యాకెట్లను జారవిడవడం తెల్సిందే. ఇజ్రాయెల్ ఆర్మీ నెలలుగా అమలు చేస్తున్న దిగ్బంధంతో గాజాలో తీవ్ర కరువు పరిస్థితులు ఏర్పడటం, జనం, ముఖ్యంగా చిన్నారులు ఆకలి చావులకు గురవుతుండటంపై అంతర్జాతీయంగా ఆందోళన వ్యక్తమవుతోంది.



పుతిన్‌కు గడువు 10, 12 రోజులే

- ఉక్రెయిన్‌తో ఒప్పందానికి రాకుంటే ఆంక్షలే
- ట్రంప్ తాజా హెచ్చరిక

ఉక్రెయిన్‌తో యుద్ధం చేస్తున్న రష్యాకు విధించిన 50 రోజుల గడువును అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుదించారు. అధ్యక్షుడు పుతిన్ 10, 12 రోజుల్లో ఉక్రెయిన్‌తో ఒప్పందం చేసుకోకుంటే ఆంక్షలు చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు. సోమవారం ఆయన స్కాట్లాండ్‌లో మీడియాతో మాట్లాడారు. ఉక్రెయిన్‌తో యుద్ధాన్ని కావాలనే పొడిగిస్తూ పోతున్న పుతిన్ వైఖరితో అసహనంతో ఉన్నానన్నారు. ఇంత సుదీర్ఘకాలం వేచి ఉండటంలో అర్థం లేదంటూ, ముమ్ముందు ఏం జరగనుందో తనకు తెలుసునని వ్యాఖ్యానించారు. అందుకే పుతిన్‌కు తక్కువ సమయం ఇస్తున్నట్లు తెలిపారు. భారీ టారిఫ్‌లను రష్యాపై విధిస్తారా అన్న ప్రశ్నకు ఆయన.. ఇందుకు సంబంధించిన చర్యలపై ఇవ్వాళోరేపో ఒక అధికారిక ప్రకటన వెలువడుతుందని ప్రకటించారు. ప్రస్తుత పరిణామాలపై పుతిన్‌తో మాట్లాడాలనే ఆసక్తి తనకు అంతగా లేదని చెప్పారు.

తక్షణమే కాల్పుల విరమణ

థాయ్‌లాండ్, కాంబోడియా అంగీకారం

పుత్రజయ్(మలేసియా): సరిహద్దు వివాదం నేపథ్యంలో ఐదు రోజులుగా కొనసాగుతున్న ఘర్షణలకు ఫుల్‌స్టాప్ పెట్టేందుకు థాయ్‌లాండ్, కాంబోడియా అంగీకరించాయి. సరిహద్దు వివాదాన్ని పరిష్కరించుకునేందుకు, తక్షణమే బేషరతు కాల్పుల విరమణకు ఆరెండు దేశాలు అంగీకరించాయని మధ్యవర్తిగా వ్యవహరించిన మలేసియా ప్రధానమంత్రి అన్వర్ ఇబ్రహీం సోమవారం మీడియా ఎదుట ప్రకటించారు. స్థానిక కాలమానం ప్రకారం మంగళవారం అర్ధ రాత్రి నుంచి ఈ ఒప్పందం అమల్లోకి వస్తుందని ఆయన పేర్కొన్నారు. రెండు దేశాల సైనికాధికారులు సరిహద్దుల్లో ఉద్రిక్తతలను తగ్గించుకునేందుకు చర్చలు జరుపుతారన్నారు. థాయ్‌లాండ్, కాంబోడియా, మలేసియా దేశాల రక్షణ, విదేశాంగ మంత్రులు ఇందుకు సంబంధించిన కార్యాచరణను ఖరారు చేసి, శాంతిని నెలకొల్పేందుకు చర్యలు తీసుకుంటారన్నారు. ఎటువంటి దాపరికం లేకుండా ఈ చర్చలు జరిగాయని అన్వర్ తెలిపారు. మీడియా సమావేశంలో పాల్గొన్న కాంబోడియా ప్రధాని హున్ మనెట్, థాయ్ తాత్కాలిక ప్రధాని ఫుమ్‌థమ్ వెచయాచై ఈ ఒప్పందం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ కరచాలనం చేసుకున్నారు. ద్వైపాక్షిక సంబంధాలు తిరిగి సాధారణ స్థాయికి వస్తాయని హున్ మనెట్ ఆశాభావం వ్యక్తం చేశారు. శాంతియుత పరిష్కారాన్ని తాము కోరుకుంటున్నామని ఫుమ్‌థమ్ చెప్పారు.



గురువారం నుంచి మొదలైన ఘర్షణల్లో కనీసం 35 మంది చనిపోగా 2.60 లక్షల మంది నిరాశ్రయు లయ్యారు. ఘర్షణలను కొనసాగిస్తే వాణిజ్య ఒప్పందాలను కుదుర్చుకోబోమంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించిన నేపథ్యంలో ఆసియాన్ చైర్మన్ హోదాలో ఉన్న మలేసియాలో జరిగిన చర్చలకు ఇరు దేశాల నేతలు రావడం తెల్సిందే. మలేసియా పరిపాలనా రాజధాని పుత్రజయలోని అన్వర్ ఇబ్రహీం నివాసంలో సోమవారం రెండు గంటలపాటు సాగిన చర్చల్లో మలేసియాలో అమెరికా, చైనా రాయబారులు సైతం పాల్గొనడం గమనార్హం.



ఈఎన్‌టీ.. ఇదేంటీ?
కోఠి ఈఎన్‌టీ ఆస్పత్రిలో శస్త్రచికిత్సలకు మూడు నెలలపాటు ఎదురుచూడాల్సి వస్తోంది. నిష్ణాతులైన వైద్యులు బదిలీ కావడంతో ఇక్కడ పరిస్థితి అధ్వానంగా మారింది. -10లో



సెల్ఫ్ బ్రాండ్.. అదే ట్రెండ్..
నగరంలో కస్టమైజ్డ్ బ్రాండ్‌లకు ప్రాధాన్యం పెరుగుతోంది. యువతీ యువకులు ఉపయోగించే గాడ్జెట్స్, వారు ధరించే దుస్తుల ద్వారా ఈ బ్రాండింగ్ ట్రెండ్ వెల్లడవుతోంది. - సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం 30.0/23.0

వాతావరణం
నగరంలో మంగళవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తేలికపాటి వర్షాలు కురిసే అవకాశముంది. గరిష్టంగా 30, కనిష్టంగా 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా.

వాట్సాప్‌కు అర్జీల వెల్లువ!



'డిజిటల్' ప్రజావాణికి భారీ స్పందన

- వివిధ సమస్యలపై సుమారు 1400పైగా అర్జీలు
- హైదరాబాద్‌తో పాటు ఇతర జిల్లాల నుంచి కూడా..
- తలలు పట్టుకుంటున్న సంబంధిత అధికారులు
- 'వాట్సాప్ సమస్యలకు' పరిష్కారం సాధ్యమేనా..?

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ వాట్సాప్ ప్రజావాణికి సోమవారం అర్జీలు వెల్లువెత్తాయి. ప్రతి సోమవారం హైదరాబాద్ కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి (మీ కోసం) కార్యక్రమానికి రాలేని సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులతోపాటు ఉద్యోగుల సౌకర్యార్థం ప్రవేశ పెట్టిన డిజిటల్ ప్రజావాణికి సోమవారం అనూహ్య స్పందన లభించింది. సుమారు 1400లకు పైగా అర్జీలు వచ్చి పడ్డాయి. అయితే ఒక హైదరాబాద్ జిల్లా పరిధిలోని నుంచే కాకుండా రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలో నుంచి కూడా పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందాయి. అందులో కలెక్టరేట్ పరిధిలోని రెవెన్యూ, వైద్యారోగ్య, హౌసింగ్, ఎక్సైజ్, రెవెన్యూ, పౌరసరఫరాల తదితర శాఖలకు సంబంధించి అర్జీలతో పాటు జీహెచ్ఎంసీ, జలమండలి, హెచ్ఎండీఏ, హైడ్రా పరిధిలోని వచ్చే అంశాలపై కూడా నగరవాసులు పెద్ద ఎత్తున దరఖాస్తులు పెట్టుకున్నారు. అయితే హైదరాబాద్ మినహా ఇతర జిల్లా, ఇతర విభాగాలకు సంబంధించి అర్జీలను ఏం చేయాలని సంబంధిత అధికారులు తలలు పట్టుకుంటున్నారు. వాస్తవంగా డిజిటల్ గవర్నెన్స్‌ను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా అర్జీలను వాట్సాప్ ద్వారా దాఖలు చేయవచ్చని కలెక్టర్ దాసరి హరిచందన ప్రకటించారు. అయితే ప్రజావాణికి హాజరుకాలేని సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులతోపాటు ఉద్యోగులకు వాట్సాప్ అర్జీలకు వెసులు బాటు కల్పించగా, ఇతరులు సైతం వాట్సాప్ ద్వారా పెద్ద ఎత్తున ఫిర్యాదులు కొనసాగించారు. దీంతో వాట్సాప్ ప్రజావాణికి కుప్పలు తెప్పలుగా ఫిర్యాదులు వచ్చి చేరాయి.

ఆచరణలో సాధ్యమేనా..?
వాట్సాప్ ప్రజావాణికి వచ్చే ప్రతి అర్జీకి ఐడీ నెంబర్ ఇచ్చి సమస్య పరిష్కారమయ్యే వరకు జవాబుదారితనంగా ఉంటామని సాక్షాత్తు కలెక్టర్ ప్రకటించగా..ఆచరణలో అమలుపై సంబంధిత అధికారులు పెదవి విరుస్తున్నారు. వాస్తవంగా ప్రజావాణి దరఖాస్తులపై అర్జీదారులకు దరఖాస్తు స్థితి సమాచారం ఇవ్వాలని ప్రతి కలెక్టర్ ఆదేశాలు జారీ చేయడం సర్వసాధారణమే. కానీ, ఆచరణలో అమలు మాత్రం లేకుండా పోయింది. ఇప్పటి వరకు కలెక్టరేట్ ప్రజావాణి అర్జీల పరిస్థితి చెవిటి వారి ముందు శంఖం ఊదినట్లే అన్న చందంగా తయారైంది. ప్రజావాణికి జిల్లా స్థాయి అధికారులు డుమ్మా కొట్టడం బట్టి సమస్యలపై వారికి చిత్తశుద్ధి స్పష్టమవుతోంది. తాజాగా వాట్సాప్ ప్రజావాణితో సమస్యలు పరిష్కారమవుతాయా అన్న అనుమానాలు నగర వాసులు వ్యక్తం చేస్తున్నారు. తాజాగా కొత్త కలెక్టర్ ఆదేశాల ప్రకారం సమస్యపై అర్జీ వాట్సాప్ నంబరుకు పంపిస్తే ప్రజావాణి సిబ్బంది దాన్ని డౌన్‌లోడ్ చేసుకొని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ పోర్టల్‌లో వీటిని నమోదు చేస్తారు. దానికి ఆధారంగా ఒక ఐడీ కేటాయించి అర్జీ ముట్టినట్లుగా సమాచారం అందిస్తారు. అర్జీని సంబంధిత శాఖలకు పంపిస్తారు. ఆయా శాఖాధికారుల నుండి చర్య నివేదిక (యాక్షన్ టేకెన్ రిపోర్టు) వచ్చిన తర్వాత ఆ సమాచారాన్ని వాట్సాప్ ద్వారా వ్యక్తిగత మొబైల్ నెంబర్‌కు పంపిస్తారు. అయితే ఇది ఆచరణలో సాధ్యమేనా? అన్న ప్రశ్న తలెత్తుతోంది.

స్పెషల్ మాన్సూన్ డ్రైవ్!

సిటీలో సమర్థవంతంగా పారిశుధ్యం

- ఆరోగ్య పరిరక్షణే లక్ష్యం
- పదిరోజుల పాటు జీహెచ్ఎంసీలోని 150 వార్డుల్లో సత్వర చర్యలు
- నేటి నుంచే అమలు

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీలో ఏటా వందల కోట్లు ఖర్చు చేస్తున్నా రోడ్లపై, ఎక్కడపడితే అక్కడ చెత్త కనిపిస్తుండటంతో ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మరోవైపు స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమాల్లో ర్యాంకులైతే వస్తున్నప్పటికీ, వాస్తవ పరిస్థితులు అధ్వాన్నంగా ఉండటంతో జీహెచ్ఎంసీ అభాసుపాలవుతోంది. పేరుగొప్ప.. ఊరు దిబ్బ అనే వ్యాఖ్యానాలు వెలువడుతున్నాయి. ఈ నేపథ్యంలో చెత్తపై శ్రద్ధ వహిస్తున్న అధికార యంత్రాంగం ఇప్పటికే, ఫోన్ చేస్తే ఇళ్ల నుంచి చెత్త సేకరించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. వీధుల్లో సైతం పారిశుధ్యం బాగుండేందుకు, తద్వారా ప్రజారోగ్య పరిరక్షణ కోసం ప్రత్యేక కార్యాచరణకు సిద్ధమైంది. స్పెషల్ మాన్సూన్ డ్రైవ్ పేరిట మంగళవారం నుంచి పదిరోజుల పాటు ఆగస్టు 8 వరకు జీహెచ్ఎంసీ 30 సర్కిళ్లలోని 150 వార్డుల్లో దీర్ఘకాలంగా పేరుకుపోయిన వ్యర్థాలు(చెత్తతో సహా), నిర్మాణ,కూల్చివేతల (సీఅండ్‌డీ)వ్యర్థాలు, గ్రీన్ వేస్ట్(చెట్లకొమ్మలు, తదితర), ఇంజినీరింగ్ పనుల వల్ల పోగుపడ్డ వ్యర్థాలు, వర్షాల వల్ల కొట్టుకొచ్చిన సిల్ట్, తదితర మైనవన్నీ తొలగించే కార్యక్రమాన్ని చేపడుతోంది. సెలవుదినాల్లో కాకుండా మిగతా రోజుల్లో ఉదయం 5.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈమేరకు సంబంధిత విభాగాల ఉన్నతాధికారులు ఎవరేం చేయాలో వివరిస్తూ కమిషనర్ కర్ణన్ సర్క్యులర్ జారీ చేశారు. ఆమేరకు

జోనల్ కమిషనర్ల విధులు ఇలా..
స్పెషల్ డ్రైవ్ నిర్వహణకు సంబంధించి తమ పరిధిలోని అన్ని లైన్ డిపార్ట్‌మెంట్స్‌తో సమావేశం నిర్వహించాలి. డ్రైవ్ జరిగే రోజుల్లో వార్డుల్ని తనిఖీ చేయాలి. నాలుగుకంటే ఎక్కువ డెంగీ కేసులు నమోదైన ఇళ్లను దర్శించడంతోపాటు పరిసరాల్లోని వంద ఇళ్లలో యాంటీలార్వా ఆపరేషన్లు విస్తృతంగా నిర్వహించాలి.

డిప్యూటీ కమిషనర్ల విధులు ఇలా..
నిర్ణీత షెడ్యూల్ కనుగుణంగా డ్రైవ్ జరుగుతున్నట్లు నిర్ధారించుకోవాలి. ఏఎంఓహెచ్‌లు, ఘనవ్యర్థాల నిర్వహణ ఇంజినీర్లతో సహా అన్ని విభాగాల్లోని అధికారులు, ఏజెన్సీలతో సమన్వయం చేసుకొని నూరు శాతం పరిశుభ్రత సాధించాలి. అందుకుగాను దీర్ఘకాలంగా రోడ్లపై, నాలాల్లో చెరువుల వద్ద, ఫుట్‌పాత్‌ల వద్ద పేరుకుపోయిన అన్ని రకాల వ్యర్థాలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలి. ఏఎంఓహెచ్‌లు, ఘనవ్యర్థాల విభాగం డీఈఈలు డెంగీ కేసులు నమోదైన ఇళ్లను రోజూ దర్శించాలి.తీసుకున్న చర్యల్ని సంబంధిత యాప్‌లో పొందుపరచాలి. పరిసరాల్లోని వంద ఇళ్లలో యాంటీలార్వా ఆపరేషన్లు సవ్యంగా జరుగుతున్నట్లు నిర్ధారించుకోవాలి.

- యూబీడీ విభాగం మేనేజర్లు తమ పరిధిలోని అన్ని పార్కుల్లో వ్యర్థాలు తొలగించే చర్యలు చేపట్టాలి.
- టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు బహిరంగ ప్రదేశాల్లో సీఅండ్‌డీ వ్యర్థాలు వేసేవారికి పెనాల్టీలు విధించాలి.
- సీనియర్ ఎంటమాలజిస్టులు యాంటీ లార్వా ఆపరేషన్ల చర్యలు పర్యవేక్షిస్తూ ప్రతిరోజూ ఎన్ని ఇళ్లు,కాలనీల్లో కార్యక్రమాలు జరిగింది సమగ్ర నివేదిక అప్‌డేట్ చేయాలి. దోమలు, దోమల ద్వారా సంక్రమించే వ్యాధులనివారణపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. ఇందులో సెల్ఫ్‌హెల్ప్‌గ్రూపుల సభ్యుల్ని భాగస్వాముల్ని చేయాలి.
- ఈఈలు ట్రాఫిక్ పోలీసులు, తదితర విభాగాల సమన్వయంతో రోడ్డు భద్రత చర్యలు చేపట్టాలి.
- సీఎంఓహెచ్ ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లోని డెంగీ కేసుల్ని ఎలీసా పరీక్షల ద్వారా నిర్ధారించుకోవాలి.

ఇంకా వివిధ విభాగాల అధికారులు ఎవరెవరు ఏయే పనులో చేయాలో సర్క్యులర్‌లో నిర్దేశించారు.పరిశుభ్రతతో పాటువ్యాధుల నివారణకు ప్రాధాన్యతనిచ్చారు. ప్రజలు కూడా ఈ కార్యక్రమాలకు తమవంతుగా సహకరించడంతో పాటు బహిరంగ ప్రదేశాల్లో ఎలాంటి వ్యర్థాలూ వేయవద్దని కమిషనర్ కర్ణన్ కోరారు.పరిశుభ్రమైన వాతావరణంతో ఆరోగ్యాన్ని కాపాడుకుందామని పేర్కొన్నారు.



చిరుతా.. చిక్కవా..?

పక్షం రోజులు దాటినా దొరకని చిరుత జాడ



ట్రెక్ పార్క్‌లో ఏర్పాటు చేసిన బోన్

నగరవాసులను చిరుత పులి భయపెడుతోంది. అభయారణ్యంలో ఉండాల్సిన చిరుత జనారణ్యంలోకి వచ్చి..దారి తెలియక అటూ ఇటూ స్థావరాలను మారుస్తూ శివారు ప్రాంతాల ప్రజలను వణికిస్తోంది. ఇప్పటి వరకు రాజేంద్రనగర్ పరిధిలోని అటవీ, పోలీసు శాఖల క్యాంపులలో ఉన్న చిరుతపులి సోమవారం ఏకంగా మిలిటరీ కేంద్రంలోకి దూరింది. దాన్ని పట్టుకునేందుకు పక్షం రోజులుగా అటవీ శాఖ అధికారులు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలించటం లేదు. - మణికొండ


- పోలీస్ క్యాంప్ నుంచి మిలిటరీ క్యాంప్‌నకు తరలినట్లు గుర్తింపు
- పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్న అధికారులు

మొయినాబాద్ మండలం, అజీజ్‌నగర్ గ్రామంలోకి వెళ్లే పాత రోడ్డులో ఉన్న మూలికావనంలో ఈ నెల 9వ తేదీన చిరుతపులి జాడ కనిపించింది. అక్కడి నుంచి ఈ నెల 20వ తేదీన పక్కనే ఉన్న గండిపేట మండలం, మంచిరేవులలోని పోలీస్ గ్రేహౌండ్స్‌లోకి వచ్చింది. అక్కడ విధుల్లో ఉన్న ఓ కానిస్టేబుల్ దాన్ని చూసి అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వటంతో వారు వచ్చి సీసీ కెమరాలు, బోన్‌లను ఏర్పాటు చేశారు. మరుసటి రోజు ఉదయం సమయంలో గ్రేహౌండ్స్‌లో ఓ రోడ్డు దాటుతూ సీసీ కెమరాలో చిక్కింది. ఆ మరుసటి రోజే గ్రే హౌండ్స్ వెనకాల ఉన్న ఓ విల్లా ప్రాజెక్ట్‌లో నివాసితులకు ఓ రాతి గుండుపై కూర్చుని కనిపించింది. ఈ నెల 24వ తేదీన తెల్లవారు జామున ఏకంగా ఔటర్‌రింగ్ రోడ్డు దాటి సర్వీసు రోడ్డులో ఉన్న అటవీశాఖకు చెందిన ట్రెక్ పార్క్‌లోకి చేరింది. దాంతో అక్కడా సీసీ కెమరాలు, బోన్‌లను ఏర్పాటు చేశారు.

మరో మారు ప్రయాణం..
మొయినాబాద్ మండలంలోని మూలికా వనం నుంచి మొదలయిన చిరుత ప్రయాణం సోమవారం తెల్లవారు జామున రాందేవ్‌గూడలోని మిలట్రీ ఏరియాలోని రోడ్డు దాటి శిక్షణా కేంద్రంలోకి వెళ్లింది. అటుగా వస్తున్న ఓ ద్విచక్ర వాహనదారుడు రోడ్డు దాటుతున్న చిరుతను చూసి 100 నెంబర్‌కు ఫోన్ చేశాడు. దాంతో ఇప్పటి వరకు అటవీశాఖ ట్రెక్‌పార్కులో ఉందనుకున్న చిరుత సోమవారం రంగారెడ్డి జిల్లా పరిధి దాటి హైదరాబాద్ జిల్లాలోకి ప్రవేశించింది. దాంతో మిలట్రీ వారు అలర్ట్ అయి దాన్ని పట్టుకోవాలని అటవీశాఖ అధికారులకు మొరపెట్టుకున్నారు.

భయాందోళనలో ప్రజలు..
తమ గ్రామాలకు పక్కనే చిరుతపులి సంచరిస్తుందనే విషయం తెలుసుకున్న గండిపేట మండల పరిధిలోని మంచిరేవుల, గండిపేట, నార్సింగి, బైరాగిగూడ, గంధంగూడ, నెక్నాంపూర్, గోల్కొండ మండల పరిధిలోని ఇబ్రహీంబాగ్, రాందేవ్‌గూడల ప్రజలు భయాందోళన చెందుతున్నారు.





వారం క్రితం పోలీస్ గ్రేహౌండ్స్ వెనక వైపు రాతి కొండ పైన కనిపించిన చిరుత

తిరిగి రావాల్సిందే..



మొయినాబాద్ మండల పరిధిలో ఆనవాళ్లు కనిపించిన చిరుతను పట్టుకునేందుకు పక్షం రోజులుగా ప్రయత్నిస్తునే ఉన్నాం. చాలాచోట్ల సీసీ కెమరాలు, బోన్‌లు ఏర్పాటు చేశాం. సోమవారం తెల్లవారుజామున రాందేవ్‌గూడలోని మిలట్రీ ఏరియాలో రోడ్డు దాటి మిలట్రీ క్యాంప్‌లోకి వెళ్లినట్టు సీసీ కెమరాలో రికార్డు అయ్యింది. దానికి అక్కడ అనువైన ప్రాంతం లేదు. కాబట్టి అది తిరిగి ట్రెక్ పార్క్, గ్రేహౌండ్స్ వైపే వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. వాటి చుట్టు పక్కల గ్రామాల ప్రజలు, రోడ్లపై ప్రయాణించే వారు జాగ్రత్తగా ఉండాలి. - లక్ష్మణ్, అటవీ రేంజ్ అధికారి, చిలుకూరు రేంజ్

టెక్నాలజీ హబ్‌లుగా ఐటీఐలు

- కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ సునీత



కలెక్టరేట్‌లో ఏటీసీ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

సాక్షి, సిటీబ్యూరో: ప్రస్తుతం ఐటీఐలు టెక్నాలజీ హబ్‌లుగా రూపుదిద్దుకున్నాయని కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ సునీత అన్నారు. సోమవారం హైదరాబాద్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ కదిరవన్ పలనితో కలిసి ఆమె అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లపై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించే సదుద్దేశ్యంతో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల (ఏటీసీ)ను నూతనంగా ప్రవేశపెట్టిందన్నారు. తద్వారా ఐటీఐలు అత్యాధునిక మౌలిక వసతులు, ప్రపంచస్థాయి ల్యాబ్‌లతో యువతకు నైపుణ్యంతో కూడిన శిక్షణను అందిస్తున్నట్లు వివరించారు. ఏటీసీ శిక్షణ కోసం 10వ తరగతి ఉత్తీర్ణత ఉండాలని, ఇంటర్, డిగ్రీ చదివిన, డిస్ కంటిన్యూ చేసిన అభ్యర్థులు కూడా అర్హులన్నారు. ఈ విద్యాసంవత్సరం 65 ఏటీసీలలో 11,132 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఇందులో నిష్ణాతులైన ట్రైనర్ల వేర్వేర్వేక్షణలో శిక్షణ ఉంటుదని అన్నారు. హైదరాబాద్‌లో మొత్తం ఏడు ఏటీసీ శిక్షణ కేంద్రాలు అందుబాటులో ఉన్నాయని, దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 31 చివరి తేదీ అని తెలిపారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ కదిరవన్ పలని, డీఆర్ఓ వెంకటాచారి, సంక్షేమ శాఖ అధికారులతో కలిసి ఆమె ఏటీసీలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ ఉప కమిషనర్ బి.జాన, డీఈవో రోహిణి, జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎ.వందన, సంక్షేమ శాఖ అధికారులు ప్రవీణ్ కుమార్ రెడ్డి, ఇలియాస్, ఆశన్న, కోటాజీ తదితరులు పాల్గొన్నారు.

హైడ్రాకు రూ.25 కోట్లు

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీకి (హైడ్రా) ప్రభుత్వం రూ.25 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ కార్యదర్శి కె.ఇలంబర్తి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిధులకు సంబంధించి తదుపరి చర్యలు తీసుకోవాల్సిందిగా హైడ్రా కమిషనర్‌ను ఆదేశించారు.

'సృష్టి' వ్యవహారాలపై లోతుగా దర్యాప్తు!

రూ.90 వేలకు శిశువును కొని రూ.34 లక్షలకు విక్రయం

- కొండాపూర్, కూకట్‌పల్లిల్లోనూ బ్రాంచ్‌లు
- విశాఖలో అరెస్టు అయిన కల్యాణి సైతం కీలకమే..
- వివిధ ఆస్పత్రుల్లో నమ్రత ఏజెంట్లు ఉన్నట్లు గుర్తింపు
- దర్యాప్తు ముమ్మరం చేసిన నార్త్‌జోన్ పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో: సరోగసి పేరుతో శిశువిక్రయాలకు పాల్పడిన యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ అండ్ రీసెర్చ్ సెంటర్ కేసు దర్యాప్తులో కీలకాంశాలు వెలుగులోకి వస్తున్నాయి. డాక్టర్ నమ్రత నేతృత్వంలోని ముఠా అసోం జంట నుంచి రూ.90 వేలకు ఖరీదు చేసిన శిశువును రాజస్థాన్ దంపతులకు ఏకంగా రూ.34 లక్షలకు విక్రయించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ సెంటర్‌కు కొండాపూర్, కూకట్‌పల్లి ప్రాంతాల్లోనూ బ్రాంచ్‌లు ఉన్నట్లు తేల్చారు. గోపాలపురంలోని సృష్టి సెంటర్ నుంచి సేకరించిన రికార్డులను పరిశీలిస్తున్నారు. వీటిలో ఐవీఎఫ్‌కు సంబంధించినవి ఎన్ని? సరోగసి ఎన్ని? ఇలా శిశువిక్రయాలు ఎన్ని? అనేది తేల్చడంపై నార్త్ జోన్ పోలీసులు దృష్టి పెట్టారు.

సరోగసి మహిళకు రూ.15 లక్షలని..
కొన్నాళ్ల క్రితం వరకు సికింద్రాబాద్‌లో నివసించిన రాజస్థాన్ జంట గతేడాది ఆగస్టులో తొలిసారిగా సృష్టి సెంటర్‌కు వెళ్లారు. అప్పట్లో రూ.66 వేలు తీసుకుని ఇరువురికీ కొన్ని పరీక్షలు చేసిన డాక్టర్ నమ్రత సరోగసి సలహా ఇచ్చారు. బిడ్డ పుట్టిన తర్వాత సరోగసికి సంబంధించిన డాక్యుమెంట్లు, శిశువుకు సంబంధించిన డీఎన్ఏ రిపోర్టు సైతం ఇస్తామంటూ ఆ సమయంలో ఆమె హామీ ఇచ్చారు. దీనికి రాజస్థాన్ దంపతులు అంగీకరించడంతో దాదాపు రూ.30 లక్షలు ఖర్చు అవుతుందని నమ్రత వారికి చెప్పారు. ఇందులో రూ.15 లక్షలు చెక్కు ద్వారా, మిగిలిన రూ.15 లక్షలు నగదు రూపంలో ఇవ్వాలని, ఆ నగదును సరోగసి మహిళకు ఇస్తామని పేర్కొన్నారు. 2024 ఆగస్టు 16, 17 తేదీల్లో రూ.4,99,999తో చెల్లింపులు ప్రారంభించిన రాజస్థాన్ జంట ఈ ఏడాది మే వరకు ఎనిమిది విడతల్లో భారీ మొత్తం చెల్లించారు.

అబార్షన్ కోసం వచ్చిన జంట ట్రాప్...
అసోం నుంచి వచ్చి హైదరాబాద్‌లో నివసిస్తున్న అలీ, నస్రీన్‌లు దినసరి కూలీలుగా పని చేస్తున్నారు. నస్రీన్ గర్భం దాల్చడంతో బిడ్డల్ని కని, పోషించే శక్తి లేని వీళ్లు అబార్షన్ కోసం ఓ ఆస్పత్రికి వెళ్లారు. అక్కడే వీరిని ట్రాప్ చేసిన ధనశ్రీ సంతోషి ఈ విషయాన్ని నమ్రతకు చెప్పారు. రాజస్థాన్ జంటకు ఈమె కనే బిడ్డని ఇవ్వాలని పథకం వేసిన ఆమె..సంతోషితో బేరసారాలు ఆడించి రూ.90 వేలకు శిశువును ఖరీదు చేస్తామని హామీ ఇప్పించింది. రాజస్థాన్ జంట నుంచి నగదు మొత్తం ముట్టిన తర్వాత నమ్రత సరోగసి విజయవంతంగా నడుస్తోందని ఈ ఏడాది జూన్ 12–19 మధ్య డెలివరీ అవుతుందని రాజస్థాన్ దంపతులకు సమాచారం ఇచ్చింది. అయితే తన భర్త మే 23న విదేశాలకు వెళ్లాల్సి ఉందని, ఈలోపు ఆయన డీఎన్ఏ నమూనాలు తీసుకుని భద్రపరచాలంటూ బాధితురాలు కోరగా..నమ్రత తిరస్కరించడంతో ఆమెకు అనుమానం వచ్చింది. దీంతో ఆ భార్యభర్తలు తమంతట తాముగా ఢిల్లీలోని వసంత్ కుంజ్‌లో ఉన్న డీఎన్ఏ ఫోరెన్సిక్ ల్యాబ్‌కు వెళ్లి నమూనాలు ఇచ్చారు.

ఆమె భర్త బ్లాక్‌మెయిలింగ్ అంటూ..
ఈ ఏడాది జూన్‌లో అలీ, నస్రీన్‌లను ఫ్లైట్‌లో తీసుకువెళ్లిన సంతోషి... విశాఖలోని శ్రీపురంలో ఉన్న లోటస్ హాస్పిటల్‌లో చేర్పించింది. అక్కడ కల్యాణి సహకారంతో ఈ ఏడాది జూన్ 4న నస్రీన్‌కు డెలివరీ చేయించింది. ఆపై రాజస్థాన్ మహిళ భర్తకు ఫోన్ చేసిన విశాఖపట్నం సృష్టి సెంటర్ మేనేజర్ కల్యాణి సరోగసి మహిళకు సిజేరియన్ జరుగుతోందని చెప్పింది. ఆపై మగ బిడ్డ పుట్టాడని, అయితే ఆ మహిళ భర్త మరో రూ.3.5 లక్షలు కావాలంటూ బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడని సమాచారం ఇచ్చింది. బేరసారాల తర్వాత అదనంగా రూ.2.5 లక్షలు, సిజేరియన్, ఇంక్యుబేటర్ కోసం మరో రూ.2 లక్షలు నమ్రతకు బాధితురాలి భర్త చెల్లించారు. ఇలా మొత్తం రూ.34 లక్షలకు పైగా వీరి నుంచి వసూలు చేసిన నమ్రత అసోం దంపతులకు కేవలం రూ.90 వేలు ఇచ్చి, శిశువును అక్కడే ఉంచి, వీరిని ఫ్లైట్‌లో తిప్పి పంపేసింది. శిశువును విశాఖలోనే రాజస్థాన్ మహిళకు అప్పగించింది.

పునరుద్ధరించలేమన్న మెడికల్ కౌన్సిల్
2016లో అక్రమాలకు పాల్పడుతున్నట్లు గుర్తించిన మెడికల్ కౌన్సిల్ సృష్టి సరోగసి ఆసుపత్రి లైసెన్సును 5 ఏళ్ల పాటు రద్దు చేసింది. దీన్ని పునరుద్ధరించాలని 2021లో తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌ను ఆశ్రయించగా కేసు కోర్టు పరిధిలో ఉందని, సాధ్యం కాదని తెగేసి చెప్పారు. దీంతో కొంత మంది ఉన్నతాధికారుల అండదండలతో అనధికారికంగా నడిపిస్తున్నారు.

2020లోనూ ఇదే తరహా కేసులో..
ఆపై చోటు చేసుకున్న పరిణామాలతో గోపాలపురం ఠాణాలో కేసు నమోదు, నిందితుల అరెస్టు జరిగాయి. నమ్రత 2020లోనూ విశాఖపట్నంలో ఇదే తరహా కేసులో అరెస్టు అయినట్ల గుర్తించారు. వివిధ ఆస్పత్రుల్లో నెట్‌వర్క్ ఏర్పాటు చేసుకున్న నమ్రత, కల్యాణి అబార్షన్ కోసం వచ్చే జంటల్ని ట్రాప్ చేస్తున్నట్లు గుర్తించారు. సికింద్రాబాద్‌తో పాటు కొండాపూర్, కూకట్‌పల్లిల్లో ఉన్న సృష్టి సెంటర్లలో సోదాలు చేసిన పోలీసులు 227 మందికి సంబంధించిన రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. వీటిని విశ్లేషిస్తూ నేర తీవ్రతను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే సృష్టి సెంటర్ వ్యవహారం వెలుగులోకి రావడంతో ఆ రికార్డులకు సంబంధించిన వాళ్లు తమ ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసుకున్నట్లు పోలీసులు చెబుతున్నారు. నమ్రత సహా అరెస్టు అయిన ఎనిమిది మందినీ కోర్టు అనుమతితో కస్టడీలోకి తీసుకుని విచారించాలని నిర్ణయించారు.



వేధింపులు తాళలేక వ్యక్తి ఆత్మహత్య


కుమార్(ఫైల్)

మూసాపేట: ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అంకెనపల్లి కుమార్(28) భార్య, కుమార్తెతో కలిసి కూకట్‌పల్లి వెంకట్రామ్‌నగర్‌లో నివాసం ఉంటున్నాడు. అతడికి ఏడాది క్రితం వివాహమైంది. ఈనెల 1వ తేదీన పాప పుట్టింది. గత ఎనిమిదేళ్లుగా అతడు బాచుపల్లిలోని శ్రీసమ్మక్క, సారక్క రాక్, సాండ్ ఇండస్ట్రీలో అకౌంటెంట్‌గా పనిచేస్తున్నాడు. అతడు పనిచేసే కార్యాలయంలో దాదాపు రూ.కోటి నష్టం జరగడంతో కంపెనీ యజమాని శ్రీనివాస్‌గౌడ్, అతడి అనుచరులు కోటి రూపాయలు చెల్లించాలని అతడిని వేధిస్తున్నారు. ఐడీ కార్డు, ఫోన్లు, కారు తీసుకుని అతడిని డ్రైవర్లతో కొట్టించారని తెలిపారు. శుక్రవారం కుమార్ తల్లిని కార్యాలయానికి పిలిచి ఆమె ఎదుటే కొట్టేందుకు ప్రయత్నిస్తుండగా సోమవారం చరిద్దామని చెప్పి ఇంటికి వచ్చారు. ఆదివారం ఫోన్‌చేసి కుమార్‌ను పిలిపించుకొని కొట్టి, తిట్టి అవమానించారని, ఈ విషయాన్ని భార్య, స్నేహితులకు ఫోన్‌లో చెప్పిన కుమార్ మానసికంగా బాధపడ్డాడని తెలిపారు. అతడిని మానసికంగా, శారీరకంగా వేధించడంతో తట్టుకోలేని కుమార్ సోమవారం తెల్లవారుజామున ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు దర్యాప్తులో తెలుస్తాయని పోలీసులు తెలిపారు.

తక్కువ ధరకు స్థలం ఇప్పిస్తానంటూ టోకరా

- నిమ్స్ డిప్యూటీ సూపరింటెండెంట్ లక్ష్మీ భాస్కర్ పై చీటింగ్ కేసు నమోదు.

బంజారాహిల్స్: కోట్ల రూపాయల విలువైన స్థలాన్ని తక్కువ ధరకు ఇప్పిస్తానంటూ ఒక వైద్యుడిని మోసం చేసినందుకుగాను నిమ్స్ ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నోరి లక్ష్మీ భాస్కర్ తదితరులపై బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో కోర్టు ఆదేశాల మేరకు కేసు నమోదైంది. బంజారాహిల్స్ పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రాజమండ్రికి చెందిన డాక్టర్ శ్రీరాములు రాజమండ్రిలో ఆసుపత్రిని ప్రారంభించేందుకు యత్నిస్తున్న సమయంలో లక్ష్మీ భాస్కర్ తో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలోనే లక్ష్మీ భాస్కర్‌తో పాటు సొసైటీ మాజీ అధ్యక్షుడైన సిద్ధయ్య అతడిని సొసైటీలో మాజీ ఎమ్మెల్యే బుచ్చయ్య పేరుతో ఉన్న స్థలాన్ని తక్కువ ధరకు ఇప్పిస్తామని చెప్పారు. రూ.5 కోట్ల విలువైన స్థలాన్ని రూ.2.5 కోట్ల నుండి



రూ.2.7 కోట్లకు ఇప్పిస్తామని చెప్పారు. ఇందు కోసం అడ్వాన్స్‌గా రూ.50 లక్షలు చెల్లించాలని సూచించగా జనవరి 2020లో రూ.15 లక్షలు లక్ష్మీ భాస్కర్ భార్య తండ్రి బాపూజీ రావు ఖాతాకు బదిలీ చేశాడు. మరో రూ. 3 లక్షలు అదే ఏడాది జూలైలో సొసైటీ పేరుతో డిమాండ్ డ్రాఫ్ట్‌గా తీసి స్టాంప్ డ్యూటీ కోసం చెల్లించారు. ఇదిలా ఉండగా 2021 జూన్‌లో గోల్కొండ డివిజన్ సహకార సంఘాల డిప్యూటీ రిజిస్ట్రార్ పేరుతో డాక్టర్ శ్రీరాములుకు స్థలం విషయమై విచారణకు హాజరు కావాలంటూ నోటీసులు జారీ అయ్యాయి. ఈ విషయమై లక్ష్మీ భాస్కర్‌ను సంప్రదించగా విచారణ అధికారిని తాము మేనేజ్ చేస్తామంటూ విచారణకు హాజరు కావలసిందిగా సూచించారు. తనకు అప్పటి ప్రభుత్వ పెద్దలైన కేటీఆర్, హరీష్ రావులతోపాటు పలువురు ప్రభుత్వ ఉన్నతాధికారులతో పరిచయాలు ఉన్నాయని నమ్మించాడు. అయితే 2022 ఆగస్టులో రిజిస్ట్రేషన్ రద్దు అయ్యింది. దీంతో డాక్టర్ శ్రీరాములు దీనిపై విచారించగా సిద్ధయ్యతోపాటు మేనేజింగ్ కమిటీ సభ్యులుగా ఉన్న నర్సింగరావు తదితరులు సొసైటీతో సంబంధం లేని వ్యక్తులకు అనధికారిక సేల్ డీడ్‌లు చేసినట్లు గుర్తించారు. దీనిపై శ్రీరాములు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేయకపోవడంతో కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు లక్ష్మీ భాస్కర్, సిద్ధయ్య తదితరులపై బీఎన్‌ఎస్ 316(2), 316(5), 318(1), 318(3), 318(4), 336(1), 336(4), 338, 175(4) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇవి నకిలీ 'యాపిల్స్'!

- ముంబై నుంచి బోగస్ యాపిల్ యాక్సెసరీస్ ఖరీదు
- ముగ్గురిని అరెస్టు చేసిన సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్
- రూ.3 కోట్ల విలువైన వివిధ రకాల ఉపకరణాలు సీజ్





సాక్షి, సిటీబ్యూరో: ఇటు వినియోగదారులతో పాటు అటు కంపెనీకీ భారీ ఆర్థిక నష్టాన్ని కలిగిస్తూ, యాపిల్ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీస్తూ నకిలీ ఉత్పత్తులు విక్రయిస్తున్న ముఠా గుట్టును మధ్య మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు రట్టు చేశారు. ప్రధాన సూత్రధారి సహా ముగ్గురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.3 కోట్ల విలువైన నకిలీ ఉత్పత్తులు స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ వైవీఎస్ సుధీంద్ర సోమవారం వెల్లడించారు. ఉత్తరప్రదేశ్ నుంచి వచ్చిన మీరాలం మండి ప్రాంతంలో స్థిరపడిన మహ్మద్ షాహిద్ అలీ ముంబైకి చెందిన ఏజెంట్ల నుంచి ఈ నకిలీ ఉత్పత్తులు ఖరీదు చేస్తున్నారు. కొరియర్ ద్వారా నగరానికి రప్పిస్తున్న ఇతగాడు వాటిని తన ఇంట్లోనే భద్రపరుస్తున్నాడు. ఆపై ఎల్బీనగర్ మస్జిద్ లైన్‌లో ఉండే ఇర్ఫాన్ అలీకి అమ్ముతున్నాడు. ఇతడి నుంచి వీటిని అఫ్జల్‌గంజ్ వాసి సంతోష్ రాజ్‌పుత్ ఖరీదు చేస్తున్నాడు. గుజరాతీ గల్లీలో పీఎం మొబైల్స్ పేరుతో దుకాణం నిర్వహిస్తున్న ఇతను దీని ద్వారా నకిలీ ఉత్పత్తులను వినియోగదారులకు విక్రయిస్తున్నాడు. దీనిపై యాపిల్ కంపెనీ కాపీరైట్ ప్రతినిధులకు సమాచారం అందడంతో వారు మధ్య మండల టాస్క్‌ఫోర్స్‌తో కలిసి మీర్‌చౌక్ ఠాణా పరిధిలో దాడి చేశారు. అక్కడే ఉన్న ముగ్గురు నిందితులను పట్టుకున్నారు. వీరి నుంచి రూ.3 కోట్ల విలువైన 288 యాపిల్ వాచీలు, 1145 ఐపాడ్స్, 52 యూఎస్‌బీ కేబుల్స్, 14 అడాప్టర్స్, నాలుగు పవర్ బ్యాంక్స్, 480 ఎస్‌కేయూ స్టిక్కర్లు తదితరాలు స్వాధీనం చేసుకున్నారు. కేసును తదుపరి చర్యల నిమిత్తం మీర్‌చౌక్ పోలీసులకు అప్పగించారు.

బైక్ అదుపుతప్పి యువకుడి మృతి

పలువురికి గాయాలు

కవాడిగూడ: బైక్ అదుపుతప్పి స్టీల్ బ్రిడ్జి డివైడర్‌ను ఢీకొట్టడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా అతడి భార్య, సోదరి, కుమార్తె తీవ్రంగా గాయపడిన సంఘటన దోమలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. దోమలగూడ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రాంనగర్‌కు చెందిన అశోక్(38), భార్య లావణ్య, సోదరి కవిత, కుమార్తె ఆకాంక్షతో కలిసి బైక్‌పై నెక్లెస్ రోడ్డులోని తన క్యాంటీన్‌కు వెళుతుండగా రామకృష్ణ మఠం సమీపంలో బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో అశోక్ అక్కడికక్కడే మృతి చెందగా అతడి భార్య లావణ్య, సోదరి కవిత, కుమార్తె ఆకాంక్షలకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న దోమలగూడ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన వారిని ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అశోక్ మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


అశోక్ మృతదేహం

ఏపీకే ఫైల్‌తో ఎఫ్‌డీలూ క్లోజ్

రూ.7.5 లక్షలు నష్టపోయిన తార్నాక వాసి

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన ఓ యువకుడికి ఏపీకే ఫైల్‌తో కూడిన ఎస్ఎంఎస్ పంపిన సైబర్ నేరగాళ్లు అతడికి సంబంధించిన ఫిక్స్‌డ్ డిపాజిట్లు క్లోజ్ చేసి, క్రెడిట్ కార్డు వివరాలను అనధికారికంగా వినియోగించి రూ.7.5 లక్షలు కాజేశారు. సోమవారం బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. తార్నాకలో ఉంటున్న యువకుడికి (27) గత నెల 25న గుర్తుతెలియని నెంబర్ నుంచి ఫోన్‌కాల్ వచ్చింది. ఇతడికి ఐసీఐసీఐ బ్యాంక్‌లో ఉన్న ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఆటోమేటిక్‌గా రెన్యువల్ చేస్తామంటూ అవతలి వ్యక్తి చెప్పాడు. అందుకు అతను అంగీకరించనప్పటికీ... వీరి మధ్య సంభాషణ జరుగుతుండగానే నేరగాళ్లు ఏపీకే ఫైల్‌తో కూడిన లింకును ఎస్సెమ్మెస్ ద్వారా పంపారు. దీనిని బాధితుడు క్లిక్ చేయడంతో ఏపీకే ఫైల్ ఇన్‌స్టాల్ అయి... అతడి ఫోన్, అందులోని యాప్స్ నేరగాళ్ల ఆధీనంలోకి వెళ్లిపోయాయి. ఇలా బాధితుడి ఫోన్‌లోని బ్యాంకు యాప్స్‌ను యాక్సెస్ చేసిన నేరగాడు వాటితో లావాదేవీలు చేశాడు. వీటి ఓటీపీల ఎస్సెమ్మెస్‌లు బాధితుడి ఫోన్‌కే వచ్చినా వాటిని నేరగాళ్లు ఏపీకే ఫైల్ సహాయంతో తెలుసుకోగలిగారు. ఇలా యువకుడి ఫిక్స్‌డ్ డిపాజిట్లు క్యాన్సిల్ చేసి, క్రెడిట్ కార్డును వినియోగించి రూ.7.5 లక్షలు తమ ఖాతాల్లోకి మార్చుకున్నారు. ఓటీపీలు వస్తున్న విషయం గుర్తించిన బాధితుడు బ్యాంకు అధికారులను అప్రమత్తం చేసే లోపే ఈ నష్టం జరిగిపోయింది. దీంతో బాధితుడు సైబర్ క్రైమ్ ఠాణాను ఆశ్రయించి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది.

ఫుడ్ పాయిజనింగ్‌కు కారణాలేంటి?

- ఘటనపై పూర్తి నివేదిక అందజేయండి
- తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి హెచ్ఆర్‌సీ ఆదేశం

సిటీ కోర్టులు : నాగర్ కర్నూల్ జిల్లా, ఉయ్యాలవాడ సమీపంలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజనింగ్ ఘటనలపై రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందివ్వకుండా ఫుడ్‌పాయిజనింగ్‌కు కారణమైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించింది. వివరాల్లోకి వెళితే..నాగర్‌కర్నూల్ జిల్లాలోని బీసీ గురుకుల పాఠశాలలో ఈనెల 26న రాత్రి భోజనం చేసిన తర్వాత దాదాపు 111 మంది ఇంటర్మీడియట్ విద్యార్థులకు తీవ్ర అస్వస్థతకు గురయ్యారని, విద్యార్థులు కడుపు నొప్పి, వాంతులతో ఇబ్బంది పడుతుండటంతో వారిని నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారని పలు పత్రికల్లో వార్తలు ప్రచురితమయ్యాయి. అపరిశుభ్ర వాతావరణం కారణంగానే విద్యార్థులు ఫుడ్‌పాయిజనింగ్ గురయ్యారని వార్తలు వచ్చాయి. ఈ వార్తలను పరిశీలించిన రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్, సభ్యులు శివాది ప్రవీణ, బి.కిశోర్‌తో కూడిన బెంచ్ సూ-మోటోగా కేసు నమోదు చేసుకుని సోమవారం విచారణ చేపట్టింది. ఇంతమంది విద్యార్థులు ఫుడ్‌పాయిజనింగ్‌కు గురికావడంపై కమిషన్ ఆవేదన వ్యక్తం చేసింది. వార్తల్లో ప్రచురితమైన అంశాలు నిజమని తేలితే, అది భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21, 21లను ఉల్లఘించినట్లేనని కమిషన్ అభిప్రాయపడింది. ఫుడ్‌పాయిజనింగ్‌కు కారాణాలేంటి? పిల్లలకు సౌకర్యవంతమైన భోజనం ఎదుకు ఇవ్వడంలేదు? అంటూ దీనిపైన పూర్తి నివేదికను వచ్చే విచారణలోపు అందజేయాలని, ఈ ఘటనకు కారణమైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి కమిషన్ ఆదేశాలు జారీ చేస్తూ తదుపరి విచారణను ఆగస్టు 28కి వాయిదా వేసింది.

దేవుడి పేరుతో కబ్జాల పర్వం

- ప్రజావాణి ఫిర్యాదుల్లో అవే అగ్రభాగం
- హైడ్రా ప్రజావాణికి 51 ఫిర్యాదులు

సాక్షి,సిటీబ్యూరో: ''రహదారులు, పార్కులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలు, ప్రభుత్వ భూములు.. ఇలా ఏవైనా,ఎక్కడైనా ఆక్రమణలకు పాల్పడాలన్నా.. కబ్జాలు చేయాలన్నా దేవుడిని రంగంలోకి దించేస్తున్నారు. ఆలయాలు, ప్రార్థనా మందిరాలంటూ నివాసితులను నోరెత్తకుండా చేస్తున్నారు. మాలాంటి వారు ఎవరైనా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే.. కుల, మత సంఘాలతో కలిసి దాడులకు పాల్పడుతున్నారు. కొత్తగా ఏర్పడిన గేటెడ్ కమ్యూనిటీలు, హెచ్ఎండీఏ అనుమతి పొందిన లే ఔట్లలోనూ ఇదే దందా కొనసాగుతోంది'' అంటూ పలువురు కాలనీ, బస్తీవాసులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. సోమవారం హైడ్రా ప్రజావాణిలో మొత్తం 51 ఫిర్యాదులు అందగా, వాటిలో అత్యధికం రహదారులు, నాలాలు ఆక్రమణలకు సంబంధించినవే. కూకట్‌పల్లి పరిధిలోని ఆంజనేయ నగర్‌లో దాదాపు ఎకరం పార్కులో జెండా పాతి కొందరు కబ్జాకు పాల్పడుతుండగా.. సికింద్రాబాద్ చికోటీ గార్డెన్స్ పరిసరాల్లో గుడికి అనుసంధానంగా షెడ్లు వేసి రోడ్డును ఆక్రమిస్తున్నవారు మరికొందరు. పటాన్ చెరు ప్రాంతంలో 500 విల్లాలున్న ఏపీఆర్ ప్రవీణ్ లగ్జీరియాలోనూ ఎకరం పార్కు స్థలంలో కొంతమేర గుడి కట్టి కబ్జా చేయాలని ప్రయత్నిస్తున్నారని స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులను పరిశీలించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్, గూగుల్ మ్యాపుల ద్వారా పరిస్థితిని ఫిర్యాదుదారులకు వివరించి, సమస్య పరిష్కరానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాలనీ సంక్షేమ సంఘాలు, సొసైటీలు ఖాళీ స్థలాలను ప్లాట్లుగా అమ్ముకుంటే వారిపైన చర్యలు తీసుకోవాలని పలువురు అసెట్ ప్రొటెక్షన్ అధికారులను కమిషనర్ ఆదేశించారు.

షటిల్ ఆడుతూ గుండె పోటుతో యువకుడి మృతి


రాకేష్ (ఫైల్)

ఉప్పల్: ఉప్పల్ భగాయత్‌లోని ఎలైట్ బ్యాడ్మింటన్ ఆకాడమీలో షటిల్ ఆడుతున్న ఓ యువకుడు గుండెపోటుతో కోర్టులోనే కుప్ప కూలిన సంఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాల ఇలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా, తల్లాడ గ్రామానికి చెందిన గుండ్ల రాకేష్ (26) నగరంలోని ఆర్టీసీ ఎక్స్ రోడ్‌లో నివాసం ఉంటూ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ప్రతి రోజు సాయంత్రం ఉప్పల్‌కు వచ్చి స్నేహితులతో కలిసి ఉప్పల్ భగాయత్‌లోని ఎలైట్ బ్యాడ్మింటన్ కోర్టులో షటిల్ ఆడేవాడు. ఆదివారం సాయంత్రం షటిల్ ఆడుతున్న అతను ఒక్క సారిగా కోర్టులోనే కుప్ప కూలాడు. స్నేహితులు అతడిని నాగోల్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి


రాజేంద్రనగర్: ఇంట్లోని ఫ్రీజ్ ఓపెన్ చేసేందుకు ప్రయత్నించిన ఓ మహిళ విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన సంఘటన సోమవారం రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎర్రబోడ ప్రాంతంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఎర్రబోడ ప్రాంతానికి చెందిన పి.లావణ్య (40) భర్త మృతి చెందడంతో ముగ్గురు పిల్లలతో కలిసి జీవిస్తోంది. సోమవారం ఉదయం ఆమె ఇంట్లోని ఫ్రిజ్ తెరిచేందుకు వెళ్లగా అప్పటికే విద్యుత్ ప్రసారం కావడంతో విద్యుదాఘాతానిక గురై అపస్మారక స్థితికి చేరుకుంది. కుటుంబ సభ్యులు ఆమెను ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు ఆమె అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని బాలుడి దుర్మరణం


బోయ అనిల్ (ఫైల్)

చైతన్యపురి: బైక్‌పై వెళుతున్న బాలుడిని వేగంగా వచ్చిన లారీ ఢీ కొనటంతో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ మహేందర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.మహబూబ్‌నగర్ జిల్లా, గోపంపేటకు చెందిన బోయ వెంకటేశ్ కుమారుడు బోయ అనిల్ (15) 15 రోజుల క్రితం నగరానికి వచ్చి నాగోల్‌లో ఉంటూ స్థానిక ఆర్‌కే మోటర్స్‌లో మెకానిక్ పని నేర్చుకుంటున్నాడు. ఆదివారం రాత్రి అతను స్నేహితుడితో కలిసి బైక్‌పై ఎల్‌బీనగర్ నుంచి దిల్‌సుఖ్‌నగర్ వెళుతుండగా వీయం హోం మెట్రో స్టేషన్ సమీపంలో వెనక నుంచి వేగంగా వచ్చిన లారీ వీరి బైక్‌ను ఢీకొట్టింది. కిందపడిన అనిల్ మీదుగా లారీ చక్రాలు వెళ్లడంతో తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే మృతి చెందాడు. అతని స్నేహితుడికి కాలు విరిగింది. లారీ డ్రైవర్ సంఘటనా స్థలంలోనే లారీని వదిలేసి పరారయ్యాడు. మృతదేహాన్ని పోస్టు మార్టం తరలించి నిమిత్తం ఆసుపత్రికి తరలించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్షిత్ రెడ్డి మృతదేహం వెలికితీత


అక్షిత్ రెడ్డి మృతదేహం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ జన చైతన్య వెంచర్ సమీపంలోని మొండి కత్వాలో గల్లంతైన బీటెక్ విద్యార్థి అక్షిత్ రెడ్డి మృతదేహన్ని డీఆర్ఎఫ్ బృందం సోమవారం ఉదయం వెలికి తీశారు. స్నేహితులతో కలిసి ఆదివారం మధ్యాహ్నం ఈ ప్రాంతానికి వచ్చిన అక్షిత్ రెడ్డి ప్రమాదవశాత్తు నీటిలో పడి గల్లంతైన విషయం తెలిసిందే. గూగుల్ ద్వారా సెర్చ్ చేసి నగరంలోని సమీపంలోని వాటర్ ఫాల్స్ చూసేందుకు వచ్చి అక్షిత్ రెడ్డి ప్రమాదానికి గురయ్యాడు. ఆదివారం మధ్యాహ్నం గల్లంతైన అక్షిత్ రెడ్డి కోసం రాత్రి వరకు గాలించినా ప్రయోజనం లేకపోయింది. చీకట్లో సహాయక చర్యలు చేపట్టేందుకు వీలు కాకపోవడంతో సోమవారం ఉదయం తిరిగి గాలింపు చేపట్టి మృతదేహన్ని వెలికి తీశారు. పంచనామా నిర్వహించి మృతదేహన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. అక్షిత్ రెడ్డి కోసం కుటుంబ సభ్యులతో పాటు స్నేహితులు, కళాశాల విద్యార్థులు పెద్ద ఎత్తున మొండికత్వా ప్రాంతానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్‌హెచ్‌ఆర్‌సీ చైర్మన్‌కు క్రైస్తవ సంఘాల ఫిర్యాదు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ ప్రాంగణంలో సోమవారం మానవ హక్కుల ఉల్లంఘనలపై బహిరంగ విచారణ జరిగింది. జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ వి.రామసుబ్రహ్మణ్యన్ ఆధ్వర్యంలో జరిగిన ఓపెన్ హియరింగ్ కోర్టుకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో క్రైస్తవులు, పాస్టర్లు, మైనార్టీలు, దళితులపై జరిగిన, పాస్టర్ ప్రవీణ్ పగడాల కేసుతో పాటు దాడులు, మానవ హక్కుల ఉల్లంఘన కేసులపై క్రైస్తవ సంఘాల నాయకులు జెరూసలెం మత్తయ్య ఫిర్యాదు చేశారు. రిటైర్డ్ సీఐ సాల్మన్‌రాజ్, రెవరెండ్ ప్రభుదాస్, కేఎస్ ప్రకాష్, డానియల్ రెడ్డి, హైకోర్టు అడ్వకేట్ సుధీర్‌చాట్ల, జవహర్ కెన్నెడీ, జిమ్మీబాబు, రాబిన్, వినయ్‌కుమార్ తదితర క్రైస్తవ సంఘాల నాయకులు కమీషన్ ఎదుట హాజరై వినతిపత్రం సమర్పించారు.

నీటి సమస్యను పరిష్కరించండి



జలమండలి జీఎం ప్రభాకర్‌రావుకు వినతి పత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

రహమత్‌నగర్: రహమత్‌నగర్ డివిజన్ కార్మికనగర్ నీటి సరఫరా సమస్యను పరిష్కరించాలని జూబ్లీహిల్స్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ నేత వినోద్ కుమార్‌గౌడ్ కోరారు. ఈ మేరకు సోమవారం జీఎం ప్రభాకర్‌రావుకు ఆయన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికనగర్‌లో మూడు రోజులకు ఓ మారులో ప్రెషర్ మంచినీరు సరఫరా అవుతుందని వాపోయారు. ఎస్పీఆర్‌హిల్స్‌లో కొత్త రిజర్వాయర్ నిర్మాణం చేపట్టిన ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. నిర్దిష్ట సమయానికి రాని నీటి గురించి ప్రజలు పనులు వదులుకుని ఎదురు చూస్తుంటారని ఆయన పేర్కొన్నారు. తాము చేసిన విజ్ఞప్తిపై జీఎం సానుకూలంగా స్పందించారని వినోద్ తెలిపారు.

'ప్రభుత్వం ప్రజా సమస్యలు గాలికొదిలేసింది'



వెంగళరావునగర్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికొదిలేసిందని కార్పొరేటర్ దేదీప్య విజయ్ తెలియజేశారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని ఈస్ట్ రహమత్‌నగర్ గల్లీలో రూ.25 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... ఈస్ట్ రహమత్‌నగర్‌లో ఎలాంటి సమస్య ఏర్పడినా తక్షణమే తనకు తెలియజేయాలని సూచించారు. ప్రస్తుతం నిర్మిస్తున్న సీసీ రోడ్ల పనులను పూర్తయ్యే వరకు దగ్గరుండి పరిశీలించాలని ఆదేశించారు. ప్రజాధనంతో నిర్మిస్తున్న పనులు త్వరగా పూర్తయ్యే విధంగా చూడాలన్నారు. ప్రజలకు నిరంతరం బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు విజయ్‌కుమార్, శ్యాంరావు తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్ఐఈఈఎఫ్ కోశాధికారిగా అలెక్స్

ఫిలింనగర్: తెలుగు ఫిలిం ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ కోశాధికారిగా టీవీ అలెగ్జాండర్(అలెక్స్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలెగ్జాండర్ తెలుగు సినీ స్టంట్ డైరెక్టర్స్ అండ్ స్టంట్ ఆర్టిస్ట్స్ యూనియన్‌లో ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. ఈ మేరకు సోమవారం ఫెడరేష్ కార్యాలయంలో ఫిలిం ఫెడరేషన్ అధ్యక్షుడు వల్లభనేని అనిల్‌కుమార్ ఆయనకు నియామక పత్రం అందజేశారు. అనంతరం ఇందిరానగర్‌లోని స్టంట్ యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్టంట్ డైరెక్టర్స్, స్టంట్ ఆర్టిస్టులో అలెగ్జాండర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అలెగ్జాండర్ మాట్లాడుతూ సినీ కార్మికుల సమస్యలపై సినీ పెద్దలతో పాటు ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతూ వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టంట్ యూనియన్ అధ్యక్షుడు పి.ఎస్.బాజి, ట్రెజరర్ రమేష్ రాజా, సలహాదారు నాగరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీలు జిల్లా మధుసూదన్, జి. మల్లేష్ యాదవ్, ఉపాధ్యక్షుడు ఎం.అశోక్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లల మరణాలపై రిపోర్టుకు హక్కుల కమిషన్ ఆదేశం

హిమాయత్‌నగర్: తెలంగాణ రాష్ట్రంలో ఉన్న పలు గురుకులల్లో ఆత్మహత్య, అనుమానస్పద మృతి, ఫుడ్ పాయిజన్ పలు కారణాలవల్ల 48 మంది విద్యార్థులు చనిపోవడం జరిగిందని, అలాగే 886 మంది విద్యార్థులు ఫుడ్ పాయిజన్ వల్ల అస్వస్థతకు గురయ్యారని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ కన్వీనర్ దిడ్డి సుధాకర్ పేర్కొన్నారు. ఈ విషయంపై జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఆప్ మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి నయీం పాషా ఫిర్యాదు మేరకు కమిషన్ సోమవారం మర్రి చెన్నారెడ్డి ఇన్‌స్టిట్యూట్‌లో చేపట్టిన విచారణకు తెలంగాణ రాష్ట్ర గురుకులాల సెక్రటరీ అలుగు వర్షిని హాజరయ్యారని తెలిపారు. ఫిర్యాదుపై, మరణాలపై తీసుకున్న చర్యలపై నాలుగు వారాల్లో పూర్తి రిపోర్టు కమిషన్ వద్ద పొందుపరచాలని కమిషన్ చైర్మన్ వి.సుబ్రమణియం ఆదేశించినట్లు తెలిపారు.

బల్దియా చేతులెత్తేసింది.. హైడ్రా ఆదుకుంది.!



ఫిలింనగర్ బుల్కాపూర్ నాలాలో జేసీబీతో చెత్త తొలగింపు..

- బుల్కాపూర్ నాలాలో 150 లారీల చెత్త తొలగింపు
- హైడ్రా చొరవతో సాఫీగా సాగుతున్న వరద

బంజారాహిల్స్: నాలాల్లో వరద సాఫీగా సాగేలా హైడ్రా చొరవ తీసుకుంది. జీహెచ్‌ఎంసీ నాలాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, వ్యర్థాలు, బురద తొలగించడంలో చేతులెత్తేయగా, హైడ్రా తీసుకున్న నిర్ణయంతో నాలాల్లో పెద్ద ఎత్తున సిల్ట్ తొలగించారు. ముఖ్యంగా ఫిలింనగర్ నుంచి బంజారాహిల్స్ రోడ్డునెంబర్–12, చింతల్‌బస్తీ, తుమ్మలబస్తీ, ఖైరతాబాద్ చౌరస్తా మీదుగా హుస్సేన్‌సాగర్‌కు వెళ్లే బుల్కాపూర్ నాలాలో 150 లారీలకు పైగా చెత్తను తొలగించారు.

◆ వారం రోజుల క్రితం హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఫిలింనగర్‌లోని మహాత్మాగాంధీనగర్, బసవతారకనగర్, హకీంపేట ప్రాంతాల్లో పర్యటించి బుల్కాపూర్ నాలాలో నిండిపోయిన చెత్తాచెదారాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వరదనీరు వెళ్లడానికి ఏమాత్రం అవకాశం లేకుండా నాలాలో సిల్ట్ నిండిపోయిన విషయాన్ని గమనించారు.

◆ జీహెచ్‌ఎంసీ సర్కిల్–18 ఇంజినీర్లు హరేరామ్‌తో పాటు మోహన్‌కుమార్ కూడా ఈ పర్యటనలో పాల్గొన్నారు. నిండిపోయిన నాలాను చూసి హైడ్రా కమిషనర్ అవాక్కయ్యారు. తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. వానాకాలానికి ముందే నాలాల్లో డీసిల్టింగ్ పనులు చేపట్టాల్సి ఉంటుంది. ఇందుకోసం ప్రత్యేకంగా నిధులు కూడా మంజూరవుతాయి. కానీ ప్రధానమైన బుల్కాపూర్ నాలాలో మాత్రం ఎక్కడా డీసిల్టింగ్ పనులు చేపట్టినట్లు కనిపించలేదు. దీంతో హైడ్రా రంగంలోకి దిగింది.

◆ ఫిలింనగర్ నుంచి బంజారాహిల్స్ మీదుగా చింతల్ బస్తీ, ఖైరతాబాద్, హుస్సేన్‌సాగర్ వరకు నాలాలో పేరుకుపోయిన చెత్త తొలగింపునకు నడుంబిగించింది. ముఖ్యంగా టోలిచౌకి సమీపంలోని విరాట్‌నగర్ వద్ద 100 మీటర్ల పరిధిలో 50 లారీల చెత్తను బయటకు తొలగించారు.

◆ షేక్‌పేట, టోలిచౌకిలోని హకీంపేట, బంజారాహిల్స్ రోడ్ నం.12, చింతల్‌బస్తీ, తుమ్మలబస్తీ, ఖైరతాబాద్ చౌరస్తా మీదుగా హుస్సేన్‌సాగర్‌కు చేరే చారిత్రాక నాలాలో పేరుకుపోయిన చెత్తను తొలగించడం పట్ల స్థానికులు హైడ్రాకు ధన్యవాదాలు తెలిపారు.

◆ గత కొన్నేళ్లుగా ఫిలింనగర్‌లోని బసవతారకనగర్, ఎంజీనగర్ నాలాలో డీసిల్టింగ్ పనులు చేపట్టకుండా జీహెచ్‌ఎంసీ ఇంజినీర్లు చేతులెత్తేశారు. దీంతో నాలా మొత్తం నిండిపోయి ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరదనీరు ఇళ్లను ముంచెత్తింది. రోడ్లన్నీ మురుగుమయమయ్యాయి.



చెత్త, వ్యర్థాలు తొలగించిన తర్వాత నాలా పరిస్థితి..

◆ స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హైడ్రా స్పందించి రంగంలోకి దిగి ప్రత్యేకంగా వాహనాలు ఏర్పాటు చేసి చెత్త తొలగింపును చేపట్టింది.

◆ తొలగించిన చెత్తను, వ్యర్థాలను తరలించేందుకు లారీలు కూడా సమకూర్చింది. ఎక్కడికక్కడ నాలాలన్నీ చెత్తతో నిండిపోయి దుర్గంధంతో స్థానికులకు విష జ్వరాలు తెచ్చిపెడుతుండగా హైడ్రా తీసుకున్న నిర్ణయంతో ప్రస్తుతం నాలాలన్నీ క్లీన్ అయ్యాయి. చెత్త, వ్యర్థాలు దాదాపుగా తొలగించారు.

◆ వరదనీరు సాఫీగా సాగే విధంగా చర్యలు తీసుకున్నారు. దీని వల్ల వరద ముంపు తప్పుతుందని అధికారులు పేర్కొన్నారు.

డిజిటల్ లైబ్రరీలు ఉపయుక్తం



ఉపన్యాస కార్యక్రమంలో మన్నెం వెంకటరాయుడు, వీసీ ఘంటా చక్రపాణి

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో సోమవారం 'లైబ్రరీ డిజిటలైజేషన్'అంశంపై ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మనసు ఫౌండేషన్ వ్యవస్థాపకులు మన్నెం వెంకటరాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. లైబ్రరీ డిజిటలైజేషన్‌లో సంప్రదాయ లైబ్రరీలలోని పుస్తకాలు, పత్రికలు, దస్తావేజులు, మాన్యూస్క్రిప్ట్‌లు తదితర భౌతిక మెటీరియల్‌ను డిజిటల్ ఫార్మాట్‌కు మార్చడంతో కావాల్సిన సమాచారం ఇంటర్నెట్ ద్వారా ప్రపంచంలోని ఎవరికైనా సులభంగా, వేగంగా అందుబాటులో ఉంచేలా సాధ్యమవుతుందని పేర్కొన్నారు. పెద్ద బుక్ షెల్ఫ్‌లు లేకుండా, ఎక్కువ మొత్తంలో పుస్తకాలు నిల్వ చేయకుండా, తక్కువ నిర్వహణ ఖర్చుతో అందరూ ఉపయోగించడానికి సులభమవుతుందన్నారు.

◆ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఘంటా చక్రపాణి మాట్లాడుతూ... మారిన ఆధునిక ప్రపంచంలో డిజిటల్ లైబ్రరీలు పరిశోధకులకు చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. విశ్వవిద్యాలయంలో ఉన్న లైబ్రరీలో గత నాలుగు దశాబ్దాలుగా సేకరించిన పుస్తకాలు, సమాచారం విద్యార్థులతో పాటు ఇతరులకు కూడా డిజిటల్ ఫార్మాట్‌లో అందించేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అకడమిక్ డైరెక్టర్ పుష్పాచక్రపాణి, రిజిస్ట్రార్ డాక్టర్ ఎల్.విజయకృష్ణారెడ్డి, విశ్వవిద్యాలయ లైబ్రరీ ఇన్‌చార్జి ప్రొఫెసర్ రజని, అన్ని విభాగాల అధిపతులు, డీన్స్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, ఉద్యోగ సంఘాల నేతలు పాల్గొన్నారు.

కారును ఢీకొట్టి... రిపేర్ చేయిస్తానని ఒప్పించి.!

వెంగళరావునగర్: టోలిచౌకీ ప్రాంతానికి చెందిన సయ్యద్ షాజతుల్లా ఆన్‌లైన్ పాఠాలు చెబుతుంటాడు. ఆదివారం రాత్రి తన స్నేహితుడితో కలిసి తన కారులో యూసుఫ్‌గూడ వెళ్తున్నారు. గ్రీన్‌బావర్చీ వద్దకు రాగానే వెనుక నుంచి వేగంగా వచ్చిన ఓ కారు అతడి కారును ఢీకొట్టింది. దీనిపై బాధితుడు వచ్చి ప్రశ్నించగా మహిళకు చెందిన స్నేహితుడు వచ్చి కారుకు మరమ్మతులు చేయిస్తామని వారి ఫోన్ నంబర్లు ఇచ్చాడు. బాధితుడు కారు షెడ్డు వద్దకు వెళ్లగా వాళ్లు రాలేదు. అంతేగాకుండా ఆమె రూ.10వేలను బాధితుడికి ఫోన్ పే చేసింది. రిపేర్ బిల్ ఎక్కువ అవుతుండటంతో ఫోన్లు చేసినా సమాధానం ఇవ్వడం లేదు. దీంతో బాధితుడు సోమవారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తూ యువకుల హల్‌చల్

వెంగళరావునగర్: మద్యం సేవించి డ్రైవింగ్ చేయడమే కాకుండా రోడ్డుపై హల్‌చల్ చేసిన యువకులను మధురానగర్ పోలీసులు అదుపులోనికి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి ఎస్‌ఆర్‌నగర్ పోలీసులు మైత్రీవనం ప్రధాన రహదారిపై డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్నారు. ఈ క్రమంలో విజయవాడ మధురానగర్‌కు చెందిన హరిహరన్ అతడి మిత్రులు ఒకే వాహనంపై వస్తున్నారు. పోలీసులు అతడిని ఆపి తనిఖీ చేయడానికి ప్రయత్నించగా రోడ్డుపై హల్‌చల్ చేశారు. పోలీసు ఫోన్ సైతం పగులగొట్టారు. దీంతో మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా స్థానిక పోలీసులు యువకులను అదుపులోనికి తీసుకుని కేసు నమోదు చేశారు.

పెద్దమ్మగుడి కూల్చివేతలో రేవంత్ సర్కార్ దాష్టీకం



ఎమ్మెల్యే కాలనీలో పెద్దమ్మ గుడి కూల్చిన ప్రాంతానికి వెళ్తున్న బీజేపీ నేతలు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నం.12లోని ఎమ్మెల్యే కాలనీలో పెద్దమ్మ తల్లి గుడిని కూల్చివేసిన ప్రాంతాన్ని సోమవారం ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పరిశీలించారు. గుడి కూల్చివేతలో సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ దాష్టీకాన్ని ఎండగట్టారు. గతంలో కేసీఆర్, ఇప్పుడు రేవంత్‌రెడ్డి హిందువుల మనోభావాలతో ఆడుకుంటున్నారని అన్నారు. ముందస్తు నోటీసులు ఇవ్వకుండానే రాత్రికి రాత్రే హైడ్రా కమిషనర్ రంగనాథ్ నేతృత్వంలో షేక్‌పేట రెవెన్యూ అధికారులు జేసీబీలతో కూల్చివేయడం అన్యాయమని తెలిపారు. అత్యుత్సాహంతో ఆలయాన్ని కూలగొట్టడం క్షమించరానిదని పేర్కొన్నారు. ప్రభుత్వ స్థలాలను, చెరువులు, కుంటలను కాపాడాల్సిన హైడ్రా పూర్తిగా విఫలమైందని విమర్శించారు. హకీంపేటలో ఉన్న చెరువు 63 ఎకరాలు కబ్జా చేసి ఇళ్లు కట్టారని, ఇది హైడ్రా అధికారులకు కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. ఫిలింనగర్ రాక్‌గార్డెన్ 27 ఎకరాలు ఉండాల్సి ఉండగా దానిని కాపాడుకోలేకపోతున్నారని అన్నారు. ఖైరతాబాద్‌లో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు 40 ఆలయాలు నిర్మాణం చేశానని తెలిపారు. ఇప్పుడు పెద్దమ్మ గుడిని కూడా తానే నిర్మిస్తానని, 500 గజాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే, మేయర్‌కు ఈ గుడి కనిపించడం లేదా? అని నిలదీశారు.

భక్తుల మనోభావాలను దెబ్బతీయడం సరికాదు

ఎమ్మెల్యే దానం నాగేందర్



ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న యాదవ సంఘం సభ్యులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నం.12లోని ఎమ్మెల్యే కాలనీలో ఇటీవల రెవెన్యూ అధికారులు ఎన్నో ఏళ్ల చరిత్ర ఉన్న పెద్దమ్మగుడిని కూల్చిన విషయం విదితమే. స్థానిక భక్తులు, యాదవ సంఘం ప్రతినిధులు సోమవారం ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... భక్తుల మనోభావాలు దెబ్బతీసే విధంగా ఆలయాన్ని కూల్చడం సరికాదన్నారు. ఈ ఘటనపై తాను కూడా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశానని తెలిపారు. ఎవరూ ఆందోళన చెందవద్దని అన్నారు. ఇంతటి సున్నితమైన సమస్యను సామరస్యపూర్వకంగా పరిష్కరించే దిశగా రెవెన్యూ శాఖ మంత్రి, స్థానిక రెవెన్యూ అధికారులతో మాట్లాడే బాధ్యతను తానే తీసుకుంటానని వారికి హామీ ఇచ్చారు. రెచ్చగొట్టి పబ్బం గడుపుకునేవారి మాటలు నమ్మవద్దని కోరారు.

అక్రమ లాగిన్ చేసిన షోరూంలపై చర్యలు తీసుకోవాలి



రవాణాశాఖ కార్యాలయం ఎదుట అసోసియేషన్ నాయకుల నిరసన

పంజగుట్ట: ఆటోలను బ్లాక్‌లో అక్రమ లాగిన్ చేసిన షోరూంలపై, అధిక ధరలకు ఆటో చీకటి వ్యాపారం చేస్తున్న ఫైనాన్షియర్లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలంగాణ స్టేట్ ఆటో, ట్యాక్సీ డ్రైవర్స్ అసోసియేషన్ (బీఎంఎస్ అనుబంధం) ఆధ్వర్యంలో సోమవారం ఖైరతాబాద్ రవాణాశాఖ ప్రధానకార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున బీఎంఎస్ నాయకులు నినాదాలు చేస్తూ రవాణాశాఖ కార్యాలయం ప్రధాన ద్వారం ఎదుట బైఠాయించారు. పోలీసులు వారికి సర్దిచెప్పి ఒక ప్రతినిధి బృందాన్ని లోనికి పంపడంతో వారు వెళ్లి ఉన్నతాధికారులకు వినతిపత్రం ఇచ్చారు. డ్రైవర్ల నిరసనతో రవాణాశాఖ ప్రధాన గేట్లు మూసివేయ్యడంతో ముందుగానే స్లాట్స్ బుక్ చేసుకున్న వాహనాలు బయటే ఆపివేశారు. దీంతో కొద్దిసేపు సేవలకు అంతరాయం ఆర్‌టీఏ బస్‌స్టాప్ మొత్తం స్లాట్ బుక్ చేసుకున్న వాహనాలతో నిండిపోయింది. ప్రముఖ సినీనటుడు దివంగత నందమూరి హరికృష్ణ కూతురు కూడా కొద్దిసేపు బయటే ఆగిపోవాల్సి వచ్చింది.

ప్రభుత్వం ద్వారానే వేతనాలు ఇప్పించాలి

ఖమ్మం జనరల్ హాస్పటల్ సిబ్బంది విజ్ఞప్తి



మంత్రి దామోదర రాజనర్సింహను కలిసిన ఖమ్మం జనరల్ హాస్పటల్ సిబ్బంది

బంజారాహిల్స్: ఖమ్మం గవర్నమెంట్ జనరల్ హాస్పటల్‌కు చెందిన సిబ్బంది సోమవారం వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సిహను కలిసి తమ సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న 33 జిల్లాల్లో ప్రభుత్వ హాస్పటల్, ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో పనిచేస్తున్న పేషెంట్‌కేర్, సెక్యూరిటీగార్డ్స్, శానిటేషన్ వర్కర్స్ 16,870 మంది కార్మికులు ఉన్నారని, వారంతా 15, 20 సంవత్సరాల నుంచి పనిచేస్తున్నారని అన్నారు. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో నూతన శానిటేషన్ ఏజెంట్ టెండర్స్ ప్రక్రియ ఉన్నందు వల్ల కార్మికులను తమ పరిధిలో తీసుకుని ప్రభుత్వం ద్వారానే వేతనాలు ఇప్పించాలని కోరారు. కార్మికులకు కనీస వేతనం కింద 26,000, అందరి కార్మికులకు ఈసీఎస్ఐ, పీఎఫ్ సమాన రీతిలో కట్టేవిధంగా చేయాలన్నారు. ఈసీఎస్ఐ ద్వారా కుటుంబంలో ఎవరికైనా జరిగిన సందర్భంలో కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందించేలా 25 లక్షల నుంచి 30 లక్షల వరకు వర్తింపు చేయాలన్నారు. ప్రమాద బీమా 25 లక్షలు వర్తించేవిధంగా చేయాలని కోరారు. ఆయా అశాలకు సంబంధించి మంత్రికి వినతిపత్రం అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో మాతంగి అనిల్‌కుమార్, కర్ష జగదీష్, వంగూరి నరేష్, చిన్న వెంకన్న, పొట్ట పింజర ఉదయ్‌కిరణ్, బోనాల ఉపేందర్, గొల్లమండల శ్రీకాంత్, చిత్రం అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్యాంగ్ సభ్యుల వేధింపులతో యువకుడు ఆత్మహత్య





ముకేష్ బాబు(ఫైల్)

ఖైరతాబాద్: ఓ బ్యానర్ విషయంలో జరిగిన గొడవలో ఓ యువకుడిపై ఖైరతాబాద్‌లో స్థానిక గ్యాంగ్ సభ్యులు దాడి చేసి.. బెదిరింపులకు పాల్పడటంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.... ఖైరతాబాద్ న్యూ సీఐబి క్వార్టర్స్‌లో నివాసముండే వీరబోయిన ముకేష్ బాబు (30) పాల వ్యాపారి. ఇటీవల బోనాల సందర్భంగా ఏర్పాటు చేసిన బ్యానర్ విషయంలో తలెత్తిన వివాదంలో భాగంగా ఖైరతాబాద్‌లోని ఓ గ్యాంగ్ సభ్యులు ఆదివారం రాత్రి ముకేష్ ఇంటి వద్దకు వెళ్లి దాడి చేయడంతో పాటు బెదిరించి, భయభ్రాంతులకు గురిచేశారు. అవమాన భారంతోనే సోమవారం ముకేష్ బాబు ఇంట్లో ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబ సభ్యులు, స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఖైరతాబాద్‌లో కొంత కాలంగా గ్యాంగ్ సభ్యులు అనేక అరాచకాలకు పాల్పడుతున్నారని, వీరిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోకపోతే పోలీస్‌స్టేషన్ ముందు ఆందోళన చేపడతామని స్థానికులు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు వచ్చిన ఎమ్మెల్యే దానం నాగేందర్ కూడా పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మృతుడి సోదరుడు రాకేష్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన విశేష్‌ను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఎట్టకేలకు రాత్రి అంత్యక్రియలు పంజాగుట్టలో నిర్వహించారు.

గెస్ట్ లెక్చరర్లకు న్యాయం చేయాలి

బంజారాహిల్స్: టీజీపీఎస్సీ ద్వారా రిక్రూట్ అయిన 1256 మంది రెగ్యులర్ లెక్చరర్ పోస్టుల వల్ల డిస్టర్బ్ అయిన 1654 మంది గెస్ట్ లెక్చరర్లకు న్యాయం చేయాలని, వారిని ఖాళీగా ఉన్న వివిధ ప్రాంతాల్లో అడ్జస్ట్ చేయాలంటూ గెస్ట్ లెక్చరర్లు కోరారు. ఈ అంశంపై వారు మంత్రులను కలిసేందుకు సోమవారం బంజారాహిల్స్‌లోని మంత్రుల నివాస ప్రాంగణానికి వచ్చి మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, దామోదర రాజనర్సింహతో పాటు పలువురు మంత్రులకు వినతి పత్రాలు అందజేశారు. తెలంగాణ గవర్నమెంట్ జూనియర్ కాలేజీ గెస్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ దార్ల భాస్కర్ మాట్లాడుతూ... 12 సంవత్సరాలుగాకు పైగా వందలాది మంది ఈ ఉద్యోగాలపై ఆధారపడి బతుకుతున్నారని రెగ్యులర్ ఉద్యోగులు వచ్చారని గెస్ట్ లెక్చరర్లను తొలగించవద్దని వేడుకున్నారు. అయితే సంబంధిత శాఖ ఉన్నతాధికారులు ఈ విషయంపై పలు చర్చలు జరిపి కేవలం 400 మంది ఉద్యోగులను మాత్రమే అడ్జస్ట్ చేయడానికి జీవో విడుదల చేసేందుకు సమాయత్తం అవుతున్నట్లు తమకు తెలిసిందని ఇలా జరిగితే మిగతా వారంతా అన్యాయమైపోతారని తమకు న్యాయం చేయాలంటూ కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు దామెర ప్రభాకర్, ఉపాధ్యక్షుడు దేవయ్య పాల్గొన్నారు.



మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు వినతి పత్రం అందజేస్తున్న గెస్ట్ లెక్చరర్లు

యువతి అదృశ్యం

వెంగళరావునగర్: హాస్టల్‌లో ఉంటూ చిరుద్యోగం చేస్తున్న తన కుమార్తె అదృశ్యమైందని ఓ మహిళ మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఖమ్మం జిల్లాకు చెందిన ప్రమీల చిన్న కుమార్తె గతేడాది కిందట యూసుఫ్‌గూడకు వచ్చి హాస్టల్‌లో ఉంటూ ప్రైవేట్ ఉద్యోగం చేస్తోంది. అంతకుముందు ఆమెకు కోదాడ సమీపంలోని తొగర్రాయికి చెందిన కంచర్ల శ్రీనివాసరెడ్డితో పరిచయం అయ్యింది. యువతిని వివాహం చేసుకుంటానని చెప్పడంతో యువతి బంధువులు అతని గురించి విచారించగా శ్రీనివాసరెడ్డికి అప్పటికే వివాహమై పిల్లలు కూడా ఉన్నారని తెలిసింది. దాంతో తమ కుమార్తెను ఇవ్వడానికి నిరాకరించారు. అనంతరం యువతి నగరానికి వచ్చింది. ఇటీవల తల్లి తన కుమార్తెకు ఫోన్ చేసి పెళ్లి సంబంధం చూస్తున్నట్టుగా తెలియజేసింది. తొలుత పెళ్లికి అంగీకరించిన యువతి తర్వాత శ్రీనివాసరెడ్డిని మాత్రమే పెళ్లి చేసుకుంటానని చెప్పింది. ఆందోళనతో ఆమె తల్లి నగరానికి వచ్చి చూడగా హాస్టల్‌లో కనిపించలేదు. అప్పటికే లగేజీ సర్దుకుని వెళ్లిపోయినట్టుగా సహచరులు తెలిపారు. దాంతో ఆమె తన కుమార్తెను శ్రీనివాసరెడ్డి మాయమాటలు చెప్పి తీసుకెళ్లాడని అనుమానం వ్యక్తం చేస్తూ మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది.పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

క్రైం కార్నర్..

పెళ్లి చేసుకుంటానని మోసం

యువకుడిపై కేసు నమోదు

వెంగళరావునగర్: ప్రేమించానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి యువతిని మోసం చేసిన వ్యక్తిపై మధురానగర్ పీఎస్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో నివసించే యువతి మియాపూర్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తుంది. ఆమెకు ఐదేళ్ల కిందట సమీర్ అనే యువకుడితో వివాహం జరిగింది. రెండేళ్లు గడచిన తర్వాత అతనికి వేరే అమ్మాయితో కూడా వివాహం జరిగిందని తెలుసుకుని విడాకులు ఇచ్చింది. గత ఏడాది తాను పనిచేసే చోట షాకీర్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. అతను ఆమెను పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఈ ఏడాది జనవరి నుంచి అనేకమార్లు శారీరకంగా కలిశాడు. డబ్బు అవసరమని ఇటీవల రూ.50 వేలు కూడా తీసుకున్నాడు. ఆమె అతని వద్ద పెళ్లి ప్రస్తావన తీసుకురాగా తప్పించుకు తిరుగుతున్నాడు. నిలదీయగా పెళ్లి చేసుకోను అంటూ బెదిరిస్తున్నాడు. తనను మోసం చేసిన షాకీర్‌పై చర్యలు తీసుకోవాలని యువతి సోమవారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సహజీవనం చేసి.. ముఖం చాటేసి.!

మోసగించిన యువకుడి రిమాండ్

ఫిలింనగర్: ప్రేమిస్తున్నానని.. పెళ్లి చేసుకుంటానని ఓ వివాహితను నమ్మించి రెండేళ్లు సహజీవనం చేసి ముఖం చాటేసిన యువకుడిని ఫిలింనగర్ పోలీసులు సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. జూబ్లీహిల్స్ సమీపంలోని వెంకటగిరిలో నివసించే వికాస్‌కుమార్ (23) ఎలాంటి జాబ్ చేయకుండా ఆవారాగా తిరుగుతూ ప్రేమ పేరుతో మహిళలను లోబర్చుకుంటూ పెళ్లి చేసుకుంటానని నమ్మిస్తూ తన అవసరాలకు డబ్బులు వాడుకుంటుంటాడు. ఇదే క్రమంలో ఫిలింనగర్‌లోని సైదప్ప బస్తీలో నివసించే వివాహిత (28)తో రెండేళ్ల క్రితం పరిచయం పెంచుకుని ప్రేమిస్తున్నానని చెప్పాడు. పెళ్లి చేసుకుంటానని మభ్యపెట్టి ఆమెతో సహజీవనం చేయసాగాడు.ఆవారాగా తిరుగుతూ కేవలం తనకు పరిచయం ఉన్న మహిళలు ఇచ్చే డబ్బులతో కాలం గడిపే వికాస్‌కుమార్‌కు ఇటీవల మరో యువతి పరిచయమైంది. దీంతో సహజీవనం చేస్తున్న వివాహిత పెళ్లి విషయం ఎత్తేసరికి ముఖం చాటేశాడు. బేబీ కేర్ సెంటర్‌లో పనిచేసే బాధితురాలు తాను మోసపోయిన విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి మంగళవారం । 29 । జూలై । 2025

ఒకటిన వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన షురూ

కాచిగూడ: కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజనను ఆగస్టు ఒకటవ తేదీన ప్రారంభిస్తోందని రీజినల్ పీఎఫ్ కమిషనర్ డాక్టర్ శివకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకాన్ని కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖకు చెందిన ఉద్యోగ భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) అమలు చేస్తుందని ఆయన పేర్కొన్నారు. 2025 ఆగస్టు 1 నుంచి 2027 జూలై 31 వరకు నమోదు ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. ఈ పథకం ఆర్థిక వృద్ధికి, ఉద్యోగ నైపుణ్య అభివృద్ధికి, భారత అధికారిక కార్మిక శక్తిని బలోపేతం చేయడానికి ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. 2024–25లో ఈ పథకాన్ని కేంద్రం బడ్జెట్‌లో ప్రకటించిందని తెలిపారు. మొత్తం రూ.99,446 కోట్ల వ్యయంతో ఈ పథకాన్ని రూపొందించారని పేర్కొన్నారు. ఈ పథకంలో భాగంగా ఉపాధి అవకాశాలు ఉన్న పారిశ్రామిక, వాణిజ్య ప్రాంతాలను గుర్తించడం, పరిశ్రమల సమాఖ్యలతో సంపర్కం, విద్య, శిక్షణ సంస్థల ద్వారా యువతకు అవగాహన కల్పించడం రాష్ట్రాల బాధ్యతలని పేర్కొన్నారు.

మార్కెట్ యార్డుల్లోని ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

– సీఎం రేవంత్‌రెడ్డికి టీఎన్జీఓ వినతి



సాక్షి, సిటీబ్యూరో: వ్యవసాయ మార్కెట్ యార్డుల్లోని ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని టీఎన్జీఓ సంఘం ఉపాధ్యక్షుడు, వ్యవసాయ మార్కెట్ కమిటీల ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నర్సింహా రెడ్డి ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి విన్నవించారు. ఈ మేరకు సోమవారం సీఎంను ఆయన నివాసంలో కలిసి వ్యవసాయ మార్కెట్ కమిటీల పరిస్థితిపై వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో శాఖాపరంగా 60 శాతం పోస్టులు ఖాళీగా ఉన్నాయని, సిబ్బందిపై పనిభారం పెరిగిందని పేర్కొన్నారు. ఈ విషయమై వ్యవసాయ శాఖ మంత్రితో మాట్లాడాలని ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డికి సీఎం సూచించారని తెలిపారు.

ప్రాణం కాపాడిన హైడ్రా సిబ్బందికి సన్మానం



సాక్షి, సిటీబ్యూరో: దుర్గం చెరువులో దూకి ఆత్మహత్యకు యత్నించిన యువకుడిని చాకచక్యంగా కాపాడిన హైడ్రా ఆధీనంలోని డీఆర్ఎఫ్ సిబ్బందిని కమిషనర్ ఏవీ రంగనాథ్ సోమవారం సన్మానించారు. వివరాలు.. రామిరెడ్డి అనే వ్యక్తి శుక్రవారం తీగల వంతెన అంచున నిలబడి చెరువులో దూకేందుకు ప్రయత్నించాడు. వంతెనపై నిలిచిన నీటిని తొలగించే పనుల్లో ఉన్న డీఆర్ఎఫ్ సిబ్బంది అప్రమత్తమయ్యారు. రామిరెడ్డిని మాటల్లో పెట్టి, దృష్టి మరల్చి అదుపులోకి తీసుకుని కాపాడారు. ఇందులో కీలకపాత్ర పోషించిన సిబ్బంది తిరుపతి యాదవ్, సహకరించిన సంతోష్‌చారి, మహ్మద్ ఇమ్రాన్‌లను సోమవారం హైడ్రా ప్రధాన కార్యాలయానికి రంగనాథ్ పిలిపించి శాలువా కప్పి సన్మానించారు.

ఇమామ్‌ల వేతనాల పునరుద్ధరణ గడువు పొడిగించాలి

సాక్షి,సిటీబ్యూరో: రాష్ట్రంలోని మసీదుల్లో సేవలు అందిస్తున్న ఇమామ్, మౌజన్‌ల గౌరవ వేతనాల పునరుద్ధరణ దరఖాస్తు గడువును మరో నెలరోజులపాటు పొడిగించాలని మైనార్టీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎండీ యాకూబ్ పాషా రాష్ట్ర వక్ఫ్ బోర్డుకు విజ్ఞప్తి చేశారు. గౌరవ వేతనాలను కొనసాగించడానికి పాన్ కార్డ్, ఆదాయ ధ్రువీకరణ పత్రం తప్పనిసరి కావడంతో ఇమామ్, మౌజన్ ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ఆదాయ ధ్రువీకరణ పత్రం పొందేందుకు రేషన్‌కార్డు అవసరమని, చాలామంది ఇమామ్, మౌజన్‌లకు ఆ కార్డులు లేవని పేర్కొన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని అధికారులు ఆదాయ ధ్రువీకరణపత్రాన్ని మినహాయించాలని కోరారు. ఈ మేరకు రాష్ట్ర వక్ఫ్ బోర్డు సీఈవో, రాష్ట్ర మైనారిటీ కార్యదర్శికి లేఖ రాసినట్లు ఆయన వివరించారు.

నగరంలో నేడు

- శ్రీనగర్ కాలనీలోని శ్రీ సత్యసాయి నిగమాగమంలో గణేష్ చతుర్థి స్పెషల్ పేరిట నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు ఉంటుంది.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన హస్తకళా మ్యూజియం ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళాశక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.comకు మెయిల్ చేయగలరు.

ఈఎన్‌టీ.. ఇదేంటీ?

- శస్త్రచికిత్సలకు మూడు నెలలపాటు ఎదురుచూపులు
- నిష్ణాతులైన వైద్యులు ఇతర ఆసుపత్రులకు బదిలీ
- వైద్యులు, ఫార్మసిస్టులు, నర్సింగ్ సిబ్బంది కొరత
- పెరిగిన ఔట్ పేషెంట్లు.. సరిగా అందని వైద్యసేవలు

సుల్తాన్‌బజార్: అది ఆసియాలోనే పేరున్న ఆసుపత్రి.. నిష్ణాతులైన వైద్యులకు నిలయం.. శస్త్రచికిత్సలకు ప్రసిద్ధి. కానీ, ఇటీవల వైద్యులు, ఫార్మసిస్టుల కొరత పీడిస్తోంది. ఉన్న సిబ్బందిపై పనిభారం తీవ్రమైంది. శస్త్ర చికిత్సలకు కనీసం మూడు నెలలపాటు వేచి చూడాల్సిందే. ఇదీ కోఠి ఈఎన్‌టీ (ముక్కు, చెవి, గొంతు) ఆసుపత్రి పరిస్థితి. కొంత కాలంగా వైద్యులు, ఫార్మసిస్టులు, నర్సులు, సిబ్బంది కొరత కారణంగా రోగులకు సరైన వైద్యం అందడం లేదు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో నిష్ణాతులైన వైద్యులు ఇతర ఆసుపత్రులకు బదిలీ కావడంతో ఇక్కడ ప్రతినిత్యం జరిగే శస్త్రచికిత్సలకు తీవ్ర జాప్యం ఏర్పడుతోంది.



కోఠి ఈఎన్‌టీ ఆసుపత్రి

రోజూ వెయ్యిమందికిపైగా ఓపీ రోగులు

తెలంగాణ నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి ఎంతో మంది రోగులు ఈ ఆసుపత్రికి వచ్చి వైద్య సేవలు పొందుతారు. ఈ ఆసుపత్రికి ప్రతి రోజు వెయ్యి నుంచి 1300 మంది ఔట్ పేషెంట్లు వస్తున్నారు. 200 నుంచి 300 వరకు ఇన్ పేషంట్లు వివిధ యూనిట్లలో చికిత్సలు పొందుతుంటారు. ఇటీవల కాలంలో ఓపీ రోగులు పెరుగుతుండటంతో సరైన వైద్య సేవలు అందటంలేదు. బదిలీలు అయిన వైద్యుల స్థానంలో కొత్తవారిని ప్రభుత్వం నియమించకపోవడంతో ఈ ఆసుపత్రిలో వైద్యం అంతంత మాత్రమే ఉంది.

తీవ్రంగా వైద్యుల కొరత..

కోఠి ఈఎన్‌టీ ఆసుపత్రిలో మొత్తం ఐదు మంది ప్రొఫెసర్లు ఉండాలి. ఇటీవల ముగ్గురు ప్రొఫెసర్లు బదిలీ కావడంతో ఇద్దరు మాత్రమే ఉన్నారు. ఐదుగురు అసోసియేట్ ప్రొఫెసర్లకుగాను ఇద్దరు బదిలీ కావడంతో ముగ్గురే సేవలందిస్తున్నారు. 14 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లకుగాను నలుగురు మాత్రమే ఉన్నారు. వైద్యుల కొరత కారణంగా రోగులకు అవసరమైన శస్త్ర చికిత్సలు సకాలంలో అందడంలేదు. నెలలపాటు ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ విషయమై పలుమార్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రభుత్వానికి నివేదికలు పంపినా ఫలితం శూన్యమని చెప్పవచ్చు. కేవలం ఒక ఫార్మసిస్టు మాత్రమే వందల మంది రోగులకు మందులు అందిస్తున్నారు. దీంతో ఆ ఫార్మసిస్టుపై పనిభారం ఎక్కువై ఇబ్బంది పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఫార్మసిస్టును వెంటనే భర్తీ చేయాలని పలువురు కోరుతున్నారు.

మందులతోనే సరి..

వివిధ జిల్లాల నుంచి రాష్ట్రాల నుంచి వచ్చే రోగులకు సరైన సమయంలో వైద్యం అందక పోవడంతో వారు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ఔట్ పేషెంటు రోగులకు పీజీ వైద్యులు కేవలం మందులు రాసి సరిపెడుతున్నారు. ఒక్కప్పుడు ఇదే ఆసుపత్రిలో ప్రతి రోజు 20 నుంచి 30 శస్త్ర చికిత్సలు జరిగేవి. ఇప్పుడు శస్త్రచికిత్సలకు కనీసం మూడు నెలలు ఎదురుచూడాల్సి వస్తోంది. ఈ ఆసుపత్రిలో సిబ్బందితో పాటు సరైన సౌకర్యాలు సైతం లేకపోవడంతో ఆసుపత్రి అధ్వానంగా మారింది. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ ఆసుపత్రికి సరైన వైద్యులు, ఫార్మసిస్ట్‌లు, నర్సింగ్ సిబ్బందిని సమకూర్చాలని పలువురు రోగులు కోరుతున్నారు.

శాస్త్ర, సాంకేతిక రంగాల్లో రాష్ట్రం మేటి

రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ

ఉప్పల్: శాస్త్ర, సాంకేతిక రంగాల అభివృద్ధిపై కళాశాలలు దృష్టి సారించాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. ఉప్పల్ లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాల ఫిజికల్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన 'ఎమర్జింగ్ ట్రెండ్స్ ఆన్ సైన్స్ అండ్ టెక్నాలజీ' అనే అంశంపై జాతీయ సదస్సును గవర్నర్ ప్రారంభించారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం శాస్త్ర, సాంకేతిక రంగాల్లో వేగంగా ముందుకు సాగుతోందన్నారు. భవిష్యత్తును నిర్మించడంలో విజ్ఞానం, ఆవిష్కరణల ప్రాధాన్యతను గుర్తించి పరిశోధకులు కొత్త ఆవిష్కరణలపై దృష్టి సారించాలని సూచించారు. మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపిజే అబ్దుల్ కలాం ప్రకారం శాస్త్రం అనేది మానవాళి అభివృద్ధి సాధించడానికి ఒక శక్తి వంతమైన సాధనమని అన్నారు. కళాశాల డైరెక్టర్ జాన్ కలరక్కల్, కరస్పాండెంట్ అరుణ్ ప్రకాశ్, ప్రిన్సిపాల్ జయంతిరెడ్డి మాట్లాడుతూ జాతీయ సదస్సు నిర్వహించడానికి గల కారణాలను వివరించారు. ఈ సదస్సు భావి తరాలకు ఉత్తేజాన్ని ఇస్తుందని అన్నారు. అంతకు ముందు విద్యార్థులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ. చిత్రంలో జాన్ కలరక్కల్, అరుణ్‌ప్రకాశ్ తదితరులు

పెగాసిస్టమ్స్ ఎక్స్‌పర్ట్ సర్కిల్స్ ప్రారంభం

మాదాపూర్: మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో సోమవారం పెగా ఇన్నోవేట్–2025లో ఎక్స్‌పర్ట్ సర్కిల్స్‌ను పెగాసిస్టమ్స్ ఇండియా సీనియర్ వైస్ ప్రెసిడెంట్, మేనేజింగ్ డైరెక్టర్ దీపక్ విశ్వేశ్వరయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పెగా డెవలపర్లలో 50 శాతానికిపైగా భారతదేశంలోనే ఉన్నారని చెప్పారు. పెగా డెవలపర్ ఎకోసిస్టమ్‌ను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా దీనిని రూపొందించినట్లు తెలిపారు. భారతదేశంలో డెవలపర్లు సగానికిపైగా ఉండటంతో హైదరాబాద్, బెంగళూరుల్లో ఈ ప్రోగ్రామ్ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పెగా చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్, మార్కెటింగ్ వైస్ ప్రెసిడెంట్ డాన్ ష్యూర్మాన్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి





చిక్కడపల్లి లైబ్రరీలో నిరుద్యోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అద్దంకి. చిత్రంలో ఉపేందర్‌రెడ్డి

ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్

చిక్కడపల్లి: నిరుద్యోగులకు, ప్రభుత్వానికి వారధిగా ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ హామీ ఇచ్చారు. సోమవారం చిక్కడపల్లి నగర కేంద్ర గ్రంథాలయంలో నిరుద్యోగ అభ్యర్థులతో ఎమ్మెల్సీ అద్దంకి సమావేశం నిర్వహించారు. నిరుద్యోగుల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్తానని చెప్పారు. నిరుద్యోగులు మాట్లాడుతూ ఆగస్ట్ 15వ తేదీలోపు ఉద్యోగ ప్రకటనలు విడుదల చేయకపోతే 'చలో గాంధీభవన్', 'చలో టీజీపీఎస్సీ' చేపడతామని హెచ్చరించారు. డ్రామాలు చేయడానికి ఇక్కడికి వస్తారని, మీ వల్ల ఏమీ కాదని ఎమ్మెల్సీని ఉద్దేశించి నిరుద్యోగులు వ్యాఖ్యానించారు. నిరుద్యోగుల ప్రతినిధి అశోక్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం ఐదువేల ఉద్యోగాలు భర్తీ చేసిందన్నారు. ఎన్నికల కోసమే గురుకుల ఉద్యోగాలను భర్తీ చేయకుండా ఆపుతున్నారని ఆరోపించారు. 40 వేల ఉద్యోగాలు భర్తీ చేసే అవకాశమున్నా ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. నిరుద్యోగ అభ్యర్థి అస్మా మాట్లాడుతూ గ్రూప్–1లో అవకతవకలు జరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం చెప్పిన మెగా డీఎస్సీ ఏమైందని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్‌తో నిరుద్యోగ అభ్యర్థుల ముఖాముఖి ఏర్పాటు చేయించాలని నిరుద్యోగులు కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల లోపు నోటిఫికేషన్లను ఖచ్చితంగా ప్రకటించాలన్నారు. లేదంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోవడం ఖాయమన్నారు. అనంతరం నిరుద్యోగులు సన్మానించేందుకు ప్రయత్నించగా దయాకర్ సున్నితంగా తిరస్కరించారు. చిక్కడపల్లి సీఐ రాజునాయక్, డీఐ శంకర్ మాలోత్, ముషీరాబాద్ సీఐ రాంబాబు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ కేసిరెడ్డి ఉపేందర్‌రెడ్డి, కార్యదర్శి పి.పద్మజ, దయాకర్ సతీమణి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

అధికారులకు జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ ఆదేశాలు

లక్డీకాపూల్: ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహించవద్దని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ స్పష్టం చేశారు. ప్రతి అర్జీదారు సమస్య పరిష్కారం కోసం తిరిగి విన్నవించకుండా హెచ్ఓడీలు కృషి చేయాలన్నారు. సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలపై కమిషనర్‌కు అర్జీలను అందజేశారు. వాటిని క్షుణ్ణంగా పరిశీలించి సత్వరం పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజావాణికి మొత్తం 66 ఫిర్యాదులు అందాయి. ఆరు జోన్లలో మొత్తం 93 అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు పంకజ, గీతా రాధిక, సత్యనారాయణ, వేణు గోపాల్, మంగతాయారు, సీఈ రత్నాకర్, హౌసింగ్ సీఈ నిత్యానంద, డిప్యూటీ కలెక్టర్ భూసేకరణ రామ్ నాయక్, అడిషనల్ సీసీపీలు గంగాధర్, వెంకన్న, ప్రదీప్, డిప్యూటీ సీఈలు సంపద, పనసరెడ్డి, ఎస్ఏ సీపీపీ రావు, హౌసింగ్ ఈఈ పీవీ రవీందర్, ఎలక్ట్రిసిటీ ఈఈ మమత, చీఫ్ మెడికల్ అధికారి డాక్టర్ పంకజ, చీఫ్ వెటర్నరీ అబ్దుల్ వకీల్, అసిస్టెంట్ అడ్వర్టైజ్‌మెంట్ అధికారి దుర్గాన భాను తదితరులు పాల్గొన్నారు.

పీజీ ప్రవేశ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ఉస్మానియా యూనివర్సిటీ: పీజీ ప్రవేశ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సీపీగెట్–2025 కన్వీనర్ ప్రొఫెసర్ పాండురంగా రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 4 నుంచి ప్రారంభంకానున్న ప్రవేశ పరీక్షల కోసం 24 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. రూ.2 వేల అపరాధ రుసుముతో సుమారు 50 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలోని 8 వర్సిటీల్లో వివిధ పీజీ కోర్సుల్లో ప్రవేశానికి 63 వేల దరఖాస్తులు అందినట్లు పేర్కొన్నారు. గతేడాది కంటే 12,500 దరఖాస్తులు తగ్గినట్లు తెలిపారు. రేపటి నుంచి (30న) హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. పూర్తి వివరాలకు ఉస్మానియా వెబ్‌సైట్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

రేషన్ డీలర్ల కమీషన్ విడుదల చేయాలి

రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆనంద్ కుమార్

సాక్షి,సిటీబ్యూరో: రేషన్ డీలర్ల కమీషన్ వెంటనే విడుదల చేయాలని రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆనంద్ కుమార్ కోరారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఐదు నెలలుగా కమీషన్ డబ్బులు రాకపోవడంతో రేషన్ డీలర్లు ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏప్రిల్, మే నెలలతోపాటు ముందస్తుగా జూన్, జూలై ఆగస్టు నెలల బియ్యం పంపిణీ చేశామని, హమాలీ, వర్కర్ చార్జీలు అదనంగా చెల్లించాల్సి వచ్చిందని పేర్కొన్నారు. ప్రస్తుతం దుకాణం అద్దె కూడా భారంగా పెరిగిందని, డీలర్ల కుటుంబ సభ్యుల పోషణకు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే రేషన్ డీలర్లకు ఐదు నెలల కమీషన్ ఒకేసారి విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు ముమ్మరం



సాక్షి,సిటీబ్యూరో: రోడ్డు ప్రమాదాల నివారణ, రోడ్‌సేఫ్టీ కార్యక్రమంలో క్యాచ్ పిట్స్, పాట్ హోల్స్, సెంట్రల్ మీడియంల మరమ్మతు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఇప్పటి వరకు మొత్తం 5,438 పాట్ హోల్స్, 256 క్యాచ్‌పిట్స్ మరమ్మతులు పూర్తయినట్లు చీఫ్ ఇంజినీర్(మెయింటనెన్స్) సహదేవ్ రత్నాకర్ తెలిపారు. 69 క్యాచ్‌పిట్ల మూతలు మార్చినట్లు, 3 సెంట్రల్ మీడియంల మరమ్మతులు చేసినట్లు పేర్కొన్నారు.

రేవంత్ హయాంలో ఉద్యమకారులకు మేలు



పురస్కార గ్రహీతలతో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ప్రొఫెసర్ పురుషోత్తం తదితరులు

గన్‌ఫౌండ్రీ: దశాబ్దం తర్వాత నిజమైన తెలంగాణ ఉద్యమకారులకు గుర్తింపు లభించడం సంతోషంగా ఉందని రాష్ట్ర ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. సోమవారం రవీంద్రభారతిలో తెలంగాణ కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలువురికి తెలంగాణ సన్మాన్ పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోనే అసలైన ఉద్యమకారులకు గుర్తింపు లభిస్తుందన్నారు. గత ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా అణగదొక్కిన కవులు, కళాకారులకు రేవంత్‌రెడ్డి హయాంలోనే మేలు జరుగుతుందన్నారు. బీఆర్ఎస్ హయాంలో దొర గడీలకు భజన చేసే కళాకారులకు తప్ప అసలైన ఉద్యమకారులకు గుర్తింపు లభించలేదని ఆరోపించారు. అనంతరం ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌కు ప్రొఫెసర్ జయశంకర్ స్మారక పురస్కారం, బీసీ కమిషన్ సభ్యురాలు బాలలక్ష్మికి చాకలి ఐలమ్మ స్మారక పురస్కారం, రచయిత పొన్నం రవిచంద్రకు పైడి జయరాజు స్మారక పురస్కారం, గాయకుడు దరువు అంజన్నకు గద్దర్ స్మారక పురస్కారం, సీనియర్ పాత్రికేయులు కాసుల ప్రతాప్‌రెడ్డికి సురవరం ప్రతాప్‌రెడ్డి స్మారక పురస్కారాలను అందజేశారు. అంతకుముందు కళాకారుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో తెలంగాణ ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ పురుషోత్తం, జ్యోతిబాపూలే గురుకుల విద్యాసంస్థల జాయింట్ సెక్రెటరీ శ్యామ్‌ప్రసాద్, తెలంగాణ ఉద్యోగుల సంఘం రాష్ట్ర సహా అధ్యక్షుడు కాలేరు సురేష్, కల్చరల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నారగోని పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ పూర్వవిద్యార్థినికి 'క్యాపిటల్' అవార్డు



రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా క్యాపిటల్ ఫౌండేషన్ అవార్డు స్వీకరిస్తున్న డాక్టర్ శిల్పాకృష్ణ

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పూర్వ విద్యార్థిని డాక్టర్ శిల్పాకృష్ణ ప్రతిష్ఠాత్మకమైన క్యాపిటల్ ఫౌండేషన్ జాతీయ అవార్డును స్వీకరించారు. రెండు రోజుల క్రితం నగరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ అవార్డును ఆమెకు అందజేశారు. శిల్పాకృష్ణ సోషియాలజీ విభాగంలో ఎంఏ, ఎంఫిల్, పీహెచ్‌డీ కోర్సులను 2012–18 బ్యాచ్‌లో పూర్తి చేశారు. సామాజిక న్యాయం, పర్యావరణ ఆరోగ్యం, సమాజ సాధికారతలో ఆమె చేసిన అవిశ్రాంత కృషికి గుర్తింపుగా ఈ అవార్డు దక్కింది. ఆమె బెంగళూరులోని సీఎంఆర్ విశ్వ విద్యాలయంలో న్యాయ డిగ్రీ చదువుతున్నారు. ఆమెను హెచ్‌సీయూ ఫ్యాకల్టీ, అధికారులు అభినందించారు.

యూత్ ఓపెన్ రెగట్టాలో రిజ్వాన్ ముందంజ



సాక్షి, సిటీబ్యూరో: హుస్సేన్ సాగర్‌లో సికింద్రాబాద్ క్లబ్ టిస్కాన్ యూత్ ఓపెన్ రెగట్టా పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. రెండోరోజు పోటీల్లో ఆప్టిమిస్ట్ మెయిన్ ఫ్లీట్ విభాగానికి సంబంధించి ఎన్‌వైఎస్‌సీ టీమ్‌కు చెందిన మహ్మద్ రిజ్వాన్ అత్యుత్తమ ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. ఆరు రేసుల్లో 10 పాయింట్లు సాధించి అగ్రస్థానంలో నిలిచాడు. టీఎస్‌సీకి చెందిన బొంగూర్ బన్నీ రెండో స్థానంలోనూ, ఆర్ఎంవైసీకి చెందిన కృష్ణా వెంకటాచలం మూడో స్థానంలోనూ నిలిచారు. బాలికల విభాగంలో సికింద్రాబాద్ సెయిలింగ్ క్లబ్ కు చెందిన శ్రింగేరి రాయ్ తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తూ ఓవరాల్ గా అగ్రస్థానంలో ఉంది. ఐఎల్ సిఏ బాలుర కేటగిరీలో ఎన్ వైఎస్ సికి చెందిన రమాకాంత్ సత్తా చాటాడు. ఆరు రేసుల్లో 19 పాయింట్లు సాధించి మొదటి స్థానంలో నిలిచాడు. బాలికల విభాగంలో ఆస్థాపాండే ముందంజలో ఉంది. ఇక వాతావరణ పరిస్థితులు అనుకూలించక తొలిరోజు వాయిదా పడిన ఆప్టిమిస్ట్ గ్రీన్ ఫ్లీట్ కేటగిరీ రెండోరోజు జరిగింది. 36 మంది యువ సెయిలర్లు పోటీపడగా.. టీఎస్ సికి చెందిన యువరాజ్ అగ్రస్థానం సాధించాడు. అటు బాలికల విభాగంలో సీఈఎస్ సికి చెందిన సోనియా బ్రార్ సత్తా చాటింది.

ఆన్‌లైన్‌లో రెసోనెన్స్ 'ఈ–లెర్నింగ్' ప్రారంభం

– జేఈఈ, నీట్, ఫౌండేషన్ కోసం..

లక్డీకాపూల్: ఐఐటీ–జేఈఈ, నీట్ పోటీ పరీక్షల శిక్షణా సంస్థ రెసోనెన్స్ విద్యార్థుల సౌలభ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రత్యేకంగా ఆన్‌లైన్ కోచింగ్ ప్లాట్‌ఫారమ్ 'ఈ–లెర్నింగ్'ను ప్రారంభించింది. ఇది జేఈఈ (మెయిన్ – అడ్వాన్స్‌డ్), నీట్, 6 నుంచి 10వ తరగతి విద్యార్థుల ఫౌండేషన్ కోర్సుల కోసం రూపొందించిన సమగ్ర డిజిటల్ విద్యావేదిక. ఈ సందర్భంగా రెసోనెన్స్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్(తెలంగాణ, ఆంధ్రప్రదేశ్) డైరెక్టర్ పూర్ణచంద్రరావు మాట్లాడుతూ ఐఐటీ–జేఈఈ, నీట్ వంటి జాతీయస్థాయి పోటీ పరీక్షల్లో అగ్రస్థానంలో ఉన్న రెసోనెన్స్‌ను ఇప్పుడు టెక్నాలజీ ఆధారిత ఫార్మాట్‌లోకి తీసుకువచ్చామని చెప్పారు. దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులకు అందుబాటులో ఉంచడమే దీని లక్ష్యమన్నారు. ఈ డిజిటల్ ఫార్మాట్‌లో నిపుణులతో లైవ్ ఇంటరాక్టివ్ వీడియో లెక్చర్లు, అత్యున్నత స్టడీ మెటీరియల్, డైలీ ప్రాక్టీస్ ప్రశ్నలు, లైవ్ డౌట్ క్లియరింగ్ సెషన్లు, పూర్తిస్థాయి టెస్ట్ సిరీస్, చాప్టర్ వారీగా అసెస్‌మెంట్‌లు ఉంటాయన్నారు. ఈ రోజుల్లో విద్యార్థులు ఇష్టమైన వేగంతో నేర్చుకునే స్వేచ్ఛ కోరుకుంటారని, అదే సమయంలో నిపుణుల మార్గదర్శకత్వం అవసరమవుతోందని పేర్కొన్నారు. రెసోనెన్స్ ఈ–లెర్నింగ్ ద్వారా విద్యార్థులు కేవలం పరీక్షలకే కాకుండా ఉజ్వల భవిష్యత్తుకు సిద్ధం అవుతున్నట్లుగా ఉంటుందని పూర్ణచంద్రరావు తెలిపారు.

ఆసియా, ఇండియా బుక్ రికార్డ్స్ సాధించిన ఏడీపీ



ఆసియా, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌ను స్వీకరించిన ఏడీపీ సంస్థ అధికారులు

రాయదుర్గం: ఏడీపీ ఇండియా సంస్థ ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ సాధించింది. సోమవారం నానక్‌రాంగూడలోని ఏడీపీ సంస్థ ప్రతినిధులకు ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌ను ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధి విజయ్ అందజేశారు. ఏడీపీ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, జనరల్ మేనేజర్ విజయ్ వేములపల్లి మాట్లాడుతూ తరంగ్ అనే సీఎస్ఆర్ కార్యక్రమం కింద పాఠశాల విద్య అభివృద్ధి, అట్టడుగు స్థాయిలో పరివర్తనకు చేస్తున్న కృషికి ఈ రికార్డ్స్ ద్వారా గుర్తింపు లభించినట్లు అయిందన్నారు. ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధి వసుధారాణి మాట్లాడుతూ ఒకేరోజు 193 ప్రభుత్వ పాఠశాలల్లో 1,600 బ్లాక్‌బోర్డుల మార్పునకు ఏడీపీ శ్రీకారం చుట్టి ఆసియా, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ సాధించిందని పేర్కొన్నారు. అక్షయపాత్ర ఫౌండేషన్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ ధనంజయ్ గజూ మాట్లాడుతూ అక్షయపాత్ర ద్వారా 35 వేల మందికిపైగా పిల్లలకు మధ్యాహ్న భోజనం అందించే కార్యక్రమం నడుస్తోందన్నారు. కార్యక్రమంలో పలువురు ఏడీపీ సంస్థ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

గెజిటెడ్ హెడ్ మాస్టర్లకు ప్రమోషన్లు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాజగంగారెడ్డి

హిమాయత్‌నగర్: గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులకు బదిలీతో కూడిన పదోన్నతులు కల్పించాలని తెలంగాణ స్టేట్ గెజిటెడ్ హెడ్ మాస్టర్స్ అసోసియేషన్(టీఎస్ జీహెచ్ఎంఏ) విజ్ఞప్తి చేసింది. సోమవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.రాజగంగా రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్.గిరిధర్‌గౌడ్ మాట్లాడారు. పాఠశాల విద్యలో 2005 నుంచి గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులకు పదోన్నతులు ఇవ్వడం లేదని తెలిపారు. అర్హతలు కలిగి ఉండి కూడా పైస్థాయి పదోన్నతులు పొందలేక గెజిటెడ్ హెడ్ మాస్టర్ గ్రేడ్–2 స్థాయిలోనే ప్రధానోపాధ్యాయులు పదవీ విరమణ పొందుతున్నారని వాపోయారు. 2018 రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం పాఠశాల విద్యలో ఎంప్లాయీస్ సర్వీస్ రూల్స్, సబార్డినేట్ సర్వీసు రూల్స్ రూపొందించి ఖాళీగా ఉన్న పోస్టుల్లో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులకు పదోన్నతి అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న ఉప విద్యాధికారి, జిల్లా విద్యాధికారి పోస్టులు, డైట్‌లలో ఖాళీగా ఉన్న సీనియర్ లెక్చరర్ పోస్టులు పదోన్నతుల ప్రక్రియ ద్వారా భర్తీ చేసేందుకు చర్య తీసుకోవాలని కోరారు. పాఠశాల విద్యలో పర్యవేక్షణను పటిష్టం చేసేందుకు మూడు లేదా నాలుగు మండలాలకు ఒక విద్య డివిజన్‌గా ఏర్పాటు చేసి నూతనంగా ఉప విద్యాధికారి పోస్టులు మంజూరు చేయాలన్నారు. సమావేశంలో బాలాజీ నాయక్, లక్ష్మణ్ నాయక్, ఛత్రు నాయక్, వెంకన్న, ప్రసూన, శైలజ, సంధ్య రాణి, ఇందుప్రియ, రంగారావు పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, మంగళవారం,
29 జూలై 2025





చీరకట్టు.. అదిరేట్టు..

నగరంలో పేజ్ త్రీ ప్రముఖుల సందడి

లక్డీకాపూల్ : సంప్రదాయాన్ని ప్రతిబింబించే శైలిలో పేరొందిన ఓ ప్రముఖ వస్త్ర దుకాణం నగరంలో తన మూడో షోరూమ్‌ను కూకట్‌పల్లిలోని నెక్సస్ మాల్ సమీపంలో సోమవారం ప్రారంభించింది. దేశీయ హ్యాండ్లూమ్స్‌ను ప్రోత్సహించే బ్రాండ్‌గా పేరొందిన ఈ సంస్థలో నగర సోషలైట్స్, పేజ్ త్రీ ప్రముఖులు సంప్రదాయ చీరకట్టులో సందడిచేశారు. భారతీయ చేనేత వైభవాన్ని ప్రతిబింబించేందుకు తాము కృషి చేస్తున్నామని నిర్వాహకుల్లో ఒకరు తెలిపారు. తమ స్టోర్‌లో జార్జెట్, కలంకారి, కోరా, కోటా, టస్సర్, కాంచీవరం, బనారసీ, గద్వాల్, ఇక్కత్ వంటి వేలాది రకాల కలెక్షన్ అందుబాటులో ఉందని తెలిపారు.


క్యూట్.. క్యూట్ పప్పీస్..



ప్రయాణికుల బడలికను దూరం చేసేందుకు ఆర్‌జీఐఏ (రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్) అధికారులు వినూత్న ప్రయోగాన్ని చేస్తున్నారు. ప్రయాణ బడలికను, టెన్షన్‌ను దూరం చేసేందుకు శిక్షణనిచ్చిన కుక్కపిల్లలను అందుబాటులో ఉంచారు. విమానాశ్రయానికి వచ్చే వారికి క్యూట్ క్యూట్ పప్పీస్ స్వాగతం పలుకుతున్నాయి. విమానాశ్రయంలోని అన్ని టచ్‌పాయింట్లలో పర్యవేక్షకుడి సమక్షంలో వీటిని తిప్పుతున్నారు.. పప్పీస్ థెరపీ కొత్త అనుభూతిని అందిస్తుందని పలువురు ప్రయాణికులు చెబుతున్నారు. – శంషాబాద్

23, 24 తేదీల్లో ఎన్‌ఎండీసీ మారథాన్

సాక్షి, సిటీప్లస్: దేశంలోనే రెండో అతిపెద్ద మారథాన్‌కు నగరం వేదిక కానుంది. దీనికి సంబంధించిన టీషర్ట్, మెడల్‌ను ప్రముఖ బాక్సింగ్ క్రీడాకారిణి నిఖత్ జరీన్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ రీజనల్ హెడ్ శ్రీనివాస్, రేస్ డైరెక్టర్ రాజేష్ సోమవారం ఆవిష్కరించారు. ఎన్‌ఎండీసీ ఆధ్వర్యంలో నిర్వహించే హైదరాబాద్ మారథాన్ 2025 ఆగస్టు 23న ఉదయం 5 గంటలకు 5 కిలో మీటర్ల రన్ హైటెక్స్ నుంచి మొదలవుతుందని, 24న ఉదయం 4.30కు ఫుల్ మారథాన్, ఉదయం 5.30కు హాఫ్ మారథాన్ నెక్లెస్ రోడ్డులోని పీపుల్స్ ప్లాజా నుంచి, 7 గంటలకు హైటెక్స్ నుంచి 10కిలో మీటర్ల రన్ ప్రారంభమవుతుందని ఎన్‌ఎండీసీ ఈడీ సంజీవ్ సాహి పేర్కొన్నారు. 14వ ఎడిషన్ విజేతలకు రూ.45 లక్షల ప్రైజ్‌మనీ ఉంటుందన్నారు. పలు సంక్షేమ కార్యక్రమాలకు నిధుల సేకరణలో భాగంగా దీనిని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మొత్తం 29 ఎన్జీఓలు ఇందులో భాగస్వామ్యమవుతున్నాయని వివరించారు.



ప్రస్తుత కాలంలో ప్రతిదీ ఓ ట్రెండే.. అది ఫ్యాషన్ అయినా.. లైఫ్ స్టైల్ అయినా.. పేర్లు, ఇష్టాలు, అభిప్రాయాలు, ఆసక్తులు ఇలా చెప్పకుంటూ పోతే మరెన్నో.. వాడే వస్తువులు, ధరించే దుస్తుల ద్వారా తమ భావాన్ని వ్యక్తికరించాలనే తపనలో ప్రస్తుత తరం యువత ఆలోచిస్తోంది. ఒక్క మాటలో చెప్పాలంటే ఆ మధ్య కాలంలో విడుదలైన పుష్ప సినిమాలోని డైలాగ్ గుర్తుందా..! 'పుష్ప అంటే పేరుకాదు పుష్ప అంటే బ్రాండ్' అన్నట్లు బ్రాండ్ ఇమేజ్ కోసం తాపత్రయ పడుతోంది నేటి యువత. అయితే ఇందులోనూ ఎవరి ట్రెండ్ వారిదే.. ఎవరి బ్రాండ్ వారిదే..

- సాక్షి, సిటీబ్యూరో







సెల్ఫ్ బ్రాండ్.. అదే ట్రెండ్..

పేరులో ఐడెంటిటీ.. నేటి స్టైల్లో మేటి..

ప్రస్తుతం ఫ్యాషన్ అంటే కేవలం అందాన్ని పెంచేదో, ఆధునికతను చూపించేదో మాత్రమే కాదు. తమ తమ వ్యక్తిత్వాన్ని వ్యక్తపరిచే సాధనంగా కూడా మారిపోయింది. ఒక్క ముక్కలో చెప్పాలంటే 'తమ గురించి తాము చెప్పుకునే' ఫ్యాషన్ ట్రెండ్. ఇప్పుడు నగరంలో ఈ తరహా ట్రెండ్ ఊపందుకొంది. వ్యక్తిగత అభిరుచిని బట్టి అలాంటి సెల్ఫ్–ఎక్స్‌ప్రెషన్ స్టైల్స్ విభిన్న రకాలుగా ఉంటున్నాయి. ఆధునిక ఫ్యాషన్ ప్రపంచంలో వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించే స్టైల్స్ ప్రాధాన్యత పెరుగుతోంది. ఇందుకు నిదర్శనంగా పలు బ్రాండ్లు సైతం వినూత్న ఫ్యాషన్లను ఆవిష్కరిస్తున్నాయి.



- కస్టమైజ్డ్ బ్రాండ్‌కు పెరుగుతున్న ప్రాధాన్యం
- పేర్లు, ఇష్టాలు, అభిప్రాయాలు, ఆసక్తులు మరెన్నో
- వాడే వస్తువులు, ధరించే దుస్తుల ద్వారా వెల్లడి
- వస్త్రధారణ, యాక్సెసరీస్ ద్వారా వ్యక్తిత్వ ప్రదర్శన
- కాలి వేళ్ల నుంచి కేశాల వరకూ ప్రస్ఫుటిస్తున్న వైనం
- ఆహార్యం అంటే అభివ్యక్తీకరణ అంటున్న యూత్



కఫ్ లింక్స్ స్టైల్ పేర్లు..

ఇటీవల తమ పేరు లేదా వ్యక్తిగత గుర్తింపుతో కూడిన కఫ్ లింక్స్ ఫ్యాషన్ ప్రియుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. విభిన్న అలంకరణలతో, చేతి చివర్లలో ధరించే ఈ కఫ్ లింక్స్‌లో పేరు, ఇంకేమైనా ప్రత్యేకమైన డిజైన్లు చెక్కించుకుంటున్నారు. ఒకప్పుడు కార్పొరేట్ ఫార్మల్ వేర్‌లో భాగంగా మాత్రమే వినియోగించే హ్యాండ్‌మేడ్ – కస్టమ్ – డిజైన్ బంగారం, వెండి లాంటి మెటల్స్‌తో తయారవుతున్నాయి. పేర్లు, లక్షణాల ప్రాతిపదికన డిజైన్‌లో మార్పులు చేర్పులు చేస్తున్నారు. అలాగే వీటిని బహుమతులుగానూ వినియోగిస్తున్నారు. ఈ ట్రెండ్ ముఖ్యంగా యువతలో, పెళ్లిళ్ల లేదా ఫ్యామిలీ ఫంక్షన్లలో తమ పేరు లేదా ఇనీషియల్స్‌తో ప్రత్యేకత చూపించాలనుకునే వారి వల్ల బాగా పాపులర్ అవుతోంది. ఫ్యాషన్ రంగ నిపుణులు కూడా ఈ ట్రెండ్‌ను 'పర్సనలైజ్డ్ ఎలిగెన్స్'గా అభివర్ణిస్తున్నారు. ఇలాంటి కొత్త ప్రయోగాలు, సంప్రదాయ ఆధునికతల కలయికగా మన నగరంలో మారుతున్నాయని చెబుతున్నారు. కేవలం కఫ్‌లింక్స్ మాత్రమే కాదు, వ్యక్తిగత గుర్తింపును ఫ్యాషన్‌లో కలిపే ట్రెండ్స్ ప్రస్తుతం ప్రాచుర్యంలో ఉన్నాయి.

- సొంత/ఇంటి పేరుతో లేదా మొదటి అక్షరంతో డిజైన్ చేసిన గొలుసులు. నేమ్ నెక్లెస్ / ఇనీషియల్ పెండెంట్స్, రింగ్స్ వంటివి సిల్వర్, గోల్డ్, రోజ్ గోల్డ్ లాంటి మెటల్స్‌లో లభ్యం అవుతున్నాయి. ఇది ముఖ్యంగా యువతలో, ప్రేమ జంటల్లో ట్రెండింగ్ అవుతున్నాయి.
- సొంత పేర్లను కాకపోయినా, తమ భావోద్వేగాలు ప్రతిబింబించే పదాలు, సంకేతాలు టాటూలుగా వేయించుకోవడం కూడా సెల్ఫ్–ఎక్స్‌ప్రెషన్‌లో భాగమే.
- జాకెట్లు/శాలువాలు : షర్ట్, జాకెట్స్(బ్లేజర్స్)పై పేరు లేదా చిన్న మెసేజ్‌ను ఎంబ్రాయిడరీతో బ్రాండెడ్ లోగో తరహాలో తీర్చిదిద్దుతున్నారు. ఇది డ్రెస్‌కి ఓ వ్యక్తిగత టచ్ ఇచ్చేలా చేస్తుంది.
- కస్టమ్ మేడ్ టి–షర్ట్స్, ప్రింట్ చేసిన పేరు, ఫేవరెట్ కోట్, బర్త్‌డేట్ లేదా క్యారెక్టర్ డ్రాయింగ్‌తో కూడిన డిజైన్లు, గ్రూప్ ఈవెంట్స్, బర్త్‌డేలు, ట్రావెల్ వంటి సందర్భాల్లో ఎక్కువగా ఉపయోగిస్తున్నారు.
- పేర్లు, ఇనీషియల్స్‌తో కూడిన స్నీకర్స్, లేదా ఫేవరెట్ డిజైన్‌తో ఉండే పాదరక్షలు, షూ డిజైన్లుగా మారుతున్నాయి. ఈ ట్రెండ్ దృష్టిలో ఉంచుకుని ప్రస్తుతం 'నైక్' వంటి బ్రాండ్లు కూడా కస్టమైజేషన్‌కు అవకాశం ఇస్తున్నాయి.
- ఇండియన్ వెడ్డింగ్ డ్రెస్‌లపై పేర్లు కాడలుగా అల్లడం పెళ్లి కూతురు లేదా వరుడు దుస్తుల్లో తన పేరు లేదా జంట పేరు అల్లించుకోవడం ట్రెండ్‌గా మారుతోంది.
- అలాగే బ్యాగ్స్, వాలెట్స్, ట్రావెల్ పౌచ్‌లు తదితర పర్సనల్ ఐటమ్స్‌పై మోనోగ్రామ్‌లు, నేమ్ ఇనీషియల్స్‌తో ఉన్న హ్యాండ్‌బ్యాగ్స్ కూడా విరివిగా వాడుతున్నారు. ఇవి లగ్జరీ బ్రాండ్స్ (లూయిస్ విటన్, గూచి) నుంచి చిన్న ఆర్టిసన్ స్టోర్ల వరకూ అందుబాటులో ఉన్నాయి.

బాక్సింగ్ అకాడమీ నా లక్ష్యం

వైద్యం, టెక్ రంగాల్లో మెరుపు వేగంతో దూసుకుపోతున్న హైదరాబాద్‌లో క్రీడలకూ మంచిరోజులు రానున్నాయి. ఇప్పటికే పలువురు క్రీడాకారులు తమ అకాడమీలను హైదరాబాద్, పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. తాజాగా మరో బాక్సింగ్ అకాడమీ ఏర్పాటుకు కార్యాచరణ సిద్ధమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తే ప్రపంచ స్థాయి బాక్సింగ్ అకాడమీని ఏర్పాటు చేయాలనే ఆలోచన చేస్తున్నానని ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్ నిఖత్ జరీన్ పేర్కొన్నారు. అవకాశం వచ్చినప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలసి తన ప్రతిపాదనను వివరిస్తానని, దీనికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆమె తెలిపారు. నగరంలో సోమవారం జరిగిన ఓ కార్యక్రమం అనంతరం 'సాక్షి'తో ముచ్చటించారామె. - సాక్షి, సిటీబ్యూరో



- ప్రస్తుతం ప్రపంచ ఛాంపియన్‌షిప్‌పై దృష్టి
- ప్రభుత్వం సహకరిస్తే ప్రాజెక్టుతో ముందుకెళ్తా
- సాక్షితో బాక్సింగ్ ఛాంపియన్ నిఖత్ జరీన్



జీవితంలో విద్యార్హతతో పాటు క్రీడలూ కీలకంగా మారుతున్నాయి. ఎంతో మంది క్రీడాకారులు ఇంటర్, పదోతరగతి విద్యార్హత ఉండటంతో చిన్నచిన్న ఉద్యోగాలకే పరిమితమవుతున్నారని, క్రీడాకారుల కోటాలో ప్రభుత్వం మంచి ఉద్యోగావకాశాలు కల్పిస్తుస్తోందని, క్రీడల్లో రాణించడం ఎంత ముఖ్యమో.. కనీసం డిగ్రీ పూర్తి చేయడం కూడా అంతే అవసరం.. అప్పుడే మెరుగైన జీవితం లభిస్తుందని నిఖత్ జరీన్ అన్నారు..

కెరీర్‌గా మార్చుకోవాలి..

'బాక్సింగ్ రంగాన్ని కెరీర్‌గా మార్చుకోవాలనే యువతకు హైదరాబాద్, తెలంగాణలో సరైన అకాడమీ అందుబాటులో లేదు. నేను బాక్సింగ్ నేర్చుకునే రోజుల్లో నిజామాబాద్, హైదరాబాద్, తెలంగాణ ప్రాంతాల్లో సరైన వసతులు లేకపోవడంతో విశాఖపట్నం, ఇతర ప్రాంతాలకు శిక్షణ కోసం వెళ్లాల్సి వస్తోంది. క్రీడల పట్ల ఆసక్తి ఉన్న యువతను ప్రోత్సహించాలి. మెరుగైన శిక్షణ అందించాలి. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో కూడిన బాక్సింగ్ అకాడమీ ఏర్పాటు చేయాలనే ఆలోచన ఉంది. దీనికి ప్రభుత్వం నుంచి సహకారం కావాలని ముఖ్యమంత్రిని కోరతాను. దాదాపు 10 ఎకరాలు అవసరం ఉంటుంది. స్థానికంగా ఎంత భూమి అందుబాటులో ఉంది అనే విషయాన్ని పరిగణలోకి తీసుకోవాలి. నా ఆలోచన ప్రకారం బాక్సింగ్ అకాడమీలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన బాక్సింగ్ హాల్, శిక్షణ కోసం వచ్చిన వారు ఉండటానికి సరైన హాస్టల్, జిమ్, స్విమ్మింగ్ పూల్, ట్రాక్, హై పెర్ఫామెన్స్ సెంటర్ అందుబాటులోకి తీసుకురావాల్సి ఉంటుంది. సానుకూలంగా స్పందిస్తే ముందుకెళతా. ప్రస్తుతానికి ప్రపంచ ఛాంపియన్‌షిప్ పైనే నా దృష్టి. మెడల్ తీసుకున్న తర్వాతే ముఖ్యమంత్రిని కలుస్తా' అని నిఖత్ చెప్పుకొచ్చారు.



డీజే బీట్స్.. రోడియో నైట్స్..

నగరంలో కొత్త తరహా సంస్కృతికి బీజం

- సోమాజిగూడలోని ఆక్వా పార్కు వేదికగా
- ఆకర్షిస్తున్న అమెరికన్ స్పిరిట్, అడ్వెంచర్ థీమ్స్

యువతను ఆకర్షించే రీతిలో హైదరాబాద్ నగరంలో మరోసారి సరికొత్త సంస్కృతికి బీజం పడింది. ప్రతిష్టాత్మక 'రాయల్ ఛాలెంజ్ అమెరికన్ ప్రైడ్ రోడియో నైట్స్'కు నగరం వేదికైంది. అమెరికా తరహా కల్చర్‌లో భాగమైన కాక్టెయిల్స్, దేశీ డీజే బీట్స్ మేళవింపుతో ఈ నైట్‌ను బోల్డ్ లైఫ్‌స్టైల్ ఎక్స్‌ప్రెషన్‌గా సోమాజిగూడలోని ఆక్వా పార్కులో సోమవారం వినూత్నంగా నిర్వహించారు. నగరంలో మొదలైన ఈ ఉత్సవం.. త్వరలోనే ఇతర నగరాలకూ విస్తరించనుంది. లైఫ్‌స్టైల్ వేదికగా అమెరికన్ స్పిరిట్, ఫ్రీడమ్, అడ్వెంచర్ థీమ్‌లతో బ్రాండ్ అనుభవాన్ని మరింత బలంగా ట్యాప్ చేయనుంది. - సాక్షి, సిటీ బ్యూరో



ఈ ఈవెంట్ ప్రధానంగా అమెరికానా వైల్డ్ వెస్ట్ థీమ్ ఆధారంగా డిజైన్ చేశారు. డెనిమ్ స్టైల్‌తో అలంకరించిన డిజైన్, ఇంటరాక్టివ్ గేమ్స్, ఏ ఆర్ ఫొటో మూమెంట్స్ వంటి అనేక అనుభూతులను కలిపి లైఫ్‌స్టైల్ స్టేట్‌మెంట్‌గా రూపొందించారు. ఇందులో భాగంగా లాసో ఛాలెంజ్‌లు, హ్యామర్ స్లామ్‌లు, హ్యాండ్ పెయింటెడ్ డీఐవై జోన్ వంటి క్రియేటివ్ స్పేస్‌తో యువతను కొత్తరకంగా భాగస్వాములను చేసింది. ఈ వేదికపై ప్రత్యేకంగా క్యూరేటెడ్ అమెరికన్ బైట్స్, సిగ్నేచర్ కాక్టెయిల్స్, ఎనర్జీ ఫుల్ డీజే బీట్ అహూతులను ఉత్సాహపరిచాయి.



ఆధునిక జీవనశైలి..

'ఇది సంగీతం, స్వేచ్ఛ, సంస్కృతిని కలిపిన ఆధునిక జీవన శైలికి ప్రతిబింబం' అని డియాజియో ఇండియా వైస్ ప్రెసిడెంట్ వరుణ్ కూరిచ్ అన్నారు. యువత ఆత్మవిశ్వాసం, ఐడెంటిటీని ప్రతిబింబించే ఈవెంట్లను కోరుతోంది. ఈ రోడియో నైట్స్ అలాంటి అవకాశాన్ని అందించిన తొలి వేదికని తెలిపారు.

క్లుప్తంగా...

ఆగస్టు 11న మహాధర్నా

తెలంగాణ ప్రభుత్వ పెన్షన్‌దారుల సంఘాల సమన్వయ కమిటీ

సాక్షి, హైదరాబాద్: ఎన్నికలకు ముందు పెన్షనర్లకు ఎన్నో ఆశలు కల్పించిన కాంగ్రెస్.. గద్దెనెక్కిన తర్వాత వారిని పూర్తిగా విస్మరించిందని తెలంగాణ ప్రభుత్వ పెన్షన్‌దారుల సంఘాల సమన్వయ కమిటీ ఆరోపించింది. కమిటీ చైర్ పర్సన్ ఉమాదేవి, చైర్మన్ లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి సోమవారం తెలంగాణ సచివాలయ మీడియా పాయింట్ బయట విలేకరులతో మాట్లాడారు. వచ్చే నెల 10లోపు సమస్యలు పరిష్కరించకపోతే ఆగస్టు 11న 'చలో హైదరాబాద్'పేరుతో ధర్నాచౌక్ వద్ద మహాధర్నా నిర్వహిస్తామన్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యోగులకు ఇచ్చినట్లు.. పెన్షనర్లకు కూడా ఇన్సెంటివ్ ప్రకటించాలన్నారు. ఈహెచ్ఎస్ కల్పించాలని, ఏప్రిల్ 2024 తర్వాత ఉద్యోగ విరమణ చేసిన వారికి వెంటనే పెన్షనరీ బెనిఫిట్, జీపీఎఫ్, ట్రెజరీ ద్వారా పెన్షన్ చెల్లించాలని డిమాండ్ చేశారు.

గ్రామపంచాయతీలకు ఉపాధిహామీ నిధులివ్వాలి

రాష్ట్ర సర్పంచుల సంఘం జేఏసీ విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: కేంద్రం నుంచి విడుదలైన జాతీయ ఉపాధి హామీ నిధులను గ్రామపంచాయతీలకు కేటాయించాలని రాష్ట్ర ఉపాధి హామీ జాయింట్ కమిషనర్ ఎం.శేషకుమార్‌కు రాష్ట్ర సర్పంచుల సంఘం జేఏసీ విజ్ఞప్తి చేసింది. వచ్చే రెండు, మూడురోజుల్లోనే ఈ నిధులను పంచాయతీలకు జమచేసేలా చూడాలని కోరింది. ఈ మేరకు సోమవారం పీఆర్ ఆర్డీ కమిషనరేట్ కార్యాలయంలో జేఏసీ అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ ఫండ్ నిధులు నెలకిందటే రూ.1,200 కోట్లు విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం వీటిని జీపీలకు మంజూరు చేయకపోవడం సరికాదని యాదయ్యగౌడ్ అన్నారు. సర్పంచ్‌ల పదవీకాలం ముగిసి 19 నెలలు గడుస్తున్నా తమ పెండింగ్ బిల్లులు చెల్లించకుండా వివక్ష చూపుతున్నారని వాపోయారు. స్థానిక ఎన్నికల నిర్వహణకు ముందే ఈ బిల్లులు చెల్లించాలని విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో సహకార్యదర్శి రాజేందర్, శ్రీనివాస్‌గౌడ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

సాంస్కృతిక ఉద్యమంతో బీసీ రాజ్యాధికారం: జాజుల


పంజగుట్ట (హైదరాబాద్): పాట ఎంతో శక్తివంతమైన ఆయుధమని, పాటలతోనే తెలంగాణ సాధించాం, అదే పాటలతో, సాంస్కృతిక ఉద్యమంతో బీసీ రాజ్యాధికారాన్ని సాధిద్దామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బీసీ కళాకారుల ఆత్మీయ సమ్మేళనం, బీసీ కల్చరల్ ఫోరం నూతన కమిటీ ఎన్నిక కార్యక్రమం నిర్వహించారు. దరువు అంజన్న అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. సాంస్కృతిక వేదిక ద్వారా బీసీలకు ఉన్న బలం, బలగం ప్రపంచానికి చూపిద్దామని పిలుపునిచ్చారు. త్వరలోనే 10 వేల మందితో బీసీ కల్చరల్ ఫోరం ఆవిర్భావ సభను జరుపుకుందామని, తరువాత ఎస్సీ, ఎస్టీ, బీసీ కళాకారుల వేదిక ప్రారంభిద్దామని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరావత్ అనిల్ మాట్లా డుతూ .. బీసీలు రాజ్యాధికారం సాధించాలంటే కళాకారుల ఆట, పాటతో భావవ్యాప్తి జరగాలన్నారు.

సెప్టెంబర్ 30 వరకు జీపీలలో కేంద్ర పథకాలపై అవగాహన

సాక్షి, హైదరాబాద్: వచ్చే సెప్టెంబర్ 30వ తేదీ వరకు తెలంగాణలోని 12,708 గ్రామపంచాయతీలలో.. కేంద్ర ప్రభుత్వపరంగా అమలవుతున్న వివిధ సంక్షేమ, పౌరుల బీమా పథకాల గురించి క్యాంప్‌లు నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్‌ఎల్‌బీసీ) చైర్మన్, ఎస్‌బీఐ హైదరాబాద్ సర్కిల్ సీజీఎం సహదేవ రాధాకృష్ణన్ వెల్లడించారు. రాష్ట్రంలో జూలై 1 నుంచి 'ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్ అండర్ సోషల్ సెక్యూరిటీ స్కీమ్స్'పై పంచాయతీ స్థాయి అవగాహన కార్యక్రమాలను ప్రారంభించగా 4,400 జీపీలలో ఈ శిబిరాలను పూర్తి చేసినట్టు తెలిపారు. సోమవారం ఎస్‌బీఐ ప్రధాన కార్యాలయంలో పీఐబీ అదనపు డైరెక్టర్ జనరల్ శ్రుతి పాటిల్, ఎస్‌ఎల్‌బీసీ పరిధిలోని వివిధ బ్యాంక్‌ల సీజీఎంలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. మూడునెలల పాటు చేపడుతున్న ఈ ప్రత్యేక క్యాంపెయిన్‌లో భాగంగా...గ్రామస్థాయి వరకు బ్యాంకింగ్, బీమా, పింఛన్లు వంటి ఫైనాన్షియల్ సర్వీసెస్ గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తామని చెప్పారు. ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన కింద ఇనాక్టివ్‌గా ఉన్న బ్యాంక్ ఖాతాలకు రీ–నో యువర్ కస్టమర్, ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజన కింద దరఖాస్తుదారుల నమోదు, అటల్ పెన్షన్ యోజన వంటి వాటిపై జాగృతం చేస్తున్నామన్నారు.

ఢిల్లీ ధర్నాతో బీసీల జీవితాల్లో మలుపు

సాక్షి, హైదరాబాద్: బీసీ రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 6న ఢిల్లీలో సీఎం, మంత్రులు చేయనున్న ధర్నా.. రాష్ట్ర బీసీ ప్రజల జీవితాలను మలుపు తిప్పుతుందని బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం చైర్మన్ టి.చిరంజీవులు ఆశాభావం వ్యక్తం చేశారు. కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. బిల్లును ఆమోదించే వరకు రాష్ట్రపతి, ప్రధానమంత్రి, కేంద్ర మంత్రుల ఘెరావ్‌ను కొనసాగించాలని కోరారు.



శ్రీశైలం ఆనకట్ట వద్ద నాలుగు గేట్ల ద్వారా దిగువకు పారుతున్న వరద నీరు

సోమవారం సాయంత్రం 6 గంటలకు కృష్ణా ప్రధాన ప్రాజెక్టుల్లోకి వరద ప్రవాహాలు ఇలా..

ప్రాజెక్టు పేరు	గరిష్ఠ మట్టం (అడుగుల్లో)	గరిష్ఠ నిల్వ (టీఎంసీల్లో)	ప్రస్తుత మట్టం (అడుగుల్లో)	ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో)	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)
ఆల్మట్టి	1,705	129.72	1699.72	101.47	60,160	80565
నారాయణపూర్	1,612	37.64	1611.97	33.52	1,20,000	1,18,000
ఉజ్జయిని	1,630	117.64	1629.59	115.70	44,808	53,793
జూరాల	1,045	9.66	1042.45	8.11	1,34,000	1,51,00
తుంగభద్ర	1,626	105.79	1624.63	75	76,733	1,03,219
శ్రీశైలం	885	215.81	882.6	202.51	1,98,920	1,83,233
నాగార్జునసాగర్	590	312.05	584.41	295.7	1,47,,195	38,762
పులిచింతల	175	45.77	161.05	26.8	26,555	5000

నేడు తెరుచుకోనున్న సాగర్ గేట్లు

ఉదయం 10 గంటలకు నీటిని విడుదల చేయనున్న మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి, అడ్లూరి లక్ష్మణ్

సాక్షి, హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల ఉమ్మడి జలాశయాలైన శ్రీశైలం, నాగార్జునసాగర్‌లు నిండు కుండల్లా తొణికిసలాడుతున్నాయి. ఎగువ పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. సోమవారం శ్రీశైలం జలాశయానికి మొత్తం 2,31,612 క్యూసెక్కుల వరద వస్తుండగా రాత్రి 10 గంటలకు ఐదు గేట్లను ఒక్కోటి 10 అడుగుల మేర పైకెత్తి మొత్తం 2,01,229 క్యూసెక్కుల నీటిని దిగువనున్న నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 882.8 అడుగుల వద్ద 203.4290 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మరోవైపు సాగర్ జలాశయ గరిష్ఠ నీటిమట్టం 590 అడుగులుకాగా ప్రస్తుత నీటిమట్టం 584.41 అడుగులకు చేరుకుంది. అలాగే గరిష్ఠ నిల్వ సామర్థ్యం 312.05 టీఎంసీలుకాగా ప్రస్తుత నిల్వ 295.7 టీఎంసీలకు చేరింది. దీంతో మంగళవారం ఉదయం 10 గంటలకు మంత్రులు ఎస్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ నాగార్జునసాగర్ గేట్లను పైఎత్తి వరద నీటిని విడుదల చేయనున్నారు. ప్రస్తుతం సాగర్‌లో విద్యుదుత్పత్తి ద్వారా 28,785 క్యూసెక్కులను తెలంగాణ దిగువకు విడుదల చేస్తుండగా.. కుడి ప్రధాన కాల్వ ద్వారా 5,394 క్యూసెక్కులను ఏపీ తీసుకుంటోంది. ఎడమ ప్రధాన కాల్వ ద్వారా రెండు రాష్ట్రాల అవసరాలకు మరో 6,634 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.

అధికారులకు తెలిసే 'సంతాన' దందా!

వైద్యాధికారులకు తెలియకుండా జరిగే అవకాశం లేదు

- ప్రభుత్వానికి అందిన ప్రాథమిక నివేదికలో స్పష్టీకరణ
- వైద్యాధికారులతో ఆరోగ్యశాఖ కమిషనర్ సమావేశం
- ప్రైవేటు సరోగసీ కేంద్రాల్లో తనిఖీలు చేయాలని ఆదేశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వైద్యాధికారుల సహకారంతోనే సంతాన సాఫల్య కేంద్రాల పేరుతో అక్రమ దందా సాగుతోందని ప్రభుత్వం ప్రాథమికంగా తేల్చింది. జిల్లాల్లో వివిధ హోదాల్లో పనిచేస్తున్న వైద్యాధికారులకు తెలియకుండా సంతాన సాఫల్య కేంద్రాలు, సరోగసి సెంటర్లు సంవత్సరాలుగా కొనసాగే పరిస్థితి లేదని ఉన్నతస్థాయి అధికారులు ప్రభుత్వానికి నివేదిక అందించినట్లు సమాచారం. మరోవైపు వైద్యాధికారులను వెనకేసుకొచ్చేందుకు కూడా ప్రయత్నాలు సాగుతున్నట్లు తెలిసింది. సికింద్రాబాద్‌లోని సృష్టి సంతాన సాఫల్య కేంద్రం మోసంపై జరిపిన దర్యాప్తులో అనేక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఐదేళ్లుగా అక్రమంగా సాగుతున్న ఈ కేంద్రంలో నాలుగుసార్లు తనిఖీకి వెళ్లి అది మూసేసి ఉన్నట్లు ఇచ్చిన నివేదిక కూడా వైద్యాధికారుల లోపాయికారి ఒప్పందాన్ని బహిర్గతం చేస్తోంది. హైదరాబాద్ డీఎంఅండ్‌హెచ్ కార్యాలయానికి తెలియకుండా ఈ దందా సాగలేదని స్పష్టమైన ఆధారాలు ప్రభుత్వానికి లభించినట్లు సమాచారం.

80 శాతం అక్రమ విధానాల్లోనే...

రాష్ట్రవ్యాప్తంగా 379 ప్రైవేటు ఫెర్టిలిటీ, సరోగసీ సెంటర్లు ఉండగా, అందులో 292 కేంద్రాల్లో అక్రమ దందా యథేచ్ఛగా జరుగుతున్నట్లు గుర్తించారు. హైదరాబాద్ జిల్లాలో 126 కేంద్రాలు, మేడ్చల్‌లో 40, రంగారెడ్డిలో 47, వరంగల్‌లో 27, కరీంనగర్‌లో 13, ఖమ్మంలో 8, నిజామాబాద్‌లో 8 కేంద్రాలు చొప్పున ఉన్నాయి. మిగిలిన జిల్లాల్లో సగటున రెండు చొప్పున ఐవీఎఫ్, సరోగసీ కేంద్రాలు ఉన్నాయి. ఈ కేంద్రాలు లేని చోట నర్సింగ్‌హోంలతో ఒప్పందాలు కుదుర్చుకున్నారు. 18 జిల్లాల్లో ఈ 'సంతాన'దందా సాగుతోందని ప్రభుత్వానికి నివేదిక అందినట్లు సమాచారం. సోమవారం ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ సంగీత సత్యనారాయణ నేతృత్వంలో అధికారులు అత్యవసర సమీక్ష సమావేశం నిర్వహించి సరోగసీ, ఐవీఎఫ్ ఇతర కేంద్రాల విషయంలో కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించారు. పేద మహిళలను సరోగసీ కోసం తీసుకొచ్చి అద్దె గర్భంతో ఎలా మోసాలు చేస్తున్నారనే అంశంపై చర్చించారు. వైద్యాధికారుల నిర్లక్ష్యంపై కమిషనర్ ఆరా తీశారు. ఇకపై గ్రేటర్ రాష్ట్రమంతా ఐవీఎఫ్, సరోగసీ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు చేయాలని ఆదేశించారు.

అక్రమ సరోగసీపై నివేదిక కోరిన హెచ్‌ఆర్‌సీ

సిటీ కోర్టులు: అక్రమ సరోగసీ, శిశువుల అమ్మకం చాలా ఆందోళనకరంగా ఉందని రాష్ట్ర మానవహక్కుల కమిషన్ ఆవేదన వ్యక్తం చేసింది. సికింద్రాబాద్‌లోని యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్‌లో చట్టవిరుద్ధమైన సరోగసీ వ్యవహారంపై సోమవారం కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్, సభ్యులు శివాది ప్రవీణ, బి.కిశోర్‌తో కూడిన బెంచ్ సుమోటోగా కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టింది. అక్రమ సరోగసీ, శిశువుల అమ్మకాలపై పూర్తి నివేదిక అందజేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శిని ఆదేశించింది. నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించింది. తదుపరి విచారణను ఆగస్టు 28కి వాయిదా వేసింది.

పీవీటీజీలకు ఇళ్ల మంజూరులో ఇవేం పరిమితులు?

- గిరిజన సలహా మండలి తీవ్ర అసంతృప్తి
- డిమాండ్‌కు తగ్గట్లుగా గృహనిర్మాణ శాఖ ఇళ్లు ఇవ్వాలని స్పష్టీకరణ
- అభివృద్ధి నిధుల బిల్లులు సకాలంలో చెల్లిస్తాం: మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



మాట్లాడుతున్న అడ్లూరి. చిత్రంలో సీతక్క

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ఎస్టీల్లోకెల్లా బలహీన తెగల సమూహాల (పీవీటీజీ)కు గృహనిర్మాణ శాఖ అతితక్కువగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడంపై గిరిజన సలహా మండలి (టీఏసీ) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. డిమాండ్‌కు తగినన్ని ఇళ్లు ఇవ్వాల్సి ఉండగా అత్యంత పరిమితంగా ఇళ్లను మంజూరు చేయడంతో క్షేత్రస్థాయిలో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోందని మండిపడింది. గిరిజనులకు సంతృప్తికర స్థాయిలో ఇళ్లు ఇవ్వాల్సిందేనని స్పష్టం చేసింది. ఒక్కో ఎమ్మెల్యేకు కేవలం 500 ఇళ్లు మంజూరు చేయడం వల్ల క్షేత్రస్థాయిలో ఇబ్బందులు ఎదురవుతున్నందున డిమాండ్‌కు తగినన్ని ఇళ్లు మంజూరు చేయాలని కోరింది. ఐదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత సోమవారం దామోదరం సంజీవయ్య సంక్షేమ భవన్‌లో 7వ టీఏసీ సమావేశం జరిగింది. టీఏసీ చైర్మన్, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖల మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, డిప్యూటీ స్పీకర్ రాంచందర్ నాయక్, గిరిజన ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు పాల్గొన్నారు. ప్రస్తుత ఇళ్ల నిర్మాణ నిబంధనల వల్ల లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని, గిరిజనుల సొంతింటి కల సాకారం చేయాలంటే నిబంధనలు సడలించాలని సభ్యులంతా కోరగా ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు. గిరిజన ప్రాంతాల్లో కాంట్రాక్టర్లు చేసిన అభివృద్ధి పనులకు సంబంధించి మొదటి ప్రాధాన్యతగా బిల్లుల చెల్లింపులు చేస్తామని మంత్రి అడ్లూరి చెప్పారు. ఇకపై క్రమం తప్పకుండా టీఏసీ సమావేశాన్ని నిర్వహిస్తామన్నారు. ఏజెన్సీ ప్రాంతాలకు కేటాయించిన నిధులను మైదాన ప్రాంతాలకు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి సీతక్క అధికారులను హెచ్చరించారు.

గిరిజన సలహా మండలి భేటీలో తీర్మానాలు...

సామాజిక అటవీ హక్కులు, పోడు పట్టాల పంపిణీపై త్వరలో ప్రత్యేక సమావేశం; నాయకపోడ్ ప్రత్యేక గిరిజన తెగగా గుర్తింపు; ప్రత్యేక ఎస్టీ కమిషన్ ఏర్పాటు; ఏజెన్సీ ప్రాంతాల్లో స్థానిక గిరిజన సొసైటీలకు మరింత లబ్ధి చేకూరేలా ఇసుక మైనింగ్ విధానంలో మార్పులు; 18 జిల్లాల్లో నూతనంగా జిల్లా గిరిజన సంక్షేమాధికారి పోస్టుల ఏర్పాటు. మైదాన ప్రాంతాల్లో ఐటీడీఏల ఏర్పాటు; జూనియర్ కళాశాలలుగా ఆశ్రమ పాఠశాలల ఉన్నతీకరణకు వినతి; ఆశ్రమ పాఠశాలలో కొత్తగా 1,085 టీచర్ పోస్టుల మంజూరు; ఆదివాసీలు, పీవీటీజీల కోసం హైదరాబాద్‌లో ప్రత్యేక ఐఏఎస్ స్టడీ సర్కిల్; 5వ షెడ్యూల్‌లో 100% రిజర్వేషన్లు గిరిజనులకు దక్కేలా చర్యలు; అంబేడ్కర్ విదేశీ విద్యానిధి పథకం కోటా 100 నుంచి 500కు పెంపు; ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల్లో రాయ్ సెంటర్ల నిర్మాణం; గిరిజన దేవాలయాలకు ధూపదీప నైవేద్యం పథకం వర్తింపు; ఎస్టీలకు మరిన్ని ఇందిరమ్మ ఇళ్ల మంజూరు.

31న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక!



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులోని బరాజ్‌ల నిర్మాణంలో అవకతవకలపై విచారణ నిర్వహించిన సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పినాకి చంద్రఘోష్ నేతృత్వంలోని విచారణ కమిషన్ ఈనెల 31న రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నట్టు తెలిసింది. జస్టిస్ చంద్రఘోష్ హైదరాబాద్‌కు చేరుకుని సోమవారం తన కార్యాలయంలో నివేదిక సమర్పించేందుకు అవసరమైన ఏర్పాట్లను చేపట్టారు. 31తో కమిషన్ గడువు ముగియనుండగా, అదే రోజు ఆయన నివేదికపై సంతకం చేసి ప్రభుత్వానికి అందజేయనున్నట్టు సమాచారం. నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జాను తన కార్యాలయానికి పిలిపించుకుని ఆయనకు సీల్డ్ కవర్‌లో నివేదికను అందించాలని కమిషన్ నిర్ణయించింది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బరాజ్ 2023, అక్టోబర్ 21న కుంగిపోగా, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లలో కూడా బుంగలు ఏర్పడి నీళ్లు సీపేజీ అయ్యాయి. బరాజ్‌ల నిర్మాణంలో సాంకేతిక లోపాలతో పాటు అవినీతి ఆరోపణలపై విచారణ కోసం 2024, మార్చి 14న జస్టిస్ పినాకి చంద్రఘోష్‌తో రాష్ట్ర ప్రభుత్వం విచారణ కమిషన్ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. 115 మంది సాక్షులను విచారించి కమిషన్ తుది నివేదికను సిద్ధం చేసింది. నివేదికలో తేల్చిన అంశాలను సవాలు చేస్తూ ఎవరైనా న్యాయస్థానాలకు వెళ్లినా న్యాయ పరీక్షలో నిలిచేలా నివేదికకు తుది రూపమిచ్చినట్టు తెలిసింది. ఇందుకోసం విచారణ కమిషన్లపై గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను కమిషన్ అధ్యయనం చేసినట్టు సమాచారం.

భూదాన్ భూముల లెక్క తేల్చాల్సిందే

హైకోర్టు స్పష్టీకరణ ● దానమిచ్చిన భూములు అనర్హుల చేతుల్లోకి వెళ్లడం స్ఫూర్తిని మంటగలపడమేనన్న జస్టిస్ లక్ష్మణ్

- 'నాగారం భూముల'పై పూర్తి వివరాలు తమ ముందుంచాలని భూదాన్ బోర్డుకు ఆదేశం
- వివాదాస్పద భూములపై విచారణ కమిషన్ వేసే ఉద్దేశం లేదన్న రాష్ట్ర ప్రభుత్వం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా భూదాన్ భూముల లెక్క తేల్చాల్సిందేనని హైకోర్టు స్పష్టం చేసింది. దాతలు సదుద్దేశంతో వేలాది ఎకరాలు ఇస్తే వారి స్ఫూర్తి మంటగలిసేలా ప్రస్తుత భూముల పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేసింది. భూముల లెక్క తేలితేగానీ ఏ సర్వే నంబర్‌లో ఎంత భూమి ఉందనేది స్పష్టత రాదని అభిప్రాయపడింది. పూర్తి గణాంకాలతో రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారం సర్వే నంబర్ 181, 182, 194, 195లోని భూమి వివరాలను తమ ముందుంచాలని భూదాన్ యజ్ఞ బోర్డు కౌన్సిల్‌ను ఆదేశించింది. ఇందుకు సంబంధించి అందరి వాదనలు వింటామన్న న్యాయమూర్తి.. తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేశారు.

థర్డ్ పార్టీ చేతుల్లోకి భూమి

నాగారం సర్వే నంబర్ 181, 194, 195లో భారీ భూ కబ్జాలపై ఫిబ్రవరి 16న, మార్చి 8న సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదంటూ అంబర్‌పేటకు చెందిన బిర్లా మహేశ్, సర్వే నంబర్ 194, 195లోని భూమిని పలువురు ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు అక్రమంగా పట్టా చేసుకోవడం, రికార్డులు తారుమారు చేయడంపై విచారణ కమిషన్ వేసేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ పడమటి తండాకు చెందిన రాములు పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై జస్టిస్ కె.లక్ష్మణ్ సోమవారం విచారణ చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా 1.4 లక్షల ఎకరాల భూమి దానం చేశారని, అందులో దాదాపు 40 వేల ఎకరాలు ప్రభుత్వం పేదలకు దానం చేసిందని భూదాన్ బోర్డు తరఫున హాజరైన (వర్చువల్‌గా) న్యాయవాది కిరణ్‌కుమార్ తెలిపారు. 40 వేల ఎకరాల్లో చాలా వరకు భూమి థర్డ్ పార్టీ చేతుల్లోకి వెళ్లిందని చెప్పారు. దీనిపై న్యాయమూర్తి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఎంతోమంది మంచి ఆలోచనతో దానం చేస్తే ఇలా అనర్హుల చేతుల్లోకి వెళ్లడం స్ఫూర్తిని మంటగలిపినట్లేనని వ్యాఖ్యానించారు. సర్వే నంబర్ 181లో 42.33 ఎకరాలుందని న్యాయవాది చెప్పగా..మంగళవారం పూర్తి వివరాలతో స్వయంగా హాజరుకావాలని న్యాయమూర్తి ఆదేశించారు. మరోవైపు నాగారంలోని వివాదాస్పద భూములపై విచారణ కమిషన్ వేసే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని అదనపు అడ్వొకేట్ జనరల్ తేరా రజనీకాంత్‌రెడ్డి కోర్టుకు తెలిపారు.

మీరెలా పిటిషన్ దాఖలు చేస్తారు?

భూమి మరొకరి (పిటిషనర్ తల్లి) పేరిట ఉంటే మీరు పిటిషన్ ఎలా దాఖలు చేస్తారని బిర్లా మహేశ్ తరఫు న్యాయవాది అశ్విన్‌ను న్యాయమూర్తి ప్రశ్నించారు. 1.3 ఎకరాల భూమి మీదనడానికి ఆధారాలెక్కడ అని అడిగారు. రెండు సర్వే నంబర్లలో 30 గుంటల చొప్పున భూమి ఉందని న్యాయవాది చెప్పగా, అలాంటప్పుడు 1.20 ఎకరాలే అవుతుందని న్యాయమూర్తి అన్నారు. ఈ అంశంపై ప్రధాని, హోంమంత్రి, గవర్నర్‌కు ఎందుకు వినతిపత్రాలు పంపారని ప్రశ్నించారు. కాంపిటెంట్ అథారిటీ ఎవరు? మీకు న్యాయం ఎక్కడ జరగాలి? అని నిలదీశారు. ఆయా సర్వే నంబర్లలో దాదాపు 700 ఎకరాల భూదాన్, ప్రభుత్వ భూమి ఉందని, విచారణ వాయిదా వేస్తే వివరాలు అందజేస్తామని న్యాయవాది చెప్పారు. పిటిషన్ వేసేటప్పుడే అన్ని వివరాలు అటాచ్ చేయాలి కదా అని న్యాయమూర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇందులో మనీ ల్యాండరింగ్ ఏం జరిగింది?

ఇందులో మనీ ల్యాండరింగ్ ఏం జరిగింది? ఈడీ ఎందుకు జోక్యం చేసుకుందని న్యాయమూర్తి ప్రశ్నించారు. గతంలో నమోదైన ఎఫ్ఐఆర్‌లో భాగంగా విచారణ చేపట్టామని ఈడీ తరఫు న్యాయవాది బదులిచ్చారు. దీంతో ఎఫ్ఐఆర్ వివరాలు అందజేయాలని ఆయన్ను జడ్జి ఆదేశించారు. కాగా 181, 182లో తమ భూమి 103 ఎకరాలు ఉందని దస్తగిరి షరీఫ్ (ఎఫ్ఐఆర్‌కు సంబంధించిన ఫిర్యాదుదారు) తరఫు న్యాయవాది పేర్కొన్నారు. ల్యాండ్ సీలింగ్ యాక్ట్ ప్రకారం అంత భూమి ఒకరి పేరుపై ఎలా ఉంటుందని న్యాయమూర్తి ప్రశ్నించగా.. సోదరులతో కలిపి ఉందని న్యాయవాది బదులిచ్చారు.

194లో భూదాన్ భూమే లేదు

అనంతరం ఐఏఎస్, ఐపీఎస్‌ల తరఫున సీనియర్ న్యాయవాదులు శ్రీరఘురాం, చంద్రసేన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు వాదనలు వినిపించారు. 194లో భూదాన్ భూమే లేదన్నారు. ఇదే విషయాన్ని పిటిషనర్ కూడా ద్వి సభ్య ధర్మాసనం వద్ద దాఖలు చేసిన అప్పీల్ విచారణ సందర్భంగా అంగీకరించారని చెప్పారు. పిటిషనర్ రాములు తరఫు న్యాయవాది కూడా వాదనలు వినిపించారు. అనంతరం న్యాయమూర్తి విచారణ వాయిదా వేశారు.

కొలుసుకు భూగొలుసు

ఏపీ మంత్రిగారి కంపెనీకి రూ.600 కోట్ల విలువైన 845.60 ఎకరాలు ధారాదత్తం

పార్థసారథి భార్య కమలాలక్ష్మి, డ్రైవర్ కొలుసు ప్రసాద్ పేరిట నితిన్ సాయి కన్‌స్ట్రక్షన్



- భూమి అంతా సొంత నియోజకవర్గంలోనిదే.. ప్లాంట్‌తో కేవలం 500 మందికే ఉపాధి
- ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం తోటపల్లిలో రూ.5 లక్షలు చొప్పున 45.60 ఎకరాల విక్రయం
- ఏటా రూ.15 వేల లీజు కింద 800 ఎకరాలు 25 ఏళ్లు కేటాయింపు.. ఆగిరిపల్లి చుట్టుపక్కల బహిరంగ మార్కెట్‌లో ఎకరం భూమి ధర రూ.60-70 లక్షలు
- నిన్న జనసేన ఎంపీ బాలశౌరి సంస్థకు 115 ఎకరాలు ధారాదత్తం
- లులుకు నామమాత్రపు ధరకు విశాఖ, విజయవాడలో సంతర్పణ
- భూ కేటాయింపులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజాసంఘాలు

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

నెలరోజుల్లో గద్వాల పత్తి రైతులకు పెండింగ్ బిల్లులు

విత్తన కంపెనీలకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల ఆదేశం



సాక్షి, హైదరాబాద్: జోగులంబ గద్వాల జిల్లా పత్తి రైతులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను నెల రోజుల్లోగా చెల్లించాలని విత్తన కంపెనీలను వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. సోమవారం సచివాలయంలో పర్యాటక శాఖమంత్రి జూపల్లి కృష్ణారావు, స్థానిక ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, రాష్ట్ర విత్తన అభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేశ్‌రెడ్డి, వ్యవసాయశాఖ సంచాలకుడు గోపి, ఇతర అధికారులు, పలు విత్తన కంపెనీ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గద్వాల జిల్లా రైతులు సుమారు 50 వేల ఎకరాల్లో పత్తి విత్తనాలను సాగు చేశారని, నెలలు గడిచినా సంబంధిత కంపెనీలు చెల్లింపులు చేయలేదని కృష్ణమోహన్‌రెడ్డి ప్రభుత్వ దృష్టికి తీసుకొచ్చారు. అన్ని కంపెనీలు కలిపి సుమారు రూ.700 కోట్లు రై తులకు బకాయిలున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రథమ లక్ష్యమని, రైతులకు ఎలాంటి అసౌకర్యం కలిగినా సహించేది లేదని మంత్రి స్పష్టంచేశారు. గద్వాల జిల్లా రైతాంగం పత్తి విత్తనాల ఉత్పత్తిలో దేశంలోనే ప్రథమ స్థానంలో ఉందని తెలిపారు.

సెంట్రల్ డిజైన్స్ సామర్థ్యం ఎంత?

సీడీఓల పనితీరును పరీక్షించనున్న సీడబ్ల్యూసీ


సాక్షి, హైదరాబాద్: దేశంలోని అన్ని రాష్ట్రాల నీటిపారుదల శాఖల సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ (సీడీఓ) విభాగాల పనితీరు, నైపుణ్యం, సామర్థ్యాన్ని కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) పరీక్షించనుంది. సీడబ్ల్యూసీ తమ ప్రాంతీయ సీఈలతో ఈనెల 9న నిర్వహించిన ఓ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం నిర్దేశిత నమూనాలో సీడీఓల పనితీరుపై వివరాలను పంపించాలని అన్ని రాష్ట్రాల నీటిపారుదల శాఖలను కోరింది. గత 5 ఏళ్లలో సంబంధిత సీడీఓ డిజైన్ చేసిన మేజర్, మీడియం, మైనర్, మల్టీ పర్పస్ ప్రాజెక్టుల్లో ఎన్నింటికి సీడబ్ల్యూసీలోని టెక్నికల్ అడ్వైజరీ కమిటీ (టీఏసీ) అనుమతులిచ్చింది? ఎన్నింటికి రాష్ట్ర టెక్నికల్ అడ్వైజరీ కమిటీ అనుమతులిచ్చింది? సీడీఓ ఎన్ని డ్యామ్ సేఫ్టీ, ఫ్లడ్ ప్రొటెక్షన్ ప్రాజెక్టులను డిజైన్ చేసింది? సీడీఓలో ఎన్ని డిజైన్ విభాగాలున్నాయి? సీడీఓలో ఎంత మంది ఇంజనీర్లు ఏయే స్థాయిలో పని చేస్తున్నారు? వారి విద్యార్హతలు, అనుభవం ఎంత? డిజైన్ల తయారీకి అవసరమైన స్ట్రక్చరల్ అనాలసిస్/హైడ్రలాజికల్ అనాలసిస్ సాఫ్ట్‌వేర్, ల్యాబ్, ట్రైనింగ్ సెంటర్ వంటి సదుపాయాలున్నాయా? ఈ సాఫ్ట్‌వేర్‌ల వినియోగంలో అధికారులు ఎంత మేరకు సమర్థులు? వంటి వివరాలను పంపించాలని సీడబ్ల్యూసీ సూచించింది. మేడిగడ్డ బరాజ్ కూలిన ఘటనలో డిజైన్ల వైఫల్యం కూడా ఒక కారణమని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్‌ఏ) నిపుణుల కమిటీ తేల్చిన నేపథ్యంలో ప్రాజెక్టుల డిజైన్లకు అనుమతులు జారీ విషయంలో సీడబ్ల్యూసీ ఆచితూచి అడుగులు వేస్తోంది. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా సీడీఓల పనితీరును మదింపు చేయాలని నిర్ణయించింది.

సీడబ్ల్యూపీఆర్‌ఎస్‌కు 'పునరుద్ధరణ' డిజైన్ల బాధ్యత

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లలోని లోపాలను గుర్తించి పునరుద్ధరణ డిజైన్లు తయారు చేయడం కోసం అవసరమైన అధ్యయనాలు చేసే బాధ్యతను పుణేలోని సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ (సీడబ్ల్యూపీఆర్‌ఎస్)కు రాష్ట్ర నీటిపారుదల శాఖ అప్పగించింది. మేడిగడ్డ బరాజ్ కుంగిపోవడం, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లలో కూడా లోపాలు బయటపడటంతో వాటిలోని లోపాలపై అధ్యయనం జరిపిన నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్‌ఏ) నిపుణుల కమిటీ ఇటీవల తుది నివేదికను సమర్పించింది. బరాజ్‌లలోని లోపాలను గుర్తించడానికి ప్రఖ్యాత సంస్థలతో జియోఫిజికల్, జియోటెక్నికల్ పరీక్షలు జరిపించాలని ఈ నివేదికలో కోరింది. కేంద్ర ప్రభుత్వ సంస్థ సీడబ్ల్యూపీఆర్‌ఎస్‌కు రాష్ట్ర నీటిపారుదల శాఖ ఆ బాధ్యతలను అప్పగించగా, ఆ సంస్థ నిపుణులు ఈనెల 22, 23, 24 తేదీల్లో మూడు బరాజ్‌లను సందర్శించి పరిశీలించారు. అనంతరం ఈ బరాజ్‌ల నిర్మాణానికి వినియోగించిన డిజైన్లు, డ్రాయింగ్స్‌ను సమర్పించాలని నిపుణులు కోరారు. దీంతో ఆ డిజైన్లను సీడబ్ల్యూపీఆర్‌ఎస్‌కు అందించాలని నీటిపారుదల శాఖలోని సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ (సీడీఓ) సీఈకు కాళేశ్వరం ప్రాజెక్టు (రామగుండం) సీఈ తాజాగా లేఖ రాశారు.

విద్యుత్ డిమాండ్ పెరుగుతోంది

అప్రమత్తంగా ఉండండి: ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిత్తల్



సాక్షి, హైదరాబాద్: పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని, విద్యుత్ సరఫరాలో అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ అధికారులను ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్ ఆదేశించారు. ఎలాంటి అవాంతరాలు లేకుండా ప్రణాళికలను రూపొందించాలన్నారు. దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్, ఇతర ఉన్నతాధికారులతో మిత్తల్ సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తాజా పరిస్థితిని అధికారుల ద్వారా తెలుసుకున్నారు. గతేడాదితో పోల్చుకుంటే ఈ వర్షాకాలంలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరిగిందని, రానున్న రోజుల్లో మరింతగా పెరిగే అవకాశముందని మిత్తల్ అన్నారు. ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క విద్యుత్ పరిస్థితిపై ప్రతిరోజూ సమీక్షిస్తున్నారని వివరించారు. రాజధాని ప్రాంతంలో పారిశ్రామిక, వాణిజ్య, గృహ విద్యుత్ వాడకం అంచనాలు మించి పోతోందన్నారు. మరోవైపు వ్యవసాయ పంపుసెట్లు నిరంతరం నడుస్తున్నాయని తెలిపారు. గతేడాది (2024) జూలై 31న గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 13,541 మెగావాట్లుగా నమోదైందని, ఈ ఏడాది జూలై 16న 14.05 శాతం పెరుగుదలతో 15,443 మెగావాట్లకు చేరిందని తెలిపారు. కాగా, డిమాండ్‌కు తగ్గట్టుగా ప్రణాళికను సిద్ధం చేస్తున్నామని, వ్యవసాయ విద్యుత్ డిమాండ్‌ను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నామని టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్‌అలీ ఫరూకీ తెలిపారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి అవాంతరాలున్నా సిబ్బంది తక్షణమే స్పందిస్తారని, మొబైల్ బృందాలను కూడా అందుబాటులోకి తెచ్చామని అన్నారు.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
మంగళవారం ॥ 29-7-2025

టైగర్ ప్రిన్సెస్



నేడు అంతర్జాతీయ పులుల దినోత్సవం



లతిక

'అమ్మో పులి' అనుకునే రోజులు కావు ఇవి.
'అయ్యో పులి' అనుకునే రోజులు.

పులుల మనుగడ ప్రమాదంలో పడిన నేపథ్యంలో వాటి పరిరక్షణకు నడుం కట్టిన అగ్రగణ్యులలో ఢిల్లీకి చెందిన లతికానాథ్ ఒకరు. 'టైగర్ ప్రిన్సెస్'గా పేరు తెచ్చుకున్న లతిక చూడని అడవి లేదు. తన కెమెరా కన్ను ప్రపంచంలోని ఎన్నో పులుల విషయాలను, విశేషాలను, విషాదాలను ఆవిష్కరించింది.

చిన్నప్పుడు లతికను తల్లిదండ్రులు నేషనల్ పార్క్‌కు తీసుకువెళ్లడం వల్ల ఆమెలో జంతువులపై ఆసక్తి, ప్రేమ పెరుగుతూ వచ్చాయి. జంతు పరిరక్షణ ఉద్యమ విశేషాలు వినడం, ఆ ఉద్యమాల్లో పాల్గొనడం లతిక కన్జర్వేషన్ ఎకాలజిస్ట్, ఫోటోగ్రాఫర్‌గా రూపుదిద్దుకోవడానికి కారణం అయింది.

'పులుల పరిరక్షణకు సంబంధించి మీరు చేసిన కృషిని డాక్యుమెంట్ చేయండి' అంటూ లతికను సంప్రదించిన నేషనల్ జియోగ్రాఫిక్ మ్యాగజీన్ నిర్వాహకులు ఆమెకు 'టైగర్ ప్రిన్సెస్' అనే బిరుదును ప్రదానం చేశారు. 'డిస్కవరీ' చానెల్ కోసం లతిక చేసిన 'వైల్డ్ థింగ్స్' డాక్యుమెంటరీ పాపులర్ అయింది. మన దేశంలో పులుల పరిరక్షణ, మేనేజ్‌మెంట్‌పై పరిశోధన చేసిన తొలి భారతీయురాలిగా లతిక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది.

పులుల ఉనికి, సంరక్షణకు సంబంధించిన అరకొర సమాచారం ఒక పరిమితిగా ఉండేది. ఆ పరిమితిని లతిక పరిశోధనలు అధిగమించాయి. డా. జార్జ్ షాలర్ తరువాత ఆ స్థాయిలో పులులపై పరిశోధన చేసిన వ్యక్తిగా లతికకు గుర్తింపు తెచ్చాయి. ప్రస్తుతం పులుల పరిరక్షణ, మేనేజ్‌మెంట్‌కు సంబంధించి అధ్యయనాలు ఎక్కువగానే జరుగుతున్నాయి.

'గతంలో పోల్చితే పులుల పరిరక్షణపై ఎక్కువగా అధ్యయనాలు జరుగుతున్నప్పటికీ, పరిశోధన, అధ్యయనం అనేవి ఇప్పటికీ అంత సులభంగా ఏం లేవు. కావు. వైల్డ్‌లైఫ్ బయాలజిస్ట్, ఫొటోగ్రాఫర్‌గా చెప్పుకోదగ్గ స్థాయిలో జీవించడం కష్టంగా ఉంది. ఈ విషయంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి. పులుల సంరక్షణకు సంబంధించి అధ్యయనాన్ని ప్రోత్సహించాలి' అంటుంది లతిక.

ప్రయాణాలు అంటే ఇష్టపడే లతిక యాభైకిపైగా దేశాలకు వెళ్లింది. ఎన్నో అడవులలో పులులతో సహా ఎన్నో జంతువుల ఫోటోలు తీసింది.

'ప్రతి ఫోటోగ్రాఫ్‌కు ఒక కథ ఉంది. నేను చూసిన ప్రతి పులి నా మనసులో ముద్రించుకుపోయింది. ప్రతి పులి తనకు సంబంధించి ఒక కథ చెబుతున్నట్లుగానే ఉంటుంది. అవి క్షేమంగా ఉండాలని ఎప్పుడూ ప్రార్థించేదాన్ని' అంటూ జ్ఞాపకాల్లోకి వెళుతుంది లతిక.

లతిక తీసుకువచ్చిన ఫొటోగ్రాఫ్స్ కలెక్షన్ 'హిడెన్ ఇండియా' సమస్త జంతుజాలాన్ని మన ముందు ఆవిష్కరిస్తుంది. ఈ పుస్తకానికి వాడిన ముఖచిత్రం ఎంతో అర్థవంతంగా ఉంటుంది. అడవిలో ఒక శిథిల వృక్షం వెనకాల నుంచి భయంగా చూస్తూ ఉంటుంది పులి. ఆ పులి కళ్లు చెప్పకనే ఏవో బాధలు చెబుతున్నట్లుగానే ఉంటుంది. పిల్లల కోసం లతిక రాసిన 'తక్దీర్ ది టైగర్ క్లబ్' ఎంతో ప్రాచుర్యం పొందింది. ప్రపంచ వ్యాప్తంగా ఇరవై భాషలలోకి అనువాదం అయింది.

'మనుషుల మనుగడ జంతువుల మనుగడతో ముడిపడి ఉంది. స్వల్పకాల స్వార్థప్రయోజనాల కోసం వాటికి హాని చేయడం అంటే భవిష్యత్ కాలంలో మన జీవితాన్ని మనం నాశనం చేసుకోవడమే' అంటున్న లతికానాథ్ అకాడమిక్ రిసెర్చ్ నుంచి కన్జర్వేషన్ ప్రాజెక్ట్‌లకు సంబంధించి కన్సల్టెన్సీ వరకు పులుల పరిరక్షణకు సంబంధించి ఎన్నో కార్యక్రమాలు చేపడుతోంది.

వాటిని చూడడం అదృష్టం

నేను పులులకు సమీపంలో ఉన్నప్పుడు, వాతావరణం వేడిగా ఉందా, చల్లగా ఉందా? అసౌకర్యంగా ఉందా? ఆకలిగా ఉందా? అనే స్పృహ ఉండదు. పులులు మాత్రమే నాకు కనిపిస్తాయి. పిట్ట కావచ్చు, పులి కావచ్చు వాటిని చూడడం అదృష్టంగా భావిస్తాను. వాటిని చూసినప్పుడల్లా వాటి పరిరక్షణకు ఇంకా ఏదైనా చేయాలనే స్ఫూర్తి కలుగుతుంది.

– లతికానాథ్

ఏఐ ఏరియా



పిల్లిగారి పెళ్లి వేడుక

ఏఐ–జనరేటెడ్ పిల్లుల పెళ్లివేడుక వీడియో సోషల్ మీడియాలో సందడి చేస్తోంది. ఒక బాలీవుడ్ పాటకు మార్జాల పెళ్లికూతురు చేస్తున్న డ్యాన్స్ చూస్తూ నవ్వు ఆపుకోవడం శా...నా కష్టం!

పెళ్లికూతురు డ్యాన్స్‌కు ఫిదా అయిన పిల్లి పెళ్లికుమారుడు భావోద్వేగానికి గురై కన్నీళ్లు పెట్టుకోవడం విశేషం.

పెళ్లికి వచ్చిన కుక్క, ఏనుగు, ఎలుక... మొదలైన జీవరాసులు సంప్రదాయ భారతీయ వివాహ దుస్తుల్లో మెరిసిపోవడం మరో విశేషం.

మీ పిల్లలు మూడీగా ఉన్నారా?

అయితే ఈ 'ఏఐ టేక్ ఓవర్' వీడియో ఒకసారి చూపిస్తే చాలు... నవ్వులే నవ్వుల్!

మీకు తెలుసా?

మిరపకాయలతో మీ కళ్లకు ఎన్నో పోషకాలు లభిస్తాయి. రెడ్ క్యాప్సికమ్‌లో ఎ, సి, ఇ వంటి విటమిన్లు పుష్కలంగా ఉన్నాయి. ఇవి కంటికి ఎలాంటి ఆక్సిడేటివ్ డ్యామేజ్ జరగకుండా నిరోధిస్తాయి. దీంతోపాటు రెటీనాను ఆరోగ్యవంతంగా చేయడంలో సహాయపడతాయి.





కొత్తగా చిగురించిన చర్మంతో చిరునవ్వులు చిందిస్తున్న మనీషా కుటుంబం

ఆ అమ్మ చర్మం

బిడ్డ బుగ్గలపై చిగురించింది

తల్లి తన బిడ్డల కోసం ఏ త్యాగం చేయడానికైనా సిద్ధపడుతుందనడానికి సిసలైన ఉదాహరణ ఇది. ఈ తల్లి ప్రమాదంలో చెంపలు కాలిపోయి అందవికారంగా తయారైన తన ఆరునెలల చిన్నారి కోసం తన చర్మాన్ని వొలిచి ఇచ్చింది. ఆ తల్లి త్యాగం ఫలించింది. ఇప్పుడా తల్లీ బిడ్డా ఇద్దరూ సంపూర్ణ ఆరోగ్యంతో చక్కగా ఉన్నారు. తనకేం జరిగిందో తెలియకున్నా అమాయకంగా నవ్వుతూ బిడ్డ ధ్యాన్ష్... తన చర్మాన్నిచ్చి కాపాడుకున్నానన్న సంతోషంతో తల్లి మనీషా ఇద్దరూ ఫొటోకు పోజులిచ్చారు.

గతనెల 12న అహమ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాదంలో విమానం కూలి మేఘని నగర్‌లోని బీజే మెడికల్ కాలేజీ హాస్టల్, నివాస గృహాలపై పడిన విషయం తెలిసిందే. ఆ ప్రమాదం జరిగిన సమయంలో సివిల్ హాస్పిటల్‌లో యూరాలజీ నిపుణుడైన డాక్టర్ కపిల్ కచ్చాడియా భార్య మనీషా, వాళ్ల ఆరు నెలల కుమారుడు ధ్యాన్ష్ ఇంట్లో ఉన్నారు. విమాన శకలం నుంచి చెలరేగిన మంటల్లో మనీషా చేతులు ముఖంపై 25 శాతం కాలిన గాయాలు కాగా, ధ్యాన్ష్ ముఖం, రెండు చేతులు, ఉదరం, ఛాతీ కాలి, గాయాలు కావడంతో ఇద్దరినీ కేడీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ధ్యాన్ష్ ను పీడియాట్రిక్ ఐసియులో చేర్చి వెంటిలేటర్‌పై ఉంచారు. 36 శాతం కాలిన గాయాలతో బాధపడుతున్న ధ్యాన్ష్‌కు అతని తల్లి ముప్పై ఏళ్ల మనీషా చర్మాన్ని తీసి స్కిన్ గ్రాఫ్టింగ్ ద్వారా అమర్చారు. ఫలితంగా ఎనిమిది నెలల పసివాడు ధ్యాన్ష్ ఇప్పుడు చక్కగా నవ్వుతున్నాడు, ప్రాణాంతక కాలిన గాయాల నుండి బయట పడిన అతని బుగ్గలు ఇప్పుడు నునుపుతేలి ఆరోగ్యంతో మెరుస్తున్నాయి. తన నుంచి తీసిన చర్మాన్ని పిల్లాడికి అమర్చి, అతడు కోలుకున్న తర్వాత ఆ బోసి నవ్వులు చూస్తూ మనీషా కూడా త్వరలోనే కోలుకుంది. తల్లి, బిడ్డ ఇద్దరూ జూన్ 12న జరిగిన ఏఐ 171 విమాన ప్రమాదం తర్వాత తీవ్రమైన కాలిన గాయాలకు ఐదు వారాల చికిత్స తర్వాత ఇటీవల డిశ్చార్జ్ అయినట్లుగా టైమ్స్ ఆఫ్ ఇండియా నివేదించింది.

'ఒక్క క్షణం అంతా నల్లగా అయిపోయింది, ఆపై వేడి మా ఇంటిని చుట్టుముట్టింది. నేను ధ్యాన్ష్‌ను పట్టుకుని దట్టమైన పొగ, మంటల గుండా పరిగెత్తాను. మేము బయటకు వచ్చి ప్రాణాలతో బయటపడగలమని అనుకోలేదు కానీ దేవుడి దయవల్ల, కేడీ హాస్పిటల్ వైద్యులు సకాలంలో స్పందించి చేసిన చికిత్స వల్ల ఇద్దరం ఇప్పుడు పూర్తిగా కోలుకున్నాం. ఇప్పుడు నేను నా బిడ్డ అందమైన నవ్వును తిరిగి చూడగలుగుతున్నాను'' అంటూ సంతోషం వెలిబుచ్చింది మనీషా.

కేడీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఆదిత్ దేశాయ్ మాట్లాడుతూ, 'ఆ తల్లి తన బిడ్డను కాపాడుకోవడానికి చూపిన ధైర్యాన్ని, వైద్యులకు అందించిన సహకారాన్ని మాటలలో వర్ణించలేం. మా హాస్పిటల్‌లో ప్రతి విభాగం సమన్వయంతో పనిచేసి సాధ్యమైనంత ఉత్తమమైన ఫలితాలనిచ్చింది'' అని పత్రికలవారికి తెలిపారు. ఈ సంఘటనలో గాయపడిన ఆరుగురు ప్రమాద బాధితులకు తమ ఆస్పత్రి మానవతా దృక్పథంతో ఉచిత సేవలందించినట్లు తెలిపారు.

బులియన్

(బంగారం 10 గ్రా.: వెండి కిలో) జూలై 28న ముగింపు రూ.లలో

	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	రాజమండ్రి	ప్రొద్దుటూరు	చెన్నై
బంగారం (24 క్యారెట్లు)	99,550	1,01,340	99,930	1,01,340	98,900	99,920
బంగారం (22 క్యారెట్లు)	93,670	91,600	91,600	94,350	90,990	91,600
వెండి	1,16,060	1,16,600	1,26,000	1,16,400	1,16,300	1,26,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

సాగుబడి
పుష్యమి కార్తె: ఆగస్టు 3 వరకు

సేంద్రియ పశుపోషణపై దృష్టి

సేంద్రియ/ప్రకృతి పంటల సాగుతో పాటు సేంద్రియ పద్ధతుల్లో పశు పోషణకూ ప్రభుత్వ ప్రోత్సాహం

సేంద్రియ పాలు, మాంసం, గుడ్ల పెంపకంపై సమగ్ర విధానం రూపకల్పనకు కసరత్తు

ఈ కృషిలో హైదరాబాద్‌లోని ఐసీఏఆర్–ఎన్ఎంఆర్ఐ కీలక పాత్ర



'ఆర్గానిక్ ఆహారోత్పత్తులు అనగానే మనకు చప్పున గుర్తొచ్చేది ధాన్యాలు, పప్పులు, కూరగాయలు, పండ్లు. కానీ, పాలు, పాల ఉత్పత్తులు, మాంసం, గుడ్లు కూడా ఆర్గానిక్ బుట్టలో ప్రధాన భాగాన్ని ఆక్రమిస్తుంది. ప్రకృతి/సేంద్రియ సేద్య పద్ధతుల్లో సాగు చేస్తున్న రైతులు ప్రపంచంలో ఏ దేశంలోనూ లేనంత ఎక్కువ మంది మన దేశంలో ఉన్నారు. వారు పండిస్తున్న సేంద్రియ ఆహారాన్ని దేశీయంగా వినియోగిస్తుండడంతోపాటు చాలా రకాల సేంద్రియ ఉత్పత్తులను అనేక దేశాలకు మన దేశం ఎగుమతి చేస్తోంది. అయితే, సేంద్రియ పాలు/ పాల ఉత్పత్తులు, సేంద్రియ పశు / కోడి మాంసం తదితర ఉత్పత్తుల ఎగుమతి మాత్రం చెప్పుకోదగిన స్థాయిలో లేదు.

సేంద్రియ పశుపోషణ, సేంద్రియ కోళ్ల పెంపకాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహించడానికి విధాన రూపకల్పన కోసం కేంద్రం కసరత్తు ప్రారంభించింది. ఆర్గానిక్ లైవ్‌స్టాక్ ప్రొడక్షన్, సర్టిఫికేషన్ ప్రక్రియలకు సంబంధించి విధి విధానాలు, ప్రమాణాలను రూపొందించే కృషి ఊపందుకుంది. హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న ఐసీఏఆర్ అనుబంధ సంస్థ జాతీయ మాంసం పరిశోధనా సంస్థ (ఐసీఏఆర్–ఎన్ ఎంఆర్ఐ) ఈ ప్రక్రియలో కీలకపాత్ర పోషిస్తోంది. ఔత్సాహిక రైతులు, శాస్త్రవేత్తలు, అధికారులతో ఇటీవల ఒక సమాలోచన కార్యశాలను సైతం ఎన్ఎంఆర్ఐ నిర్వహించింది. ఈ నేపథ్యంలో అసలు సేంద్రియ పద్ధతుల్లో పాడి పశువులు, మేకలు, గొర్రెలు, కోళ్ల పెంపకం అంటే ఏమిటి? రసాయనాలు వాడకుండా పశుపోషణ ఎలా? వ్యాధుల నివారణ, చికిత్సకు రసాయనాలకు ప్రత్యామ్నాయం ఏమిటి? సేంద్రియ ధ్రువీకరణ పద్ధతులేమిటి? మన బలాబలాలు, సవాళ్లేమిటి? ఇటువంటి అంశాలపై విషయ నిపుణులు 'సాక్షి సాగుబడి'తో ఏమన్నారంటే..

పంటలు/తోటలు లేదా జంతువులు / కోళ్లను రసాయనిక పురుగు మందులు, రసాయనిక ఎరువులు, హార్మోన్లు, అల్లోపతి మందులు వంటి సింథటిక్ ఉత్పాదకాలను ఉపయోగించకుండా పెంచటాన్ని సేంద్రియ వ్యవసాయంగా అంతర్జాతీయ సమాజం గుర్తిస్తోంది. ఈ విధంగా రసాయనాలు, జన్యుమార్పిడి ఉత్పాదకాలు వాడకుండా సేంద్రియ / ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పెంచే ఆహారోత్పత్తులకు దేశ విదేశీ మార్కెట్లలో గిరాకీ అంతకంతకూ పెరుగుతోంది. ధ్రువీకరణ ప్రమాణాలకు అనుగుణంగా పెంచిన ఆరోగ్యదాయక మైన సేంద్రియ ధాన్యాలు, పప్పులు, కూరగాయలు, పండ్లతో పాటు సేంద్రియ పాలు, మాంసం, కోడిగుడ్లు, విలువ ఆధారిత సేంద్రియ ఆహారోత్పత్తులకు అధిక సొమ్ము చెల్లించటానికి ధనిక, మధ్యతరగతి వినియోగదారులు వెనుకాడటం లేదు. ఈ ట్రెండ్ ఇప్పుడు అభివృద్ధి చెందిన దేశాలతో పాటు భారత్ వంటి వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లోనూ కనిపిస్తోంది.

ప్రపంచ సేంద్రియ మార్కెట్ జోరు

ఆర్గానిక్ పాలు, గుడ్లు, మాంసం ఉత్పత్తులకు ప్రపంచ మార్కెట్ వేగంగా పెరుగుతోంది. సేంద్రియ పాల మార్కెట్ ఏటా 6% పెరుగుతోంది. 2020లో 2 వేల కోట్ల డాలర్లుగా ఉండగా, 2026 నాటికి 3,200 కోట్ల డాలర్లకు పెరుగుతుందని అంచనా. అదేవిధంగా సేంద్రియ మాంసం ఉత్పత్తుల మార్కెట్ 7% పెరుగుతోంది. 2020లో 1,500 కోట్ల డాలర్ల నుంచి 2025 ఆఖరు నాటికి 2 వేల కోట్లకు పెరుగుతుందని అంచనా. ఆర్గానిక్ ఎగ్ మార్కెట్ మరింత వేగంగా 12.5% పెరుగుతోంది. 2023లో 370 కోట్ల డాలర్ల వ్యాపారం జరగ్గా 2032 నాటికి ఇది 1,070 కోట్ల డాలర్లకు పెరుగుతుందని అంచనా.

20% పెరుగుతున్న దేశీయ మార్కెట్

మన దేశంలో సేంద్రియ ఆహారోత్పత్తుల మార్కెట్ ఏటా 20% పెరుగుతోంది. కోవిడ్ తర్వాత సేంద్రియ ఉత్పత్తులకు డిమాండ్ పెరిగింది. అనధికారిక పద్ధతుల్లో మార్కెటింగ్ ఊపందుకుంది. ఉత్పత్తిదారు నుంచి వినియోగదారులు నేరుగా కొంటున్నారు. ప్రభుత్వం ప్రకృతి/ సేంద్రియ పంటల సాగును చాలా ఏళ్లుగా విస్తృతంగా ప్రోత్సహిస్తోంది. ఇప్పుడు సేంద్రియ పాడి పశువుల పెంపకం, సేంద్రియ గొర్రెలు/మేకల పెంపకం, సేంద్రియ కోడిగుడ్లు, కోడి మాంసం పెంపకంపై ఇప్పుడు దృష్టి సారించింది.

ఎన్‌పీఓపీ, పీజీఎస్ సర్టిఫికేషన్లు

2023–24లో మన దేశంలో 44.75 లక్షల హెక్టార్లలో సేంద్రియ సాగు జరుగుతోంది. దీనితో పాటు 28.5 లక్షల హెక్టార్ల అటవీ ప్రాంతం నుంచి సేంద్రియ ఉత్పత్తులు సేకరిస్తున్నారు. విదేశాలకు ఎగుమతి చేయడానికి వీలున్న నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ ఆర్గానిక్ ప్రొడక్షన్ (ఎన్‌పీఓపీ) సర్టిఫికేషన్ కలిగిన రైతులు 36 లక్షల టన్నుల సేంద్రియ దిగుబడులు పండించారు. దేశీయంగా అమ్ముకోవడానికి ఉద్దేశించిన పార్టిసిపేటరీ గ్యారంటీ సిస్టం (పీజీఎస్) సర్టిఫికేషన్ ఉన్న రైతులు 6.20 లక్షల టన్నులు పండించారు. ఈ రెండు రకాల సర్టిఫికేషన్లు పంటలతో పాటు పాలు, మాంసం, గుడ్లు, తేనె, ఆక్వా ఉత్పత్తులకు కూడా ఇస్తారు.

ఎగుమతులకు అవకాశాలు

2023–24లో 2,61,029 టన్నుల (వీటి ఖరీదు రూ.4,008 కోట్లు) సేంద్రియ పత్తి, నూనెగింజలు, చెరకు, ధాన్యాలు, చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, ఔషధ మొక్కలను భారత్ నుంచి విదేశాలకు ఎగుమతి చేశాం. అమెరికా, యూరోపియన్ యూనియన్, కెనడా, బ్రిటన్, శ్రీలంక, స్విట్జర్లాండ్, వియత్నాం, ఆస్ట్రేలియా తదితర దేశాలకు మనం సేంద్రియ ఉత్పత్తులు అమ్మాం. ఆయా దేశాల సేంద్రియ ప్రమాణాలకు తగిన రీతిలో సేంద్రియ పాలు, మాంసం, గుడ్లు మన రైతులు ఉత్పత్తి చేస్తే, వాటిని ఎగుమతి చేయటం కష్టమేమీ కాదంటున్నారు నిపుణులు. యూఏఈ, సౌదీ అరేబియా, ఖతార్, జర్మనీ, నెదర్లాండ్స్, స్విట్జర్లాండ్, సింగపూర్, మలేసియా, కెనడా దేశాల్లో సేంద్రియ మాంసం, గుడ్లు, పాలు, తేనెకు డిమాండ్ ఉంది. ఆ మార్కెట్ల ప్రత్యేక నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా మన దేశంలో సేంద్రియ పాలు, మాంసం, గుడ్ల ఉత్పత్తి, ప్రాసెసింగ్, మార్కెటింగ్‌కు మౌలిక సదుపాయాలు, ఏర్పాటు చేసే పటిష్టమైన సమగ్ర విధానంతో పాటు రైతుల కోసం ప్రత్యేక పథకాలను రూపొందించాలని నిపుణులు సూచిస్తున్నారు.

– పంతంగి రాంబాబు

సేంద్రియ పశుపోషణలో ఎన్ఎస్ఓపీ ప్రమాణాలు కీలకం

సేంద్రియ పాలు, మాంసం, గుడ్లు ఉత్పత్తి చెయ్యాలనుకునే రైతులు, సంస్థలు నేషనల్ స్టాండర్డ్స్ ఫర్ ఆర్గానిక్ ప్రొడక్షన్ (ఎన్ఎస్ఓపీ) ప్రమాణాలు పాటించాలి.

అవి: సహజ బ్రీడింగ్ పద్ధతులను అనుసరించటం.. జంతువుల ఆరోగ్యం– సంక్షేమానికి రక్షణ చర్యలు తీసుకోవటం.. సేంద్రియంగా పండించిన దాణాను, పశుగ్రాసాలను మేపటం.. పశువులను ఒకేచోట కట్టేసి ఉంచకుండా సహజ ప్రవర్తనను వ్యక్తీకరించేలా స్వేచ్ఛనివ్వటంతో పాటు ఒత్తిడిని తగ్గించడం ముఖ్యం. ముఖ్యమైన విషయం ఏమిటంటే.. అల్లోపతి ఔషధాలు, యాంటీబయాటిక్స్, హార్మోన్లు, పెరుగుదలకు బూస్టర్లు, దాణా మిశ్రమాలు మొదలైన వాటి వాడకంపై నూటికి నూరు శాతం నిషేధం పాటించాలి. పెంచే పశువులు, జీవాల జాతుల ఎంపిక.. దాణా, ఆరోగ్య సంరక్షణ, పెంపకం, పేడ, మూత్రాల నిర్వహణ, సేంద్రియ పెంపక పద్ధతులకు మారే కాలం, షెడ్ల నిర్మాణంలో మెళకువలు, విశాలమైన స్థలం ఆవశ్యకత, ప్రతి పశువుకు గుర్తింపు చిహ్నం ఇవ్వటం, రవాణా పద్ధతులు, వధ–కోత అనంతర నిర్వహణలో నిర్దిష్ట పద్ధతులు పాటించాలి.


అన్ని విషయాలపై రికార్డులు తయారు చేయటం ముఖ్యమైన విషయం. ఈ ప్రమాణాలు పాటిస్తూ సేంద్రియ పద్ధతులను అలవాటు చేసుకోవటంలో రైతులకు, విస్తరణ సిబ్బందికి అవగాహన కల్పించటం కోసం హయత్‌నగర్‌లోని 'క్రీడా' ప్రదర్శన క్షేత్రంలో సేంద్రియ గొర్రెల పెంపక యూనిట్‌ను ప్రారంభించాం. ఎన్‌పీఓపీ ధ్రువీకరణ ప్రమాణాలు పాటిస్తున్నాం. సేంద్రియ పశుపోషణ ద్వారా పాలు, మాంసం, సేంద్రియ కోళ్ల పెంపకంలో ఆసక్తి గల రైతులు, రైతు ఉత్పత్తి సంస్థలు(ఎఫ్‌పీఓలు), సహకార సంఘాలకు ప్రామాణిక శిక్షణ ఇస్తాం.



- డాక్టర్ పి. బస్వారెడ్డి,
ప్రధాన శాస్త్రవేత్త,
ఐసీఏఆర్– జాతీయ మాంసం పరిశోధనా సంస్థ (ఎన్ఎంఆర్ఐ),
చెంగిచర్ల, హైదరాబాద్
040–29801672

ఏ జాతులనైనా సేంద్రియంగా పెంచవచ్చు


విదేశాల్లో పంటలు పండించే పొలాలు, పశువుల్ని పెంచే క్షేత్రాలు కలిసి ఉండవు. మన దేశంలో పంటలు సాగు చేసే రైతులకు పశువుల పెంపకం కూడా ఉంటుంది. ప్రకృతి/సేంద్రియ సేద్యంలో పంటలు పండించే రైతుల పొలాల్లోనే సేంద్రియంగా ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకానికి ప్రోత్సహిస్తే సత్ఫలితాలు వస్తాయి. వారి సొంత పంట వ్యర్థాలను, సొంత ధాన్యాలను పశువులకు మేపటం ద్వారా నాణ్యతా ప్రమాణాలను సులువుగా ఆచరించవచ్చు. నేల–పశువు–పంట.. ఈ మూడింటి మధ్య సేంద్రియ అనుసంధానం చెయ్యాలి. ఈ విషయంలో మన దేశంలో చిన్న, సన్నకారు రైతులకు ఉన్న నైపుణ్యాలు వరంగా ఉపయోగపడతాయి. విదేశాలతో పోల్చితే రసాయనాలకు పెద్ద పీట వెయ్యని దేశం మనది. వ్యవసాయ రసాయనాలు వాడకం తక్కువగా ఉన్న కొండ/గిరిజన ప్రాంతాలపై తొలుత దృష్టిని కేంద్రీకరించి, ప్రోత్సహించాలి. దేశీ, నాటు పశువులను మాత్రమే సేంద్రియ పెంపకానికి వాడాలనేం లేదు. సంకరజాతి పశువులను నిస్సందేహంగా పెంచవచ్చు.



- డాక్టర్ మహేశ్ చందర్, ప్రధాన శాస్త్రవేత్త, జాతీయ పశుపోషణ పరిశోధనా సంస్థ (ఐసీఏఆర్–ఐవీఆర్ఐ), ఇజ్జత్‌నగర్, ఉత్తరప్రదేశ్

పశు వ్యాధులకు సంప్రదాయ ఈవీఎం చికిత్స మేలు


పశు వ్యాధుల నివారణలో, చికిత్సలో యాంటీబయాటిక్ ఔషధాలను అతిగా వాడుతూ వాటికి నిరోధకత పెంచుకోవటం ఇప్పుడు మానవాళి ఎదుర్కొంటున్న పెద్ద సమస్య. సుసంపన్న సంప్రదాయ సిద్ధ, ఆయుర్వేద విజ్ఞానంతో కూడిన మూలికా వైద్య చికిత్స (ఎత్నో వెటర్నరీ మెడిసిన్–ఈవీఎం)ల ద్వారా పశువ్యాధులను జయించవచ్చు. 24 ఏళ్లుగా ఈవీఎంలపై కృషి చేస్తున్నా. వీటి పనితీరు ఎంత ప్రభావశీలంగా ఉందో 9 రాష్ట్రాల్లో 25 ఎన్‌డీడీబీ అనుబంధ పాడి సహకార సంఘాల్లోని రైతుల అనుభవాలే తేటతెల్లం చేస్తున్నాయి. పొదుగువాపు, గాలికుంటు వ్యాధి వంటి అనేక తీవ్ర జబ్బులను సైతం కొద్ది రోజుల్లో ఈవీఎం మందులతో తగ్గించవచ్చని రుజువైంది. 11.2 లక్షల కేసుల్లో 80.4% జబ్బులు తగ్గిపోయాయి. కేంద్ర ప్రభుత్వం కూడా ఈవీఎంల ప్రభావశీలతను గుర్తించింది. ఈవీఎంకు ఎవిడెన్స్ బేస్డ్ మెడిసిన్‌గా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు వస్తోంది. ఇవి తక్కువ ఖర్చుతో, కచ్చితంగా ఫలితాలనిచ్చే పర్యావరణ హితమైన, ఆరోగ్యదాయకమైన చికిత్సలని గుర్తించాలి.



- ప్రొ. ఎన్. పుణ్యమూర్తి, ఎన్‌డీడీబీ కన్సల్‌టెంట్, టిఎఎన్‌యువిఎఎస్ విశ్రాంత ఆచార్యులు, తంజావూరు, తమిళనాడు

సమగ్ర విధానం ద్వారా రైతులకు మార్గదర్శనం

ప్రకృతి/సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్న కేంద్ర ప్రభుత్వం తాజాగా ఆర్గానిక్ మాంసం, గుడ్లు, పాలు/పాల ఉత్పత్తుల పెంపకంపై కూడా దృష్టిని కేంద్రీకరించింది. సేంద్రియ మాంస ఉత్పత్తుల పెంపకం, మార్కెటింగ్ తదితర అంశాలపై రైతులు, శాస్త్రవేత్తలు, అధికారులు, పారిశ్రామికవేత్తల ఆకాంక్షలతో పాటు మా అనుభవాలను జోడించి కేంద్రానికి నివేదిక పంపుతాం. సమగ్ర విధాన రూపకల్పనకు ఇది దోహదం చేస్తుంది. సేంద్రియ పశుపెంపకంపై పరిశోధనలకు, విస్తరణకు ప్రత్యేక నిధులు కేటాయించాలి. అపెడాలో సేంద్రియ పశు పెంపకం ప్రోత్సాహానికి ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చెయ్యాలి. అమూల్ వంటి నమ్మదగిన బ్రాండ్ ద్వారా విక్రయిస్తే సేంద్రియ పాలు, గుడ్లు, మాంసం అధిక ధర ఇచ్చి కొనటానికి దేశంలో ప్రజలు ఆసక్తితో ఉన్నారు. యూరప్, మధ్యప్రాచ్య దేశాలకు సేంద్రియ పాలు, మాంసం ఎగుమతి చేయడానికి అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఆసక్తి గల రైతులు మమ్మల్ని సంప్రదిస్తే మార్గదర్శనం చేస్తాం.



- డా. ఎస్. బి. బర్బుదే, సంచాలకులు, ఐసీఏఆర్– జాతీయ మాంసం పరిశోధనా సంస్థ (ఎన్ఎంఆర్ఐ), చెంగిచర్ల, హైదరాబాద్



"వరల్డ్ కప్ విజయానుభూతిని ఆస్వాదిస్తున్నాను. దీని నుంచి తేరుకునేందుకు ఇంకా కొంత సమయం పడుతుంది. ఇక్కడికి వచ్చే ముందు నాకు ఒక్క జీఎం నార్మ్ కూడా లేదు. నేను ఎప్పుడు నార్మ్ సాధిస్తానో అని ఆలోచించేదాన్ని. కానీ ఇక్కడ ఇలా గ్రాండ్‌మాస్టర్ కావాలని నాకు రాసి పెట్టి ఉంది. నాకు ఈ ఆనందంలో మాటలు రావడం లేదు. ఈ విజయానికి ఎంతో ప్రత్యేకత ఉంది. నా దృష్టిలో ఇది ఆరంభం మాత్రమే. ముమ్ముందు ఇంకా ఇలాంటివి చాలా సాధించాలని కోరుకుంటున్నా. - దివ్య

దివ్యమైన విజయం...

మహిళల చెస్ ప్రపంచకప్ టైటిల్ నెగ్గిన దివ్య దేశ్‌ముఖ్

- ఈ ఘనత సాధించిన తొలి భారతీయ క్రీడాకారిణిగా రికార్డు
- ఫైనల్లో భారత్‌కే చెందిన స్టార్ ప్లేయర్ కోనేరు హంపిపై విజయం
- టైబ్రేక్‌లో హంపిపై పైచేయి సాధించిన దివ్య
- తాజా ప్రదర్శనతో గ్రాండ్‌మాస్టర్ (జీఎం) హోదా ఖాయం
- రూ. 43 లక్షల 38 వేల ప్రైజ్‌మనీ సొంతం

అంతర్జాతీయ చదరంగ వేదికపై మరోసారి భారత త్రివర్ణ పతాకం రెపరెపలాడింది. మహిళల ప్రపంచకప్ చెస్ టోర్నమెంట్‌లో భారత్ నుంచి దివ్య దేశ్‌ముఖ్ రూపంలో తొలిసారి చాంపియన్ ఆవిర్భవించింది. తనకంటే ఎంతో మెరుగైన రేటింగ్ ఉన్న క్రీడాకారిణులు బరిలో ఉండటం... ఫేవరెట్ ముద్ర లేకపోవడం... 19 ఏళ్ల ఈ మహారాష్ట్ర అమ్మాయికి కలిసొచ్చింది. ఫలితంగా... ఆరంభం నుంచి స్వేచ్ఛగా ఆడుతూ... అందరి అంచనాలను తారుమారు చేస్తూ... మేధో క్రీడలో ఏకాగ్రతతో ఆడితే... పక్కా ప్రణాళికతో చకచకా ఎత్తులు వేస్తే... ప్రత్యర్థి ఎంతటి మేధావి అయినా... ఒకానొక దశలో ఒత్తిడికి గురై అనవసర తప్పిదాలు చేస్తారని.... చివరకు చేతులెత్తేస్తారని... దివ్య తన అద్భుతమైన ఆటతీరుతో నిరూపించింది. వెరసి తన కెరీర్‌లోనే అతిపెద్ద విజయాన్ని సొంతం చేసుకుంది. ఒకే గెలుపుతో... దివ్య స్వర్ణ పతకాన్ని దక్కించుకోవడంతోపాటు...మరోవైపు ఊహకందని విధంగా గ్రాండ్‌మాస్టర్ (జీఎం) టైటిల్ హోదాను కూడా ఖాయం చేసుకోవడం విశేషం.

బతూమి (జార్జియా): అనుభవంపై యువతరం గెలిచింది. మహిళల ప్రపంచకప్ చెస్ టోర్నీలో భారత్‌కు చెందిన అంతర్జాతీయ మాస్టర్ (ఐఎం), 19 ఏళ్ల దివ్య దేశ్‌ముఖ్ విజేతగా అవతరించింది. రెండు సార్లు ర్యాపిడ్ ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన భారత మహిళా దిగ్గజ చెస్ ప్లేయర్, ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్, 38 ఏళ్ల కోనేరు హంపితో జరిగిన ఫైనల్లో దివ్య దేశ్‌ముఖ్ ఓవరాల్‌గా 2.5–1.5 పాయింట్ల తేడాతో విజయం సాధించింది. ఆదివారం క్లాసికల్ ఫార్మాట్‌లో నిర్ణీత రెండు గేమ్‌లు ముగిశాక ఇద్దరూ 1–1తో సమంగా నిలిచారు. దాంతో విజేతను నిర్ణయించేందుకు సోమవారం టైబ్రేక్ నిర్వహించారు. ర్యాపిడ్ ఫార్మాట్‌లో 15 నిమిషాల నిడివిగల రెండు గేమ్‌లు జరిగాయి. తొలి గేమ్‌లో తెల్ల పావులతో ఆడిన దివ్య 81 ఎత్తుల్లో 'డ్రా' చేసుకుంది. దాంతో టైబ్రేక్‌లో తొలి గేమ్ ముగిశాక ఇద్దరూ 0.5–0.5తో సమంగా నిలిచారు. రెండో గేమ్‌ను హంపి తెల్ల పావులతో ప్రారంభించింది. ఒకానొక దశలో ఈ గేమ్ కూడా 'డ్రా'గా ముగిసేలా అనిపించింది. చాంపియన్‌ను నిర్ధారించేందుకు మరో రెండు ర్యాపిడ్ గేమ్‌లు అవసరం పడతాయనిపించింది. అయితే సమయాభావం వల్ల కీలక



దశలో హంపి ఒత్తిడికిలోనై పొరపాట్లు చేయడం... వాటిని దివ్య సద్వినియోగం చేసుకుంది. ఫలితంగా రెండో గేమ్‌లో దివ్య 75 ఎత్తుల్లో గెలుపొంది 1.5–0.5తో విజయాన్ని ఖాయం చేసుకుంది. టైబ్రేక్‌లో తొలి రెండు ర్యాపిడ్ గేముల్లోనే విజేత తేలిపోవడంతో తదుపరి గేమ్‌లు నిర్వహించాల్సిన అవసరం రాలేదు. ఈ గెలుపుతో ప్రస్తుతం అంతర్జాతీయ మాస్టర్ (ఐఎం) టైటిల్‌తో ఉన్న దివ్యకు గ్రాండ్‌మాస్టర్ (జీఎం) టైటిల్ ఖాయమైంది. విజేత దివ్య దేశ్‌ముఖ్‌కు స్వర్ణ పతకంతోపాటు 50 వేల డాలర్లు (రూ. 43 లక్షల 38 వేలు)... రన్నరప్ హంపికి రజత పతకంతోపాటు 35 వేల డాలర్లు (రూ. 30 లక్షల 36 వేలు)... మూడో స్థానం పొందిన చైనా గ్రాండ్‌మాస్టర్ టాన్ జోంగికి కాంస్య పతకంతోపాటు 25 వేల డాలర్లు (రూ. 21 లక్షల 68 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి.

గాలివాటమేమీ కాదు...

46 దేశాల నుంచి మొత్తం 107 మంది ప్లేయర్లు పోటీపడ్డ ఈ ప్రపంచకప్ నాకౌట్ టోర్నీలో 2463 రేటింగ్ పాయింట్లు ఉన్న దివ్య 15వ సీడింగ్‌తో బరిలోకి దిగింది. తొలి రౌండ్‌లో 'బై' పొందిన ఈ నాగ్‌పూర్ అమ్మాయి టైటిల్ గెలిచే క్రమంలో తన కంటే ఎంతో మెరుగైన రేటింగ్ పాయింట్లు, గ్రాండ్‌మాస్టర్ హోదా ఉన్న నలుగురు ప్లేయర్లను ఓడించి ఈ విజయం గాలివాటమేమీ కాదని నిరూపించుకుంది. ఫైనల్లో హంపి (2543 రేటింగ్ పాయింట్లు), సెమీఫైనల్లో టాన్ జోంగి (చైనా; 2546), క్వార్టర్ ఫైనల్లో ద్రోణవల్లి హారిక (భారత్; 2483), ప్రీక్వార్టర్ ఫైనల్లో జు జినెర్ (చైనా; 2547 రేటింగ్)లపై దివ్య గెలిచింది. దివ్య 2005లో జన్మించగా... హంపి 2002లోనే గ్రాండ్‌మాస్టర్ హోదా పొందింది. ఇప్పటికి రెండుసార్లు హంపి ప్రపంచ ర్యాపిడ్ చాంపియన్ (2019లో, 2024లో) నిలిచింది. ఈ నేపథ్యంలో ఫైనల్లో హంపినే ఫేవరెట్ అనుకున్నారంతా... కానీ అందరి అంచనాలను తారుమారు చేస్తూ అద్భుత విజయంతో 'దివ్య'మైన చెస్ ప్రపంచాన్ని సొంతం చేసుకుంది. విజేతగా నిలిచిన వెంటనే దివ్య తన భావోద్వేగాన్ని తల్లితో పంచుకుంది.

డాక్టర్ల ఫ్యామిలీ నుంచి...

దివ్య తల్లిదండ్రులు నమ్రత, జితేంద్ర దేశ్‌ముఖ్‌లిద్దరూ డాక్టర్లు. 2005 డిసెంబర్ 5న నాగ్‌పూర్‌లో జన్మించిన దివ్య ఐదేళ్ల ప్రాయంలో చెస్‌లో అడుగు పెట్టింది. దివ్య సోదరి బ్యాడ్మింటన్ శిక్షణకు వెళుతున్న సమయంలో అక్కడే జరుగుతున్న చెస్ శిబిరంలో దివ్య చేరింది. ఆ తర్వాత చెస్‌పై మక్కువ ఏర్పడటంతో ఆటను సీరియస్‌గా తీసుకుంది. 2020లో ఆన్‌లైన్‌లో జరిగిన చెస్ ఒలింపియాడ్‌లో విజేతగా నిలిచిన భారత జట్టులో సభ్యురాలిగా ఉన్న దివ్య 2021లో అంతర్జాతీయ మాస్టర్ (ఐఎం) హోదా పొందింది. ఆ తర్వాత 2022లో జాతీయ చాంపియన్‌గా నిలిచింది. 2022 చెస్ ఒలింపియాడ్‌లో వ్యక్తిగత కాంస్య పతకం... 2023లో ఆసియా చాంపియన్‌షిప్‌ను సొంతం చేసుకుంది. 2023లోనే జరిగిన టాటా స్టీల్ చెస్ టోర్నీ ర్యాపిడ్ విభాగంలో హారిక, హంపి, సవితాశ్రీ, వంతిక అగర్వాల్, ఇరీనా క్రుష్‌లను ఓడించిన దివ్య వరల్డ్ చాంపియన్ జు వెన్‌జున్‌తో, అనా ఉషెనినాతో గేమ్‌లు 'డ్రా' చేసుకొని టోర్నీ విజేతగా నిలిచింది. 2024లో గాంధీ నగర్‌లో జరిగిన ప్రపంచ జూనియర్ చాంపియన్‌షిప్‌లో టైటిల్ నెగ్గిన దివ్య... హంగేరిలో జరిగిన చెస్ ఒలింపియాడ్‌లో భారత జట్టుకు స్వర్ణం దక్కడంలో కీలకపాత్ర పోషించింది. వ్యక్తిగత విభాగంలోనూ ఆమె బంగారు పతకాన్ని సాధించింది.



హంపి

ప్రస్తుత వరల్డ్ ర్యాపిడ్ చాంపియన్ అయిన హంపి ఓటమి ఊహించలేనిది. ఎండ్‌గేమ్‌లో ఆమె వరుసగా తప్పులు చేసింది. 54వ ఎత్తులో చిన్న పొరపాటు చేసి హంపి వెనుకబడినా... ఆమెకు కోలుకునే అవకాశం కూడా వచ్చింది. అయితే సమయాభావ ఒత్తిడి ఆమెపై ప్రభావం చూపించింది. 67వ ఎత్తు వేసే సమయానికి దివ్యకు సానుకూల పరిస్థితి ఏమీ లేదు. దీనిని హంపి జాగ్రత్తగా వేసి ఉంటే గేమ్ డ్రా వైపు వెళ్లేది. కానీ ఇక్కడే హంపి మళ్లీ మరో పెద్ద తప్పు చేసింది. కొత్త తరానికి ప్రతినిధి అయిన దివ్య కొత్తగా నేర్చుకోవడంలో, దూసుకుపోవడంలో సహజంగానే కాస్త ఎక్కువ చురుకుదనాన్ని ప్రదర్శించింది. సుదీర్ఘ కెరీర్‌లో ఎన్నో ఘనతలు సాధించిన హంపిని ఎదుర్కొనేందుకు దివ్య పక్కాగా కొత్త ప్రణాళికలతో సిద్ధమై వచ్చినట్లు కనిపించింది.

–చంద్రమౌళి, ఇంటర్నేషనల్ చెస్ ఆర్బిటర్

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో



విన్నర్స్ ట్రోఫీ, స్వర్ణ పతకంతో దివ్య

4 భారత్ నుంచి గ్రాండ్‌మాస్టర్ (జీఎం) టైటిల్ పొందిన నాలుగో మహిళా క్రీడాకారిణిగా దివ్య గుర్తింపు పొందింది. గతంలో హంపి (2002లో), ద్రోణవల్లి హారిక (2011లో), వైశాలి (2023లో) ఈ ఘనత సాధించారు.

88 భారత్ నుంచి 88వ గ్రాండ్ మాస్టర్ (జీఎం) హోదా పొందిన ప్లేయర్ దివ్య.

44 గ్రాండ్‌మాస్టర్ (జీఎం) టైటిల్ హోదా ఉన్న మహిళా చెస్ ప్లేయర్లు.

సాక్షి సినిమా



కాంతలో దుల్కర్ సల్మాన్

డబుల్ ధమాకా

హీరో దుల్కర్ సల్మాన్ తన ఫ్యాన్స్‌కు డబుల్ ధమాకా ఇచ్చారు. సోమవారం (జులై 28) దుల్కర్ బర్త్ డే. ఈ సందర్భంగా ఆయన నటిస్తున్న 'కాంత, ఆకాశంలో ఒక తార' సినిమాల అప్‌డేట్స్ ఇచ్చారు మేకర్స్. దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే హీరో హీరోయిన్లుగా, సముద్రఖని కీలక పాత్రలో నటిస్తున్న పీరియాడికల్ సినిమా 'కాంత'. ఈ ద్విభాషా (తెలుగు, తమిళం) సినిమాను రానా దగ్గుబాటి, దుల్కర్ సల్మాన్, ప్రశాంత్ పొట్లూరి, జోమ్ వర్గీస్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. 'ఏంటి.. నటచక్రవర్తి.. ఆరంభమే అబ్బుర పరచేలా ఉందే..!, 'అన్నట్టు సినిమా పేరు శాంత కాదు.. కాంత... ఆడియన్స్‌కి ఇదే నచ్చుతుంది' వంటి డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి. విలక్షణ నటుడు చంద్రన్‌గా దుల్కర్ సల్మాన్, వెటరన్ రైటర్–డైరెక్టర్ అయ్య పాత్రలో సముద్రఖని నటించారు. సెప్టెంబరు 12న విడుదల కానున్న 'కాంత' కి ఝను చంతర్ సంగీతం అందించారు. ఇక దుల్కర్ సల్మాన్ హీరోగా పవన్ సాధినేని దర్శకత్వం వహించిన సినిమా 'ఆకాశంలో ఒక తార'. గీతా ఆర్ట్స్, స్వప్న సినిమాస్ సమర్పణలో సందీప్ గుణ్ణం, రమ్య గుణ్ణం నిర్మిస్తున్నారు. ఈ చిత్రం గ్లింప్స్ రిలీజ్ చేశారు. ఈ మూవీకి సంగీతం: జీవీ ప్రకాష్‌కుమార్.

మనం వేరే దారి వెతుకుదాం!



'అవతార్ 3' పోస్టర్

ప్రముఖ హాలీవుడ్ దర్శకుడు జేమ్స్ కామెరూన్ వెండితెరపై సృష్టించిన విజువల్ వండర్ 'అవతార్'. 'పండోర' అనే ఓ కల్పిత గ్రహం నేపథ్యంలో జేమ్స్ కామెరూన్ తెరకెక్కించిన 'అవతార్' సినిమా 2009లో విడుదలై బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఆ తర్వాత 'అవతార్' ఫ్రాంచైజీ నుంచి 2022లో వచ్చిన 'అవతార్: ద వే ఆఫ్ వాటర్' కూడా ప్రేక్షకులను మెప్పించింది. తాజాగా ఈ ఫ్రాంచైజీ నుంచి 'అవతార్: ఫైర్ అండ్ యాష్' (అవతార్ 3) చిత్రం రూపొందింది. సామ్ వర్తింగ్టన్, జో సల్దానా, సిగౌర్నీ వీవర్, ఉనాచాప్లిన్, స్టీఫెన్‌లాంగ్ ఈ చిత్రంలో ప్రధాన పాత్రల్లో నటించారు. ఈ డిసెంబరు 19న ఈ సినిమా రిలీజ్ కానుంది. కాగా సోమవారం ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. 'నువ్వు చేయగలిగింది ఏదైనా ఉంటే.. ఆ పని వెంటనే చేయాలి', 'మనం వేరే దారి వెతుకుదాం' వంటి పలు డైలాగ్స్‌తో, సూపర్ విజువల్స్‌తో ట్రైలర్ ఆకట్టుకునేలా ఉంది.

కబడ్డీ నేపథ్యంలో...



విజయ రామరాజు, సిజారోజ్

విజయ రామరాజు, సిజారోజ్ జోడీగా నటించిన చిత్రం 'అర్జున్ చక్రవర్తి'. విక్రాంత్ రుద్ర దర్శకత్వంలో శ్రీని గుబ్బల నిర్మించారు. ఈ సినిమా టీజర్‌ని డైరెక్టర్ హను రాఘవపూడి విడుదల చేశారు. టీజర్ లాంచ్ ఈవెంట్‌లో విక్రాంత్ రుద్ర మాట్లాడుతూ–"12 ఏళ్ల వయసులో అర్జున్ చక్రవర్తిగారి వద్దకు నేను కబడ్డీ ట్రైనింగ్ కోసం వెళ్లినప్పుడు ఆయన ఒక కథ చెప్పారు. ఆ కథని ఎలాగైనా ప్రపంచానికి చెప్పాలని భావించాను. అలా ఆ కథే నేను డైరెక్టర్ కావడానికి డ్రైవ్ చేసింది. ఈ సినిమాకి 46 అంతర్జాతీయ అవార్డులు వచ్చాయి" అని తెలిపారు. విజయ రామరాజు మాట్లాడుతూ– "నేను ఏడాదిన్నర పాటు ప్రో కబడ్డీ టీమ్స్‌తో ప్రయాణం చేసి, కబడ్డీ నేర్చుకుని ఈ సినిమా చేశాను" అని పేర్కొన్నారు. "ఎక్కడా రాజీ పడకుండా ఈ చిత్రం నిర్మించాను" అన్నారు శ్రీని గుబ్బల. ఈ కార్యక్రమంలో సిజ్జా రోజ్, సంగీత దర్శకుడు విగ్నేష్ భాస్కరన్, కెమెరామెన్ జగదీష్, నటుడు దుర్గేష్ మాట్లాడారు.

కూలీ ట్రైలర్ వస్తోంది



'కూలీ' పోస్టర్

రజనీకాంత్ హీరోగా నటించిన తాజా చిత్రం 'కూలీ'. ఈ సినిమాలో నాగార్జున, సత్యరాజ్, సౌబిన్ షాహిర్, ఉపేంద్ర, శ్రుతీహాసన్, మహేంద్రన్ ఇతర ప్రధాన పాత్రల్లో నటించారు. లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో సన్ పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ నిర్మించిన ఈ సినిమా ఆగస్టు 14న రిలీజ్ కానుంది. నిర్మాతలు డి. సురేష్ బాబు, 'దిల్' రాజు, సునీల్ నారంగ్, భరత్ నారంగ్ యాజమాన్యంలోని ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థ ఏషియన్ మల్టీప్లెక్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ 'కూలీ' తెలుగు విడుదల హక్కులను సొంతం చేసుకుంది. కాగా ఈ సినిమా ట్రైలర్‌ను ఆగస్టు 2న విడుదల చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించి, కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ చిత్రానికి సంగీతం: అనిరుధ్ రవిచందర్.

నచ్చేస్తుందే.. నచ్చేస్తుందే...



సిద్ధు జొన్నలగడ్డ, రాశీఖన్నా

సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'తెలుసు కదా'. ఈ చిత్రంలో రాశీఖన్నా, శ్రీనిధీ శెట్టి హీరోయిన్లుగా నటించగా, వైవా హర్ష కీలక పాత్రలో చేశారు. స్టైలిస్ట్ నీరజా కోనను దర్శకురాలిగా పరిచయం చేస్తూ టీజీ విశ్వప్రసాద్, కృతీ ప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం అక్టోబరు 17న విడుదల కానుంది. రొమాంటిక్ డ్రామాగా రూపొందుతోన్న ఈ చిత్రంలోని 'మల్లికా గంధ' అనే పాట లిరికల్ వీడియోని మల్లారెడ్డి విమెన్స్ ఇంజనీరింగ్ కాలేజీలో విడుదల చేశారు మేకర్స్. "మాంగళ్యం కట్టే సమయం.. ఏడడుగులతోనే పయనం.. ఈ నిమిషం కోసం నాదే మనసే వేచే ఉన్నదే... నచ్చేస్తుందే.. నచ్చేస్తుందే.. నీతో ఉండే ప్రతి క్షణమే.. మల్లికా గంధ... మల్లికా గంధ..' అంటూ సాగుతుందీ పాట. కృష్ణకాంత్ ఈ పాటకు సాహిత్యం అందించగా, సిద్ శ్రీరామ్ పాడారు. ఈ సినిమాకు తమన్ మ్యూజిక్ డైరెక్టర్.

సూపర్ హీరో



కల్యాణీ ప్రియదర్శన్

హీరోయిన్ కల్యాణీ ప్రియదర్శన్ లీడ్ రోల్‌లో నటిస్తున్న తాజా మలయాళ చిత్రం 'లోకా: చాప్టర్ 1'. డొమినిక్ అరుణ్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో 'ప్రేమలు' ఫేమ్ నస్లేన్ కీలక పాత్ర పోషిస్తున్నారు. వేఫరర్ ఫిల్మ్స్ పతాకంపై హీరో దుల్కర్ సల్మాన్ నిర్మిస్తున్నారు. 'లోకా: చాప్టర్ 1' టీజర్‌ని సోమవారం విడుదల చేశారు మేకర్స్. "చంద్ర అనే ఓ సాధారణ అమ్మాయి సూపర్ హీరోగా ఎలా మారింది? అనే కథాంశంతో ఈ సినిమా రూపొందుతోంది. ఈ సినిమాని దక్షిణాదిలోని అన్ని భాషల్లో విడుదల చేసే ఆలోచన ఉంది" అని చిత్రయూనిట్ పేర్కొంది. ఇదిలా ఉంటే.. ఓనమ్ సందర్భంగా ఆగస్టు 27న లేదా సెప్టెంబర్ 5న 'లోకా: చాప్టర్ 1' విడుదల కానుందని మాలీవుడ్ టాక్.

నన్ను మీ వాణ్ణి చేసేసుకున్నారు

– విజయ్ దేవరకొండ



వెంకటేశ్, సత్యదేవ్, భాగ్యశ్రీ బోర్సే, విజయ్ దేవరకొండ, నాగవంశీ, అనిరుధ్

"'కింగ్డమ్' సినిమా విడుదలకు కేవలం రెండు రోజులే ఉన్నాయి. ఈ నెల 31న మిమ్మల్ని(అభిమానులు, ప్రేక్షకులు) థియేటర్స్‌లో కలుస్తాం. లోపల భయమేస్తోంది.. అలాగే ఓ సంతృప్తి ఉంది, లోపల చిన్న ఒత్తిడి ఉంది.. అలానే సంతోషంగా ఉంది. మేము ఎలాంటి సినిమా తీశామనే దానిపై మా టీమ్ అంతా సంతోషంగా ఉన్నాం.. రిజల్ట్ ఏంటన్నది మీరే చెప్పాలి" అని విజయ్ దేవరకొండ చెప్పారు. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో విజయ్ దేవరకొండ, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటించిన చిత్రం 'కింగ్డమ్'. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్, ఫోర్చ్యూన్ ఫోర్ సినిమాస్‌పై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ సినిమా ఈ నెల 31న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో **విజయ్ దేవరకొండ మాట్లాడుతూ** – " మీరు (అభిమానులు) దేవుడిచ్చిన వరం.. నా సినిమా హిట్ అయినా, ఫ్లాప్ అయినా అదే ప్రేమ, అదే అభిమానం చూపిస్తున్నారు. 'కింగ్డమ్'తో మనం హిట్ కొడుతున్నామంటూ మీరు స్వయంగా నాతో అంటుంటే... నన్ను మీ వాణ్ణి చేసేసుకున్నారు. 'పెళ్ళిచూపులు, అర్జున్ రెడ్డి' సినిమాలప్పుడే ఫిక్స్ అయింది రెండే.. దేవుడు మీకు నన్ను పరిచయం చేసింది సినిమా వల్ల.. వాటికోసం నేను ప్రాణం పెట్టి చేస్తా.. చేస్తూనే ఉన్నా. కానీ, ఇప్పటి నుంచి నేను చేసే ఏ సినిమా అయినా సరే మీరు గౌరవించేలా ఉంటుంది. ఇక రెండోది.. మిమ్మలందర్నీ నేను కలవలేమోగానీ, నేను ఉన్నంత వరకు, నా శక్తి మేరకు మీ అందరి లైఫ్‌లో పాజిటివ్‌గా కాంట్రిబ్యూట్ చేసే పోతాను.. ఎలాగైనా మీ జీవితంలో నేను కూడా మంచిది తిరిగిచ్చే పోతాను. నేను ఏం చేయగలనో అది 100శాతం చేస్తాను.. అది నా బాధ్యత. ఇది నా 'కింగ్డమ్' కాదు.. గౌతమ్ తిన్ననూరి 'కింగ్డమ్'. ఈ రోజు వరకూ ఆయన సినిమా పనిమీదే ఉన్నారు. తన సంగీతంతో అనిరుధ్ ఈ సినిమాని తర్వాతి స్థాయికి తీసుకెళ్లారు. ఈ చిత్రం గొప్పగా రావడానికి నాగవంశీగారు ఎంతో ఖర్చు పెట్టారు. భాగ్యశ్రీ, సత్యదేవ్, వెంకటేశ్‌గార్ల పాత్రలు అద్భుతంగా ఉంటాయి. రెండు రోజుల్లో మిమ్మల్ని కలుస్తున్నాం. మీ ఆకాంక్ష నాకు తెలుసు. 'కింగ్డమ్'తో మనం కొడదాం" అని తెలిపారు. "'కింగ్డమ్' సినిమాలో భాగమైనందుకు చాలా గౌరవంగా ఉంది" అన్నారు **భాగ్యశ్రీ బోర్సే**. "విజయ్‌కి మంచి మనసుంది. తను దేవరకొండ కాదు.. బంగారు కొండ" అని చెప్పారు నటుడు **సత్య దేవ్**.

ఈ వేడుకలో కెమెరామేన్స్ జోమోన్ టి.జాన్, గిరీష్ గంగాధరన్, డైరెక్టర్ నీరజా కోన, పాటల రచయిత కృష్ణకాంత్, ప్రొడక్షన్ డిజైనర్ అవినాష్ కొల్లా, 'ఆదిత్య మ్యూజిక్' నిరంజన్, మాధవ్, ఎడిటర్ నవీన్ నూలి తదితరులు పాల్గొన్నారు.

యముడు విజయం సాధించాలి

– బెక్కెం వేణుగోపాల్



వేణుగోపాల్, జగదీష్, శ్రావణి

"ప్రతి ఏడాది వందల చిత్రాలొస్తున్నా, అందులో కొంతమందికి మాత్రమే సక్సెస్ వస్తోంది. చిన్న సినిమాలు ఈ మధ్య అద్భుతాలు సృష్టిస్తున్నాయి. అలా ఈ 'యముడు' చిత్రం కూడా పెద్ద విజయం సాధించాలి" అని నిర్మాత బెక్కెం వేణుగోపాల్ అన్నారు. జగదీష్ ఆమంచి హీరోగా నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన సినిమా 'యముడు'. 'ధర్మో రక్షతి రక్షితః' అనేది ఉపశీర్షిక. శ్రావణి శెట్టి హీరోయిన్‌గా నటించిన ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. హైదరాబాద్‌లో ఈ సినిమా ఆడియో లాంచ్ వేడుక నిర్వహించారు. ఈ సినిమాలోని పాటలను కే మ్యూజిక్ సీఈఓ ప్రియాంక, బెక్కెం వేణుగోపాల్, మల్లిక విడుదల చేశారు. ఈ సందర్భంగా జగదీష్ ఆమంచి మాట్లాడుతూ–"ప్రస్తుతం ఎక్కడ చూసినా కుట్రలు, హత్యలు, వివాహేతర సంబంధాలకు సంబంధించిన వార్తలే కనిపిస్తున్నాయి. ఈ పాయింట్‌తో 'యముడు' తీశాం" అని పేర్కొన్నారు. "మంచి కథాంశంతో రూపొందిన మా సినిమాను ప్రేక్షకులు ఆదరించాలి" అని కెమెరామెన్ విష్ణు, శ్రావణి శెట్టి, మల్లిక, ఆకాష్, భవానీ రాకేష్, స్క్రీన్ ప్లే రైటర్ శివ కోరారు.

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
572	156
80,891	24,681

విదేశీ సూచీలు

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	21,139	△	31
డోజోన్స్	44,755	▽	147
ఎఫ్‌టీఎస్‌ఈ 100	9,069	▽	52
డాక్స్	23,961	▽	257
షాంఘై	3,598	△	4
నికాయ్	40,998	▽	458

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో


			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	[illegible]	86.05	87.07
£	బ్రిటన్ పౌండ్	[illegible]	114.90	117.79
€	యూరో	[illegible]	100.20	102.98
¥	జపాన్ యెన్ (100)	[illegible]	58.19	59.69
AU$	ఆస్ట్రేలియా డాలర్	[illegible]	55.75	57.99
S$	సింగపూర్ డాలర్	[illegible]	65.01	68.66
SAR	సౌదీ రియాల్	[illegible]	22.14	23.62
UAE D	యూఏఈ దిర్హామ్	[illegible]	22.60	23.85
¥	చైనా యువాన్	[illegible]	11.15	12.97

ఈ ఐటీకి ఏమైంది..?

సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల్లో తొలగింపు గుబులు...

- టీసీఎస్ 12,000 సిబ్బంది కోత ప్రకటనతో ఉలిక్కిపడ్డ ఐటీ పరిశ్రమ
- ఏఐ, ఆటోమేషన్, అధిక వ్యయాల ఎఫెక్ట్
- ఇది ఆరంభమే.. మరిన్ని కంపెనీలదీ ఇదే బాట అంటున్న విశ్లేషకులు

2000 సంవత్సరంలో వై2కే, 2017లో క్లౌడ్.. ఇప్పుడు ఏఐ.. ఇలా టెక్నాలజీ కంపెనీల్లో ఉద్యోగులకు సరికొత్త టెక్నాలజీలే పెను సవాలుగా మారుతున్నాయి. ఇన్నాళ్లూ ఉద్యోగ కల్పవృక్షంగా నిలుస్తున్న ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) రంగంలో ఒక్కసారిగా 'కోత'ల గుబులు మొదలైంది. సాఫ్ట్‌వేర్ దిగ్గజం టీసీఎస్ 12,000 మందికి పైగా సిబ్బందిని తొలగిస్తున్నట్లు చేసిన ప్రకటనతో పరిశ్రమకు షాక్ తగిలింది. ఒకపక్క అమెరికా అధ్యక్షుడు ట్రంప్ టారిఫ్ వార్ దెబ్బ, మరోపక్క ప్రపంచ ఆర్థిక మందగమనంతో ఐటీ కంపెనీల ఆదాయాలకు చిల్లు పడుతోంది. దీంతో వ్యయాలను తగ్గించుకుంటున్నాయి. పులిమీదపుట్రలా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), ఆటోమేషన్ కూడా ఉద్యోగులకు కునుకు లేకుండా చేస్తున్నాయి. టీసీఎస్ చర్యలు ఆరంభమేనని.. రానున్న కాలంలో మరిన్ని కంపెనీలూ ఇదే బాట పట్టొచ్చనేది విశ్లేషకుల మాట.



దేశంలో అతిపెద్ద ఐటీ కంపెనీ టీసీఎస్‌లో ఉద్యోగాల తొలగింపు వార్త అటు ఐటీ రంగాన్నే కాదు.. స్టాక్ మార్కెట్లను సైతం కుదిపేసింది. పరిశ్రమ లీడర్ పరిస్థితే ఇలా ఉంటే.. ఇక మిగతా కంపెనీలు ఎలాంటి చర్యలకు దిగుతాయోనన్న భయమే దీనికి కారణం. వాస్తవానికి ఐటీలో కొత్త ఉద్యోగాలు గత రెండు మూడేళ్లుగా పెద్దగా పెరగడం లేదు. టీసీఎస్‌నే తీసుకుంటే, 2022–23 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ మొత్తం ఉద్యోగుల సంఖ్య 6.14 లక్షల గరిష్ఠ స్థాయిని చేరుకుంది. అయితే, 2019–20లో 4.48 లక్షలుగా ఉన్న కంపెనీ సిబ్బంది సంఖ్య తదుపరి మూడేళ్లలో ఏకంగా 1.7 లక్షలు పెరగడం విశేషం. ఆపై క్రమంగా దిగజారుతూనే ఉంది. 2023–24లో 6.01 లక్షలకు పడిపోయింది. 13,249 మంది సిబ్బంది తగ్గిపోయారు. గతేడాది కాస్త పుంజుకుని 6.07 లక్షలకు చేరుకుంది. తాజాగా 2025–26 తొలి త్రైమాసికం (క్యూ1)లో నికరంగా 5,090 మంది సిబ్బంది జతయ్యారు. అయినప్పటికీ మొత్తం సిబ్బంది సంఖ్య మూడేళ్ల క్రితం నాటి గరిష్ఠ స్థాయి కిందే కొనసాగుతోంది. ఇక మిగతా కంపెనీల విషయానికొస్తే, టాప్–5 కంపెనీలు కలిపి ఈ ఏడాది క్యూ1లో కేవలం 4,703 ఉద్యోగులను మాత్రమే నికరంగా జత చేసుకున్నాయి. ఇందులో టీసీఎస్, ఇన్ఫోసిస్ మినహా మిగతా మూడు కంపెనీల్లో సిబ్బంది సంఖ్య తగ్గిపోవడం గమనార్హం. ఐటీ నియామకాల్లో మందగమనాన్ని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

ఎందుకీ పరిస్థితి...

టీసీఎస్ ప్రకటించిన 12,000 మంది సిబ్బంది కోతల్లో అత్యధికంగా మధ్య, సీనియర్ స్థాయి ఉద్యోగులపైనే ప్రభావం చూపనుంది. భవిష్యత్తు సవాళ్లకు సంసిద్ధంగా తీర్చిదిద్దడం, టెక్నాలజీలో పెట్టుబడులపై మరింత ఫోకస్ చేయడం, ఏఐ వినియోగం, మార్కెట్ విస్తరణ, సిబ్బంది పునర్వ్యవస్థీకరణ వంటి విస్తృత వ్యూహాలను కంపెనీ దీనికి కారణంగా చెబుతోంది. అంటే, రానున్న రోజుల్లో ఇతర కంపెనీలు కూడా ఇలాంటి వ్యూహాల వైపే నడుస్తాయనే సంకేతాలు కనబడుతున్నాయి. 'ఆర్థిక ఒత్తిళ్లతో పాటు క్లయింట్ల అంచనాలు, అలాగే చురుకైన, ఫలితాల ఆధారిత డెలివరీ విధానాల దిశగా పరిశ్రమలో వస్తున్న మార్పులు వంటి అనేక అంశాలు టీసీఎస్ సిబ్బంది కోత నిర్ణయాన్ని ప్రతిబింబిస్తున్నాయి' అని కౌంటర్ పాయింట్ రీసెర్చ్ సంస్థలో రీసెర్చ్ డైరెక్టర్ తరుణ్ పాఠక్ వ్యాఖ్యానించారు. బెంచ్ సిబ్బంది విషయంలో కఠిన పాలసీని కంపెనీలన్నీ అమలు చేస్తుండటాన్ని చూస్తుంటే, సిబ్బంది సేవలను పూర్తిగా సద్వినియోగం చేసుకోవడంపై ఐటీ సంస్థలు దృష్టి పెడుతున్నాయనేందుకు నిదర్శనం. అయితే, టీసీఎస్ మాత్రం ఏఐకి తాజా కోతలకు సంబంధం లేదని చెబుతోంది. కానీ టెక్ పరిశ్రమలో సిబ్బంది నియామకాలను ఏఐ, ఆటోమేషన్ అనేవి మరింత ప్రభావితం చేస్తున్న తరుణంలో టీసీఎస్ నిర్ణయం వెలువడం గమనార్హం. మరోపక్క, ఇటీవలి ఐటీ కంపెనీల ఫలితాలను పరిశీలిస్తే.. ఆదాయాల్లో ఏమంత పెద్ద పెరుగుదల లేదు. క్లయింట్లు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. దీంతో వ్యయాల తగ్గింపునకు కంపెనీలు మొగ్గు చూపడం కూడా నియామకాలపై ప్రభావం చూపుతోందని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి.

– సాక్షి, బిజినెస్ డెస్క్

పరిశీలిస్తున్నాం: ఐటీ శాఖ

భారీ స్థాయిలో ఉద్యోగులను తొలగించాలన్న టీసీఎస్ నిర్ణయంతో తలెత్తే పరిణామాలను కేంద్ర ఐటీ శాఖ నిశితంగా పరిశీలిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. మరోవైపు, కార్మిక శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయను కలిసిన నాసెంట్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎంప్లాయీస్ సెనేట్ (ఎన్‌ఐటీఈఎస్), ఉద్యోగుల తొలగింపుపై వివరణ ఇవ్వాలని ఆదేశిస్తూ టీసీఎస్‌కు నోటీసులు ఇవ్వాలని కోరింది.

ప్రపంచవ్యాప్తంగా ఇదే తీరు...

మైక్రోసాఫ్ట్, గూగుల్, ఫేస్‌బుక్‌తో సహా ప్రపంచ టెక్నాలజీ దిగ్గజాలు.. ఇప్పటికే ఉద్యోగుల తగ్గింపు బాట పట్టాయి. ముఖ్యంగా సరికొత్త డిజిటల్ ప్రాధాన్యతలకు అనుగుణంగా ఉద్యోగ విధులు, నైపుణ్యాలను మదింపు చేస్తూ అవసరమైన వారికి శిక్షణ ఇవ్వడం.. లేదంటే వేటు వేయడానికీ వెనుకాడటం లేదు. 'మన ఐటీ కంపెనీల విషయానికొస్తే.. సమర్థవంతమైన, పనితీరు ఆధారిత సిబ్బంది విధానాల వైపు మార్పునకు ఈ చర్యలు అద్దం పడుతున్నాయి' అని పాఠక్ అభిప్రాయపడ్డారు. 'ప్రపంచవ్యాప్తంగా కంపెనీలన్నీ ఇప్పుడు ఏఐ ఆసరాతో తక్కువ వ్యయానికి మరిన్ని సేవలు కోరుతున్నాయి. ఖర్చులు తగ్గించుకుంటున్నాయి. దీంతో ఐటీ సంస్థల సిబ్బంది కోతలకు ఆజ్యం పోస్తోంది. భవిష్యత్తు అంతా ఏఐ ఆధారిత ఐటీ వైపు మారుతోంది. ప్రస్తుత మానవ నైపుణ్యాలతో పోటీ పడే ఏఐ ఏజెంట్లు.. ఇప్పుడున్న కొంత మంది సిబ్బందిని భర్తీ చేసే ప్రక్రియ జోరందుకుంటుంది' అని టెక్‌ఆర్క్ వ్యవస్థాపకుడు ఫైజల్ కవూసా అభిప్రాయపడ్డారు. ఐటీ డిమాండ్ తగ్గడం, క్లయింట్ల ప్రాధాన్యతలు మారడం వల్ల ఎదురవుతున్న మార్జిన్ ఒత్తిళ్లు.. సిబ్బంది కోతకు దారితీస్తున్నాయని సైబర్ మీడియా రీసెర్చ్ వైస్ ప్రెసిడెంట్ ప్రభు రామ్ పేర్కొన్నారు.

క్యూ1లో టాప్-5 కంపెనీల్లో ఉద్యోగాలు ఇలా..

కంపెనీ	నికరంగా జత	మొత్తం ఉద్యోగులు
టీసీఎస్	5,090	6,13,069
ఇన్ఫోసిస్	210	3,23,788
విప్రో	(-)114	2,33,232
హెచ్‌సీఎల్ టెక్	(-)269	2,23,151
టెక్ మహీంద్రా	(-)214	1,48,517

నైపుణ్యాలు లేకుంటే ఇంటికే...

కంపెనీ పనితీరును మెరుగుపరిచేందుకు టీసీఎస్‌తో పాటు దిగ్గజ ఐటీ కంపెనీలన్నీ ఏఐ, ఆటోమేషన్ బాట పడుతున్నాయి. మార్జిన్లు పెంచుకోవడానికి తక్కువ సిబ్బందితో ఎక్కువ ఫలితాలు పొందాలనేది వాటి తాజా వ్యూహం. ప్రతి కంపెనీలో సిబ్బంది, విధానాలు, టెక్నాలజీ అన్నీ ఏఐ చుట్టూనే తిరుగుతున్నాయని టీమ్ లీజ్ డిజిటల్ సీఈఓ నీతి శర్మ పేర్కొన్నారు. 'కంపెనీలన్నీ తమ ప్రస్తుత సిబ్బందితో పాటు కొత్తగా తీసుకునే ఉద్యోగుల సాంకేతిక నైపుణ్యాలను పెంచేందుకు భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి. స్కిల్స్ పెంచుకోకుండా, భవిష్యత్తు విధానానికి అనుగుణంగా లేనివారిపై వేటు తప్పదు. దీర్ఘకాలంలో కంపెనీల్లో అనేక సానుకూల మార్పులతో పాటు కొన్ని ప్రతికూలతలు కూడా తప్పవు' అని శర్మ అభిప్రాయపడ్డారు.

ఇండస్‌ఇండ్ లాభం డౌన్



న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగ దిగ్గజం ఇండస్‌ఇండ్ బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) తొలి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 72% క్షీణించి రూ.604 కోట్లకు పరిమితమైంది. గతేడాది (2024–25) ఇదే కాలంలో రూ. 2,171 కోట్లు ఆర్జించింది. అయితే గతేడాది క్యూ4(జనవరి–మార్చి)లో రూ. 2,329 కోట్ల నికర నష్టం ప్రకటించిన సంగతి తెలిసిందే. కాగా.. మొత్తం ఆదాయం రూ.14,988 కోట్ల నుంచి రూ. 14,421 కోట్లకు స్వల్పంగా బలహీనపడింది. నికర వడ్డీ ఆదాయం సైతం రూ. 5,408 కోట్ల నుంచి రూ. 4,640 కోట్లకు తగ్గింది.

ఎన్‌పీఏలు అప్: క్యూ1లో త్రైమాసికవారీగా ఇండస్‌ఇండ్ స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 3.13% నుంచి 3.64 శాతానికి పెరిగాయి. ప్రొవిజన్లు రూ. 2,522 కోట్ల నుంచి రూ.1,760 కోట్లకు తగ్గాయి. తాజా స్లిప్పేజీలు సగానికి తగ్గి రూ. 2,567 కోట్లకు పరిమితమయ్యాయి. వీటిలో రూ.2,322 కోట్లు కన్జూమర్ బ్యాంక్ నుంచి నమోదయ్యాయి. కనీస మూలధన నిష్పత్తి 16.63 శాతానికి చేరింది. మైక్రోఫైనాన్స్ బిజినెస్‌పట్ల అప్రమత్తంగా వ్యవహరిస్తున్నట్లు బ్యాంక్ పేర్కొంది. అయితే ఇకపై గత మోసాల ప్రభావం ఆర్థికంగా ప్రభావం చూపబోదని బ్యాంక్ స్పష్టం చేసింది.

ఇండస్‌ఇండ్ బ్యాంక్ షేరు 2.6% క్షీణించి రూ. 802 వద్ద ముగిసింది.

మోల్డ్‌టెక్ లాభం రూ. 22 కోట్లు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో మోల్డ్‌టెక్ ప్యాకేజింగ్ లాభం రూ. 22 కోట్లుగా నమోదైంది. గతేడాది ఇదేకాలంలో లాభం రూ. 16.52 కోట్లు. మరోవైపు ఆదాయం రూ. 198 కోట్ల నుంచి రూ. 241 కోట్లకు ఎగిసింది. రూ. 5 ముఖ విలువ చేసే ఒక్కో షేరుపై 40 శాతం మేర (రూ. 2) కంపెనీ మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. 2024–25కి సంబంధించి రూ. 2 తుది డివిడెండ్ ప్రకటించడంతో ఒక్కో షేరుపై మొత్తం రూ. 4 చొప్పున డివిడెండ్ ఇచ్చినట్లవుతుందని సంస్థ తెలిపింది. కొత్త ఆవిష్కరణలు, వ్యూహాత్మకంగా కార్యకలాపాల విస్తరణపై దృష్టి పెట్టడటం, ఉత్పత్తి సామర్థ్యాలను మెరుగుపర్చుకోవడం తదితర అంశాల వల్ల కీలకమైన వ్యాపార విభాగాల్లో పటిష్ఠమైన పనితీరు సాధించినట్లు సంస్థ సీఎండీ జె. లక్ష్మణరావు తెలిపారు. విభాగాలవారీగా చూస్తే పెయింట్స్ ప్యాక్స్ 28 శాతం, ఫుడ్..ఎఫ్‌ఎంసీజీ ప్యాక్స్ 14 శాతం, ఫార్మా 11 శాతం వృద్ధి నమోదు చేసినట్లు వివరించారు.

అంబర్ గ్రూప్ చేతికి యూనిట్రానిక్స్

డీల్ విలువ రూ. 404 కోట్లు



న్యూఢిల్లీ: కన్జూమర్ డ్యూరబుల్స్, ఎలక్ట్రానిక్స్ కాంట్రాక్ట్ తయారీ(ఈఎంఎస్) దిగ్గజం అంబర్ గ్రూప్.. ఇజ్రాయెల్ సంస్థ యూనిట్రానిక్స్‌లో నియంత్రిత వాటా కొనుగోలు చేయనుంది. పూర్తిగా నగదు విభాగంలో ఇందుకు రూ. 404 కోట్లు చెల్లించేందుకు తప్పనిసరి ఒప్పందం కుదుర్చుకున్నట్లు అంబర్ గ్రూప్ తాజాగా వెల్లడించింది. అనుబంధ సంస్థ ఐఎల్‌జేఐఎన్ ఎలక్ట్రానిక్స్ ఇండియా ద్వారా సుమారు 40.24% వాటాను సొంతం చేసుకోనున్నట్లు గ్రూప్ కంపెనీ అంబర్ ఇండియా పేర్కొంది. యూనిట్రానిక్స్ జాయింట్ చైర్మన్ హయిమ్ షానీతో కలసి సంయుక్తంగా 45.13% వాటాను పొందనున్నట్లు తెలియజేసింది. తాజా కొనుగోలుతో తమ ఎలక్ట్రానిక్స్ విభాగం ఐఎల్‌జేఐఎన్.. హియరబుల్, వేరబుల్, టెలికం, ఆటోమోటివ్ తదితర పలు విభాగాలకు పోర్ట్‌ఫోలియోను విస్తరించనున్నట్లు అంబర్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్, సీఈవో జస్బీర్ సింగ్ పేర్కొన్నారు.

అంబర్ ఎంటర్‌ప్రైజెస్ షేరు బీఎస్‌ఈలో 2.8% బలపడి రూ. 7,467 వద్ద క్లోజైంది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
స్పీడ్ తగ్గిన పారిశ్రామికోత్పత్తి | రెండు నెలల కనిష్టానికి సూచీలు

భవిత
స్పర్ధయా వర్ధతే విద్య

విద్య, ఉద్యోగ సమాచారం

ఇండియన్ ఆర్మీ.. 66వ షార్ట్ సర్వీస్ కమిషన్(టెక్)కోర్సులో ప్రవేశాలు

ఇండియన్ ఆర్మీ 2026 ఏప్రిల్‌లో ప్రారంభమయ్యే 66వ షార్ట్ సర్వీస్ కమిషన్(టెక్) కోర్సులో ప్రవేశాలకు ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 381.
» పోస్టుల వివరాలు: షార్ట్ సర్వీస్ కమిషన్(టెక్)-66 పురుషులు-350, షార్ట్ సర్వీస్ కమిషన్(టెక్)-66 మహిళలు-29, ఎస్ఎస్‌సీ(డబ్ల్యూ)(టెక్)-01,ఎస్ఎస్‌సీ(డబ్ల్యూ)(నాన్ టెక్)-01.
» ఇంజనీరింగ్ విభాగాలు: సివిల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, మెకానికల్, ఇండస్ట్రియల్, ఆటోమొబైల్, ఏరోస్పేస్, ఏవియానిక్స్, మైనింగ్, కెమికల్, టెక్స్‌టైల్, బయోటెక్.
» అర్హత: బీఈ/బీటెక్ ఉత్తీర్ణులవ్వాలి లేదా 01.04.2026కి ముందు డిగ్రీ పూర్తిచేసే ఫైనల్ ఇయర్ విద్యార్థులు. ఎస్ఎస్‌సీ(డబ్ల్యూ) (నాన్ టెక్)కోసం ఏదైనా విభాగంలో గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణులవ్వాలి.
» వయసు: ఎస్ఎస్‌సీ(టెక్) పురుష- మహిళా అభ్యర్థులు 20 నుంచి 27 ఏళ్ల మధ్య (01.04.1999 నుంచి 31.03.2006 మధ్య జన్మించిన వారై ఉండాలి) ఉండాలి.
» ఫిజికల్ స్టాండర్డ్స్:పురుషులు–2.4 కి.మీ. పరుగు 10.30 నిమిషాల్లో, పుష్–అప్స్ 40, పుల్–అప్స్ 6, మహిళలు 2.4 కి.మీ. పరుగు 13 నిమిషాల్లో, పుష్–అప్స్ 15, పుల్–అప్స్ 2,ఈతలో ప్రాథమిక పరిజ్ఞానం ఉండాలి.
» వేతనం: రూ.56,100 నుంచి రూ.1,77,500.
» స్టైపెండ్: రూ.56,100.
» ఎంపిక విధానం: షార్ట్‌లిస్టింగ్, గ్రాడ్యుయేషన్ మార్కులు, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 22.08.2025
» వెబ్‌సైట్: www.joinindianarmy.nic.in

బీఈఎల్, ఘజియాబాద్ యూనిట్‌లో 32 ఇంజనీర్ పోస్టులు

భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బీఈఎల్) ఘజియాబాద్ యూనిట్‌లో ఫీల్డ్ ఆపరేషన్ ఇంజనీర్, ప్రాజెక్ట్ ఇంజనీర్-1 పోస్టులకు దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 32.
» పోస్టుల వివరాలు: ఫీల్డ్ ఆపరేషన్ ఇంజనీర్–08, ప్రాజెక్ట్ ఇంజనీర్1–24.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్/బీఎస్సీ ఇంజనీరింగ్‌లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» వయసు: 01.07.2025 నాటికి ఫీల్డ్ ఆపరేషన్ ఇంజనీర్‌కు 40 ఏళ్లు, ప్రాజెక్ట్ ఇంజనీర్–1కు 32 ఏళ్లు ఉండాలి.
» వేతనం: నెలకు ఫీల్డ్ ఆపరేషన్ ఇంజనీర్‌కు రూ.60,000 నుంచి రూ.70,000, ప్రాజెక్ట్ ఇంజనీర్–1కు రూ.40,000 నుంచి రూ.55,000.
» ఎంపిక విధానం: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» దరఖాస్తులకు చివరితేది: 05.08.2025.
» ఇంటర్వ్యూ తేది: 04.08.2025, 05.08.2025.
» వెబ్‌సైట్: https://bel-india.in

క్యాట్-2025

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం)ల్లో మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ప్రవేశాలకు కామన్ అడ్మిషన్ టెస్ట్(క్యాట్-2025)కు నోటిఫికేషన్ విడుదలైంది. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

» కోర్సుల వివరాలు: పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లు(పీజీ/ఎంబీఏ), ఫెలో/డాక్టరేట్ ప్రోగ్రామ్‌లు, ఇతర మేనేజ్‌మెంట్ కోర్సులు.
» అర్హత: గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి 50 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభతేది: 01.08.2025
» ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరితేది: 13.09.2025.
» హాల్‌టికెట్ డౌన్‌లోడ్ తేది: 05.11.2025 నుంచి 30.11.2025.
» పరీక్ష తేది: 30.11.2025.
» ఫలితాల వెల్లడి తేది: 2026 జనవరి మొదటి వారం.
» పరీక్ష కేంద్రాలు: దేశవ్యాప్తంగా 170 నగరాల్లో పరీక్ష నిర్వహిస్తారు.
» వెబ్‌సైట్: https://iimcat.ac.in

బీడీఎల్‌లో ట్రైనీ ఇంజనీర్

ప్రభుత్వ రంగ సంస్థ భారత్ డైనమిక్ లిమిటెడ్ (బీడీఎల్).. ఒప్పంద ప్రాతిపదికన వివిధ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. సంస్థకు చెందిన ఏపీ, తెలంగాణల్లోని యూనిట్‌ల్లో ఉన్న 212 ఖాళీలకు ఎంపిక ప్రక్రియ చేపట్టనుంది. ట్రైనీ ఇంజనీర్, ట్రైనీ ఆఫీసర్, ట్రైనీ డిప్లొమా అసిస్టెంట్, ట్రైనీ అసిస్టెంట్ పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఈ నేపథ్యంలో.. బీడీఎల్ పోస్టులు, దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక విధానం, వేతనాలు తదితర వివరాలు..

» మొత్తం 212 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్
» కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ ఆధారంగా ఎంపిక
» దరఖాస్తులకు చివరి తేది: 10.08.2025

- మొత్తం పోస్టుల సంఖ్య: 212
- పోస్టుల వివరాలు: ట్రైనీ ఇంజనీర్–100 పోస్టులు, ట్రైనీ ఆఫీసర్–12 పోస్టులు, ట్రైనీ డిప్లొమా అసిస్టెంట్–90 పోస్టులు, ట్రైనీ అసిస్టెంట్–10 పోస్టులు.
- విభాగాలు: ఎలక్ట్రానిక్స్, మెకానికల్, ఎలక్ట్రికల్, కంప్యూటర్ సైన్స్, హెచ్ఆర్, ఫైనాన్స్, బిజినెస్ డవలప్‌మెంట్.

ఒప్పంద కాల వ్యవధి

తొలుత ఒక ఏడాదికి ఒప్పంద ప్రాతిపదికన నియమిస్తారు. ఆ తర్వాత సంస్థ అవసరాలకు అనుగుణంగా మరో మూడేళ్లు పొడిగించే అవకాశం ఉంది. అంటే నాలుగేళ్లు ఒప్పంద ప్రాతిపదికన పని చేసే వీలుంటుంది. అనంతరం సంస్థ అవసరాలు, అభ్యర్థి పనితీరు ఆధారంగా మరో నాలుగేళ్లు పొడిగించే అవకాశం కూడా ఉంది.

వేతనం

- ట్రైనీ ఇంజనీర్/ట్రైనీ ఆఫీసర్ పోస్టులకు మొదటి ఏడాది నెలకు రూ.29,500, రెండో ఏడాది నెలకు రూ.32,500, మూడో ఏడాది నెలకు రూ.35,500, నాలుగో ఏడాది నెలకు రూ.38,500.
- ట్రైనీ డిప్లొమా అసిస్టెంట్/ట్రైనీ అసిస్టెంట్ పోస్టులకు మొదటి ఏడాది నెలకు రూ.24,500, రెండో ఏడాది నెలకు రూ.26,000, మూడో ఏడాది నెలకు రూ.27,500, నాలుగో ఏడాది నెలకు రూ.29,000.

అర్హతలు

- ట్రైనీ ఇంజనీర్(ఎలక్ట్రానిక్స్, మెకానికల్, ఎలక్ట్రికల్, కంప్యూటర్ సైన్స్) పోస్టులకు సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్ లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణత ఉండాలి.
- ట్రైనీ ఆఫీసర్ ఫైనాన్స్ పోస్టులకు సీఎంఏ/సీఏ/ఫైనాన్స్‌లో గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి రెండేళ్ల ఎంబీఏ/పోస్ట్‌గ్రాడ్యుయేట్ డిగ్రీ/పోస్ట్‌గ్రాడ్యుయేట్ డిప్లొమా కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి.
- ట్రైనీ ఆఫీసర్ హ్యూమన్ రిసోర్సెస్ పోస్టులకు గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి హెచ్ఆర్‌లో రెండేళ్ల ఎంబీఏ లేదా పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా లేదా పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ/పీఎం అండ్ ఐఆర్/పర్సనల్ మేనేజ్‌మెంట్/ఇండస్ట్రియల్ రిలేషన్స్/సోషల్ సైన్స్/సోషల్ వెల్ఫేర్/సోషల్ వర్క్‌లో రెండేళ్ల కోర్సు ఉత్తీర్ణులవ్వాలి.
- ట్రైనీ ఆఫీసర్ బిజినెస్ డెవలప్‌మెంట్ పోస్టులకు గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి మార్కెటింగ్/సేల్స్ అండ్ మార్కెటింగ్‌లో ఎంబీఏ/పోస్ట్‌గ్రాడ్యుయేట్ డిగ్రీ / పోస్ట్‌గ్రాడ్యుయేట్ డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.
- విద్యార్హతల్లో కనీసం 55 శాతం మార్కులు సాధించి ఉండాలి. ఎస్సీ/ఎస్టీలు కనీసం 50 శాతం మార్కులు పొందాలి.
- ట్రైనీ డిప్లొమా అసిస్టెంట్(ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రికల్/మెకానికల్/కంప్యూటర్ సైన్స్) పోస్టులకు సంబంధిత విభాగంలో మూడేళ్ల డిప్లొమా ఇంజనీరింగ్ ఉత్తీర్ణులవ్వాలి. కంప్యూటర్ సైన్స్‌కు సంబంధించి బీఎస్సీ కంప్యూటర్స్/బీసీఏ అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- ట్రైనీ అసిస్టెంట్ ఫైనాన్స్ పోస్టులకు ఫైనాన్స్ స్పెషలైజేషన్‌తో కామర్స్/బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌లో డిగ్రీతోపాటు ఆఫీస్ అప్లికేషన్స్‌లో ఆరు నెలల కంప్యూటర్ కోర్సు పూర్తి చేసి ఉండాలి లేదా సీఏ ఇంటర్/ఐసీడబ్ల్యూ ఇంటర్ /సీఎస్ ఇంటర్ లేదా సైన్స్/ఎకనామిక్స్‌లో డిగ్రీతో పాటు ఒక ఏడాది ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ కోర్సు, ఆఫీస్ అప్లికేషన్స్‌లో ఆరు నెలల కంప్యూటర్ కోర్సు పూర్తి చేసి ఉండాలి.
- ట్రైనీ అసిస్టెంట్ హెచ్ఆర్ పోస్టులకు బిజినెస్ అడ్మినిస్ట్రేషన్,సోషల్ వెల్ఫేర్,పీఎం అండ్ ఐఆర్, పర్సనల్ మేనేజ్‌మెంట్, హెచ్ఆర్, సోషల్ సైన్సెస్‌లో డిగ్రీతోపాటు ఆఫీస్ అప్లికేషన్స్‌లో ఆరు నెలల కంప్యూటర్ కోర్సు పూర్తి చేసి ఉండాలి.

వయసు

10.08.2025 నాటికి జనరల్/అన్ రిజర్వ్‌డ్/ఈడబ్ల్యూఎస్ కేటగిరీ అభ్యర్థులకు గరిష్ఠ వయోపరిమితి 28 ఏళ్లు ఉండాలి. ఎస్సీ/ఎస్టీలు, ఓబీసీ అభ్యర్థులకు గరిష్ఠ వయోపరిమితిలో మూడేళ్ల సడలింపు లభిస్తుంది.



ఎంపిక విధానం

- దరఖాస్తులను స్క్రీనింగ్ చేసి షార్ట్‌లిస్ట్ అయిన అభ్యర్థులకు రాత పరీక్ష(కంప్యూటర్ బేస్డ్ ఆన్‌లైన్ టెస్ట్) నిర్వహిస్తారు. అనంతరం రాత పరీక్షలో ప్రతిభ ఆధారంగా ఇంటర్వ్యూ నిర్వహించి తుది ఎంపిక చేపడతారు.
- కంప్యూటర్ బేస్డ్ ఆన్‌లైన్ టెస్ట్‌లో 120 ప్రశ్నలు ఉంటాయి. ఇందులో వంద ప్రశ్నలు సంబంధిత సబ్జెక్టు నుంచి అడుగుతారు. మిగతా 20 ప్రశ్నలు జనరల్ అప్టిట్యూడ్ (క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్, రీజనింగ్, జనరల్ ఇంగ్లిష్) నుంచి ఉంటాయి. రాత పరీక్షలో కనీసం 50 శాతం మార్కులు సాధించాల్సి ఉంటుంది.ఓబీసీ/ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులు కనీసం 40 శాతం మార్కులు పొందాలి. రాత పరీక్షలో ప్రతిభ ఆధారంగా ఒక్కో పోస్టుకు ఏడు మంది(1: 7)ని చొప్పున కేటగిరీల వారీగా ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. రాత పరీక్షకు 80 శాతం వెయిటేజీ, ఇంటర్వ్యూకు 20 శాతం వెయిటేజీ కల్పించి తుది విజేతలను ప్రకటిస్తారు.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది: 10.08.2025
- సీబీటీ పరీక్షకు అడ్మిట్ కార్డ్: 18.08.2025
- సీబీటీ పరీక్ష తేది: 24.08.2025
- వెబ్‌సైట్:www.bdl-india.in/recruitments

సిడ్బిలో 76 అసిస్టెంట్ మేనేజర్ కొలువులు

లక్నోలోని స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(సిడ్బి).. పలు ఉద్యోగాల భర్తీకి ప్రకటన విడుదల చేసింది. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా సిడ్బి కార్యాలయాల్లో 76 గ్రేడ్–ఎ, గ్రేడ్–బి కేటగిరీలో ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. అర్హులైన అభ్యర్థులు ఆగస్టు 11వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

- మొత్తం పోస్టుల సంఖ్య: 76.

విభాగాల వారీగా పోస్టులు

అసిస్టెంట్ మేనేజర్ గ్రేడ్–ఎ(జనరల్)–50, అసిస్టెంట్ మేనేజర్ గ్రేడ్–బి (జనరల్)–11, అసిస్టెంట్ మేనేజర్ గ్రేడ్–బి(లీగల్)–08, అసిస్టెంట్ మేనేజర్ గ్రేడ్–బి (ఐటి)–07 పోస్టులు.

అర్హతలు

పోస్టును అనుసరించి కనీసం 60 శాతం మార్కులతో ఏదైనా డిగ్రీ,పీజీ, సీఏ/సీఎస్/సీఎస్ఏ/సీఎంఏ లేదా ఎంబీఏ/పీజీడీఎం ఉత్తీర్ణత సాధించి ఉండాలి. అలాగే సంబంధిత పని అనుభవం ఉండాలి.

వయసు

14.07.2025 నాటికి గ్రేడ్–ఎ కేటగిరీకి 21–30 ఏళ్లు;గ్రేడ్–బి కేటగిరీకి 25–33 ఏళ్ల మధ్య ఉండాలి.

ఎంపిక విధానం

ఫేజ్–1(ఆన్‌లైన్ ఆబ్జెక్టివ్ స్క్రీనింగ్ పరీక్ష), ఫేజ్–2(ఆన్‌లైన్ డిస్క్రిప్టివ్–సబ్జెక్ట్ టెస్ట్), ఫేజ్–3(ఇంటర్వ్యూ), ఆన్‌లైన్ సైకోమెట్రిక్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా అభ్యర్థుల ఎంపిక ఉంటుంది.



ఫేజ్-1 పరీక్షలోని అంశాలు

మొత్తం 200 మార్కులకు పరీక్ష ఉంటుంది. ఇందులో ఇంగ్లిష్ లాంగ్వేజ్(30 ప్రశ్నలు–30 మార్కులు), రీజనింగ్ ఆప్టిట్యూడ్ (25 ప్రశ్నలు–25 మార్కులు), క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్(25 ప్రశ్నలు–25 మార్కులు), కంప్యూటర్ నాలెడ్జ్ (20 ప్రశ్నలు–20 మార్కులు), జనరల్ అవేర్‌నెస్(20 ప్రశ్నలు–20 మార్కులు), ఎంఎస్ఎంఈ(30 ప్రశ్నలు–30 మార్కులు), స్ట్రీమ్ స్పెసిఫిక్ టెస్ట్(50 ప్రశ్నలు–50 మార్కులు). పరీక్ష వ్యవధి 120 నిమిషాలు.

ముఖ్య సమాచారం


- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: 11.08. 2025
- ఆన్‌లైన్ పరీక్ష (ఫేజ్–1): 06.09.2025
- ఆన్‌లైన్ పరీక్ష (ఫేజ్–2): 04.10.2025
- ఇంటర్వ్యూ షెడ్యూల్: నవంబర్ 2025
- వెబ్‌సైట్: https://www.sidbi.in

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-ఇండియన్ పాలిటీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం-ఫిజిక్స్
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-జనరల్ స్టడీస్-తెలంగాణ హిస్టరీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం-ఇంగ్లిష్

కువకువలు.. కిలకిలా రావాలు!


పైడ్ కొక్కూ


బ్లాక్ బెల్లీడ్



సాక్షి, హైదరాబాద్

రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న పక్షి జాతుల వైవిధ్యంపై సమగ్ర అధ్యయనం జరిగింది. ఉస్మానియా విశ్వవిద్యాలయం జువాలజీ ప్రొఫెసర్ చెల్మల శ్రీనివాసులు, హైదరాబాద్ బర్డింగ్ పాల్స్‌కు చెందిన శ్రీరామ్ రెడ్డి..వివిధ రూపాల్లో అందుబాటులో ఉన్న సమాచారం, పరిశోధనలు, అధ్యయనాల్లో వెల్లడైన సమాచారాన్ని క్రోడీకరించారు. రాష్ట్రంలో 452 రకాల పక్షి జాతులున్నట్లుగా నమోదు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను డాక్యుమెంటేషన్ చేశారు. ఈ డాక్యుమెంటేషన్ ఇటీవల 'జర్నల్ ఆఫ్ త్రెటెన్డ్ టాక్సా'లో ప్రచురితమైంది. ఇందులో తెలంగాణకు సంబంధించిన పక్షి జాతులతో పాటు, అరుదుగా కనిపించే పక్షులు, భారత స్థాయిలో నమోదైన పక్షులు, తొలిసారిగా కనిపించి కనువిందు చేసిన 'స్పర్-వింగ్డ్ లాప్‌వింగ్'తో పాటు ప్రపంచవ్యాప్తంగా అంతరించిపోయే ప్రమాదాన్ని ఎదుర్కొంటున్న 'ఇండియన్ వల్చర్', 'లెస్సర్ ఫ్లోరికన్'వంటి వాటిని గురించి వివరించారు. పక్షుల సాధారణ పేర్లు, శాస్త్రీయ నామాలతో పాటు స్థానికంగా ఉన్న పేరు, ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ (ఐయూసీఎన్), భారత వన్యప్రాణుల రక్షణ చట్టం గురించిన వివరాలు పొందుపరిచారు. మొత్తంగా తెలంగాణలో పక్షుల వైవిధ్యం 452 జాతులతో (24 ఆర్డర్లు, 82 కుటుంబాలకు) ఉన్నట్లు గుర్తించారు. వీటిలో 339 సాధారణ జాతులు, రకాలు (75.5%), 78 అసాధారణ జాతులు, రకాలు, (17.37%), 35 అరుదైన జాతులు, రకాలు (7.79%) ఉన్నాయి. గ్రేట్ ఇండియన్ బస్టర్డ్ ఆర్డియోటిస్ నైగ్రిసెప్స్ (వైగర్స్,1831), జెర్డాన్స్ కోర్సర్‌రైనోప్టిలస్ బిటోర్క్వటస్ (బ్లైత్, 1848) అనే రెండు జాతులు రాష్ట్రంలో అంతరించిపోతున్నట్లుగా గుర్తించడం గమనార్హం. పక్షుల వైవిధ్యంపై డాక్యుమెంటేషన్‌కు నేతృత్వం వహించిన ప్రొఫెసర్ శ్రీనివాసులు, శ్రీరామ్‌రెడ్డి ఇందుకు సంబంధించి తమ అభిప్రాయాలను వెల్లడించారు.

రాష్ట్రంలో అపార పక్షి వైవిధ్యం

- మొత్తం 452 రకాల పక్షి జాతుల గుర్తింపు
- సాధారణ, అసాధారణ, అరుదైన పక్షుల రకాలతో డాక్యుమెంటేషన్
- 'ద జర్నల్ ఆఫ్ త్రెటెన్డ్ టాక్సా'లో ప్రచురితమైన వివరాలు
- ఆరోగ్యవంతమైన పర్యావరణానికి పక్షులు సూచికలంటున్న పరిశోధకులు


బార్ హెడెడ్ గూస్

పక్షుల పరిరక్షణకు నడుం బిగించాలి

పక్షులు ఆరోగ్యవంతమైన పర్యావరణానికి ఉత్తమమైన సూచికలుగా నిలుస్తాయి. మేము చేసిన పరిశోధనల ద్వారా రాష్ట్రంలో పక్షులకు సంబంధించి ఉన్న వివరాలు (రికార్డులను) సరిచేసే అవకాశం ఏర్పడింది. రాష్ట్రంలో అంతర్ముఖంగా ఉండిపోయిన జీవవైవిధ్య గొప్పదనాన్ని, చిత్తడి నేలలు మొదలు అడవుల దాకా..గడ్డి భూముల నుంచి పట్టణాల్లోని చెరువుల దాకా విస్తరించి ఉన్న జీవవైవిధ్యంలో అలరారుతున్న పక్షి జాతుల గురించి మరింత సమాచారం వెలుగులోకి వచ్చింది. ప్రత్యక్ష, పరోక్ష రూపాల్లో ఎదురౌతున్న సవాళ్ల కారణంగా మన పక్షి జాతుల వైవిధ్యత క్రమంగా క్షీణించిపోతోంది. కాబట్టి ప్రజలు తమ చుట్టూ ఉన్న పక్షి జాతులను గౌరవిస్తూ, వాటి పరిరక్షణకు నడుం బిగించాలి. పక్షి జాతులను, వాటిలోని వైవిధ్యతను భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది. **- ప్రొఫెసర్ చెల్మల శ్రీనివాసులు, జువాలజీ విభాగం, ఓయూ**

ప్రజల్లో అవగాహన పెరిగే చాన్స్


మలబార్ విజ్లింగ్ త్రష్

తెలంగాణ పక్షులకు సంబంధించిన వివరాలను సంకలనం చేసి ఒకచోట చేర్చడం ద్వారా...రాష్ట్రానికి సంబంధించిన ప్రత్యేకమైన పక్షుల రకాలు వెల్లడి కావడంతో పాటు వాటి పరిరక్షణ, సంరక్షణపై ప్రజల్లో మరింత మెరుగైన అవగాహన కలిగేందుకు అవకాశం ఏర్పడింది. పక్షి ప్రేమికులు, బర్డ్ వాచర్స్, పరిశోధకుల సమష్టి కృషి, అధ్యయనాల ఫలితంగానే ఈ లక్ష్యాన్ని సాధించగలిగాము. అడవుల్లో పక్షులకు కొంతస్థాయిలో రక్షణ అనేది లభిస్తోంది. అయితే గడ్డి భూములు, చిత్తడి నేలలు వంటి చోట్ల ఇది పూర్తి స్థాయిలో లేదు. దీంతో పర్యావరణ వ్యవస్థపై ఆధారపడే ఆయా పక్షిజాతులు గత కొన్నేళ్లుగా క్రమంగా క్షీణిస్తున్నాయి. పక్షుల రక్షణకు, అడవుల్లో, బయటా వాటిని కాపాడేందుకు విధానపరమైన నిర్ణయాలతో పాటు విస్తృతస్థాయిలో చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.
- శ్రీరామ్‌రెడ్డి, హైదరాబాద్ బర్డింగ్ పాల్స్

క్లుప్తంగా...

ఇంజనీరింగ్ ఫీజులపై కమిటీ సమావేశం నేడు

సాక్షి, హైదరాబాద్: ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల వార్షిక ఫీజులపై పరిశీలనకు ప్రభుత్వం నియమించిన ప్రత్యేక కమిటీ మంగళవారం భేటీ కానుంది. విధివిధానాలపై ప్రధానంగా చర్చిస్తుంది. ఈ సందర్భంగా ఏయే అంశాలను పరిశీలించాలో ఖరారు చేసే వీలుంది. కమిటీ ఏర్పాటు తర్వాత జరిగే తొలి సమావేశం కావడంతో ప్రాధాన్యం సంతరించుకుంది. జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్‌టీయూహెచ్)లో జరగనున్న ఈ సమావేశానికి విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు కూడా హాజరవుతున్నట్టు తెలిసింది. ఇంజనీరింగ్ ఫీజుల నిర్ధారణకు ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి చైర్మన్‌గా ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసింది. ఇందులో వివిధ విభాగాలకు చెందిన ఏడుగురిని సభ్యులుగా చేర్చారు. మరో ఇద్దరిని చైర్మన్ నామినేట్ చేయాల్సి ఉంది. ఈ ఇద్దరినీ ఏ విభాగాల నుంచి తీసుకోవాలనే అంశంపై కూడా చర్చిస్తారు. ప్రభుత్వ సలహాదారు కూడా సమావేశంలో పాల్గొంటున్నందున.. కొన్ని కాలేజీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలనే సంకేతాలను ప్రభుత్వం ఇచ్చినట్టు తెలుస్తోంది.

టీచర్లకు పదోన్నతులు!
నేడు ఉత్తర్వులు వెలువడే అవకాశం

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయుల పదోన్నతికి సంబంధించిన ఆదేశాలు మంగళవారం వెలువడే వీలుంది. ప్రమోషన్ల ఫైలుపై ముఖ్యమంత్రి సంతకం అయినట్టు అధికార వర్గాలు తెలిపాయి. ఈ ఫైల్ ప్రస్తుతం విద్యాశాఖ కార్యదర్శి కార్యాలయానికి చేరింది. ఆమె ఆమోదం తర్వాత ఉత్తర్వులు వెలువడే వీలుంది. 870 మంది హెచ్‌ఎంలకు పదోన్నతులు కల్పించాలి. ఖాళీగా ఉన్న 2,500 స్కూల్ అసిస్టెంట్ పోస్టులను ఎస్జీటీతో భర్తీ చేస్తారు. కొత్తగా కల్పించే పదోన్నతులు కూడా కలిపితే మొత్తంగా 4 వేల మంది టీచర్లకు ప్రమోషన్లు ఇచ్చే వీలుంది.

పాలిసెట్‌లో 18,267 సీట్ల భర్తీ

సాక్షి, హైదరాబాద్: పాలిటెక్నిక్ తుది దశ సీట్లను సోమవారం కేటాయించారు. మొత్తం 115 కాలేజీల్లో 29,449 సీట్లు అందుబాటులో ఉంటే, 18,267 (62 శాతం) సీట్లు భర్తీ అయ్యాయి. ఇంకా 11,182 సీట్లు ఖాళీగా ఉన్నాయి. ఈ ఏడాది పాలిసెట్‌లో 80,949 మంది అర్హత సాధించారు. ఐదు ప్రభుత్వ సంస్థలు, ఒక ఎయిడెడ్ సంస్థలో వంద శాతం సీట్లు భర్తీ అయ్యాయి. సీట్లు పొందిన విద్యార్థులు 30వ తేదీలోగా రిపోర్టు చేయాలని అధికారులు సూచించారు.

సరికొత్తగా డిగ్రీ ఆంగ్లం

ఆంగ్ల సిలబస్‌లో భారీ మార్పులు.. భాష, రచనా నైపుణ్యానికి పెద్దపీట

కొత్త సిలబస్‌కు విద్యామండలి ఆమోదం.. ఈ ఏడాది నుంచే అమలు



సాక్షి, హైదరాబాద్: ఉన్నత విద్యలో ఆంగ్లం ఉన్నతి పెరగబోతోంది. భాష, రచనా నైపుణ్యానికి పెద్దపీట లభించనుంది. భాషా భాగాల దగ్గర్నుంచి, జాతీయాలు, పదబంధాలను సరికొత్త పద్ధతిలో అందించబోతున్నారు. అందుకు తగ్గట్టుగా డిగ్రీ ఆంగ్ల సిలబస్‌లో గుణాత్మక మార్పులు తెచ్చారు. ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్టారెడ్డి నేతృత్వంలోని కమిటీ కొత్త సిలబస్‌కు సోమవారం ఆమోదం తెలిపింది. ఈ విద్యా సంవత్సరం నుంచి మారిన సిలబస్ అందుబాటులోకి తీసుకురానుంది. నాలుగు సెమిస్టర్లలోనూ మొత్తం 18 యూనిట్లపై నిపుణులు కసరత్తు చేశారు.

పర్సనల్, సోషల్ కమ్యూనికేషన్‌కు ప్రాధాన్యం

డిగ్రీ తొలి సెమిస్టర్‌లో ఆంగ్లానికి సరికొత్త చాప్టర్లు తీసుకొస్తున్నారు. 'పర్సనల్, సోషల్ కమ్యూనికేషన్స్'కు ప్రాధాన్యమిచ్చారు. ఆడియో, వీడియోలతో ఆంగ్ల మాటల్లోని ఉచ్చారణను అంశంగా జోడించారు. విన్నది అర్థం చెడకుండా చెప్పే విధానం 'క్రాఫ్టింగ్ డిస్క్రిప్టివ్ లాంగ్వేజ్'గా అందిస్తున్నారు. ఒక కథాంశంలోని ప్రతి పదాన్నీ ఎలా పలకాలో చెప్పే చాప్టర్‌ను జోడించారు. ఇక రెండో సెమిస్టర్‌లో రెస్యూమ్ రైటింగ్‌లో సంస్థలను ఆకట్టుకునే పదబంధాన్ని ఎలా చేర్చాలి? వ్యక్తిగత సమాచారం ఎంత శక్తివంతంగా ఉండాలి? అనే స్కిల్‌ను సిలబస్‌లో చేర్చారు. పాతకాలం మాదిరిగా నచ్చిన లేఖ రాయమనే విధానం కాకుండా... కొత్త సిలబస్‌లో వినూత్న లేఖా రచనను 'టైప్స్ అండ్ ఫార్మాట్స్' అంశంగా తీసుకొచ్చారు.

ఆంగ్ల ఉచ్చారణకు మెరుగులు..

మూడో సెమిస్టర్‌లో ఆంగ్ల ఉచ్చారణకు మరిన్ని మెరుగులు దిద్దారు. వివిధ దేశాల్లో ఆంగ్ల భాష ఉచ్చారణను అందించే ప్రయత్నం చేశారు. మారుతున్న అంతర్జాతీయ రాత విధానంలో మెళకువలను అడ్వాన్స్‌డ్ రైటింగ్ టెక్నిక్స్ రూపంలో చేర్చారు. ఆఖరి సెమిస్టర్‌లో రిపోర్ట్ రైటింగ్‌ను మాస్టర్ స్థాయికి తీసుకెళ్లే సిలబస్‌ను చేర్చారు. ఎడిటింగ్ స్కిల్స్, వృత్తిపరమైన రచనా మెళకువలు ఈ సెమిస్టర్‌లో ప్రత్యేకం.

విద్యార్థులకు ఆంగ్ల ఆడియో, వీడియోలు



డిగ్రీ ఆంగ్ల సిలబస్ మార్చడమే కాదు... బోధనా శైలి కూడా మారబోతోంది. ఆడియో, వీడియో క్లిప్పింగ్స్‌ను ప్రతి విద్యార్థికీ అందుబాటులోకి తెస్తున్నాం. ఆధునిక ఆంగ్ల పోకడలకు అనుగుణంగా పీడీఎఫ్ ఫైళ్లను ఆన్‌లైన్ ద్వారా అందిస్తాం.
- ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి, ఉన్నత విద్యామండలి చైర్మన్

ఉన్నతిని పెంచుతాయి



సిలబస్‌లో ప్రతి మార్పు కూడా విద్యార్థి ఉన్నతిని పెంచుతుంది. విద్యార్థి ఆంగ్లంలో మాట్లాడగలిగేలా, రాసేలా సిలబస్ రూపకల్పనలో జాగ్రత్తలు తీసుకున్నాం. మార్కెట్ అవసరాలకు అనుగుణంగానే వాటి రూపకల్పన జరిగింది.
- ప్రొ.ధన్వంతరి వసుంధర, దోస్త్ అడ్మిషన్ ఆఫీసర్

భాషా పరిజ్ఞానం పెంచేందుకే..



ఆంగ్ల భాషలో ప్రస్తుతం మన విద్యార్థులకు కనీస పరిజ్ఞానం కూడా లేని పరిస్థితులు నెలకొన్నాయి. అందుకే సిలబస్‌లో మార్పులు తెచ్చాం.
- మిట్టపల్లి రాజేశ్వర్, రీసెర్చ్ డైరెక్టర్, ఉన్నత విద్యామండలి

రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేలా 'వైద్య' వాదనలు

- అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డికి మంత్రి దామోదర వినతి
- ఎంబీబీఎస్‌లో స్థానిక కోటాపై సుప్రీంలో ఆగస్టు 5న విచారణ



సాక్షి, హైదరాబాద్

రాష్ట్రంలో ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్ల కేటాయింపులో తెలంగాణ విద్యార్థుల ప్రయోజనాలు కాపాడేలా సుప్రీంకోర్టులో వాదనలు వినిపించాలని రాష్ట్ర అడ్వొకేట్ జనరల్ (ఏజీ) సుదర్శన్‌రెడ్డికి వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ విజ్ఞప్తి చేశారు. తెలంగాణ స్థానిక కోటాపై సుప్రీంకోర్టులో ఉన్న కేసు ఆగస్టు 5న విచారణకు రానున్న నేపథ్యంలో సోమవారం ఆయన ఏజీ నివాసానికి వెళ్లి భేటీ అయ్యారు. 2022–23 వరకు టెన్త్ వరకు నాలుగేళ్లకు మించి వరుసగా తెలంగాణలో చదివిన వారికి తెలంగాణ కోటా కింద సీట్లు కేటాయించే విధానం అమల్లో ఉండేదని ఏజీకి మంత్రి వివరించారు. అయితే 9వ తరగతి వరకు నకిలీ స్టడీ సర్టిఫికెట్లతో కొందరు విద్యార్థులు సీట్లు పొందినట్లు తేలడంతో తెలంగాణ విద్యార్థులకు మాత్రమే ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్లు లభించాలన్న ఉద్దేశంతో టెన్త్, ఇంటర్‌లను తెలంగాణలో చదవడాన్ని తప్పనిసరి చేస్తూ గతేడాది జీవో నంబర్ 33 తీసుకొచ్చామన్నారు. తెలంగాణ స్థానిక కోటాలో తమకు కూడా సీట్లు ఇవ్వాలని ఇతర రాష్ట్రాల విద్యార్థులు సుప్రీంను ఆశ్రయించడం వెనుకున్న వాస్తవాలను వివరించాలని సూచించారు.

సుప్రీం ఆదేశాలతో తహసీల్దార్ నివాస ధ్రువపత్రం ఆధారంగా..

జీవో నంబర్ 33పై ఇతర రాష్ట్రాల విద్యార్థులు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు.. తహసీల్దార్ ఇచ్చే నివాస ధ్రువీకరణ పత్రం ఆధారంగా వైద్య సీట్లు కేటాయించాలని మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. ఆ మేరకు గతేడాది సీట్లు కేటాయించారు. అయితే ఈ ఏడాది కాళోజీ యూనివర్సిటీ 33వ జీవో ప్రకారమే స్థానికతను నిర్ణయిస్తూ కౌన్సెలింగ్‌కు నోటిఫికేషన్ ఇవ్వగా విద్యార్థులు మళ్లీ సుప్రీంను ఆశ్రయించారు. దీంతో తాము తుదితీర్పు ఇచ్చే వరకు గతేడాది తరహాలోనే కౌన్సెలింగ్ నిర్వహించాలని కోర్టు ఆదేశించింది. ఆగస్టు 5న చేపట్టే విచారణలో స్థానికతకు సంబంధించి రూపొందించిన విధివిధానాలతో హాజరు కావాలని స్పష్టం చేసింది. కాగా, సుప్రీం ఆదేశాల నేపథ్యంలో కాళోజీ వర్సిటీ ఈనెల 25తో ముగిసిన కౌన్సెలింగ్‌ను 30వరకు పొడిగించగా వందలాది మంది స్థానికత ధ్రువీకరణ పత్రాలు సమర్పించారు. దీనిపై తెలంగాణ విద్యార్థుల తల్లిదండ్రులు సోమవారం వర్సిటీ ప్రాంగణం వద్ద ఆందోళన నిర్వహించారు.



గోల్కొండ ప్రాంతంలో చిరుత

రోడ్డు దాటడం చూసిన ద్విచక్రవాహనదారుడు

గోల్కొండ (హైదరాబాద్): గోల్కొండ కోట వెనుక భాగంలోని రాందేవ్‌గూడ వద్ద పట్టపగలే ఒక చిరుత సంచరించడం కలకలం రేపింది. వన్‌మోర్‌నగర్ నుంచి చిరుత ప్రధాన రహదారి దాటి.. తారామతిబారాదరి వెనుక వైపు భాగంలో ప్రవేశిస్తుండగా.. గమనించిన ఒక ద్విచక్రవాహదారుడు డయల్ 100కి సమాచారం ఇచ్చాడు. రాందేవ్‌గూడ నుంచి నార్సింగి వైపు వెళ్లే రోడ్డులో.. ఓ వైపు ఆర్టిలరీ సెంటర్ వారి క్వార్టర్స్, శిక్షణ కేంద్రాలు, పరేడ్ గ్రౌండ్స్ ఉన్నాయి. వీటి మధ్యలోంచి మూసీ నది లంగర్‌హౌస్ బాపూఘాట్ వైపు ప్రవహిస్తోంది. ఈ ప్రాంతం అంతా దట్టమైన చెట్లు ఉన్నాయి. అయితే రోడ్డు దాటి మూసీ నది వైపు వెళ్లిన చిరుత.. లంగర్‌హౌస్ బాపూఘాట్‌ను ఆనుకున్న దట్టమైన చెట్లలోకి వెళ్లి ఉండవచ్చునని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. చిరుత సంచారంపై టోలిచౌకి డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్.. అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. అటవీ శాఖ అధికారులు చిరుత జాడ కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది.

రైలు తగిలిందని.. రైలుకు ఎదురుగా వెళ్లి..

మద్యం మత్తులో పట్టాలపై వీరంగం సృష్టించిన వ్యక్తి



కామారెడ్డి క్రైం: మద్యం మత్తులో ఓ వ్యక్తి రైలు పట్టాలపై వీరంగం సృష్టించిన ఘటన కామారెడ్డి జిల్లా కేంద్రంలోని అశోక్ నగర్ రైల్వే గేటు వద్ద చోటుచేసుకుంది. కరీంనగర్ నుంచి కాచిగూడ వైపు వెళ్తున్న డెమో రైలు ఆదివారం రాత్రి 8 గంటల ప్రాంతంలో వస్తుండగా అశోక్‌నగర్ రైల్వే గేటును మూసివేశారు. అదే సమయంలో మేస్త్రీ పని చేసే నలుగురు వ్యక్తులు పట్టాలు దాటబోయారు. నెమ్మదించిన రైలు చివరి అంచు భాగం.. మద్యం మత్తులో ఉన్న మల్యాద్రి అనే మేస్త్రీకి తగిలింది. దీంతో మల్యాద్రి ముఖానికి గాయమైంది. మద్యం మత్తులో ఉన్న అతడు రైలు ఢీకొందనే కోపంతో పరిగెత్తుకుంటూ రైలుకు ఎదురుగా వెళ్లి పట్టాలపై కూర్చుని ఆందోళన వ్యక్తం చేశాడు. గమనించిన లోకో పైలట్ రైలును అక్కడే ఆపి అధికారులకు సమాచారం ఇచ్చాడు. దాదాపు 20 నిమిషాల పాటు రైలు నిలిచిపోయింది. అనంతరం రైల్వే పోలీసులు అక్కడకు చేరుకుని మల్యాద్రిని పట్టాలపై నుంచి పక్కకు తీసుకువచ్చి జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. అతడు అతిగా మద్యం సేవించి ఉన్నాడని రైల్వే అధికారులు తెలిపారు.

నోట్ల వర్షం కురిపిస్తామని..

- 'డెమో'లో నాలుగురెట్లు డబ్బులిచ్చి వ్యాపారిని నమ్మించిన ముఠా
- రూ.21 లక్షలు, బంగారు నాణెంతో పరార్
- ఐదుగురి అరెస్ట్.. రూ.18 లక్షలు స్వాధీనం



చేవెళ్ల: పైసల వర్షం కురిపిస్తామని నమ్మించిన ముఠా ఓ వ్యాపారిని మోసం చేసి, అతని వద్దనుంచి రూ.21 లక్షల నగదు, బంగారు కాయిన్‌ను దోచుకుని ఉడాయించింది. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు ముఠాలోని ఐదుగురిని పట్టుకుని సోమవారం రిమాండ్‌కు తరలించారు. చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్ వివరాలు వెల్లడించారు. మహారాష్ట్రకు చెందిన నలుగురు, ఆదిలాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాకు చెందిన ముగ్గురు వ్యక్తులు ముఠాగా ఏర్పడ్డారు. ఆదిలాబాద్ జిల్లాకు చెందిన వర్మ అనే వ్యాపారి గండిపేట్ మండలం మంచిరేవులలో నివాసం ఉంటున్నాడు. ఇతనికి ముందుగానే పరిచయం ఉన్న ముఠాలోని ఇద్దరు సభ్యులు.. ఆదిలాబాద్‌లో తమకు తెలిసిన మంత్రగాళ్లు డబ్బుల వర్షం కురిపిస్తున్నారని చెప్పారు. ఇందుకు సంబంధించిన డెమో చూసి వద్దామని అతన్ని ప్రేరేపించారు. అక్కడికి వెళ్లి రూ.500 నోట్లకట్ట పెట్టగా.. ఇందుకు నాలుగురెట్ల నోట్లు కురిసినట్లు చూపించారు. ఈ మొత్తాన్ని వ్యాపారికే ఇచ్చేశారు. ఇది నిజమేనని నమ్మిన బాధితుడు తన వద్ద రూ.21 లక్షలు, బంగారు కాయిన్ ఉందని చెప్పాడు. వీటి ద్వారా రూ.5 కోట్లకుపైగా నోట్ల వర్షం కురుస్తుందని, 1 గ్రాము బంగారు కాయిన్‌కు 8 కాయిన్లు వస్తాయని ముఠా సభ్యులు నమ్మబలికారు. ఈనెల 25న బాధితుడి కారులోనే చేవెళ్ల మండలం ముడిమ్యాల అటవీ ప్రాంతానికి తీసుకువచ్చి, పూజలు చేస్తున్నట్లు నమ్మించారు. పథకం ప్రకారం మరో కారులో వారి మనుషులతో నకిలీ నోట్లు తెప్పించారు. పూజల పేరుతో పసుపు, కుంకుమ చల్లి ఫోన్లు స్విచాఫ్ చేయించారు. పూజ సమయంలో పెద్ద శబ్దాలు, కాంతులు వస్తాయని, వాటిని మీరు తట్టుకోలేరని చెప్పి బాధితుడిని కారులో కూర్చోబెట్టారు. అనంతరం డబ్బుతో పరారయ్యారు. కొద్ది సమయం తర్వాత తేరుకున్న వ్యాపారి జరిగిన మోసంపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఏడుగురు సభ్యుల ముఠాలో ఐదుగురిని పట్టుకున్నారు. వారిలో మహారాష్ట్రకు చెందిన సిద్దేశ్వర్‌దత్త వాంఖడే అలియాస్ యోగేంద్ర, ప్రకాశ్ మల్హోత్రా మాధవి, ఆదిలాబాద్‌కు చెందిన సింగారే ధర్మేందర్, పెద్దపల్లికి చెందిన ములకుంట్ల సంజీవ్‌కుమార్, మంచిర్యాలకు చెందిన కోమండ్ల శ్రీనివాస్ ఉన్నారు. మహారాష్ట్రకు చెందిన దేవరావు సిందే, ప్రశాంత్ పాటిల్ కోసం పోలీసులు వెతుకుతున్నారు. నిందితుల నుంచి రూ.18 లక్షల నగదు, బంగారు నాణెం, నకిలీ నోట్ల కట్టలను స్వాధీనం చేసుకున్నారు.

రూ. వేలల్లోకి వాహన రిజిస్ట్రేషన్ చార్జీలు!

- టూవీలర్స్ విలువపై 0.5 శాతం, ఇతర పెద్ద వాహనాలపై 0.1 శాతంగా ఖరారు
- లైసెన్స్, పర్మిట్, వాహన ఫిట్‌నెస్ చార్జీలపైనా బాదుడు
- గుట్టుచప్పుడు కాకుండా పెంచిన రవాణా శాఖ.. జీవో 51 జారీ

సాయిరామ్ ఓ పాత కారును కొనుగోలు చేశాడు. దాని యాజమాన్య బదిలీ కోసం సర్వీసు చార్జీ కింద రూ. 2,660 చెల్లించాల్సి వచ్చింది. రెండు రోజుల క్రితం వరకు ఆ మొత్తం రూ. 400 మాత్రమే ఉండేది. ఇంత తేడా ఎందుకొచ్చిందని రవాణా శాఖ అధికారులను అడిగితే సర్వీసు చార్జీలు పెరిగాయని చల్లగా బదులిచ్చారు. దీంతో అతను అవాక్కయ్యాడు.

సాక్షి, హైదరాబాద్: ఆదాయాన్ని పెంచుకొనే క్రమంలో రవాణా శాఖ గుట్టుచప్పుడు కాకుండా వివిధ రకాల సేవల రుసుములను భారీగా పెంచేసింది. ఆదివారం నుంచి కొత్త రుసుములను అమల్లోకి తెచ్చింది. దీంతో స్లాట్ బుకింగ్ సమయంలో సేవా రుసుములను చూసి బెంబేలెత్తడం వాహదారుల వంతైంది. ముఖ్యంగా వాహనాల రిజిస్ట్రేషన్, హైపోథికేషన్, వాహన యాజమాన్య బదిలీ, ఆర్సీల రెన్యూవల్స్, ఒక ప్రాంత చిరునామా నుంచి మరో ప్రాంత చిరునామాకు వాహనాల బదిలీలకు సంబంధించిన క్లియరెన్స్ సర్టిఫికెట్‌లు, ఎన్‌ఓసీల జారీకి చార్జీలను రూ. వందల నుంచి ఏకంగా రూ. వేలల్లోకి పెంచేసింది. గతంలో ద్విచక్ర వాహనాలకు సంబంధించి కొత్త వాహనాల రిజిస్ట్రేషన్లు, పాత వాహనాల యాజమాన్య హక్కుల బదిలీ, హైపోథికేషన్ అగ్రిమెంట్, తొలగింపు, ఎన్‌ఓసీ, ఆర్సీ రెన్యూవల్ సేవలకు సర్వీసు చార్జీ రూ. 200గా ఉండేది. ఇతర పెద్ద వాహనాలకు రూ. 400గా ఉండేది. కానీ ఇప్పుడు ద్విచక్ర వాహనాలకైతే వాహన విలువపై 0.5 శాతం, ఇతర పెద్ద వాహనాలకు వాహన విలువపై 0.1 శాతాన్ని సేవా రుసుముగా రవాణా శాఖ ఖరారు చేసింది. దీంతో ఆయా చార్జీల కింద ఏకంగా రూ. 2,500 నుంచి రూ. 4,000 వరకు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. 2017 మేలో సవరించిన సర్వీసు చార్జీలే ఇప్పటివరకు కొనసాగుతున్నందున అన్ని రకాల ధరలు పెరిగిన తరుణంలో వాటిని కూడా సవరించాలంటూ రవాణా శాఖ కమిషనర్ ప్రతిపాదించారని ప్రభుత్వం పేర్కొంది. అందుకు అనుగుణంగానే రుసముల పెంపునకు అనుమతిస్తూ జీ.ఓ. నంబర్ 51 జారీ చేసింది.

రెండుసార్లు బాదుడు..

ఒకే వాహనానికి సంబంధించి సేవలకు రెండుసార్లు సర్వీసు టాక్స్ చెల్లించాల్సి వస్తోంది. ఒక ఆర్టీఓ పరిధిలోని వాహనాన్ని మరో ఆర్టీఓ పరిధిలోని చిరునామాకు మార్చినప్పుడు రెండుసార్లు భారీగా వడ్డిస్తున్నారు. తొలుత పాత రవాణాశాఖ కార్యాలయం పరిధి నుంచి క్లియరెన్స్ సర్టిఫికెట్ (సీసీ) తీసుకునేటప్పుడు వాహనం విలువలో నిర్ధారిత శాతాన్ని రుసుముగా వసూలు చేస్తున్నారు. కొత్త చిరునమాలోని రవాణా శాఖ కార్యాలయంలో వాహన యాజమాన్య బదిలీ జరిగినప్పుడు మళ్లీ వాహనం విలువలో నిర్ధారిత శాతం మేర సర్వీసు చార్జి చెల్లించాల్సి వస్తోంది.



కొన్ని రకాల రుసుములు ఇలా.. (రూ.లలో)

	పాత	కొత్త
లెర్నర్స్ లైసెన్స్.. పేపర్, 6 నెలల కాలానికి	100	200
రవాణా లైసెన్స్ పీవీసీ కార్డు మూడేళ్లకు	200	300
రవాణాయేతర డ్రైవింగ్ లైసెన్సు	300	400
రిజిస్ట్రేషన్..		
రవాణాయేతర ఆర్సీ–టూవీలర్	200	వాహన విలువపై 0.5 శాతం
రవాణాయేతర ఆర్సీ–ఇతర వాహనాలు	400	వాహన విలువపై 0.1 శాతం
ఆటో రిక్షా ఆర్సీ	150	250
ఇతర రవాణా వాహనాల ఆర్సీ	400	500
ఫిట్‌నెస్..		
ఆటో రిక్షా	100	200
ఇతర వాహనాలు	200	300
ఆటో రిక్షా పర్మిట్లు	100	200
ఇతర వాహనాల పర్మిట్లు	200	300

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

అంతరిస్తున్న వృక్షజాతులు

- అంతరించే దశలో 132 రకాల చెట్లు, వన్యప్రాణులు, పక్షులు
- ఇష్టారాజ్యంగా అడవుల నరికివేత
- జీవ వైవిధ్యాన్ని కాపాడేందుకు చర్యలు శూన్యం


అంతరించిపోతున్న వృక్షజాతులు

జగిత్యాల రూరల్: తునికి పండ్లు తింటే తుంటి ఎముకలకు బలం.. మొర్రి పండ్లు తింటే కంటి చూపు మెరుగు.. జీడిపండ్లు, చిటిమిటి పండ్లు నాలుగేసి తిన్నా.. ఒక పూట ఆహారంతో సమానం, ఇప్పకాయలు, ఎల్లేరుగడ్డతో ఎనలేని ఆరోగ్యం పొందవచ్చని పెద్దలు చెబుతుంటారు. అటవీ ప్రాంతాల్లో విరివిగా లభించే ఈ ఫల వృక్ష జాతులు భవిష్యత్‌లో కనుమరుగయ్యే పరిస్థితి నెలకొంది. మనిషి స్వార్థానికి పలు వృక్షజాతులు అంతరించి పోయే దశకు చేరుకున్నాయి.

ఎందుకిలా..?

పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా అవసరాలు, అభివృద్ధి, సౌకర్యాలు, విలాసాల నెపంతో ప్రకృతిని విచక్షణారహితంగా ధ్వంసం చేస్తున్నారు. మనుగడకు ఎంతో అవసరమైన అడవులు, ప్రకృతిని నాశనం చేస్తూ జీవన సమతుల్యతను నాశనం చేస్తున్నారు. దీంతో పలురకాల అరుదైన వృక్షజాతులు, పరోక్షంగా అనేక జీవజాతులు అంతరించి పోనున్నాయి. అటవీ ఉత్పత్తులు అమ్మి జీవనం సాగించే గిరిజన కుటుంబాలు ఉపాధిని కోల్పోయి ఇబ్బంది పడుతున్నారు. నిర్ధారిత విస్తీర్ణం 38 శాతం ఉండాల్సిన అడవులు.. ఎప్పుడో ఆ సంఖ్య దిగువకు చేరుకున్నాయి. మానవుడి విపరీత చర్యల వల్ల ప్రకృతి సమతుల్యత దెబ్బతిని, వాతావరణంలో పెనుమార్పులు చోటుచేసుకుని అనావృష్టి, అతివృష్టి సంభవిస్తున్నాయి.


పండ్ల జాతి చెట్టు

ఔషధభరితమైన అద్భుత ఫలాలను అందిస్తూ ప్రత్యక్షంగా, కలప రూపంలో పరోక్షంగా ఎంతో మేలు చేసే తునికి, మొర్రి, జీడి మామిడి, ఇప్ప, ఎల్లేరు, రామసీతాఫలం లాంటి పండ్ల జాతులు సహా 132 రకాల చెట్లు, పలు రకాల వన్య ప్రాణులు, పక్షులు అంతరించిపోయే దశలో ఉన్నాయని ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ (ఐయూసీఎన్) నివేదిక వెల్లడించింది.

పరిరక్షణ చర్యలు చేపట్టాలిలా..

- అడవులు, వన్యప్రాణులను జాతీయ సొత్తుగా ప్రకటించి వాటి పరిరక్షణకు కఠిన చట్టాలు అమలు చేయాలి.
- అటవీశాఖలో అవినీతి వల్లే అటవీ సంపద దుర్వినియోగం కావడంపై ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.
- అడవుల చుట్టూ పెద్ద కందకాలు తవ్వించి.. అత్యవసరమైతే తప్ప మనుషులు, పశువులు అడవుల్లోకి వెళ్లకుండా కఠిన చర్యలు చేపట్టాలి. కలప, వన్యమృగాల అక్రమ రవాణాను అరికట్టేందుకు కఠిన చట్టాలు, శిక్షలు అమలు చేయాలి.
- ప్రజలందరికీ పర్యావరణ సమతుల్యత, అడవుల ప్రాధాన్యం వాటిని ధ్వంసం చేయడం వల్ల కలిగే పరిణామాలపై విరివిగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి.

పండ్లు దొరకడం లేదు



మా కాలంలో అడవుల్లో దొరికే పండ్ల ద్వారానే కడుపు నింపుకొనేవాళ్లం. కోతులు, పందుల బెడద ఉండేది కాదు. అడవుల్లోకి వెళ్లాలంటే చౌకీదార్ అనుమతి తప్పనిసరి. అడవిని తల్లిలాగా చూసేటోల్లం. ఇప్పుడు ఇష్టం వచ్చినట్లు చెట్లను నరికి వేస్తున్నారు. పండ్లు దొరకడం గగనమైపోయింది.

– శేఖర్, గుల్లపేట

చెట్ల నరికివేత వల్లే గ్లోబల్ వార్మింగ్



గ్లోబల్ వార్మింగ్‌కు ముఖ్య కారణం అడవుల్లో విచక్షణారహితంగా చెట్లను నరికివేయడమే. చెట్లు తగ్గిపోవడంతో భూ వాతావరణం వేడెక్కి.. విపరీతమైన ఎండలు కాస్తున్నాయి. సకాలంలో వర్షాలు కురవక భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. ప్రతీ ఒక్కరూ అడవుల పెంపునకు కృషి చేయాలి.

– పాలమాకుల గంగారెడ్డి, పొరండ్ల

ప్రజలు సహకరించాలి



అడవులు, వన్యప్రాణుల సంరక్షణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నాం. వ్యాపార అవసరాల నిమిత్తం అడవులకు నిప్పు పెట్టడం, వన్యప్రాణులను వేటాడటం వంటివి నేరం. అడవులను కాపాడటం ప్రజలు కనీస బాధ్యతగా భావించాలి.


– రవిప్రసాద్, జిల్లా అటవీశాఖ అధికారి

మర్రి తొర్రలో మహిమగల దేవుడు..!

- లంబాడీల ఆరాధ్య దైవంగా దేవానాయక్ మర్రి ఆలయం
- 300 ఏళ్ల నుంచి మర్రివృక్షం తొర్రలోనే పూజలు
- భక్తులకు సంతాన ప్రాప్తి కలుగుతుందని విశ్వాసం


దేవానాయక్ స్వామీజీ విగ్రహాలు


మల్లాపురంలోని దేవానాయక్ మర్రి దేవాలయం


మర్రి చెట్టు తొర్రలోని దేవానాయక్ స్వామీజీ

యాదగిరిగుట్ట రూరల్: యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం మల్లాపురం గ్రామంలో దేవానాయక్ మర్రి ఆలయం గిరిజన ఆరాధ్య దైవంగా విరాజిల్లుతోంది. సంతానం లేని దంపతులు వచ్చి ముడుపు కట్టి కోరిన కోరికలు నెరవేరుతుండడంతో.. ఈ ఆలయం ప్రత్యేకతను చాటుకుంది. మహావృక్షమైన మర్రి తొర్ర లోపలికి వెళ్లి దర్శించుకోవడం ఈ ఆలయానికి ఉన్న మరో ప్రత్యేకత. దేవాదాయ శాఖ పరిధిలోని ఈ ఆలయం యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉంది.

ఆలయ చరిత్ర : ఈ ఆలయం 300 ఏళ్ల క్రితం నాటిది. ఈ ఆలయం ఆవిర్భావం వెనుక ఆసక్తికరమైన కథనం ప్రచారంలో ఉంది. యాదగిరిగుట్ట మండలం మల్లాపురం ప్రాంతంలో దేవానాయక్ తండా.. అనే ప్రదేశంలో దేవానాయక్ అనే స్వామీజీ ఉండేవాడు. ఆ స్వామీజీ అదే తండాలోని హాస్కీ అనే మహిళను పెళ్లి చేసుకున్నాడు. పెళ్లి చేసుకున్న కొద్ది రోజులకే భార్యను, తండాను వదిలిపెట్టి దేశాల బాట పట్టాడు. సన్యాసులను కలిసి వారితో 12 ఏళ్లు ఉన్నాడు. ఆ తర్వాత ఒకసారి, మళ్లీ ఈ ప్రాంతానికి 61 మంది సన్యాసులతో తిరిగి వచ్చాడు. ఈ ప్రాంతంలోని బావి వద్ద నీళ్లు తోడుతుండగా.. దేవానాయక్ తండా ప్రజలు సన్యాసులను పలకరించారు. తండాలోని ఒక మహిళ.. దేవానాయక్ ఆచూకీ అడిగింది. విషయం తెలుసుకున్న సన్యాసుల పెద్ద.. స్వామీజీ దేవానాయక్‌ను ఆయన భార్య దగ్గరికి తిరిగి పంపివేశాడు. అనంతరం తండాలోనే జీవనం సాగించి.. ముగ్గురు పిల్లలు పుట్టిన తర్వాత దేవానాయక్ స్వామీజీ మృతి చెందాడు. ఇతని శవాన్ని ఈ దేవానాయక్ మర్రి దగ్గర సమాధి చేశారు. కొన్ని రోజుల తర్వాత ఈ సమాధి మీద మర్రి వృక్షం మొలకెత్తింది. తండావాసుల కలలో కనిపించి.. తన విగ్రహం ఏర్పాటు చేసి పూజలు చేస్తే.. పంటలు సమృద్ధిగా పండుతాయని, కోరిన కోర్కెలు తీరుతాయని దేవానాయక్ స్వామీజీ చెప్పినట్లు భక్తులు అంటారు. దీంతో నాటినుంచి నేటి వరకు ఈ మర్రి తొర్రలో దేవానాయక్ స్వామీజీ పూజలు అందుకుంటున్నాడు.

తొర్రలోనే దర్శనం

దేవానాయక్ ఆలయంలోని దేవుడు.. పెద్ద మర్రివృక్షం తొర్రలో భక్తులకు దర్శనం ఇస్తాడు. చెట్టు తొర్రలోకి ఒక్కొక్కరుగా వెళ్లి.. స్వామి వారి దర్శనం చేసుకోవడానికి వీలుంటుంది. దాదాపు 300 ఏళ్ల క్రితం దేవానాయక్ స్వామి మృతి చెందగా, ఈ ప్రదేశంలో సమాధి చేశారు. కొన్ని రోజుల తర్వాత దేవానాయక్ సమాధిపై ఒక మర్రి చెట్టు మొలకెత్తింది. దేవానాయక్ స్వామి కొడుకైన ధనానాయక్‌కు సంతానం కలగలేదు. కాగా దేవానాయక్ స్వామి కుమారుడికి కలలో వచ్చి.. తన సమాధిపై మొలకెత్తిన మర్రి చెట్టు వద్ద విగ్రహం ఏర్పాటు చేయమని కోరినట్లు భక్తులు చెబుతారు. దీంతో భద్రాచలం నది నుంచి రాయి తీసుకొచ్చి.. విగ్రహం చేయించి ఏర్పాటు చేశాడు. వారి కుమారుడికి సంతానం కలిగింది. అప్పటి నుంచి ఈ ఆలయానికి భక్తులు రావడం ప్రారంభమైంది. ఇక్కడికి వచ్చి మొక్కిన వారికి సంతాన ప్రాప్తి కలుగుతుందని భక్తుల్లో నమ్మకం ఏర్పడింది. దేవానాయక్ సమాధిపై ఉన్న మర్రి చెట్టు మహావృక్షంగా మారింది. చెట్టు తొర్రలోనే దేవానాయక్ విగ్రహాలు ఉంటాయి.

ఆలయంలో జరిగే ఉత్సవాలు

దేవానాయక్ మర్రి ఆలయంలో నిర్వాహకులు ఏటా ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఏటా సంత్‌సేవాలాల్ జయంతి, దసరా, సంక్రాంతి సమయంలో రెండు రోజుల పాటు ఉత్సవాలను ఘనంగా నిర్వహించి అన్నదానాలు చేస్తారు. స్వామి వారికి నెయ్యి, పాలు, ఊదు, బెల్లం, బోగ్ బండారంతో ప్రసాదాలు సమర్పిస్తారు.

ఆలయం ప్రత్యేకత: దేవానాయక్ మర్రి దేవాలయం లంబాడీల ధరావత్ వంశస్తులకు చెందింది. కాగా ఈ ఆలయం ఏర్పాటైన సమయంలో.. దేవానాయక్ సమాధిపై మర్రి చెట్టు మొలకెత్తడంతో.. ఈ వంశస్తులు మర్రి ఆకుల్ని విస్తరాకులుగా తయారు చేయరు. వాటిలో నీళ్ల తాగడం లాంటివి కూడా చేయరు. మర్రి చెట్టును దేవుడిగా కొలుస్తారు. ప్రపంచంలోని లంబాడీలలోని ధరావత్ వంశస్తులు.. మర్రి చెట్టు మొలకెత్తినప్పటి నుంచి ఆరాధ్య దైవంగా భావిస్తారు. ధరావత్ వంశస్తులు ఎక్కడున్నా తలనీలాలు ఇక్కడే సమర్పిస్తారు..

వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు : ఈ ఆలయానికి ఏటా మార్చి నుంచి జూన్ నెలలో వస్తుంటారు. దీనిలో భాగంగా తెలంగాణతో పాటు, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, బల్హార్ష, బీమ్‌పురం, నాందేడ్ వంటి ప్రాంతాల నుంచి ఈ ఆలయాన్ని దర్శించుకోవడానికి గిరిజన భక్తులు వచ్చి వెళ్తుంటారు.

సంతాన ప్రాప్తికి ప్రసిద్ధి

ఆలయానికి వచ్చే భక్తులు.. ప్రధానంగా తమకు సంతాన ప్రాప్తి కలగాలని దేవుడికి మొక్కి ముడుపులు కడతారు. వారి కోర్కెలు నెరవేరగానే.. ఇదే ఆలయానికి వచ్చి పిల్లల వెంట్రుకలను కూడా దేవుడికి సమర్పిస్తారు. మరి కొంతమంది భక్తులు తమ కోరికలు నెరవేరితే జెండాలు సమర్పిస్తామని వేడుకుని.. కోర్కెలు తీరగానే ఆలయంలో జెండాలను స్వామి వారికి అర్పిస్తారు.


మర్రిచెట్టులో దేవానాయక్ ప్రధానాలయం

ప్రభుత్వం సహకరించాలి



మా పూర్వీకుల తర్వాత 1997 సంవత్సరం నుంచి ప్రధానార్చకులుగా వ్యవహరిస్తున్నాను. 35 సంవత్సరాల క్రితం ఇక్కడి ప్రాంతంలో పొలాన్ని కౌలుకు తీసుకుని పంటలు పండిస్తే, దిగుబడి బాగా వచ్చింది. వచ్చిన డబ్బులతో దేవాలయాన్ని పునర్నిర్మాణం చేయించాను. కొంత స్థలాన్ని దేవాదాయశాఖకు ఇచ్చాం. ప్రభుత్వం ఆలయం అభివృద్ధికి మరింత సహకరించాలి.

– భీమా నాయక్, ప్రధానార్చకుడు, దేవానాయక్ మర్రి దేవాలయం

ఏటా వస్తుంటాం



ఇరవయ్యేళ్లుగా ఏటా ఈ దేవానాయక్ మర్రి దేవాలయానికి వచ్చి మొక్కులు చెల్లించుకుంటాం. మా కోర్కెలను స్వామివారు తీరుస్తూ వస్తున్నారు. ఇప్పుడు మా పిల్లలకు వెంట్రుకలు తీయడానికి వచ్చాం. స్వామి వారిని దర్శించుకుంటే చాలా సంతోషంగా ఉంటుంది. మా ఇష్టదైవంగా కొలుస్తాం. ఆలయాన్ని చూస్తుంటే చాలా ఆనందంగా ఉంటుంది.

– యాకమ్మ, భక్తురాలు, జనగామ జిల్లా


ప్రధాన న్యాయమూర్తిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్‌ను కలసిన న్యాయశాఖ ఉద్యోగుల సంఘ కార్యవర్గం. చిత్రంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బయ్య, ప్రధాన కార్యదర్శి రమణరావు, ఉపాధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కోటేశ్వర్‌రెడ్డి, సహాయక కార్యదర్శి కొడుమూరు నల్లారెడ్డి తదితరులు.

మీనాక్షితో పాదయాత్రా?

- బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ సతీష్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర నేతలు కాకుండా.. బయటి నుంచి వచ్చిన మీనాక్షి నటరాజన్‌తో పాదయాత్ర చేయిస్తున్నారంటే రాష్ట్ర కాంగ్రెస్ పరిస్థితి ఏమిటో అర్థం అవుతుందని బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్, రెడ్కో మాజీ చైర్మన్ వై.సతీష్ వ్యాఖ్యానించారు. దీంతో రాష్ట్ర సీఎం, మంత్రులను ఢిల్లీలోని కాంగ్రెస్ అధిష్టానం నమ్మే పరిస్థితి లేదని తేటతెల్లమైందని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిజంగానే కాంగ్రెస్‌ది ప్రజాపాలనైతే.. ప్రజలంతా కాంగ్రెస్ పాలనను, సీఎం రేవంత్ రెడ్డి పనితీరును మెచ్చుకోవడం నిజమైతే.. రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు ఎందుకు పాదయాత్ర చేయడం లేదని ప్రశ్నించారు.

సీఎం రమేశ్‌వి చిల్లర మాటలు

నల్లమోతు భాస్కర్‌రావు

సాక్షి, హైదరాబాద్: కమ్మ సామాజిక వర్గంపై సీఎం రమేశ్ చిల్లర మాటలు మాట్లాడుతున్నారని బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు మండిపడ్డారు. కమ్మ సామాజికవర్గంతో సహా అన్ని వర్గాలను అక్కున చేర్చుకున్న నేతలు బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అని పేర్కొన్నారు. సోమవారం తెలంగాణ భవన్‌లో ఆయన మాట్లాడుతూ బీజేపీతో కేసీఆర్ మాట్లాడాలనుకుంటే నేరుగా మాట్లాడతారని, మధ్యలో సీఎం రమేశ్‌ను సంప్రదించాల్సిన అవసరం లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కమ్మ సామాజికవర్గాన్ని కూడా ముంచే పనిలో ఉన్నాడని భాస్కర్‌రావు మండిపడ్డారు. కమ్మ సామాజికవర్గం మీద ఆయనకు ప్రేముంటే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో అదే సామాజికవర్గానికి టికెట్ ఇవ్వాలన్నారు. సీఎం రమేశ్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రహస్య వ్యాపార భాగస్వాములు, కంచ గచ్చిబౌలి భూముల విషయంలో వచ్చిన ఆరోపణలపై సీఎం రమేశ్ సమాధానం ఇవ్వాలని బీఆర్‌ఎస్ నేత దినేశ్ చౌదరి డిమాండ్ చేశారు.


ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సచివాలయంలో మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేస్తున్న ఐఎన్టీయూసీ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు నాగన్న గౌడ్


సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి


పొట్టకూటి కోసం కష్టాలు ... పంజాగుట్టలో ద్విచక్రవాహనంపై ప్రమాదకరంగా వెళ్తున్న ప్లాస్టిక్ సామాన్లు అమ్మే వ్యక్తి...

నిద్రలేచింది మొదలు పడుకునే వరకు ప్రతి వస్తువు ప్లాస్టిక్‌తో చేసిన వాటినే అందరూ వినియోగిస్తున్నారు. ముఖ్యంగా జిల్లాలోని విద్యార్థులు కేజీ నుంచి పీజీ వరకు ప్లాస్టిక్ బాటిళ్లు, బాక్స్‌లనే అధికంగా వాడుతున్నారు. వేడి వేడిగా పెట్టిన ఆహారం ప్లాస్టిక్ బాక్స్‌ల్లో పెట్టిన కొన్ని గంటలకే రసాయనాలు ఆహారంలో కలిసి క్యాన్సర్ మహమ్మారికి దారితీస్తున్నాయి. ఇంత ప్రమాదకరమని తెలిసినా ప్లాస్టిక్ బాటిళ్లు, బాక్స్‌లనే కొనుగోలు చేసి అనారోగ్యాన్ని కొని తెచ్చుకుంటున్నారు. దీనిపై విద్యార్థులు, తల్లిదండ్రుల్లో చైతన్యం తీసుకురావడంలో విద్యా, వైద్యశాఖలు విఫలమవుతున్నాయి.



ప్లాస్టిక్‌మయం.. వ్యాధుల భయం

ప్లాస్టిక్ లంచ్ బాక్సులు, వాటర్ బాటిళ్లతో ప్రమాదం

- 90 శాతం విద్యార్థులు ప్లాస్టిక్ భూతాన్ని మోస్తున్న వైనం
- ప్లాస్టిక్ బాటిళ్లు, బాక్సుల వినియోగంతో ప్రాణాంతక వ్యాధులు
- అవగాహన కల్పించడంలో విద్య, వైద్యశాఖ విఫలం
- మొక్కుబడిగా తల్లిదండ్రుల సమావేశాలు
- చైతన్యం చేయాలంటున్న నిపుణులు



తిరుపతి సిటీ : రంగు రంగుల డిజైన్లు, కార్టూన్ క్యారెక్టర్స్, గ్లిట్టర్ ఎఫెక్ట్స్‌తో పిల్లలను ఆకట్టుకునే విధంగా ప్లాస్టిక్ బాటిళ్లు, లంచ్ బాక్స్‌లు మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. ప్రతి విద్యార్థి బ్యాగుల్లో ప్లాస్టిక్ బాటిళ్లు, బాక్స్‌లు దర్శనమిస్తున్నాయి. విద్యార్థులను తమ వైపు తిప్పుకునే విధంగా ఆకర్షణీయంగా ప్లాస్టిక్ బాటిళ్లను తయారు చేసి మార్కెట్‌లోకి వదులుతున్నారు. వీటి అమ్మకాలు ఊహించని స్థాయికి చేరుకున్నాయి. పలు రకాల వెరైటీలు, తక్కువ ధర, బరువు తక్కువగా కనిపించే ప్లాస్టిక్ బాటిళ్ల వైపే విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు ఆకర్షితులై ప్రాణాంతకమైన రోగాలను కొని తెచ్చుకుంటున్నారు. అనారోగ్యం, పర్యావరణానికి హాని కలిగిస్తాయని తెలిసినా విద్యావంతులు, ఉన్నత వర్గాలు సైతం వీటి వినియోగాన్ని వదలకపోవడం గమనార్హం. ప్లాస్టిక్ వినియోగం మనిషి జీవితంలో భాగమైపోయింది. పిల్లలు పాఠశాలలకు వెళ్లాలన్నా, పెద్దలు విధులకు హాజరు కావాలన్నా టిఫిన్, లంచ్ బాక్సులు, వాటర్ బాటిల్స్ అన్నీ ప్లాస్టిక్‌వే వాడుతున్నారు. ప్లాస్టిక్ వస్తువుల వినియోగం పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఉదయం ప్లాస్టిక్ బాక్సులలో ప్యాక్ చేసిన ఆహారం మధ్యాహ్నం పిల్లలు భోజనం చేసే సమయానికి ఆహారంలో చాలా తేడా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు.

రసాయనాలు కరిగి విషపూరితం

ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్, లంచ్ బాక్సులతో ప్రమాదమని తెలిసినా మార్కెట్‌లో దొరికే పలు రకాల డిజైన్లు చూసి విద్యార్థులు అటు తల్లిదండ్రులు మోజుపడి కొనుగోలు చేసి వాడుతున్నారు. ప్లాస్టిక్ వస్తువులను కొనుగోలు చేస్తే రోగాలను కొనుగోలు చేసినట్టేనని వైద్యులు హెచ్చరిస్తున్నారు. మరిగించిన వాటర్‌ను, అత్యంత శీతలమైన పదార్థాలను ప్లాస్టిక్ పాత్రలలో నింపితే సుమారు 90శాతం కెమికల్స్ అందులో కరిగి ఆ పదార్థాలను విషపూరితం చేస్తాయి. దీంతో రోగాలు శరీరాన్ని కబళిస్తాయి. అలాగే ప్లాస్టిక్ బాటిళ్ల వ్యర్థాలు భూమిలో కరగాలంటే కనీసం 450 ఏళ్ల సమయం పడుతుందని నిపుణులు చెబుతున్నారు. వీటి వినియోగం ఆరోగ్యానికే కాక పర్యావరణానికి ప్రమాదకరం. పాఠశాలలు, కళాశాలలో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు సామాజిక వేత్తలు, ప్రభుత్వ అధికారులు చొరవ చూపాల్సిన అవసరం ఉందని ప్రకృతి ప్రేమికులు సూచిస్తున్నారు.

ప్లాస్టిక్‌తో ప్రాణాంతక వ్యాధులు

ప్లాస్టిక్‌లో బిస్‌ఫినాల్-ఏ (బీపీఏ), మైక్రో ప్లాస్టిక్స్ అనే రసాయనం అధికంగా ఉండటంతో కొద్ది మోతాదులోనైనా శరీరంలో చేరే ప్రమాదం ఉంది. దీంతో హార్మోన్ల సమతుల్యతను దెబ్బతీస్తుంది. శరీరంలోని గ్రంథులపై ప్రభావం చూపి వాటి పనితీరును మందగిస్తుంది. జీర్ణ సంబంధిత వ్యాధులు సంక్రమిస్తాయి. అతిశీతలం, అధిక వేడి పదార్థాల కోసం వీటిని వినియోగిస్తే పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. ప్రధానంగా ప్లాస్టిక్ వినియోగంతో క్యాన్సర్ మహమ్మారి కాటేసే ప్రమాదం ఉంది. ప్లాస్టిక్‌ను ఇలానే వినియోగిస్తే 2030 నాటికి ఆంధ్రప్రదేశ్‌లో 27 శాతం మంది క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఉందని నిపుణులు, మేధావుల గణాంకాలు హెచ్చరిస్తున్నాయి. ప్రధానంగా అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి 25 ఏళ్ల లోపు పిల్లలు, యువతలోనూ ప్లాస్టిక్ వినియోగించడంతో కలిగే అనర్థాలు ప్రాణాంతక వ్యాధులకు గురి చేస్తున్నాయి. గత 10 ఏళ్ల నుంచి రోజు రోజుకు పెద్ద ఎత్తున ప్లాస్టిక్ వినియోగం అధికమవడమే ఇందుకు ప్రధాన కారణంగా వైద్యులు సూచిస్తున్నారు.

తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించాలి



పిల్లలకు టిఫిన్ బాక్స్‌లు, వాటర్ బాటిళ్ల విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి లేదంటే ప్రమాదమే. వేడి ఆహార పదార్థాలను ప్లాస్టిక్ డబ్బాలలో ఉంచడం ద్వారా రుచి, వాసన కోల్పోవడంతో పాటు కొన్ని రకాల విష పదార్థాలు ఏర్పడతాయి. ఇవి చిన్నారుల అవయవాలపై ప్రభావం చూపుతాయి. నాణ్యత ప్రమాణాలు తక్కువగా ఉండే వాటర్ బాటిళ్లు, లంచ్ బ్లాక్స్‌లు వాడటంతో అందులోని కెమికల్స్ పొరలుగా ఆహారంలో కలిసి ప్రాణాంతక వ్యాధులు సంక్రమించే అవకాశం ఉంది.

– డాక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి, చిన్న పిల్లల వైద్యనిపుణులు, తిరుపతి

పేరెంట్స్ మీటింగ్‌ల్లో అవగాహన కల్పించాలి



ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలో పేరెంట్స్ మీటింగ్‌లంటూ హడావుడి చేస్తుంటారు. కానీ అందులో విద్యార్థులకు అవసరమైన విషయాలను తల్లిదండ్రులతో చర్చించడం లేదు. తల్లిదండ్రులకు గేమ్స్ ఏర్పాటు చేసి, టీలు, కాఫీలు ఇచ్చి సంతోషపెట్టి పంపుతున్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై యాజమాన్యాలు శ్రద్ధ చూపకపోవడం ఆశ్చర్యమేస్తోంది. పిల్లల ఆరోగ్యంపై చూపే ప్రభావాన్ని, నివారణా చర్యలను తల్లిదండ్రులకు అవగాహన కల్పించడంలేదు. విద్య, వైద్య శాఖాధికారులు దీనిపై దృష్టి పెట్టాలి.

– రాజశేఖర్‌రెడ్డి, రిటైర్డ్ అధ్యాపకులు, తిరుపతి

స్టీలు, రాగి వస్తువుల వినియోగం శ్రేయస్కరం



ఆధునిక యువత, చిన్నారుల ఆరోగ్యం పెను ప్రమాదంలో పడింది. నిద్రలేచిన మొదలు పడుకునే వరకు ప్రతి వస్తువు ప్లాస్టిక్‌తో చేసిన వాటినే వినియోగిస్తున్నారు. దీంతో క్యాన్సర్ వంటి వ్యాధులతో పాటు దీర్ఘకాలిక సమస్యల చిన్న వయస్సు నుంచే వెంటాడుతున్నాయి. ప్లాస్టిక్ బాక్సులలో ఆహారం భద్రపరిచి కొన్ని గంటల తర్వాత విద్యార్థులు ఆరగించడంతో అదికాస్త విషంగా మారుతోంది. పలు పరిశోధనలలో ఈ విషయం బయటపడినా తల్లిదండ్రులు పట్టించుకోకపోవడం దారుణం.

– ప్రశాంతి, ప్లాస్టిక్ వినియోగం–అనర్థాలపై పరిశోధన చేస్తున్న విద్యార్థిని, తిరుపతి

క్యాన్సర్ విజృంభించే ప్రమాదం



సామాన్యుల నుంచి ఉన్నత వర్గాల వరకు ప్లాస్టిక్ భూతం చుట్టుముట్టింది. తల్లిదండ్రులు చిన్న పిల్లల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. పూర్వీకులు పాటించిన నియమాలు, అలవాట్లలో ఎంతో రహస్యాలు దాగి ఉన్నాయి. వాటిని నేటి తరం అనుసరించాలి. ప్లాస్టిక్ బాటిళ్లు, లంచ్ బాక్సుల వినియోగంతో కాన్సర్ మహమ్మారి దగ్గరవుతోంది. దీన్ని నుంచి బయట పడాలంటే ప్లాస్టిక్ వస్తువులను పిల్లలకు దూరంగా ఉంచాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపై ఉంది. ఇప్పటికే ప్రభుత్వ పరంగా పలు రకాలుగా అవగాహన కార్యక్రమాలు చేపట్టి ప్రజలను చైతన్య వంతులను చేయడం జరిగింది.

– కే. భానుప్రసాద్, జిల్లా సైన్స్ అధికారి, తిరుపతి

ఏపీ ఇన్ పార్లమెంట్

లోక్‌సభ

యువతలో నైపుణ్యాభివృద్ధికి పలు పథకాలు

వైఎస్ అవినాష్ రెడ్డి ప్రశ్నకు మంత్రి జయంత్ చౌదరి వివరణ



దేశవ్యాప్తంగా యువతకు నైపుణ్యాభివృద్ధిలో సహకారం అందించేందుకు కేంద్రం ఎప్పటికప్పుడు కొత్త పథకాలను ప్రవేశపెడుతోందని కేంద్ర స్కిల్ డెవలప్‌మెంట్ శాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి తెలిపారు. లోక్‌సభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ప్రశ్నకు ఆయన లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు. 2022–23, 2024–25 మధ్య ప్రధాన మంత్రి కుషాల్ వికాస్ యోజన (పీఎంకేవీవై) కోసం రూ.56.48 కోట్లు, జన్ శిక్షాణ్ సంస్థాన్ (జేఎస్ఎస్) కోసం రూ.9.66 కోట్లు, నేషనల్ అప్రెంటిషిప్ ప్రమోషన్ స్కీం (ఎన్ఏపీఎస్) కింద 49.48 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు.

రాజ్యసభ

గ్రీన్‌ఫీల్డ్ సిటీగా 'కొప్పర్తి'!

వైవీ సుబ్బారెడ్డి ప్రశ్నకు సమాధానం



సాక్షి, న్యూఢిల్లీ: వైఎస్సార్ జిల్లాలోని కొప్పర్తిని గ్రీన్ ఫీల్డ్ సిటీగా అభివృద్ధి చేయాలని ప్రతిపాదనలు అందినట్లు కేంద్ర గృహనిర్మాణ, పట్టణాభివృద్ధి శాఖల సహాయ మంత్రి తోఖన్ సాహూ తెలిపారు. రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి ప్రశ్నకు ఆయన లిఖితపూర్వకంగా సమాధానమిస్తూ, గ్రీన్‌ఫీల్డ్ సిటీల కోసం 23 రాష్ట్రాల నుంచి 28 ప్రతిపాదనలు అందినట్లు తెలిపారు. ఇవి పరిశీలనలో ఉన్నట్లు తెలిపారు. కాగా, ఎనిమిది కొత్త నగరాల ఇంక్యుబేటింగ్ ఛాలెంజ్ ఫండ్‌గా 15వ ఆర్థిక సంఘం రూ.8 వేల కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. అయితే, ఇందుకోసం నగరాలను ఇంకా గుర్తించలేదని తెలిపారు.

పోలవరం ప్రాజెక్టుకు రూ.5,512 కోట్లు విడుదల

గొల్ల బాబురావు ప్రశ్నకు సమాధానం



పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి మే 2024 నుంచి జూలై 2025 వరకు రూ.5,512.40 కోట్లు విడుదల చేసినట్లు కేంద్రం తెలిపింది. ఈ మొత్తంలో రూ.2,807.69 కోట్లు గత ఏడాది అక్టోబర్ 9న విడుదల అయినట్లు కేంద్ర జల్‌శక్తి శాఖ సహాయ మంత్రి రాజ్ భూషణ్ చౌదరి వెల్లడించారు. ఇందులో రూ.459.69 కోట్ల వ్యయం ఇప్పటికే జరిగిందన్నారు. రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ గొల్ల బాబురావు ప్రశ్నకు ఆయన ఈ మేరకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

'పీఎస్పీ' ప్రాజెక్టులు రద్దు

- పలు పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టులకు అనుమతులు
- గ్రీన్‌హైడ్రోజన్ వ్యాలీ డిక్లరేషన్‌కు ఆమోదం
- 'బీఈఎస్ఎస్' అమలుకు ట్రాన్స్‌కో సీఎండీకి అధికారం
- ఏపీపీడీసీఎల్‌లో పెట్టుబడులకు విద్యుత్ సంస్థలకు అనుమతి
- ఆదేశాలు జారీచేసిన ఇంధనశాఖ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని పలు జిల్లాల్లో పంప్డ్ హైడ్రో స్టోరేజ్ పవర్ ప్రాజెక్టు (పీఎస్పీ)ల ఏర్పాటుకు వివిధ సంస్థలకు ఇచ్చిన అనుమతులను రాష్ట్ర ప్రభుత్వం రద్దుచేసింది. పలు పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టుల నిర్మాణానికి ఆమోదం తెలిపింది. ఇటీవల జరిగిన గ్రీన్‌హైడ్రోజన్ సమ్మిట్‌లో రూపొందించిన గ్రీన్‌హైడ్రోజన్ వ్యాలీ డిక్లరేషన్‌కు ఆమోదం తెలిపింది. బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ (బీఈఎస్ఎస్) అమలుకు ట్రాన్స్‌కో సీఎండీకి అధికారం కల్పించింది. అలాగే ఏపీపీడీసీఎల్‌లో పెట్టుబడులు పెట్టేందుకు విద్యుత్ సంస్థలకు అనుమతులిచ్చింది. ఈ మేరకు ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సోమవారం వేర్వేరుగా ఉత్తర్వులు జారీచేశారు. ఆ వివరాలు..

- అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్, అహ్మదాబాద్‌కు పార్వతీపురం మన్యం జిల్లా, కురుకుట్టిలో కేటాయించిన 1,200 మెగావాట్లు, కర్రివలసలో 1000 మెగావాట్ల పంప్డ్ హైడ్రో స్టోరేజ్ పవర్ ప్రాజెక్టులను స్థానిక సమస్యల కారణంగా రద్దుచేసింది.
- అనంతపురం జిల్లా సింగనమలలో ఆరో ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్‌కు కేటాయించిన 800 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ జలవిద్యుత్ ప్రాజెక్టు డీపీఆర్ తయారీ, కార్యకలాపాల్లో జాప్యం కారణంగా రద్దుచేసింది.
- కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని ధోనె పశ్చిమ ప్రాంతంలో 900 మెగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టుల ఏర్పాటుకు రెన్యూ విక్రమ్‌శక్తి ప్రైవేట్ లిమిటెడ్‌కు అనుమతి ఇచ్చింది.
- శ్రీ సత్యసాయి జిల్లా ముదిగుబ్బ మండలానికి బదులుగా వైఎస్సార్ కడప జిల్లాలోని జమ్మలమడుగు మండలం సున్నపురాళ్లపల్లె, ఇతర గ్రామాల వద్ద 400 మెగావాట్ల సౌరవిద్యుత్ ప్రాజెక్టును ఏర్పాటుకు జేఎస్‌డబ్ల్యూ నియో ఎనర్జీ లిమిటెడ్‌కు అనుమతి ఇచ్చింది.
- విజయనగరం జిల్లా వంగర మండలం అరసాడ గ్రామంలో రోజుకు 20 టన్నుల (టీపీడీ) కంప్రెస్డ్ బయో–గ్యాస్‌ను ఉత్పత్తి చేసే ప్లాంట్ ఏర్పాటుకు పీవీఎస్ గ్రూప్ కంపెనీకి ఆమోదం తెలిపింది.
- శ్రీకాకుళం జిల్లా జి.సిగడం మండలం సంతవురిటి గ్రామంలో రోజుకు 20 టన్నుల (టీపీడీ) కంప్రెస్డ్ బయో–గ్యాస్‌ను ఉత్పత్తి చేసే రెండుప్లాంట్ల నిర్మాణానికి పీవీఎస్ రామ్మోహన్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు ఆమోదం తెలిపింది.
- నంద్యాల జిల్లాలోని ఓక్ వద్ద 800 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్ట్‌ను ఆర్‌వీఆర్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు కేటాయించింది.
- పవర్ సిస్టమ్ డెవలప్‌మెంట్ ఫండ్ (పీఎస్‌డీఎఫ్) ద్వారా 2,500 మెగావాట్ హవర్ (ఎండబ్ల్యూహెచ్) సామర్థ్యం గల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ (బీఈఎస్ఎస్) ప్రాజెక్టులను స్థాపించాలనుకుంటున్నారు. అయితే వాటి ఏర్పాటుకు వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)లు, నోడల్ ఏజెన్సీ వివరాలను సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ (సీఈఏ)కి పంపాల్సి ఉంది. ఈ నేపథ్యంలో బీఈఎస్ఎస్ అమలుకు ఏపీ ట్రాన్స్‌కో సీఎండీకి ప్రభుత్వం అధికారాన్ని కల్పించింది.
- గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి, నిల్వ, విక్రయం, విద్యుత్ ఉత్పత్తికి సంబంధించి ఇటీవల ఓ ప్రైవేటు యూనివర్సిటీలో జరిగిన గ్రీన్‌హైడ్రోజన్ సమ్మిట్‌లో ఒక డిక్లరేషన్‌ను తయారు చేశారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం అధికారముద్ర వేసింది.
- పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (పీఎఫ్‌సీ) నుంచి రూ.1,724.37 కోట్ల రుణాన్ని ఆంధ్రప్రదేశ్ పవర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్(ఏపీపీడీసీఎల్) తీసుకోనుంది. దీనికి హామీదారుగా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది.
- ఏపీపీడీసీఎల్‌లో రూ.605.70 కోట్లను ప్రిఫరెన్షియల్ షేర్ల జారీ కింద పెట్టుబడి పెట్టడానికి ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీసీపీడీసీఎల్)కు అధికారం కల్పించింది. రూ.569.78 కోట్లకు ఏపీపీడీసీఎల్ వాటాలను కొనుగోలు చేయడానికి కూడా అంగీకరించింది.
- ఏపీపీడీసీఎల్‌లో ఈక్విటీ ద్వారా రూ.510.31 కోట్ల షేర్లను హక్కు జారీ కింద పెట్టుబడి పెట్టడానికి ఏపీజెన్‌కోకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.
- ఏపీపీడీసీఎల్‌లో ఈక్విటీ ద్వారా హక్కు, ప్రాధాన్యత షేర్ల జారీ కింద ఏపీఈపీడీసీఎల్, రూ.354.86 కోట్లు, ఏపీఎస్పీడీసీఎల్ రూ.454.86 కోట్లు పెట్టుబడి పెట్టడానికి ప్రభుత్వం అనుమతిచ్చింది.

ఏపీ దివ్యాంగ విద్యార్థులకు పతకాల పంట

జాతీయ స్థాయిలో సత్తా

సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న దివ్యాంగ విద్యార్థులు జాతీయ స్థాయిలో సత్తా చాటారని సమగ్ర శిక్ష రాష్ట్ర పథక సంచాలకులు బి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. స్పెషల్ ఒలింపిక్స్ భారత్ ఆధ్వర్యంలో జూలై 24 నుంచి 28 వరకు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బిలాస్‌పూర్‌లో జరిగిన జాతీయ స్థాయి బోచీ పోటీల్లో రాష్ట్ర విద్యార్థులు ఆరు పతకాలు సాధించారన్నారు. ఈ పోటీల్లో దివ్యాంగ విద్యార్థులు 1 బంగారు పతకం, 2 వెండి పతకాలు, 3 కాంస్య పతకాలు గెలుచుకున్నారని వివరించారు. ఈ విజయం దివ్యాంగ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపుతుందని తెలిపారు.

విజేతలు వీరే:

1. ఎస్. తన్మయ శ్రీదేవి - పశ్చిమ గోదావరి - బంగారు పతకం - 1వ స్థానం - వ్యక్తిగతం
2. వి.చరణ్ తేజ - గుంటూరు - రజత పతకం - 2వ స్థానం -వ్యక్తిగతం
3. కె.ఎస్.డి పోలరాజు - కాకినాడ - రజత పతకం - 2వ స్థానం - యూనిఫైడ్ పార్ట్‌నర్
4. ఎ.తోషిణి -విజయనగరం - కాంస్య పతకం - 3వ స్థానం - వ్యక్తిగతం
5. ఎ. తన్మయ శ్రీదేవి - పశ్చిమ గోదావరి - బ్రాంజ్ పతకం - 3వ స్థానం యూనిఫైడ్ పార్ట్‌నర్
6. కె.ఎస్.డి. పోలరాజు - కాకినాడ - కాంస్య పతకం -3వ స్థానం
7. ఎన్.బాల సరస్వతి -అనకాపల్లి - 4వ స్థానం -వ్యక్తిగతం
8. వి రాజేష్ - విశాఖపట్నం ఏపీ - 5వ స్థానం - సింగిల్

పీఎం కిసాన్‌తో కలిపి అన్నదాత సుఖీభవ సాయం

వ్యవసాయ శాఖ డైరెక్టర్ సేనాపతి డిల్లీరావు

సాక్షి, అమరావతి: అన్నదాత సుఖీభవ పథకాన్ని పీఎం కిసాన్ పథకంతో కలిపి 2025–26 వ్యవసాయ సీజన్ నుంచి ప్రభుత్వం అమలు చేయనున్నట్టు వ్యవసాయ శాఖ డైరెక్టర్ డిల్లీరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సాగుభూమి కలిగి ఉన్న భూ యజమానులతో పాటు అటవీ భూ సాగుదారులకు పీఎం కిసాన్ కింద కేంద్రం అందించే రూ.6వేలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.14వేలు కలిపి రూ.20వేలు మూడు విడతల్లో అందిస్తుందన్నారు. ఆగస్టు 2న పీఎం కిసాన్ 20వ విడత సాయం రూ.2వేలు, అన్నదాత సుఖీభవ కింద రూ.5వేలు కలిపి రూ.7వేల చొప్పున నేరుగా వారి ఖాతాల్లో జమ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు.

ముస్లిం మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ముస్లిం మహిళలకు త్వరలో ఉచితంగా కుట్టు మిషన్లు అందిస్తామని ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్ చెప్పారు. సోమవారం విజయవాడలో జరిగిన వక్ఫ్ బోర్డు సమావేశంలో అజీజ్ మాట్లాడుతూ.. గతంలో దాతలు ఇచ్చిన దాదాపు 70 వేల ఎకరాల్లో.. ఇప్పటికే 30 వేల ఎకరాలు ఆక్రమణకు గురయ్యాయని చెప్పారు. దాదాపు 15 వేల ఎకరాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని తెలిపారు. ముస్లిం విద్యార్థుల కోసం ఉచిత విద్య పథకాన్ని ప్రారంభించబోతున్నామన్నారు. ఈ సమావేశంలో వక్ఫ్ బోర్డు సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

మెడికల్ వ్యర్థాల నిర్వహణపై ఫిర్యాదులకు 104 వినియోగించాలి: ఎం.టి. కృష్ణబాబు

సాక్షి, అమరావతి: ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణపై ఫిర్యాదుల కోసం 104 కాల్‌సెంటర్‌ను వినియోగించేలా చర్యలు చేపట్టాలని వైద్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ రాష్ట్ర స్థాయి సలహా కమిటీ చైర్మన్ ఎం.టి.కృష్ణబాబు ఆదేశించారు. ఆయా ఏజెన్సీలు ఆస్పత్రుల నుంచి వ్యర్థాల సేకరణ, వాటి నిర్వహణపై పర్యవేక్షణకు థర్డ్ పార్టీ ఏజెన్సీని నియమించాలని సూచించారు. సోమవారం సచివాలయంలో బయోమెడికల్ వ్యర్థాల రాష్ట్ర స్థాయి సలహా కమిటీ సమావేశం నిర్వహించారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

- రాష్ట్రవ్యాప్తంగా సచివాలయాల్లో వినతి పత్రాలు

సాక్షి, అమరావతి: అర్హులైన కౌలు రైతులందరికీ పంట సాగుహక్కుదారుల పత్రాలు (సీసీఆర్సీ) జారీ చేయాలని ఏపీ కౌలు రైతుల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా సోమవారం గ్రామ సచివాలయాల ఎదుట నిరసన ప్రదర్శనలు నిర్వహించి సచివాలయ సిబ్బందికి వినతి పత్రాలు అందజేసింది. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్నీడి యల్లమందరావు, ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య మాట్లాడుతూ ఆర్‌బీఐ నిబంధనల మేరకు ప్రతి కౌలు రైతుకు హామీలేని పంట రుణాలు అందించాలన్నారు. ఉచిత పంటల బీమా పథకాన్ని, కౌలు రైతులకూ వర్తింప చేయాలన్నారు. పంటల బీమా పథకం గడువు ఆగస్టు 15 వరకు పొడిగించాలని డిమాండ్ చేశారు. కౌలుగుర్తింపు కార్డులు జారీ చేయకముందే పంటల బీమా పథకం గడువు ముగిసిందని, ఇలా అయితే కౌలురైతులు పండించిన పంటలకు బీమా ఎలా వర్తిస్తుందని ప్రశ్నించారు. డిమాండ్‌కు సరిపడా ఎరువులను అందుబాటులో ఉంచాలని కోరారు.

విద్యుత్ ప్రాజెక్టులు సకాలంలో పూర్తవ్వాలి

సీఎస్ విజయానంద్ నిర్దేశం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ అవసరాలను తీర్చడానికి సకాలంలో ప్రాజెక్టులను పూర్తి చేయాలని, అదే సమయంలో ఆర్థిక నిర్వహణపై దృష్టి సారించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ అధికారులకు సూచించారు. థర్మల్, హైడల్, సోలార్ యూనిట్ల ఉత్పత్తి పనితీరుపై విద్యుత్ సౌధలో సోమవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బొగ్గు నిల్వలు తగినంతగా ఉండేలా చూసుకోవాలని, ప్రధాన థర్మల్ ప్రాజెక్టులలో పెండింగ్ పనులను వేగంగా పట్టాలెక్కించాలని చెప్పారు. డాక్టర్ నార్ల తాతారావు థర్మల్ పవర్ స్టేషన్‌లో మరమ్మతులకు గురైన ఏడు యూనిట్ల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో ఏపీ ట్రాన్స్‌కో జేఎండీ కీర్తి చేకూరి, డైరెక్టర్లు ఏవీకే భాస్కర్, జీవీ రావు, ఏపీ జెన్‌కో డైరెక్టర్లు అశోక్ కుమార్ రెడ్డి, సుజయ కుమార్ పాల్గొన్నారు.

విద్యేతర కార్యక్రమాలకు ఉపాధ్యాయులు వద్దు

సాక్షి, అమరావతి: ఉపాధ్యాయులను విద్యేతర కార్యక్రమాలలో భాగస్వాములుగా చేయొద్దని పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా కలెక్టర్లకు పంపిన ఈ ఆదేశాలలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, కేజీబీవీ, మోడల్ స్కూల్స్, ఏపీఆర్ఈఐఎస్, జెడ్పీహెచ్ఎస్, ఎంపీయూపీఎస్, ఎంపీపీఎస్, మున్సిపల్ పాఠశాలల ఉపాధ్యాయులను ఇలాంటి కార్యక్రమాల్లో నియమించరాదని పేర్కొన్నారు.

గిరిజన మహిళలను జైళ్ల నుంచి విడుదల చేయాలి

ఇండోసోల్ వ్యవహారంపై డిమాండ్

సాక్షి, అమరావతి: నెల్లూరు జిల్లా కరేడులో ఇండోసోల్‌కు భూ కేటాయింపుల వ్యవహారానికి సంబంధించి అరెస్టయిన గిరిజన మహిళలపై కేసులను తొలగించి, వారిని జైళ్ల నుంచి విడుదల చేయాలని ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎ.అశోక్, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్) రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ విషయమై గిరిజన సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి ఎంఎం నాయక్‌ను సోమవారం కలిసి వారు వినతి పత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ, గిరిజన భూమి రక్షణకు ఆందోళన చేస్తున్న మణికాల శిరీష, మల్లవరపు లలిత, మణికల సుజాతపై పోలీసులు కేసు నమోదు చేసి జైలుకు పంపించారన్నారు. గిరిజన మహిళల భూములకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

పిల్లలకు ఉడికీ ఉడకని భోజనం

అసంతృప్తి వ్యక్తం చేసిన ఎమ్మెల్సీ రమేష్ యాదవ్

ఒంగోలు వన్‌టౌన్: ఉడికీ, ఉడకని అన్నం పిల్లలకు పెడుతున్నారని ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఒంగోలులోని మంగమూరు రోడ్డులో ఉన్న బీసీ బాలుర వసతి గృహాన్ని ఆయన సోమవారం రాత్రి పరిశీలించారు. వసతి గృహంలో ప్రతి గదిని పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ స్వయంగా పిల్లలకు వడ్డించే భోజనం తిని సరిగ్గా ఉడక్కపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం తన సొంత డబ్బులతో పిల్లలకు భోజనం తెప్పించారు. వసతి గృహం పై రెండు సెల్‌ఫోన్ టవర్లను ఏర్పాటు చేశారని, దీని వలన పిల్లలపై రేడియేషన్ ప్రభావం పడుతుందన్నారు.

5న విద్యుత్ ఉద్యమం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

సాక్షి, అమరావతి: కరెంటు చార్జీల పెంపు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ వామపక్షాలు, ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆగస్టు 5వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా అన్ని విద్యుత్ కార్యాలయాల ఎదుట తలపెట్టిన విద్యుత్ ఉద్యమాన్ని విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపునిచ్చారు. ఆయన సోమవారం సీపీఐ మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, పార్టీ ముఖ్య నేతలు ముప్పాళ్ల నాగేశ్వరరావు, అక్కినేని వనజ, పి.హరినాథరెడ్డి, జి.ఈశ్వరయ్యతో కలిసి వర్చువల్‌గా అన్ని జిల్లాల పార్టీ నాయకులతో మాట్లాడారు. ఇంటింటా కరపత్రాలను పంపిణీ చేస్తూ విద్యుత్ ఉద్యమంలో ప్రజల్ని భాగస్వాములను చేయాలని సీపీఐ శ్రేణులకు సూచించారు. ప్రభుత్వం దిగివచ్చేలా ఈ ఉద్యమం పెద్ద ఎత్తున సాగాలన్నారు. విజయవాడ గవర్నర్‌పేటలోని ఆర్టీసీ స్థలాన్ని ప్రభుత్వం లీజు పేరుతో లులు మాల్‌కు కట్టబెట్టడాన్ని రామకృష్ణ తప్పుబట్టారు.

ఆగస్టు 3 వరకు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు

మావోయిస్టు పార్టీ

చర్ల: సోమవారం నుంచి ఆగస్టు 3 వరకు నిర్వహిస్తున్న అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను విజయవంతం చేయాలని మావోయిస్టు పార్టీ పిలుపునిచ్చింది. ఈ మేరకు పార్టీ భద్రాద్రి కొత్తగూడెం – అల్లూరి సీతారామరాజు జిల్లాల డివిజన్ కమిటీ పేరుతో.. భద్రాద్రి జిల్లా చర్ల మండలం ఆర్.కొత్తగూడెం, దానవాయిపేట గ్రామాల్లో సోమవారం బ్యానర్లు, కరపత్రాలు వెలిశాయి. కగార్ ఆపరేషన్‌ను ప్రజా ఉద్యమాల ద్వారా ఓడించాలని పార్టీ కోరింది. ప్రధాని మోదీ నాయకత్వంలోని బీజేపీ సర్కారు 2047 నాటికి బ్రాహ్మణీయ హిందూ రాజ్యాన్ని స్థాపించాలని లక్ష్యంగా పెట్టుకుందని ఆరోపించింది. దశాబ్దాల పోరాటంతో సాధించిన తెలంగాణలోనూ ప్రజలకు ప్రాథమిక హక్కులు లేవని విమర్శించింది.

స్మార్ట్‌మీటర్లపై అవగాహన కల్పించండి

విద్యుత్ అధికారులకు మంత్రి గొట్టిపాటి ఆదేశం

సాక్షి, విశాఖపట్నం: స్మార్ట్ మీటర్లపై ప్రజలకు అవగాహన కల్పించిన తరవాతే వాటిని అమర్చేందుకు ప్రయత్నించాలని ఈపీడీసీఎల్ అధికారుల్ని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు. విశాఖలో సోమవారం రాత్రి ఈపీడీసీఎల్ అధికారులతో మంత్రి అత్యవసర సమీక్ష నిర్వహించారు. ప్రణాళికాయుత కార్యక్రమాలు, ప్రత్యేక క్యాంపెయిన్లు నిర్వహించి స్మార్ట్ మీటర్ల వినియోగంపై ప్రజల్లో సానుకూల దృక్పథాన్ని కల్పించాలని సూచించారు. రాష్ట్రంలో వ్యవసాయ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు అమర్చటం లేదని, ఈ విషయంపైనా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

జల్లుల సీజన్... ఒళ్లు జాగ్రత్త!



ఈ వానాకాలంలో గత కొన్నాళ్లుగా...
ఎడతెరిపి లేకుండా వర్షాలు పడుతున్నాయి.
ఈ వానాకాలపు సీజన్‌లో
ఎంత వర్షం పడిందో తెలిపే సెంటీమీటర్లూ...
అలాగే జ్వరం తీవ్రత తెలిపే థర్మామీటర్ల రీడింగులూ
పోటాపోటీగా పెరుగుతూపోతుంటాయి.
ఎందుకంటే...
వర్షం రాబోయే పంట సీజన్‌కు మంచి పంటలనే కాదు
వర్తమానంలో జ్వరాలు, ఇన్ఫెక్షన్ల తంటాలనూ
ప్రామిస్ చేస్తుంది.
అందుకే ఓ పక్క మోద ప్రమోదాలతో పాటు
మరో పక్క ఖేద ప్రమాదాలను తెచ్చిపెట్టే
రెయినీ సీజన్ పెచ్చరిల్లజేసే
వానల వ్యాధుల గురించి తెలుసుకుందాం.
వర్షపు వ్యాధుల ముప్పులనుంచి
కాపాడుకోవడమెలాగో అవగాహన పెంచుకుందాం...

వానల్లో హాయిగా పకోడీలు తింటూ, కిటికీలోంచి చినుకులను చూసే అదృష్టం కొద్దిమందికే ఉంటుంది. చాలామంది రెయిన్‌కోట్ తొడుక్కునో లేదా గొడుగు పట్టుకునో... అవేవీ లేనివాళ్లు తడుస్తూనైనా వర్షాల్లో తమ పనులకూ / ఆఫీసులకూ వెళ్లి తీరాల్సిందే. ఈ నేపథ్యంలో తడవడంతో వచ్చే అనారోగ్యాలతో పాటు... ఈ సీజన్‌లోనే పెరిగే వ్యాధుల గురించి తెలుసుకుని జాగ్రత్త పడాల్సిన అవసరముంది. చిన్నారులు తమ ఆటలో భాగంగా వానలో తడిసేందుకు ఆసక్తి చూపుతారు. అలా వాళ్లు జలుబూ, జ్వరాలు తెచ్చిపెట్టుకుంటారు. ఇక వృద్ధులకు ఈ సీజన్ ఓ ప్రమాదకారిలా అనేక ముప్పులు తెచ్చిపెడుతుంది. వాన వ్యాధుల గురించి అవగాహన పెంచుకోవడంతో వాటిని చాలావరకు నివారించుకోవచ్చు. అదెలాగో చూద్దాం.



వర్షాలు అనేక రకాలుగా అనారోగ్య సమస్యలను తెచ్చిపెడతాయి. మొదటిది నేరుగా తడవడం వల్ల వచ్చే జలుబూ, జ్వరాలు ఒక తరహావి. ఇక ఈ సీజన్‌లో నీటిగుంటల్లో చేరే నీరు కారణంగా దోమల ప్రత్యుత్పత్తి (బ్రీడింగ్)తో వాటి సంఖ్య విపరీతంగా పెరగడం, దాంతో అవి వ్యాప్తి చేసే వ్యాధులు మరో తరహావి అయితే... ఇదే సీజన్‌లో ముసురుకునే ఈగలు వ్యాప్తి చేసే జబ్బులూ... వెరసి ఇవన్నీ అనేక అనారోగ్య సమస్యలకు కారణమవుతాయి. ఇక ఇంకో తరహా ముప్పు ఏమిటంటే... వాన నీరు భూమి ఉపరితలాన్నీ తడిపేయడంతో ఎలకలు తమ బొరియల్లోంచి పైకి వచ్చి, ఇళ్లలోని కిచెన్ ప్లాట్‌ఫారమ్ మీద ఉన్న ఆహారాలను కలుషితం చేయడంతో వచ్చే లెప్టోస్పైరోసిస్ లాంటి జ్వరాలను తెచ్చిపెట్టడం మరో ముప్పు. వృద్ధుల్లాంటి వారు బురదలో కాలుజారి ఎముకలకు ప్రమాదాలు తెచ్చిపెట్టుకోవడం వంటి ట్రామా కేసులకూ ఈ సీజన్ కారణమవుతుంటుంది. ఇలా ఒక్కో తరహా ముప్పుల తీరుతెన్నులను పరిశీలిద్దాం...

నీరు కలుషితం కావడం కారణంగా...



వర్షాల సీజన్‌లో నీరు కలుషితం కావడం (వాటర్ కంటామినేషన్) వల్ల టైఫాయిడ్, కలరా, షిజెల్లోసిస్, ఈ-కొలై వంటి వ్యాధులు ఎక్కువగా కనిపిస్తుంటాయి. అలా నీరు కలుషితం కావడం వల్ల కనిపించే ప్రధాన వ్యాధులు...

● **టైఫాయిడ్ :** సాల్మొనెల్లా టైఫీ అనే బ్యాక్టీరియా వల్ల ఈ వ్యాధి వస్తుంది. జ్వరం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు, కడుపునొప్పి, వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలు కనిపిస్తుంటాయి. బ్లడ్ కల్చర్, స్టూల్ కల్చర్, వైడాల్ టెస్ట్ వంటి పరీక్షలతో ఈ వ్యాధిని నిర్ధారణ చేయవచ్చు. సకాలంలో వైద్య చికిత్స అందించడం వల్ల దీనికి చికిత్స చేయవచ్చు. అయితే సరైన చికిత్స తీసుకోకపోతే ఈ సమస్య వల్ల పేగుల్లో పుండ్లు పడటం, సెప్టిసీమియా (ఒంటిలోని రక్తానికి ఇన్ఫెక్షన్ రావడం) వంటి కాంప్లికేషన్లకు దారితీయవచ్చు. తగిన మందులతోనూ, సెప్టిసీమియాలో ప్రత్యేకంగా చేయాల్సిన చికిత్సలతోనూ వైద్యులు ఈ సమస్యకు చికిత్స అందిస్తారు.

● **కలరా :** విబ్రియో కలరా అనే బ్యాక్టీరియా వల్ల ఈ వ్యాధి వస్తుంది. తీవ్రమైన నీళ్ల విరేచనాలు, వాంతులు వల్ల డీహైడ్రేషన్ వస్తుంది. దాంతో బీపీ పడిపోవడం జరుగుతుంది. బియ్యం కడిగిన నీళ్లలా విరేచనం కావడం ఈ వ్యాధి ముఖ్య లక్షణం. అందుకే ప్రత్యేకంగా ఈ లక్షణాన్ని 'రైస్ వాటర్ స్టూల్స్' అని కూడా చెబుతారు. ఈ వ్యాధికి సకాలంలో వైద్యం అందకపోతే మూత్రపిండాలు పాడైపోవడం వంటి దుష్పరిణామాలు చోటు చేసుకుని, ఒక్కోసారి ఆ పరిస్థితి ప్రాణాంతకంగా కూడా మారే అవకాశముంటుంది. స్టూల్ కల్చర్, డార్క్ ఫీల్డ్ మైక్రోస్కోపీ వంటి పరీక్షలతో ఈ రోగనిర్ధారణ చేస్తారు. కొన్ని రకాల యాంటీబయాటిక్స్‌తో వైద్యులు దీన్ని అదుపు చేస్తారు.

● **షిజెల్లోసిస్ :** జ్వరం, రక్త విరేచనాలు, వాంతులు, కడుపునొప్పి మొదలైనవి ఈ వ్యాధి తాలూకు లక్షణాలు. షిజెల్లోసిస్‌లో పేగులో ఇన్ఫెక్షన్‌తో వచ్చే 'టాక్సిక్ మెగా కోలన్' అనే కాంప్లికేషన్‌తో పాటు... రక్తంలో యూరియా మోతాదులు ఉండాల్సిన దానికంటే చాలా ఎక్కువగా పెరిగిపోవడవం; రక్తం కలుషితమయ్యే 'కీటోలైటిక్ యురేమియా' వంటి దుష్ప్రభావాలూ కనిపించవచ్చు. ఇలా జరిగినప్పుడు ఆ పరిస్థితి ప్రాణాంతకం అయ్యేందుకు అవకాశం ఉంది.

● **ఈ-కొలై :** నీళ్ల విరేచనాల ఎక్కువగా అయ్యే ఈ కండిషన్‌కు 'ఈ-కొలై' అనే బ్యాక్టీరియా కారణం. ఇది పేగులతో పాటు కిడ్నీలు, ఊపిరితిత్తులు, మెదడు, చర్మం లాంటి భాగాల్లోనూ ఇన్ఫెక్షన్ కలిగించవచ్చు. రక్తం, మూత్రం కల్చర్ పరీక్షల ద్వారా ఈ వ్యాధి నిర్ధారణ చేయవచ్చు.

దోమలతో వ్యాప్తిచెందే వ్యాధులు...



● **డెంగీ :** వానాకాలంలో మునపటి కంటే ఎక్కువగా వ్యాప్తి చెందే ఈ వ్యాధికి ఏడిస్ ఈజిప్టై అనే రకం దోమలు కారణమవుతాయి. జ్వరం, తీవ్రమైన తలనొప్పితో పాటు ఎముకలు విరిచేసినంత తీవ్రమైన నొప్పి రావడంతో దీన్ని 'బ్రేక్ బోన్ ఫీవర్' అని కూడా అంటారు. వ్యాధి ముదిరినప్పుడు అంతర్గత అవయావాల్లో రక్తస్రావం కూడా జరగవచ్చు. మామూలుగా వచ్చే డెంగీ వ్యాధిని 'క్లాసికల్ డెంగీ' అంటారు. అయితే తీవ్రమైన అంతర్గత రక్తస్రావం వల్ల వచ్చే పరిస్థితిని 'డెంగీ హేమరేజిక్ ఫీవర్' అంటారు. ఒక్కోసారి రోగి తీవ్రమైన షాక్‌కు గురికావచ్చు. ఈ తరహా డెంగీని దీన్ని 'డెంగీ షాక్ సిండ్రోమ్' అంటారు. దోమలు వ్యాప్తి చేసినప్పటికీ డెంగీ వైరస్‌తో వచ్చే వ్యాధి ఇది. దీనికి ప్రత్యేకంగా చికిత్స ఉండదు. కనిపించే లక్షణాలను బట్టి చికిత్స అందించే సింప్టమేటిక్ ట్రీట్‌మెంట్‌తో దీనికి చికిత్స చేస్తారు. డెంగీకి వ్యాక్సిన్ అందుబాటులో ఉన్నప్పటికీ... ఒకసారి డెంగీ బారిన పడ్డవారు మరోసారి దీని బారిన పడితే పరిస్థితి చాలా తీవ్రంగానూ, విషమంగానూ ఉంటుంది కాబట్టి ఒకసారి డెంగీ బారిన పడ్డవారికి వ్యాక్సిన్ ఇస్తుంటారు.

● **చికన్ గున్యా :** ఇది కూడా ఎడిస్ ఈజిప్టై అనే దోమ వల్లనే వ్యాప్తి చెందుతుంది. దోమల వల్ల వ్యాప్తి చెందే ఒక రకం వైరస్ కారణంగా ఇది వస్తుంది. ఏడిస్ ఈజిప్టై దోమ సాధారణంగా పగటి వేళ ఎక్కువగా కనిపిస్తుంటుంది. జ్వరంతో పాటు విపరీతమైన తలనొప్పి, తీవ్రస్థాయిలో కీళ్లనొప్పులు వస్తాయి. ఈ కీళ్లనొప్పులు భరించలేనంతగా ఉంటాయి. ఇది కూడా వైరల్ జ్వరం కావడంతో లక్షణాలను బట్టి ఇచ్చే సింప్టమేటిక్ ట్రీట్‌మెంట్ అందిస్తారు.

● **మలేరియా :** ఇది కొన్ని ప్రాంతాల్లో చాలా ఎక్కువగా ఉండే తీవ్రమైన జ్వరం. అనాఫిలస్ అనే రకం దోమ కారణంగా ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. ఇది రాత్రివేళల్లో ఎక్కువగా కనిపిస్తుంటుంది. దోమలో వృద్ధి చెందే ప్లాస్మోడియమ్ అనే ప్రోటోజోవా రకానికి చెందిన ఏకకణ సూక్ష్మజీవి వల్ల మలేరియా జ్వరాలు వస్తాయి. ఇందులో ప్రధానంగా నాలుగు రకాలు ఉంటాయి. ఇందులో రకాన్ని బట్టి జ్వరాలు నిర్దిష్టంగా కొంత కొంత వ్యవధిలో మాటిమాటికీ వస్తుంటాయి. ఈ వ్యాధిలో ఒక రకం (స్పీషీస్) వల్ల సెరిబ్రల్ మలేరియా వస్తుంది. దీని వల్ల ఒక్కోసారి శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది (అక్యూట్ రెస్పిరేటరీ డిస్ట్రెస్ సిండ్రోమ్-ఏఆర్‌డీఎస్), స్పృహ తప్పిపడిపోవడం, అపస్మారక స్థితిలోకి వెళ్లడం, మూత్రపిండాలు విఫలం కావడం (రీనల్ ఫెయిల్యూర్) వంటివి జరగవచ్చు.



మలేరియాలో మళ్లీ మళ్లీ జ్వరం ఎందుకంటే...

మలేరియా అనేది ప్రోటోజోవా అనే విభాగానికి చెందిన ఏకకణ జీవి అయిన 'ప్లాస్మోడియమ్' కారణంగా వస్తుంది. మళ్లీ ఇందులోనూ కొన్ని రకాలు ఉంటాయి. ఉదాహరణకు ప్లాస్మోడియమ్ వైవాక్స్, ప్లాస్మోడియమ్ ఓవ్యూల్. మిగతా రకాలు ఎలా ఉన్నా... ఇవి మాత్రం చికిత్స తర్వాత... మందులకు దొరికి నశించిపోకుండా ఉండేందుకు వెళ్లి కాలేయంలో దాక్కుంటాయి. ఇవి అక్కడే ఉన్నప్పుడు... చికిత్స తర్వాత కొన్ని రోజులకూ లేదా కొన్ని నెలలకు జ్వరం మళ్లీ మళ్లీ తిరగబెడుతూ ఉంటుంది. దాన్ని పూర్తిగా తొలగించేలా చేయడానికి 'ర్యాడికల్ చికిత్స' అనే ప్రత్యేక చికిత్స అవసరమవుతుంది. మలేరియా వచ్చాక అది ప్లాస్మోడియమ్ వైవాక్స్, ప్లాస్మోడియమ్ ఓవ్యూల్ రకానికి చెందిందా కాదా అని తెలుసుకోవడం కోసం 'బ్లడ్ స్మియర్'ను మైక్రోస్కోప్ కింద పరీక్షించాలి. బాధితుడికి ప్లాస్మోడియమ్ వైవాక్స్ ఉందని తెలిశాక, వాస్తవానికి అతడికి 'ప్రైమాక్విన్' అనే మందును 14 రోగుల పాటు ఇవ్వాలి. అయితే వాళ్లలో 'జీ6పీడీ'లోపం ఉంటే అలాంటివాళ్లకు ప్రైమాక్విన్ మందు ఇవ్వకూడదు. ఆలోపం ఉందా లేదా అని తెలుసుకునేందుకు 'జీ6పీడీ' అనే పరీక్ష నిర్వహించి, లోపం లేనివాళ్లకు మాత్రమే ప్రైమాక్విన్ మందు ఇవ్వాల్సి ఉంటుంది. అలా మందును నిర్ణీత కాలంపాటు బాధితుడికి ఇచ్చి... అతడిలోనుంచి మలేరియాను సమూలంగా తొలగిపోయేలా చేయాలి. దీన్నే 'ర్యాడికల్ ట్రీట్‌మెంట్' అంటారు.



డాక్టర్ నవీన్ కుమార్
సీనియర్ ఫిజీషియన్

ఈగలతో వచ్చే వ్యాధులు...

వానల సీజన్ మొదలవ్వగానే ఈగలు ఎక్కువ సంఖ్యలో కనిపిస్తుంటాయి. ఈగలతో దాదాపు వంద రకాల వ్యాధులు వస్తుంటాయి. ఇవి పరిశుభ్రత లేని చోట్ల ఎక్కువగా కనిపిస్తుంటాయి. ఇవి కొన్ని మైళ్ల దూరాలూ వెళ్లగలవు. సాధారణంగా పగటివేళ ఎక్కువగా కనిపిస్తుంటాయి. రాత్రివేళ విశ్రాంతి తీసుకుంటుంటాయి.

ఈగల లార్వాలతో వృద్ధి చెందే వ్యాధులను 'మైయాసిస్' అంటారు. ఈగల కారణంగా వ్యాప్తి చెందే వ్యాధులు సాధారణంగా ఒంటిపై ఉండే గాయాలు, పుండ్ల ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతుంటాయి. ఈగ లార్వాలు కొన్ని కంటిలోకి కూడా ప్రవేశించి, రెటీనాకు సైతం హాని చేయవచ్చు.

ఇవీ ఈగలతో వ్యాప్తి చెందే వ్యాధుల్లో కొన్ని...

నీళ్ల విరేచనాలకు కారణం అయ్యే ఎంటమీబా హిస్టలిటికా, జియార్డియా లాంబ్లియా వంటి ప్రోటోజోవన్ పరాన్న జీవులనూ, ఆస్కారిస్ లుంబ్రికాయిడ్స్, ఎంటరోబియస్ వర్మికులారిస్ వంటి నులిపురుగులనూ, పోలియో, వైరల్ హెపటైటిస్ (హెపటైటిస్ ఏ అండ్ ఈ) వంటి వైరస్‌లనూ ఈగలు వ్యాప్తి చేస్తాయి. ఈ కింద పేర్కొన్నవి ఈగలు వ్యాప్తి చేసే ముఖ్యమైన వ్యాధుల్లో కొన్ని మాత్రమే.

● **అమీబియాసిస్ :** ఇవి ప్రోటోజోవాకు చెందిన సూక్ష్మక్రిములు. వీటి వల్ల ఆహారం కలుషితమైనప్పుడు తీవ్రమైన కడుపునొప్పి, మలంలో రక్తం పడటం, జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తాయి. మలపరీక్ష, ఎలైసా వంటి వైద్యపరీక్షలతో ఈ వ్యాధిని సులభంగా గుర్తించవచ్చు. అమీబియాసిస్ వల్ల జీర్ణ వ్యవస్థలోని పేగులతో పాటు కాలేయం, ఊపిరితిత్తులు, మెదడు వంటి కీలకమైన అవయవాలు దెబ్బతినవచ్చు. ముఖ్యంగా కాలేయంలో చీముగడ్డలు (లివర్ యాబ్సెస్) కనిపించే అవకాశాలు ఉన్నాయి. కాలేయంలోని ఈ చీముగడ్డలను అల్ట్రాసౌండ్ స్కానింగ్ పరీక్ష ద్వారా తేలిగ్గా గుర్తించవచ్చు.

● **జియార్డియాసిస్ :** ఈ వ్యాధి జియార్డియా లాంబ్లియా అనే ప్రోటోజోవా రకానికి చెందిన సూక్ష్మక్రిముల వల్ల వస్తుంది. ఈ సూక్ష్మక్రిములు చిన్న పేగుల్లో నివాసం ఏర్పరచుకొని ఈ వ్యాధిని కలగజేస్తాయి. ఈ వ్యాధి సోకిన వారిలో వికారం, వాంతులు, కడుపునొప్పి, కడుపు ఉబ్బరం వంటి లక్షణాలు ఉంటాయి. ఈ సూక్ష్మజీవులు రక్తంలోకి విస్తరించినప్పుడు ఒంటిపై దురద రావడం, అలా దురద వచ్చిన ప్రాంతమంతా నల్లబారడం వంటి చర్మసంబంధమైన లక్షణాలూ కనిపిస్తాయి. తిన్న ఆహారం ఒంటికి పట్టకపోవడం (మాల్ అబ్‌జార్ప్షన్) కూడా ఈ వ్యాధి వచ్చిన వారిలో కనిపిస్తుంటుంది. అమిబియాసిస్‌తో పాటు జియార్డియాసిస్ వంటి అనారోగ్యాలు కనిపించినప్పుడు గట్ ఎన్విరాన్‌మెంట్‌ను నార్మల్‌గా ఉంచుతూ హానికరమైన సూక్ష్మజీవులను బయటికి పంపే కొన్ని రకాల పౌడర్లు, మెడిసిన్స్‌తో పాటు అవసరమైతే యాంటీబయాటిక్స్ వాడాల్సి ఉంటుంది.

ఎలుకల వల్ల...



వర్షాలకు బొరియల్లో ఉండే ఎలుకలు బయట నుంచి ఇళ్లలోకి వస్తాయి. ఎలుకల్లో పెరిగే లెప్టోస్పైరోసిస్ అనే బ్యాక్టీరియా కారణంగా లెప్టో స్పైరోసిస్ అనే వ్యాధి వస్తుంది. ఎలుకల వల్ల ఆహారం కలుషితమైపోవడంతో లెప్టోస్పైరోసిస్ జ్వరాలు వస్తాయి. ఈ సీజన్‌లో ఎలుకలు ఎక్కువగా ఉండే బురద నీళ్లలో ఎక్కువగా తిరిగే వారికీ ఈ వ్యాధి వచ్చే అవకాశాలు ఎక్కువ. జ్వరం, తీవ్రమైన తలనొప్పి, కొన్నిసార్లు వాంతులు కావడం వంటి లక్షణాలు ఈ వ్యాధిలో ప్రధానంగా కనిపిస్తాయి. కొన్నిసార్లు కడుపునొప్పి, కళ్లు ఎర్రబారడం, కళ్లు పచ్చగా మారడమూ జరుగుతుంది. కొన్ని రకాల యాంటీబయాటిక్స్‌తో డాక్టర్లు లెప్టోస్పైరోసిస్‌కు చికిత్స అందిస్తారు.

నిర్వహణ:
యాసీన్

వర్షాకాలం వ్యాధుల నివారణ ఇలా...

- ఈ సీజన్‌లోని దాదాపు అన్ని వ్యాధులకు కారణం కలుషితమైన నీరే. కాబట్టి నీటిని కాచి చల్లార్చాక వడపోసి తాగడం అన్నిటి కంటే ప్రధానం.
- కుండల్లో ఎక్కువ రోజులు నిల్వ ఉన్న నీరు తాగవద్దు.
- వాటర్‌ను డిస్ ఇన్ఫెక్ట్ చేయడానికి క్లోరిన్ బిళ్ల వేసి క్లోరినేషన్ ద్వారా శుభ్రం చేసిన నీరు తాగడం మంచిది.
- ఈ సీజన్‌లో బయటి ఆహార పదార్థాలకు దూరంగా ఉండటమే మంచిది.
- తాజాగా వండుకున్న తర్వాత వేడిగా ఉండగానే తినేయాలి. ఈ సీజన్‌లో చల్లారిన ఆహారాన్ని మాటి మాటికీ వేడి చేసి తినడం అంత మంచిది కాదు.
- మాంసాహారం కంటే శాకాహారానికి ప్రాధాన్యం ఇవ్వాలి. అయితే ఇక్కడ గుర్తుపెట్టుకోవాల్సిందేమిటంటే... ఈ వ్యాధులు మాంసాహారం కారణంగా వ్యాప్తిచెందవు. కాకపోతే శాకాహారంతో పోలిస్తే మాంసాహారం ప్రాసెస్ చేసే క్రమంలో ఈగలు బాగా ముసరడానికి అవకాశం ఎక్కువ. సరిగ్గా ప్రాసెస్ చేయడం, పూర్తిగా ఉడికించడం వంటి జాగ్రత్తలు పాటిస్తే ఈ ముప్పును తప్పించుకోవచ్చు.





- ఈ సీజన్‌లో పరిసరాల పరిశుభ్రత తప్పక పాటించాలి. నీళ్లు నిల్వ ఉండటానికి అవకాశం ఇచ్చే, పాత టైర్లు, ఖాళీ కొబ్బరి చిప్పల వంటివి దోమల పెరుగుదలకు కారణమవుతాయి. నీటి చేరడానికి అవకాశమిచ్చే చిన్న చిన్న నీటి గుంటలు, పైన పెచ్చులు ఊడిపోయిన సన్‌షేడ్‌కు పైన ఉండే ప్రదేశాల్లో దోమలు గుడ్లు పెట్టి తమ సంతతిని అభివృద్ధి (బ్రీడింగ్) చేస్తాయి. కాబట్టి మీ ఇళ్లలో, ఇంటి పరిసరప్రాంతాల్లో దోమలను వృద్ధి చేసే పరిస్థితులన్నింటినీ నివారించాలి. రాత్రిళ్లు పడుకునే సమయంలో మంచం చుట్టూ దోమ తెరలు వాడటం వల్ల దోమల కారణంగా వ్యాప్తి చెందే అనేక వ్యాధులు నివారితమవుతాయి.




- ఈ సీజన్‌లో దోమలతో వచ్చే వ్యాధుల నుంచి కాపాడుకోడానికి శరీరమంతా కప్పే దుస్తులు వేసుకోవాలి.
- ఇంటి కిటికీలకు మెష్‌లు ఉపయోగించడం మేలు. కిటికీలకు మెష్‌లు ఉపయోగించడం కాస్త శ్రమతోనూ, ఖర్చుతోనూ కూడిన వ్యవహారమే అయినప్పటికీ ఇప్పుడు కిటికీలకు అంటించడానికి రెడీగా ఉండే మెల్‌క్రో వంటి ప్లాస్టిక్ మెష్‌లు ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి. వీటివల్ల దోమలతో వచ్చే అనేక వ్యాధులు నివారితమవుతాయి.
- వేప ఆకులతో పొగవేయడం, మస్కిటో రిపల్లెంట్ ఉపయోగించడం వల్ల దోమలు దూరమవుతాయి. అయితే కొంతమందికి పొగ, మస్కిటో రిపల్లెంట్స్‌లోని ఘాటైన వాసనల వల్ల అలర్జీ ఉంటుంది. కుటుంబ సభ్యుల్లో ఎవరికైనా ఇలాంటి అలర్జీలు ఉంటే పొగవేసే ఇలాంటి చిట్కాల పట్ల జాగ్రత్తగా ఉండాలి.



- ఇంట్లో చెత్త వేసుకునే కుండీలను ఎప్పటికప్పుడు దూరంగా ఉన్న కుండీలలో వేస్తుండాలి. వీధిలో ఉండే కుండీలను పారిశుద్ధ్య సిబ్బంది క్రమంతప్పకుండా శుభ్రం చేసేలా జాగ్రత్తలు తీసుకోవాలి. త్వరగా కుళ్లేందుకు అవకాశం ఉన్న పదార్థాలను వెంటవెంటనే శుభ్రం చేసుకుంటూ ఉండాలి.
- వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి. మల, మూత్ర విసర్జనకు ముందు, తర్వాత చేతులు శుభ్రంగా సబ్బుతో లేదా బూడిదతో కడుక్కోవాలి.





- కొందరు నేల మీది మట్టితో పాత్రలు శుభ్రం చేస్తారు. అలా ఎప్పుడూ చేయవద్దు. పాత్రలు శుభ్రం చేసే సమయంలో సబ్బు లేదా బూడిద మాత్రమే వాడాలి.
- వానలో అతిగా తడిసిన సందర్భాల్లో అప్పటికే ఏవైనా ఇన్ఫెక్షన్లతో బాధపడే వారిలో నిమోనియా వంటి సెకండరీ ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశం ఉంది. ఇలాంటి వారు సాధ్యమైనంత వరకు తల తడవకుండా జాగ్రత్త వహించాలి.

చివరగా... ఈ సీజన్‌లో చేతులను ఎప్పటికప్పుడు శుభ్రంగా కడుక్కుంటూ ఉండాలి. ఇలా చేతులు ఎక్కువగా కడుక్కోవడం వల్ల చాలా రకాల జబ్బులను... మరీ ముఖ్యంగా వర్షాల సీజన్‌లో వచ్చే అనేక వ్యాధులను సమర్థంగా నివారించవచ్చు.

స్పీడ్ తగ్గిన పారిశ్రామికోత్పత్తి

జూన్‌లో ఐఐపీ వృద్ధి 1.5 శాతంగా నమోదు

- మైనింగ్, విద్యుత్ రంగాల్లో బలహీన పనితీరు



న్యూఢిల్లీ: దేశ పారిశ్రామిక రంగం వృద్ధి జూన్‌లో మరింత నిదానించింది. పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) 1.5 శాతం పెరిగింది. ఇది పది నెలల (2024 ఆగస్ట్ తర్వాత) కనిష్ఠ వృద్ధి రేటు కావడం గమనార్హం. ముఖ్యంగా మైనింగ్, విద్యుత్ రంగాల్లో పనితీరు ఢీలాపడింది. జూన్ చివర్లో వర్షాలు ఈ రంగాల పనితీరును ప్రభావితం చేశాయి. 2024 జూన్‌లో ఐఐపీ వృద్ధి 4.9 శాతంగా ఉండటం గమనార్హం. ఈ మేరకు జూన్ నెలకు సంబంధించి ఐఐపీ వివరాలను జాతీయ గణాంక కార్యాలయం (ఎన్ఎస్‌వో) విడుదల చేసింది. ఈ ఏడాది మే నెలకు సంబంధించిన ఐఐపీ రేటును 1.2 శాతం నుంచి 1.9 శాతానికి సవరించింది.

- తయారీ రంగంలో ఉత్పత్తి జూన్‌లో 3.9 శాతం పెరిగింది. 2024 జూన్‌లో ఈ రంగంలో ఉత్పత్తి 3.5 శాతం వృద్ధి చెందడం గమనార్హం.
- మైనింగ్‌లో ఉత్పత్తి మైనస్ 8.7 శాతానికి పడిపోయింది. క్రితం ఏడాది ఇదే నెలలో 10.3 శాతం వృద్ధి నమోదైంది.
- విద్యుదుత్పత్తి సైతం మైనస్ 2.6 శాతంగా ఉంది. క్రితం ఏడాది ఇదే నెలలో 8.6 శాతం వృద్ధి నమోదైంది.
- క్యాపిటల్ గూడ్స్ విభాగంలోనూ వృద్ధి 3.5 శాతానికి పరిమితమైంది.
- కన్జ్యూమర్ డ్యూరబుల్స్‌లో వృద్ధి 2.9 శాతంగా ఉంది. క్రితం ఏడాది ఇదే నెలలో వృద్ధి 8.8 శాతంగా ఉంది.
- కన్జ్యూమర్ నాన్ డ్యూరబుల్స్ ఉత్పత్తి మైనస్ 0.4 శాతంగా నమోదైంది. క్రితం ఏడాది జూన్‌లోనూ మైనస్ ఒక శాతంగా ఉండడం గమనార్హం.
- ఇన్‌ఫ్రా/నిర్మాణ రంగంలో 7.2 శాతం వృద్ధి కనిపించింది. క్రితం ఏడాది ఇదే నెలలో ఇది 8.2 శాతం వృద్ధిని చూసింది.
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తొలి త్రైమాసికంలో (ఏప్రిల్–జూన్)నూ పారిశ్రామికోత్పత్తి వృద్ధి 2 శాతానికి తగ్గింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో వృద్ధి రేటు 5.4 శాతంగా ఉంది.

వర్షాల ప్రభావం..

జూన్ రెండో భాగంలో అధిక వర్షాలు మైనింగ్ ఉత్పత్తి, విద్యుత్ రంగాలపై ప్రభావం చూపించినట్టు ఇక్రా ముఖ్య ఆర్థికవేత్త అదితి నాయర్ తెలిపారు. త్రైమాసికం వారీగా చూస్తే వృద్ధి 11 నెలల కనిష్ఠ స్థాయికి చేరినట్టు పేర్కొన్నారు.

నయారాకు మైక్రోసాఫ్ట్ సర్వీసుల నిలిపివేత



న్యూఢిల్లీ: రష్యన్ కంపెనీలపై యూరోపియన్ యూనియన్ ఆంక్షల నేపథ్యంలో నయారా ఎనర్జీకి టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ సేవలు నిలిపివేసింది. దీనితో గతంలోనే పూర్తిగా చెల్లించి, లైసెన్సులను కొనుగోలు చేసినప్పటికీ సొంత డేటా, ఇతరత్రా టూల్స్ మొదలైనవి తమకు అందుబాటులోకి లేకుండా పోయాయని నయారా వెల్లడించింది. ఇలాంటివి చాలా ప్రమాదకర ధోరణులని ఆందోళన వ్యక్తం చేసింది. మైక్రోసాఫ్ట్ ఏకపక్షంగా, హఠాత్తుగా సర్వీసులను నిలిపివేయడంపై ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించినట్లు వివరించింది. సర్వీసులను పునరుద్ధరించేలా ఆదేశించాలని కోరుతూ పిటీషన్ దాఖలు చేసినట్లు పేర్కొంది. ఉక్రెయిన్‌తో యుద్ధం నేపథ్యంలో రష్యాను కట్టడి చేసే దిశగా తీసుకుంటున్న చర్యల్లో భాగంగా నయారా ఎనర్జీపై కూడా యూరోపియన్ యూనియన్ (ఈయూ) ఆంక్షలు విధించింది. అయితే, ఇవి ఈయూ చట్టాల పరిధిలోకే వస్తాయి తప్ప మైక్రోసాఫ్ట్‌లాంటి అమెరికన్ కంపెనీలకు, భారతీయ సంస్థలకు వర్తించవని నయారా ఎనర్జీ తెలిపింది. రిఫైనింగ్ సామర్థ్యంలో 8 శాతం, రిటైల్ పెట్రోల్ బంకుల నెట్‌వర్క్‌లో ఏడు శాతం వాటాతో భారత ఇంధన భద్రతలో తమ సంస్థ కీలక పాత్ర పోషిస్తోందని వివరించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

29-7-2025

విశాఖ	450-00
చిత్తూరు	463-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	445-00
విజయవాడ	475-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	400-00
వరంగల్	402-00
రిటైల్ ధర	4.60

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
SHRIRAMFIN	632	2.62
CIPLA	1,570.00	2.45
HEROMOTOCO	4,292.00	1.45
ASIANPAINT	2,359.50	1
HINDUNILVR	2,439.00	0.98

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
KOTAKBANK	1,968.70	-7.34
BAJFINANCE	881	-3.58
INDUSINDBK	799.6	-2.93
BHARTIARTL	1,889.90	-2.48
TITAN	3,385.00	-2.25

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	7,565
ఎన్ఎస్ఈ	92,169
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	3,73,065
ఎఫ్ఐఐ	- 6,082
డీఐఐ	+ 6,765

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	66.66 (రాత్రి 11.30కు)	$ 65.16 (క్రితం ముగింపు)
బ్రెంట్	69.48 (రాత్రి 11.30కు)	$ 67.66 (క్రితం ముగింపు)

స్టార్‌లింక్ ఇచ్చేది 20 లక్షల కనెక్షన్లే

- ఆ సంస్థతో టెల్కోలకు పోటీ ఉండదు
- కేంద్రం వెల్లడి



న్యూఢిల్లీ: అమెరికన్ శాటిలైట్ కమ్యూనికేషన్స్ సంస్థ స్టార్‌లింక్ నుంచి బీఎస్ఎన్ఎల్‌లాంటి దేశీ టెలికం సంస్థలకు ఎలాంటి పోటీ ఉండబోదని కేంద్ర టెలికం శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పారు. ప్రస్తుత సామర్థ్యాలను బట్టి స్టార్‌లింక్ భారత్‌లో గరిష్ఠంగా 200 ఎంబీపీఎస్ స్పీడ్‌తో 20 లక్షల కనెక్షన్లు మాత్రమే ఇవ్వగలదని ఆయన తెలిపారు. దీనితో టెలికం సర్వీసులపై ఎలాంటి ప్రభావం ఉండదని చెప్పారు. ఈ సర్వీసులను పొందాలంటే ముందుగా భారీ మొత్తం వెచ్చించడంతో పాటు ప్రతి నెలా సుమారు రూ. 3,000 వరకు చెల్లించాల్సి రావచ్చని మంత్రి చెప్పారు. ప్రభుత్వ రంగ బీఎస్ఎన్ఎల్‌కి గణనీయంగా కార్యకలాపాలున్న గ్రామీణ, మారుమూల ప్రాంతాలే లక్ష్యంగా శాట్‌కామ్ సర్వీసులు ఉండనున్న నేపథ్యంలో మంత్రి వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. బీఎస్ఎన్ఎల్ 4జీ సర్వీసుల విస్తరణ పూర్తయిందని ఆయన చెప్పారు. ప్రస్తుతం మార్కెటింగ్‌పైనే దృష్టి పెడుతున్నట్లు, టారిఫ్‌లు పెంచే ప్రతిపాదనేదీ లేనట్లు మంత్రి వివరించారు. బీఎస్ఎన్ఎల్‌లో చైనా పరికరాల వినియోగంపై స్పందిస్తూ, పూర్తిగా దేశీ సాంకేతికతల వినియోగానికి ప్రాధాన్యమిస్తున్నట్లు చెప్పారు.

టూ-వీలర్ల మార్కెట్లో కైనెటిక్ రీఎంట్రీ

ఎలక్ట్రిక్ డీఎక్స్ ఆవిష్కరణ; ధర రూ. 1,11,499 నుంచి ప్రారంభం



న్యూఢిల్లీ: కైనెటిక్ ఇంజినీరింగ్ సంస్థ మరోసారి ద్విచక్ర వాహనాల విభాగంలోకి ఎంట్రీ ఇచ్చింది. గతంలో ప్రాచుర్యం పొందిన కైనెటిక్ డీఎక్స్ స్కూటర్‌లో ఎలక్ట్రిక్ వెర్షన్ శ్రేణిని కంపెనీ ఆవిష్కరించింది. ఇది ఒక్కసారి చార్జ్ చేస్తే 116 కి.మీ. రేంజ్ ఇస్తుంది. ఇందులో డీఎక్స్ ధర రూ. 1,11,499గా, డీఎక్స్‌ప్లస్ రేటు రూ. 1,17,499గా (పుణె ఎక్స్‌షోరూం) ఉంటుంది. గరిష్ఠంగా గంటకు 90 కిలోమీటర్ల వేగాన్ని అందుకోగలదు. 1984 నుంచి 2009 వరకు డీఎక్స్ స్కూటర్లు కైనెటిక్ విక్రయించింది. మరోవైపు, సేల్స్ నెట్‌వర్క్‌ను, ఉత్పత్తిని పెంచుకునేందుకు వచ్చే ఏడాదిన్నర వ్యవధిలో సుమారు రూ. 177 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు సంస్థ ఎండీ అజింక్యా ఫిరోదియా తెలిపారు. వచ్చే 3-4 ఏళ్లలో 1.5 లక్షల వాహన విక్రయాల లక్ష్యాన్ని సాధించాలని నిర్దేశించుకున్నామని, ఇందుకు సుమారు 300 డీలర్‌షిప్‌లు అవసరమవుతాయని వివరించారు. వచ్చే మూడేళ్లలో ఈ సెగ్మెంట్లోని టాప్ 3 సంస్థల్లో ఒకటిగా ఎదగాలని నిర్దేశించుకున్నట్లు తెలిపారు.

జోరుగా డిజిటల్ చెల్లింపులు

మార్చి చివరికి 10.7% పెరుగుదల



ముంబై: డిజిటల్ చెల్లింపులు ఎప్పటికప్పుడు కొత్త రికార్డులను సృష్టిస్తున్నాయి. ఆర్‌బీఐ – డిజిటల్ పేమెంట్స్ ఇండెక్స్ (ఆర్‌బీఐ–డీపీఐ) ఈ ఏడాది మార్చి నెలకు 493.22గా నమోదైంది. దీనికి ఆరు నెలల ముందు.. 2024 సెప్టెంబర్‌లో ఈ సూచీ 455.5గా ఉండడం గమనార్హం. అంటే డిజిటల్ చెల్లింపుల్లో 10.7% మేర వృద్ధి నమోదైంది. చెల్లింపుల సదుపాయాలు, సరఫరా వైపు అంశాలు ఆర్‌బీఐ–డీపీఐ సూచీ బలపడేందుకు దారితీసినట్టు ఆర్‌బీఐ తెలిపింది. ఐదు అంశాల ఆధారంగా చెల్లింపుల తీరును ఆర్‌బీఐ మదింపు వేస్తుంటుంది. ఇందులో చెల్లింపులు చేసే వారు (25% వెయిటేజీ), చెల్లింపులు సదుపాయాలు – డిమాండ్ వైపు అంశాలు (10%) పేమెంట్ సదుపాయాలు – సరఫరా వైపు అంశాలు (15%), చెల్లింపుల పనితీరు (45%), వినియోగదారుల కేంద్రీకరణ 5% చొప్పున వెయిటేజీ కలిగి ఉన్నాయి.

క్లెయిమ్ చేయని డిపాజిట్లు రూ.67వేల కోట్లు

అధిక మొత్తం ఎస్‌బీఐ పరిధిలోనే



న్యూఢిల్లీ: బ్యాంక్‌ల్లో అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లు (కాల వ్యవధి ముగిసిపోయినప్పటికీ వెనక్కి తీసుకోనివి) జూన్ చివరికి రూ.67,003 కోట్లకు చేరాయి. ఇందులో ప్రభుత్వరంగ బ్యాంకుల్లో రూ.58,330 కోట్లు ఉంటే, రూ.8,673.72 కోట్లు ప్రైవేటు బ్యాంకుల పరిధిలోనివి. ఈ వివరాలను కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లోక్‌సభకు లిఖిత పూర్వకంగా వెల్లడించారు. ప్రభుత్వరంగ బ్యాంకుల్లో ఒక్క ఎస్‌బీఐలోనే అన్ క్లెయిమ్డ్ డిపాజిట్లు రూ.19,330 కోట్లుగా ఉన్నాయి. ఆ తర్వాత పీఎన్‌బీలో రూ.6,910 కోట్లు, కెనరా బ్యాంక్‌లో రూ.6,278 కోట్లు చొప్పున ఉన్నాయి. ప్రైవేటు బ్యాంకుల్లో అత్యధికంగా ఐసీఐసీఐ బ్యాంకుల్లో రూ.2,063 కోట్లు క్లెయిమ్ లేకుండా పడి ఉన్నాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో రూ.1,609 కోట్లు, యాక్సిస్ బ్యాంకులో రూ.1,360 కోట్ల చొప్పున అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లు ఉన్నాయి.

పెగాసిస్టమ్స్ డెవలపర్ల కోసం ఎక్స్‌పర్ట్ సర్కిల్స్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దేశీయంగా తమ డెవలపర్ల కోసం ఎక్స్‌పర్ట్ సర్కిల్స్ సెషన్లను ప్రారంభించింది. ప్రపంచవ్యాప్తంగా తమ డెవలపర్లలో 50 శాతం మంది భారత్‌లో ఉన్నారని, వారు తమ నైపుణ్యాలను మరింతగా పెంచుకునేందుకు ఇవి ఉపయోగపడతాయని పెగాఇన్నోవేట్ 2025 కార్యక్రమం సందర్భంగా కంపెనీ ఎండీ దీపక్ విశ్వేశ్వరయ్య తెలిపారు. పెగా ప్రధాన టెక్నాలజీలైన బ్లూప్రింట్, యాప్ డిజైన్‌లాంటి టెక్నాలజీలు తదితర అంశాల గురించి ఈ సెషన్స్‌లో చర్చిస్తారు. ఒక్కో సెషన్‌లో 50 మంది వరకు పాల్గొనవచ్చని దీపక్ చెప్పారు.

విప్రో ఇన్‌ఫ్రా నుంచి కొత్త బిజినెస్

న్యూఢిల్లీ: ఇంజినీరింగ్, తయారీ సొల్యూషన్లు అందించే విప్రో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇంజినీరింగ్ (విన్) తాజాగా కొత్త బిజినెస్ విభాగానికి తెరతీసింది. విప్రో ఎలక్ట్రానిక్ మెటీరియల్స్ పేరుతో ఏర్పాటు చేసిన విభాగంపై రూ. 500 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు పేర్కొంది. ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డుల(పీసీబీలు) తయారీలో ఉపయోగించే బేస్ మెటీరియల్స్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపింది. ఇందుకోసం కర్ణాటకలో కాపర్ క్లాడ్ లామినేట్(సీసీఎల్) తయారీ యూనిట్‌ను నెలకొల్పుతున్నట్లు వివరించింది. దీంతో సుమారు 350 మందికి ఉపాధి లభించనుంది.

రెండు నెలల కనిష్టానికి సూచీలు

- మూడో రోజూ అమ్మకాల ఒత్తిడి
- సెన్సెక్స్ 572 పాయింట్ల పతనం
- నిఫ్టీ 156 పాయింట్లు డౌన్



ముంబై: మూడు రోజుల వరుస నష్టంతో స్టాక్ సూచీలు సోమవారం రెండు నెలల కనిష్టానికి దిగివచ్చాయి. సెన్సెక్స్ 572 పాయింట్లు పతనమై 80,891 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 156 పాయింట్లు కోల్పోయి 24,681 వద్ద నిలిచింది. అమెరికా–భారత్ ట్రేడ్ డీల్ ఆలస్యం అవుతుండడం, పలు కంపెనీలు ప్రకటిస్తున్న క్యూ1 ఆర్థిక ఫలితాలు నిరాశజనకంగా ఉండడం, ఐటీ రంగంలో భారీగా ఉద్యోగాల కోత, విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాలు సెంటిమెంట్‌ను బలహీనపరిచాయి. ఉదయం స్వల్ప లాభాలతో మొదలైన సూచీలు కాసేపు లాభ, నష్టాల మధ్య కదలాడాయి. మిడ్ సెషన్ తర్వాత ఇన్వెస్టర్లు అమ్మకాలకు పాల్పడంతో సూచీలు నష్టాల్లోకి జారుకున్నాయి. ఒక దశలో సెన్సెక్స్ 687 పాయింట్లు క్షీణించి 80,776 వద్ద, నిఫ్టీ 190 పాయింట్లు కుప్పకూలి 24,647 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకాయి. ఆరంభ లాభాలు కోల్పోయిన రూపాయి విలువ డాలర్ మారకంలో 18 పైసలు బలహీనపడి 86.70 వద్ద స్థిరపడింది. ఆసియాలో జపాన్, దక్షిణ కొరియా సూచీలు 1% నష్టపోయాయి. యూరప్ మార్కెట్లు అరశాతం నష్టపోయాయి. అమెరికా సూచీలు బలహీనంగా ట్రేడవుతున్నాయి.

- ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26)లో 12,261 మంది ఉద్యోగులను తొలగించేందుకు సిద్ధమైన టీసీఎస్ కంపెనీ షేరు అమ్మకాల ఒత్తిడికి లోనైంది. బీఎస్ఈలో 1.76% నష్టపోయి రూ.3,079 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 2% పతనమై రూ.3,070 వద్ద కనిష్టాన్ని తాకింది. ఇదే ఐటీ రంగానికి చెందిన విప్రో, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్, టెక్ మహీంద్రా షేర్లు 0.50% – 1.50 శాతం నష్టపోయాయి.
- జూన్ క్వార్టర్ త్రైమాసిక ఆర్థిక ఫలితాలు నిరాశపరచడంతో కోటక్ మహీంద్రా బ్యాంక్ షేరు 7.50% నష్టపోయి రూ.1,966 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 8% క్షీణించి రూ.1,960 వద్ద కనిష్టాన్ని తాకింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.31,670 కోట్లు హరించుకుపోయి రూ.3.91 లక్షల కోట్లకు దిగివచ్చింది. సెన్సెక్స్, నిఫ్టీ సూచీల్లో అత్యధికంగా నష్టపోయిన షేరు ఇదే.

సవ్య ఇన్‌ఫ్రా లిస్టింగ్ సూపర్

సవ్య ఇన్ ఫ్రా అండ్ లాజిస్టిక్స్ షేరు, ఇష్యూ ధర (రూ.68) తో పోలిస్తే ఎన్ఎస్ఈ ఎస్ఎంఈ ప్లాట్‌ఫామ్‌పై 14% ప్రీమియంతో రూ.85 వద్ద ప్రారంభమైంది. చివరికి 20% లాభంతో రూ.143.30 వద్ద అప్పర్ సర్క్యూట్ తాకి, అక్కడే ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.298 కోట్లుగా నమోదైంది

క్యూ1 ఫలితాలు

అదానీ గ్రీన్ ఎనర్జీ లాభం జూమ్ — క్యూ1లో రూ. 824 కోట్లు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26) తొలి త్రైమాసికంలో పునరుత్పాదక ఇంధన రంగ దిగ్గజం అదానీ గ్రీన్ ఎనర్జీ ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 31% వృద్ధితో రూ. 824 కోట్లను తాకింది. ఆదాయం పుంజుకోవడం ఇందుకు సహకరించింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 629 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 3,112 కోట్ల నుంచి రూ. 4,006 కోట్లకు ఎగసింది. దీనిలో రూ. 3,312 కోట్లు విద్యుత్ సరఫరా ద్వారా నమోదైనట్లు కంపెనీ వెల్లడించింది. అయితే మొత్తం వ్యయాలు సైతం రూ. 2,437 కోట్ల నుంచి రూ. 3,050 కోట్లకు పెరిగాయి. ఈ కాలంలో నిర్వహణ సామర్థ్యం 45% బలపడి 15,816 మెగావాట్లకు చేరినట్లు కంపెనీ వెల్లడించింది. 2030కల్లా 50 గిగావాట్ల సామర్థ్యాన్ని అందుకునే లక్ష్యంలో ముందుకు సాగుతున్నట్లు తెలియజేసింది.
ఫలితాల నేపథ్యంలో అదానీ గ్రీన్ ఎనర్జీ షేరు బీఎస్ఈలో 3 శాతం ఎగసి రూ. 1,005 వద్ద ముగిసింది.

ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ లాభం ప్లస్ — క్యూ1లో రూ. 124 కోట్లు



న్యూఢిల్లీ: మల్టీమోడల్ లాజిస్టిక్స్ కంపెనీ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(టీసీఐ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26) తొలి త్రైమాసికంలో పటిష్ఠ ఫలితాలు సాధించింది. ఏప్రిల్–జూన్(క్యూ1)లో స్టాండెలోన్ నికర లాభం 19 శాతం ఎగసి రూ. 124 కోట్లను అధిగమించింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 105 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 984 కోట్ల నుంచి రూ. 1,034 కోట్లకు బలపడింది. ఇది 5% వృద్ధికాగా.. నిర్వహణ లాభం(ఇబిటా) రూ. 145 కోట్ల నుంచి రూ. 163 కోట్లకు పుంజుకుంది.
ఫలితాల నేపథ్యంలో టీసీఐ షేరు బీఎస్ఈలో 0.4 శాతం బలహీనపడి రూ. 1,199 వద్ద ముగిసింది. అజంతా ఫార్మా లాభం ప్లస్

అజంతా ఫార్మా లాభం గుడ్ — క్యూ1లో రూ. 255 కోట్లు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26) తొలి త్రైమాసికంలో ఔషధ రంగ కంపెనీ అజంతా ఫార్మా పటిష్ఠ ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 4 శాతం వృద్ధితో రూ. 255 కోట్లను తాకింది. బ్రాండెడ్ జనరిక్స్ అమ్మకాలు పుంజుకోవడం ఇందుకు సహకరించింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 246 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ.1,145 కోట్ల నుంచి రూ. 1,303 కోట్లకు ఎగసింది. దీనిలో భారత్‌లో బ్రాండెడ్ జనరిక్స్ అమ్మకాలు 9% బలపడి రూ. 941 కోట్లకు చేరిరాయి. ఈ బాటలో యూఎస్‌లో మరింత అధికంగా 36 శాతం జంప్‌చేసి రూ. 310 కోట్లను తాకాయి.
ఫలితాల నేపథ్యంలో అజంతా ఫార్మా షేరు బీఎస్ఈలో 0.4% నష్టంతో రూ. 2,771 వద్ద ముగిసింది.

ఎన్ఏసీఎల్ ఇండస్ట్రీస్ లాభం రూ. 14 కోట్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో ఎన్ఏసీఎల్ ఇండస్ట్రీస్ రూ. 14.30 కోట్ల లాభం (స్టాండెలోన్)ప్రకటించింది. గత క్యూ1లో కంపెనీ రూ. 18.27 కోట్ల నష్టం నమోదు చేసింది. మరోవైపు, ఆదాయం రూ. 334 కోట్ల నుంచి రూ. 438 కోట్లకు చేరింది.

టొరెంట్ ఫార్మా లాభం అప్ — క్యూ1లో రూ. 548 కోట్లు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26) తొలి త్రైమాసికంలో ఔషధ రంగ దిగ్గజం టొరెంట్ ఫార్మాస్యూటికల్స్ పటిష్ఠ ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 20 శాతం ఎగసి రూ. 548 కోట్లను తాకింది. భారత్, యూఎస్ తదితర మార్కెట్లలో అమ్మకాలు పుంజుకోవడం ఇందుకు సహకరించింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 457 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 2,859 కోట్ల నుంచి రూ. 3,178 కోట్లకు ఎగసింది. దీనిలో భారత్ నుంచి 11 శాతం అధికంగా రూ. 1,811 కోట్లు లభించినట్లు కంపెనీ పేర్కొంది. ఈ బాటలో యూఎస్ బిజినెస్ 19 శాతం వృద్ధితో రూ. 308 కోట్లకు, బ్రెజిల్ అమ్మకాలు 11 శాతం పుంజుకుని 218 కోట్లకు చేరినట్లు వెల్లడించింది. ఇదే విధంగా జర్మనీ నుంచి ఆదాయం 9 శాతం బలపడి రూ. 308 కోట్లను తాకినట్లు తెలియజేసింది.
ఫలితాల నేపథ్యంలో టొరెంట్ ఫార్మా షేరు బీఎస్ఈలో 0.6% బలపడి రూ. 3,625 వద్ద ముగిసింది.

వర్ల్‌పూల్ లాభం ఫ్లాట్ — క్యూ1లో రూ. 146 కోట్లు



న్యూఢిల్లీ: కన్జూమర్ డ్యురబుల్స్ దిగ్గజం వర్ల్‌పూల్ ఇండియా ఈ ఆర్థిక సంవత్సరం(2025–26) తొలి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం నామమాత్ర వృద్ధితో రూ. 146 కోట్లను తాకింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 145 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం స్వల్ప(3 శాతం) క్షీణతతో రూ. 2,432 కోట్లకు పరిమితమైంది. గత క్యూ1లో రూ. 2,497 కోట్ల టర్నోవర్ సాధించింది. వేసవి కలసిరాకపోవడం, ముందస్తు రుతుపవనాలు ఏసీలు, రిఫ్రిజిరేటర్ అమ్మకాలపై ప్రతికూల ప్రభావం చూపినట్లు కంపెనీ పేర్కొంది.
ఫలితాల నేపథ్యంలో వర్ల్‌పూల్ షేరు 1.3% నష్టపోయి రూ. 1,377 వద్ద ముగిసింది.

వారీ ఎనర్జీస్ లాభం హైజంప్ — క్యూ1లో రూ. 773 కోట్లు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26) తొలి త్రైమాసికంలో పునరుత్పాదక ఇంధన రంగ దిగ్గజం వారీ ఎనర్జీస్ ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 93 శాతం జంప్‌చేసి రూ. 773 కోట్లను తాకింది. ఆదాయం పుంజుకోవడం ఇందుకు సహకరించింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో కేవలం రూ. 401 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 3,496 కోట్ల నుంచి రూ. 4,597 కోట్లకు ఎగసింది. కంపెనీ చరిత్రలోనే అత్యధికంగా ఒక త్రైమాసికంలో 2.3 గిగావాట్ల మాడ్యూల్ ఉత్పత్తిని సాధించినట్లు వారీ ఎనర్జీస్ వెల్లడించింది. పటిష్ఠ నిర్వహణ, సెల్ ప్రొడక్షన్ నిరంతర పెంపు ఇందుకు సహకరించినట్లు పేర్కొంది. గుజరాత్‌లో సెల్ ఉత్పత్తి సామర్థ్యాన్ని 4 గిగావాట్లకు, మహారాష్ట్రలో ఇన్‌గాట్ వేఫర్ ఉత్పత్తిని 4 గిగావాట్లకు విస్తరించేందుకు వీలుగా కంపెనీ బోర్డు రూ. 2,754 కోట్ల అదనపు పెట్టుబడులకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు వెల్లడించింది. 2026–27 కాలంలో పెట్టుబడులను వెచ్చించనుంది.
ఫలితాల నేపథ్యంలో వారీ ఎనర్జీస్ షేరు బీఎస్ఈలో 2.7 శాతం క్షీణించి రూ. 3,111 వద్ద ముగిసింది.

గెయిల్ లాభం నేలచూపు — క్యూ1లో రూ. 1,886 కోట్లు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ నేచురల్ గ్యాస్ పంపిణీ దిగ్గజం గెయిల్ ఇండియా ఈ ఆర్థిక సంవత్సరం (2025–26) తొలి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 30 శాతం క్షీణించి రూ. 1,886 కోట్లకు పరిమితమైంది. పెట్రోకెమికల్ బిజినెస్‌లో నష్టాలు పెరగడం, గ్యాస్ మార్కెటింగ్ మార్జిన్లు నీరసించడం ప్రభావం చూపాయి. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 2,724 కోట్లు ఆర్జించింది. పెట్రోకెమికల్ బిజినెస్ నష్టాలు రూ. 42 కోట్ల నుంచి రూ. 249 కోట్లకు పెరిగాయి. అయితే మొత్తం ఆదాయం మాత్రం రూ. 33,962 కోట్ల నుంచి రూ. 34,792 కోట్లకు బలపడింది.
ఫలితాల నేపథ్యంలో గెయిల్ షేరు బీఎస్ఈలో 1.7 శాతం నష్టంతో రూ. 180 వద్ద ముగిసింది.

నిప్పన్ లైఫ్ లాభం భళా — క్యూ1లో రూ. 396 కోట్లు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26) తొలి త్రైమాసికంలో ప్రయివేట్ రంగ కంపెనీ నిప్పన్ లైఫ్ ఇండియా అసెట్ మేనేజ్‌మెంట్(ఎన్ఏఎం ఇండియా) పటిష్ఠ ఫలితాలు సాధించింది. ఏప్రిల్–జూన్ (క్యూ1) లో నికర లాభం 19% ఎగసి రూ. 396 కోట్లను అధిగమించింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 332 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 505 కోట్ల నుంచి రూ. 607 కోట్లకు జంప్‌చేసింది. జూన్ చివరికల్లా నిప్పన్ ఇండియా మ్యూచువల్ ఫండ్(ఎన్ఐఎంఎఫ్) అసెట్ మేనేజర్‌గా వ్యవహరిస్తున్న కంపెనీ ఆస్తులు రూ. 7.44 లక్షల కోట్లకు చేరినట్లు ఎన్ఏఎం ఇండియా ఈడీ, సీఈవో సందీప్ సిక్కా పేర్కొన్నారు.
ఫలితాల నేపథ్యంలో నిప్పన్ లైఫ్ షేరు బీఎస్ఈలో 2% నష్టంతో రూ. 794 వద్ద ముగిసింది.

ఇంగ్లండ్... తగ్గేదేలే



మహిళల యూరో ఫుట్‌బాల్ టోర్నీ టైటిల్ నిలబెట్టుకున్న ఇంగ్లండ్

- ఫైనల్లో పెనాల్టీ 'షూటౌట్'లో 3-1తో స్పెయిన్‌పై గెలుపు
- తుది పోరులో గల్లంతైన స్పెయిన్ ఆశలు

బాసెల్: డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్ మహిళల జట్టు యూరో ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో టైటిల్ నిలబెట్టుకుంది. భారత కాలమానం ప్రకారం ఆదివారం అర్ధరాత్రి దాటాక జరిగిన హోరాహోరీ తుది పోరులో ఇంగ్లండ్ జట్టు పెనాల్టీ షూటౌట్‌లో 3-1తో స్పెయిన్‌పై విజయం సాధించింది. నిర్ణీత సమయంలో ఆఖరి క్షణం దాకా పోటాపోటీగా పోరాడిన స్పెయిన్ పెనాల్టీ షూటౌట్‌లో అనూహ్యంగా చిత్తయ్యింది. కేవలం ఒకే ఒక్క స్ట్రయికర్ గోల్ చేయడం గమనార్హం. మరోవైపు ఇంగ్లండ్ బృందంలో ఇద్దరు బంతిని లక్ష్యాన్ని చేర్చడంలో విఫలమవగా... ముగ్గురు గోల్స్ చేశారు. అంతకుముందు నిర్ణీత సమయం ముగిసేసరికి ఇంగ్లండ్, స్పెయిన్ జట్లు 1-1 స్కోరుతో సమఉజ్జీలుగా నిలిచాయి. ముందుగా స్పెయిన్ శిబిరం నుంచి గోల్ నమోదైంది. తొలి అర్ధభాగంలోనే మరియాన కాల్డెంటీ (25వ నిమిషంలో) గోల్ చేసి జట్టుకు శుభారంభాన్నిచ్చింది. 1-0తో ఆధిక్యంతోనే ప్రథమార్ధాన్ని ముగించింది. ద్వితీయార్ధం మొదలవగానే ఇంగ్లండ్ ప్లేయర్లు దాడులకు పదును పెట్టారు. ఈ క్రమంలో అలెసియా రుసో (57వ నిమిషంలో) గోల్ చేసి స్కోరును 1-1తో సమం చేసింది. తర్వాత ఇరుజట్ల ప్లేయర్లు ఎంతగా శ్రమించిన ఒక్క గోల్ కూడా నమోదు కాలేదు. నిర్ణీత సమయంలో ఫలితం తేలకపోవడంతో అదనపు సమయం ఆడించారు. అయినా... స్కోరులో ఏ మార్పు లేకపోవడంతో పెనాల్టీ షూటౌట్ అనివార్యమైంది. ఇక్కడ తొలి షాట్ నుంచే 'డ్రా' మొదలైంది. స్పెయిన్ ఒకటే గోల్ చేసినా... ఇంగ్లండ్ గెలిచేందుకు ఆఖరి షాట్ గోల్‌దాకా వేచిచూడక తప్పలేదు. ఎందుకంటే మొదట కిక్ మొదలు పెట్టిన ఇంగ్లండ్ జట్టులో బెత్ మీడ్ విఫలమైంది. స్పెయిన్ తరఫున ప్యాట్రిసియా గూజారో గోల్ కొట్టడంతో నిర్ణీత సమయం మ్యాచ్‌లోలానే 1-0తో 'షూటౌట్'లోనూ తొలుత పైచేయి సాధించింది. అయితే ఇంగ్లండ్ ప్లేయర్లు అలెక్స్ గ్రీన్‌వుడ్, నియామి చార్లెస్‌లు వరుసగా షాట్లు కొట్టడంతో రేసులో పడగా... మరోవైపు స్పెయిన్ శిబిరంలో మరియానా, ఐతాన బొన్‌మటి విఫలమవడంతో ఇంగ్లండ్ అనూహ్యంగా 2-1తో ఆధిక్యంలోకి దూసుకొచ్చింది. నాలుగో షాట్ లియా విలియమ్సన్ (ఇంగ్లండ్), సాల్మ పారాల్యులో (స్పెయిన్) ఎవరి వల్లా కాలేదు. 2-1తో ఇక ఆఖరి ప్రయత్నానికి సిద్ధమయ్యారు. ఒకవేళ ఇంగ్లండ్ ఐదో షాట్ విఫలమై, స్పెయిన్ చేసి ఉంటే 2-2తో సమమై విజేత కోసం డ్రామా కొనసాగేది. కానీ క్లో కెల్లీ (ఇంగ్లండ్) స్పెయిన్‌కు ఆ ఆఖరి ఛాన్స్ ఇవ్వకుండా గోల్ చేసింది. 3-1తో ఫలితం రావడంతో స్పెయిన్ ఆఖరి షాట్ తీసుకోలేదు. 2022లో జరిగిన అమ్మాయిల యూరోలోనూ ఇంగ్లండే చాంపియన్‌గా నిలిచింది.

స్టేడియానికి 'రాయల్' కళ

సెయింట్ జాకబ్ పార్క్‌లో జరిగిన ఈ టైటిల్ పోరుకు 'రాయల్' హాజరు లభించింది. తుదిపోరును ప్రత్యక్షంగా తిలకించేందుకు బ్రిటన్ యువరాజు విలియమ్స్ (కింగ్ చార్లెస్ తనయుడు) కుమార్తె ప్రిన్సెస్ చార్లట్‌తో విచ్చేశారు. ప్రిన్స్ విలియమ్స్ ఇంగ్లిష్ ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉన్నారు. మరోవైపు స్పెయిన్ రాజవంశానికి చెందిన యువరాణి ప్రిన్సెస్ లియోనర్ తన సోదరి ఇన్‌ఫాంటా సోఫియాతో కలిసి టైటిల్ పోరును వీక్షించింది. సోఫియా 2023లో సిడ్నీలో జరిగిన ప్రపంచకప్ ఫైనల్‌ను తల్లి, స్పెయిన్ రాణి లెటిజియాతో కలిసి వీక్షించింది. ఆ మ్యాచ్‌లో స్పెయిన్ విజేతగా నిలిచింది. మొత్తానికి 2023 ప్రపంచకప్, 2024 యూఈఎఫ్ఏ నేషన్స్ లీగ్ టైటిళ్లతో జోరుమీదున్న స్పెయిన్ వరుసగా మూడో ఏడాది ప్రతిష్టాత్మక టైటిల్ గెలవాలనే గంపెడాశలతో బరిలోకి దిగింది. కానీ తుదిమెట్టుపై చతికిలబడింది. దీంతో 'యూరో' కప్ స్పెయిన్ మహిళల జట్టుకు ఇన్నేళ్లయినా అందని ద్రాక్షగానే ఉంది.



సౌత్‌జోన్ సారథిగా తిలక్ వర్మ

ఆగస్టు 28 నుంచి దులీప్ ట్రోఫీ ● సెమీస్‌లో వెస్ట్‌జోన్‌తో తలపడనున్న సౌత్ జోన్

బెంగళూరు: దేశవాళీ క్రికెట్ టోర్నమెంట్ దులీప్ ట్రోఫీలో పాల్గొనే సౌత్ జోన్ జట్టుకు హైదరాబాద్ ఆటగాడు ఠాకూర్ తిలక్ వర్మ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. టీమిండియా తరఫున 4 వన్డేలు, 25 టి20లు ఆడిన తిలక్ వర్మ... ఇంగ్లండ్ కౌంటీ చాంపియన్‌షిప్‌లో చక్కటి ప్రదర్శన కనబరుస్తున్నాడు. హ్యాంప్‌షైర్ క్లబ్ తరఫున ఆడుతున్న 22 ఏళ్ల తిలక్ గత నాలుగు ఇన్నింగ్స్‌ల్లో వరుసగా 100, 56, 47, 112 పరుగులు చేశాడు. ఆగస్టు 28 నుంచి బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ గ్రౌండ్‌లో జరగనున్న ఈ టోర్నీ కోసం ఆదివారం 16 మందితో కూడిన సౌత్‌జోన్ జట్టును ప్రకటించారు. ఇందులో హైదరాబాద్ నుంచి తిలక్ వర్మతో పాటు తన్మయ్ అగర్వాల్, తనయ్ త్యాగరాజన్ చోటు దక్కించుకోగా... ఆంధ్ర జట్టు నుంచి త్రిపురాణ విజయ్, రికీ భుయ్‌లకు అవకాశం దక్కింది. కేరళ నుంచి అత్యధికంగా నలుగురు ప్లేయర్లు ఈ జట్టుకు ఎంపికయ్యారు. రంజీ ట్రోఫీలో రాణించిన మొహమ్మద్ అజహరుద్దీన్, నిధీశ్, బాసిల్, సల్మాన్ నిజార్ చోటు దక్కించుకున్నారు. అజహరుద్దీన్ జట్టుకు వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. తమిళనాడుకు చెందిన నారాయణ్ జగదీశన్, సాయి కిషోర్, కర్ణాటక ప్లేయర్ దేవదత్ పడిక్కల్ జట్టులో ఉన్నారు. కర్ణాటకకు చెందిన వైశాఖ్ విజయ్‌కుమార్ బౌలింగ్ దళానికి నాయకత్వం వహించనున్నాడు. ఈ ఏడాది నుంచి దులీప్ ట్రోఫీని తిరిగి పాత తరహాలో జోనల్ విధానంలో నిర్వహిస్తున్నారు. గతేడాది భారత్ 'ఎ', 'బి', 'సి', 'డి' జట్ల మధ్య మ్యాచ్‌లు నిర్వహించగా... ఈసారి ఆరు జోన్‌ల మధ్య పోటీ జరగనుంది. సౌత్ జోన్, వెస్ట్ జోన్ జట్లు నేరుగా సెమీఫైనల్ ఆడనుండగా... నార్త్ జోన్‌తో ఈస్ట్ జోన్, సెంట్రల్ జోన్‌తో నార్త్ ఈస్ట్ జోన్ క్వార్టర్ ఫైనల్లో తలపడనున్నాయి. ఆంధ్ర ప్లేయర్ షేక్ రషీద్‌తో పాటు రంజీ ట్రోఫీలో కర్ణాటక తరఫున అత్యధిక పరుగులు చేసిన స్మరణ్ స్టాండ్‌బై ప్లేయర్లుగా ఎంపికయ్యారు.



సౌత్ జోన్ జట్టు: తిలక్ వర్మ (కెప్టెన్), మొహమ్మద్ అజహరుద్దీన్, తన్మయ్ అగర్వాల్, దేవదత్ పడిక్కల్, మోహిత్ కాలె, సల్మాన్ నిజార్, నారాయణ్ జగదీశన్, త్రిపురాణ విజయ్, సాయి కిషోర్, తనయ్ త్యాగరాజన్, వైశాఖ్ విజయ్ కుమార్, ఎండీ నిధీశ్, రికీ భుయ్, బాసిల్, గుర్జపనీత్ సింగ్, స్నేహల్ కౌథాంకర్. స్టాండ్‌బై: మోహిత్ రెడ్కర్, స్మరణ్, అంకిత్ శర్మ, యాపిల్ టామ్, సిద్ధార్థ్, షేక్ రషీద్.

ఆసీస్‌కు భారత హాకీ జట్టు

వచ్చే నెలలో నాలుగు ఫ్రెండ్లీ మ్యాచ్‌లు ఆడనున్న పురుషుల జట్టు

న్యూఢిల్లీ: భారత పురుషుల హాకీ జట్టు ఆస్ట్రేలియాలో పర్యటించనుంది. ఆసియా కప్ టోర్నీకి సన్నాహకంగా వచ్చే నెలలో కంగారూ జట్టుతో నాలుగు ఫ్రెండ్లీ మ్యాచ్‌లు ఆడనున్నట్లు హాకీ ఇండియా (హెచ్ఐ) తెలిపింది. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో ఎనిమిదో స్థానంలో ఉన్న భారత జట్టు ఆగస్టు 15, 16, 19, 21 తేదీల్లో ఆరో ర్యాంకర్ అయిన ఆతిథ్య దేశంతో తలపడుతుంది. 'ఈ పర్యటన మాకు కీలకం కానుంది. ఆసియా కప్‌కు ముందు జరిగే ఫ్రెండ్లీ సిరీస్ జట్టుకు బాగా ఉపయోగపడుతుంది. ఆటగాళ్లంతా పూర్తిస్థాయిలో సన్నద్ధమయ్యేందుకు మేటి జట్టుతో జరిగే పోటీలు దోహదం చేస్తాయి. ఆసీస్‌లాంటి గట్టి ప్రత్యర్థితో జరిగే సిరీస్ భారత్ సత్తాకు చక్కని పరీక్ష పెడుతుంది. లోటుపాట్లను సరిదిద్దుకొని సమాయత్తమయ్యేందుకు ఈ పర్యటన కచ్చితంగా ఉపయోగపడుతుంది' అని హెడ్ కోచ్ క్రెయిగ్ ఫుల్టన్ చెప్పారు. ఇటీవల అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) ప్రొ లీగ్ యూరోప్ అంచె పోటీల్లో భారత జట్టు తీవ్రంగా నిరాశపరిచింది. ఇందులో భాగంగా ఐరోపా జట్లతో పాటు ఆసీస్‌తోనూ తలపడిన రెండు మ్యాచ్‌ల్లోనూ భారత్ ఓడింది. అయితే గతేడాది పారిస్ ఒలింపిక్స్‌లో 3-2తో ఆస్ట్రేలియాపై గెలుపొందడం ద్వారా 1972-మ్యూనిక్ ఒలింపిక్స్ తర్వాత విశ్వక్రీడల్లో ఆసీస్‌పై తొలి విజయాన్ని నమోదు చేసినట్లయ్యింది. ఓవరాల్‌గా చూసుకుంటే ఇప్పటివరకు ఆసీస్‌దే పైచేయిగా ఉంది. 2013 నుంచి ఇరు దేశాల మధ్య 51 మ్యాచ్‌లు జరిగితే 35 మ్యాచ్‌ల్లో ఆసీస్ గెలిచింది. కానీ భారత్ మాత్రం కేవలం 9 మ్యాచ్‌లే గెలిచింది. మరో ఏడు మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి. ఆసీస్ పర్యట ముగిసిన వెంటనే ఆసియా కప్ హాకీ టోర్నమెంట్ ఆగస్టు 29 నుంచి సెప్టెంబర్ 9 వరకు బీహార్‌లోని రాజ్‌గిర్‌లో జరుగనుంది. ఇందులో విజేతగా నిలిచిన జట్టుకు ప్రపంచకప్ బెర్త్ లభిస్తుంది.



'మాది గొప్ప జట్టని నిరూపించాం'

- 'డ్రా'తో ఆత్మవిశ్వాసం పెరిగింది
- భారత కెప్టెన్ శుబ్‌మన్ గిల్ వ్యాఖ్య
- జడేజా, సుందర్‌లపై ప్రశంసలు



మాంచెస్టర్: ఇంగ్లండ్‌తో జరిగిన నాలుగో టెస్టులో ఓటమి అంచుల నుంచి తప్పించుకొని మ్యాచ్‌ను భారత్ 'డ్రా'గా ముగించడంపై అన్ని వైపుల నుంచి ప్రశంసలు వచ్చాయి. రెండో ఇన్నింగ్స్ తొలి ఓవర్లోనే 2 వికెట్లు కోల్పోయి టీమిండియా... తర్వాతి ఐదు సెషన్లలో మరో రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి ప్రత్యర్థిని నిలువరించగలిగింది. ఇది మన జట్టు పట్టుదలను చూపించింది. ఈ విషయాన్ని భారత కెప్టెన్ శుబ్‌మన్ గిల్ కూడా ప్రత్యేకంగా ప్రస్తావించాడు. మంచి జట్టుకు, గొప్ప జట్టుకు మధ్య ఉన్న తేడాను తాము చూపించగలిగామని అతను చెప్పాడు. 'మైదానంలో 143 ఓవర్ల పాటు ఒకే లక్ష్యంతో ఒకే తరహా ఆలోచనతో మానసికంగా దృఢంగా ఉండటం చాలా కష్టం. కానీ మేం దానిని చేసి చూపించాం. ఒక మంచి జట్టుకు, గొప్ప జట్టుకు మధ్య ఇదే ప్రధాన తేడా. ఈ టెస్టులో ఆటతో మాది గొప్ప జట్టని నిరూపించాం' అని గిల్ వ్యాఖ్యానించాడు. సున్నాకే 2 వికెట్లు కోల్పోయిన దశలో సీనియర్ కేఎల్ రాహుల్‌తో కలిసి గిల్ నెలకొల్పిన భాగస్వామ్యమే జట్టు రాతను మార్చింది. 70.3 ఓవర్ల వీరి భాగస్వామ్యంలో 188 పరుగులు వచ్చాయి. ఈ పార్ట్‌నర్‌షిప్‌తోనే తాము మ్యాచ్‌ను కాపాడుకోగలమనే నమ్మకం కలిగిందని గిల్ చెప్పాడు. 'మా జట్టు పట్టుదలగా ముందుకు వెళ్లాలంటే కావాల్సిన అగ్గిని రగిల్చేందుకు ఒక నిప్పు కణిక అవసరమైంది. నేను, రాహుల్ కలిసి నెలకొల్పిన భాగస్వామ్యం అలాంటిదే. మేం పెట్టుకున్న లక్ష్యాన్ని అందుకోగలమని అప్పుడే అనిపించింది. తుది ఫలితం చాలా సంతోషాన్నిచ్చింది. శనివారం మేం ఉన్న స్థితితో పోలిస్తే మ్యాచ్‌ను డ్రా చేసుకోవడం ఎంతో సంతృప్తికరం. నా ఇన్నింగ్స్ పట్ల కూడా ఎంతో ఆనందంగా ఉన్నా' అని గిల్ పేర్కొన్నాడు. భారత్ ఓటమి నుంచి తప్పించుకోవడంలో కీలక పాత్ర పోషించిన జడేజా, సుందర్‌లపై కూడా కెప్టెన్ ప్రశంసలు కురిపించాడు. వీరిద్దరు 55.2 ఓవర్లు ఆడి అభేద్యంగా 203 పరుగులు జత చేశారు. 'జడేజా, సుందర్ క్రీజ్‌లో ఉన్నప్పుడు కూడా బ్యాటింగ్‌కు అంత అనుకూల పరిస్థితి ఏమీ లేదు. బంతి అనూహ్యంగా స్పందిస్తోంది. కానీ అలాంటి స్థితి నుంచి ప్రశాంతంగా ఆడుతూ ఇద్దరూ సెంచరీలు సాధించడం చాలా గొప్ప విషయం. ఏకాగ్రత చెదరకుండా ప్రతీ బంతిపై వారు దృష్టి పెట్టి డ్రా వరకు తీసుకెళ్లడం ఎంతో ప్రత్యేకం. ఇది మాలో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది' అని గిల్ అన్నాడు.



పేస్ బౌలర్లంతా సిద్ధం: గంభీర్

ఇంగ్లండ్‌తో చివరి టెస్టు కోసం జస్‌ప్రీత్ బుమ్రా సహా భారత బౌలింగ్ బృందమంతా సిద్ధంగా ఉందని, ఎలాంటి గాయాల సమస్య లేదని జట్టు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ స్పష్టం చేశాడు. ఈ సిరీస్‌లో బుమ్రా మూడు టెస్టులు మాత్రమే ఆడతాడనే ముందే ప్రకటించినా... ప్రస్తుత స్థితిలో బుమ్రా చివరి టెస్టు కూడా ఆడే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే బుమ్రా విషయంలో ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని, తుది జట్టుకు సంబంధించి ఇంకా చర్చ జరగలేదని అతను వెల్లడించాడు. మరో వైపు కెప్టెన్ గిల్‌పై గతంలో విమర్శలు చేసినవారిని గంభీర్ తప్పు పట్టాడు. 'గిల్ ప్రతిభ విషయంలో ఎప్పుడూ ఎలాంటి సందేహాలు లేవు. అతడిని విమర్శిస్తున్నవారికి క్రికెట్ గురించే తెలియకపోవచ్చు. అతని ప్రదర్శన మాకు ఎవరికీ ఆశ్చర్యం కలిగించలేదు. అతనిపై కెప్టెన్సీ ఒత్తిడి కూడా లేదని తేలిపోయింది' అని గంభీర్ వ్యాఖ్యానించాడు. భారత బ్యాటర్లు కనబర్చిన పోరాటపటిమను కెప్టెన్ ప్రత్యేకంగా మెచ్చుకున్నాడు. అయితే ఈ డ్రాతో ఏదో సాధించామని భావించడం లేదని, తర్వాతి పోరులో గెలిచేందుకు ప్రయత్నిస్తామని అతను అన్నాడు. 'నేను 'డ్రా' కంటే మ్యాచ్‌లో ఫలితం రావడాన్నే ఇష్టపడతా. మేం ఇంకా 1-2తో వెనుకబడి ఉన్నామనే విషయం మర్చిపోలేదు. దీనిని 2-2గా మార్చడం అవసరం. మా ఆటగాళ్లకు తగినంత అనుభవం లేకపోయినా ప్రస్తుతం ఇది మా ఉత్తమ జట్టు. వీరంతా ఎవరో ఒకరిని అనుకరించడం కాకుండా తామే కొత్త చరిత్ర సృష్టించాలనే లక్ష్యంగా పెట్టుకున్నారు' అని గంభీర్ పేర్కొన్నాడు. మరో వైపు చివరి టెస్టులో శార్దుల్, కంబోజ్ స్థానాల్లో కుల్దీప్ యాదవ్, ఆకాశ్‌దీప్ వచ్చే అవకాశాలున్నాయి.

తేజస్విన్ మరో జాతీయ రికార్డు



న్యూఢిల్లీ: భారత స్టార్ డెకాథ్లెట్ తేజస్విన్ శంకర్ తన రికార్డును తానే బద్దలు కొట్టాడు. పోలాండ్‌లో జరిగిన వీస్లా జాపీక్స్కీ మెమోరియల్ టోర్నమెంట్‌లో నిర్వహించిన డెకాథ్లాన్ పోటీల్లో అదరగొట్టాడు. పది క్రీడాంశాల సమాహారమైన ఈ ఈవెంట్‌లో అతను 7826 పాయింట్లను సాధించాడు. వరల్డ్ అథ్లెటిక్స్ కంబైన్డ్ ఈవెంట్స్ టూర్ గోల్డ్ లెవెల్ మీట్‌లో భాగమైన ఈ చాంపియన్‌షిప్‌లో 7800 పైచిలుకు పాయింట్లు సాధించిన తొలి భారత అథ్లెట్‌గా ఘనత వహించాడు. తద్వారా 2023లో జరిగిన హాంగ్జౌ ఆసియా క్రీడల్లో తను నెలకొల్పిన 7666 పాయింట్ల జాతీయ రికార్డును తాజాగా తానే అధిగమించాడు. తొలి రోజు నిర్వహించిన 100 మీటర్ల పరుగు, లాంగ్‌జంప్, షాట్‌పుట్, హైజంప్, 400 మీటర్ల పరుగు పోటీలు ముగిసేసరికి 26 ఏళ్ల తేజస్విన్ 4292 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచాడు. 100 మీటర్ల పరుగులో అతను 11.02 సెకన్లతో వ్యక్తిగత ప్రదర్శన కనబరిచాడు. రెండో రోజు జరిగిన 110 మీటర్ల హర్డిల్స్, డిస్కస్ త్రో, పోల్‌వాల్ట్, జావెలిన్ త్రో, 1500 మీటర్ల పరుగు పోటీల్లో 3534 పాయింట్లు సాధించాడు.

పంత్ స్థానంలో జగదీశన్



లండన్: కాలి గాయంతో భారత వికెట్ కీపర్ రిషభ్ పంత్ ఇంగ్లండ్‌తో చివరి టెస్టుకు దూరమయ్యాడు. అతని స్థానంలో తమిళనాడు వికెట్ కీపర్ నారాయణ్ జగదీశన్‌ను ఎంపిక చేశారు. ఇప్పటికే మరో వికెట్ కీపర్ ధ్రువ్ జురేల్ జట్టుతోనే ఉన్నా... ముందు జాగ్రత్తగా జగదీశన్‌ను తీసుకున్నారు. అతను మంగళవారం టీమ్‌తో కలుస్తాడు. 29 ఏళ్ల జగదీశన్ 52 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లలో 47.50 సగటుతో 3373 పరుగులు చేశాడు. నాలుగో టెస్టులో వోక్స్ బౌలింగ్‌లో రివర్స్ స్వీప్ ఆడే ప్రయత్నంలో పంత్ కాలుకు బంతి బలంగా తాకింది. నొప్పితోనే అతను తొలి ఇన్నింగ్స్‌లో 54 పరుగులు సాధించాడు. రెండో ఇన్నింగ్స్‌లో పంత్ బ్యాటింగ్ చేయాల్సిన అవసరం లేకపోయింది.

ఇంగ్లండ్ జట్టులో ఒవర్టన్‌కు చోటు



లండన్: భారత్‌తో జరిగే చివరి టెస్టు కోసం ఇంగ్లండ్ అదనంగా మరో పేస్ బౌలర్‌కు జట్టులో చోటు కల్పించింది. ఇప్పటికే ఉన్న 14 మంది సభ్యులతో పాటు పేసర్ జేమీ ఒవర్టన్‌ను టీమ్‌లోకి ఎంపిక చేశారు. ఒవర్టన్ రెండేళ్ల క్రితం తన కెరీర్‌లో ఏకైక టెస్టు ఆడి 2 వికెట్లు తీశాడు. 'డ్రా'గా ముగిసిన నాలుగో టెస్టులో ఏకంగా 257.1 ఓవర్లు బౌలింగ్ చేయాల్సి రావడంతో ఇంగ్లండ్ పేసర్లు బాగా అలసిపోయారు. దాంతో తుది జట్టులో మార్పులకు అవకాశం ఉండటంతో ముందు జాగ్రత్తగా ఒవర్టన్‌ను తీసుకున్నారు. ఓవల్‌లో జరిగే చివరి టెస్టులో వోక్స్ స్థానంలో ఒవర్టన్ లేదా అట్కిన్సన్‌లలో ఒకరిలో చాన్స్ లభించవచ్చు.

డబుల్స్ టైటిల్ లక్ష్యంగా సాత్విక్ జోడీ

నేటి నుంచి మకావు ఓపెన్



మకావు: వచ్చే నెలలో పారిస్‌లో జరిగే ప్రపంచ చాంపియన్‌షిప్‌కు సన్నాహంగా భారత షట్లర్లు మకావు ఓపెన్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీ బరిలోకి దిగుతున్నారు. పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్ రెండో సీడ్‌గా ఆటను ప్రారంభించనున్నాడు. ఈ సీజన్‌లో సెమీఫైనల్స్‌తో సరిపెట్టుకుంటున్న అగ్రశ్రేణి డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి ఇక్కడ టైటిలే లక్ష్యంగా సత్తా చాటేందుకు సిద్ధమయ్యారు. ఆసియా క్రీడల చాంపియన్లు సాత్విక్-చిరాగ్ జంట గత వారం చైనా ఓపెన్‌లో సెమీస్‌లో నిష్క్రమించారు. ఈ సీజన్‌లో నిలకడగా ఆడుతున్న ఈ ప్రపంచ మూడో ర్యాంక్ జోడీకి ఈ ఏడాది టైటిల్ లోటుగా ఉంది. ప్రపంచ చాంపియన్‌షిప్‌కు ముందు ఆ వెలతిని పూడ్చుకోవాలనే పట్టుదలతో సాత్విక్ ద్వయం ఉంది. తొలి రౌండ్లో ఈ జోడీ... మలేసియాకు చెందిన లో హంగ్ యి-ఎన్గ్ ఇంగ్ చియాంగ్ జంటతో తలపడుతుంది. పురుషుల సింగిల్స్ తొలిరౌండ్లో లక్ష్యసేన్... జియోన్ హ్యోక్ జిన్ (కొరియా)ను ఎదుర్కొంటాడు. ప్రణయ్... క్వాలిఫయర్‌తో ఈ టోర్నీని ప్రారంభించనున్నాడు. 2023 ప్రపంచ చాంపియన్‌షిప్ కాంస్య పతక విజేత అయిన ప్రణయ్ చైనా ఓపెన్‌లో రెండో రౌండ్లోనే ఇంటిదారి పట్టాడు. అయితే ఈ టోర్నీలో వైఫల్యాలను అధిగమించి విజయమే లక్ష్యంగా బరిలోకి దిగనున్నాడు. మిగతా మ్యాచ్‌ల్లో మన్‌రాజ్ సింగ్, తరుణ్ మన్నెపల్లి, శంకర్ ముత్తుస్వామి, రిత్విక్ సంజీవి, సతీశ్ కుమార్, కిరణ్ జార్జ్‌లు గట్టి పోటీ ఇచ్చేందుకు సై అంటున్నారు. మహిళల సింగిల్స్‌లో టీనేజ్ సంచలనం ఉన్నతి హుడా, రక్షితశ్రీ, అనుపమ, ఆకర్షి కశ్యప్ శుభారంభం ఇచ్చేందుకు సిద్ధమయ్యారు.




తూర్పు సిక్కింలో సోమవారం ఆర్మీ దివ్య దృష్టి పేరుతో చేపట్టిన విన్యాసాల్లో ఫిరంగుల కాల్పులు.. ఆన్‌లైన్‌లో సమీక్షిస్తున్న డిప్యూటీ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ లెఫ్టినెంట్ జనరల్ రాకేశ్ కపూర్(ఎడమ నుంచి రెండో వ్యక్తి) తదితరులు

సెప్టెంబర్‌లో సిరియా ఎన్నికలు

డమాస్కస్: దీర్ఘకాల అంతర్యుద్ధం అనంతరం.. సిరియాలో పార్లమెంటరీ ఎన్నికలు జరగనున్నాయి. సెప్టెంబర్ 15 నుంచి 20 ఎన్నికలను నిర్వహించనున్నట్లు పీపుల్స్ అసెంబ్లీ ఎన్నికల ఉన్నత కమిటీ చైర్మన్ మొహమ్మద్ తహ అల్–అహ్మద్ తెలిపారు. గతేడాది డిసెంబర్‌లో తిరుగుబాటుతో బషర్ అసద్ అధికార పతనం తరువాత.. దేశంలో మొదటిసారి ఎన్నికలు జరగుతున్నాయి. తాత్కాలిక అధ్యక్షుడు అహ్మద్ అల్–షరా మార్చిలో తాత్కాలిక రాజ్యాంగంపై సంతకం చేశారు. సాధారణ ఎన్నికలు జరిగి.. శాశ్వత రాజ్యాంగాన్ని ఆమోదించే వరకు తాత్కాలిక పార్లమెంటుగా పీపుల్స్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ఆధ్వర్యంలోనే ఎన్నికలు జరగనున్నాయి.

అలవైట్లపై హింస..
డ్రూజ్ మిలిటెంట్ల దాడులు

మార్చిలో అలవైట్ మైనారిటీకి చెందిన వందలాది మంది హత్యతో మతపరమైన హింస చెలరేగింది. సిరియా భద్రతా దళాలు అలవైట్ మైనార్టీ వర్గానికి చెందిన వందలాది మంది పౌరులను చంపినట్లు ఆరోపణలు వచ్చాయి. అలవైట్లను లక్ష్యంగా చేసుకొని 30 సార్లు సాగించిన మారణకాండలో 745 మంది పౌరులు చనిపోయినట్లు బ్రిటన్ కేంద్రంగా పనిచేసే సిరియన్ అబ్జర్వేటరీ ఫర్ హ్యూమన్ రైట్స్ (ఎస్‌ఓహెచ్‌ఆర్) తెలిపింది. దీంతో సిరియాలో మైనారిటీల స్థితిగతులపై ఆందోళనలను రేకెత్తించాయి. మరో మైనారిటీ గ్రూప్ డ్రూజ్ మిలిటెంట్లు ప్రభుత్వంపై దాడికి దిగారు. గతంలో ఐఎస్ఎస్ ఉగ్రవాదిగా ఉన్న అహ్మద్ అల్ షరా.. అసద్ ప్రభుత్వాన్ని కూలదోసేందుకు ఈ డ్రూజ్ మైనారిటీల మిలిటెంట్ల సాయం తీసుకున్నారు. తీరా అల్ షరా తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడేటప్పుడు కేవలం ఒక్క డ్రూజ్ నేతకే ప్రభుత్వంలో స్థానం కల్పిస్తానని చెప్పడం, డ్రూజ్ ప్రాబల్య ప్రాంతాల అభివృద్ధిని పట్టించుకోకపోవడంతో చీలిక వచ్చింది. డ్రూజ్‌లో ఒక వర్గం ఇలా సాయుధ పంథాను ఉధృతం చేసింది. సువైదా ప్రావిన్స్‌లో జూలై 13న డ్రూజ్ వ్యాపారి అపహరణతో తాజా హింస ప్రారంభమైంది. డమాస్కస్, సువైదా, డెరాపై ఇజ్రాయెల్ వైమానిక దాడులు ప్రారంభించింది. ప్రభుత్వ అనుబంధ దళాల నుండి డ్రూజ్‌ను రక్షించడానికి తమ దళాలు ప్రయత్నిస్తున్నాయని పేర్కొంది. సువైదాలో 1,100 మందికి పైగా మరణించినట్లు ఎస్‌ఓహెచ్ఆర్ తెలిపింది. డ్రూజ్, బెడోయిన్, ప్రభుత్వ దళాలు.. దారుణాలకు పాల్పడ్డాయి. అసద్ పతనం నుంచి దేశవ్యాప్తంగా సైనిక స్థావరాలు, ప్రభుత్వ దళాలపై దాడి చేస్తున్న ఇజ్రాయెల్.. సిరియాలోని కుర్దులు, డ్రూజ్, అలవైట్లతో సహా మైనారిటీల రక్షకుడిగా చూపించుకునే ప్రయత్నం చేసింది. అయితే.. ఇజ్రాయెల్ తన విస్తరణ కోసం సిరియాలో మత విభజనను రేకెత్తిస్తోందని విమర్శలున్నాయి. రాష్ట్ర నిర్మాణం, యుద్ధానంతర పునరుద్ధరణ ప్రయత్నాలను మత ఘర్షణలు, ఇజ్రాయెల్ దాడులు పక్కదారి పట్టిస్తున్నాయి. ఈ హింస తర్వాత ప్రజల్లో చీలిక వచ్చింది. కొత్త ప్రభుత్వంపై కొంత వ్యతిరేకత పెరిగింది. ఈ నేపథ్యంలోనే తాత్కాలిక ప్రభుత్వం ఎన్నికల ప్రకటన చేసింది. అసద్ పతనం తరువాత మొదలైన మతపరమైన విభజనలను తగ్గించి.. పరిస్థితులను పునరుద్ధరించేందుకు తాత్కాలిక అధ్యక్షుడు అల్–షరా ప్రయత్నిస్తున్నారు. అందులో భాగంగానే ఈ ఎన్నికలు జరుగుతున్నాయి. ప్రభుత్వం ఇటీవల తన ఎన్నికల చట్టాలను సవరించింది, పార్లమెంటు సీట్లను 150 నుంచి 210కి పెంచింది. 210 సీట్లలో మూడింట ఒక వంతు స్థానాలను తాత్కాలిక అధ్యక్షుడు అల్–షరా నియమిస్తారు. మిగిలిన స్థానాలకు ఎన్నికలు జరుగుతాయి. దీనికోసం సిరియాలోని ప్రతి ప్రావిన్స్‌లో ఒక ఎలక్టోరల్ కాలేజీని ఏర్పాటు చేయనున్నారు.

న్యాయస్థానం సహనాన్ని పరీక్షిస్తున్నారు..!

కల్నల్ సోఫియా ఖురేషీపై అనుచిత వ్యాఖ్యల కేసు
- మధ్యప్రదేశ్ మంత్రిపై సుప్రీంకోర్టు ఆగ్రహం
- బహిరంగ క్షమాపణ చెప్పనందుకు మండిపాటు

న్యూఢిల్లీ: భారత ఆర్మీ అధికారి కల్నల్ సోఫియా ఖురేషీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో మధ్యప్రదేశ్ మంత్రి కువ్వర్ విజయ్ షా తీరుపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. బహిరంగ క్షమాపణలు చెప్పకుండా న్యాయస్థానం సహనాన్ని పరీక్షిస్తున్నారంటూ తలంటింది. జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి సోమవారం ఈ కేసు విచారణ సందర్భంగా మంత్రి ప్రవర్తనను, వ్యాఖ్యల వెనుక ఆయన ఉద్దేశాన్ని అనుమానించాల్సి వస్తోందని పేర్కొంది. 'ఈ విధంగా క్షమాపణ చెప్పడంలో ఆయన ఉద్దేశం ఏమిటి? బహిరంగంగా క్షమాపణ చెప్పాలని చెబుతున్నాం. ఏది? ఎక్కడ చెప్పారు? మా సహనాన్ని ఆయన పరీక్షిస్తున్నారు'అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేసింది. మంత్రి షా చెప్పిన బహిరంగ క్షమాపణలను ఆన్‌లైన్‌లో షేర్ చేశామని ఆయన తరపు లాయర్ కె.పరమేశ్వర్ తెలపగా.. 'క్షమాపణలను ఆన్‌లైన్‌లో చెప్పడమేంటి? ఆయన తీరు, ఉద్దేశాలపై మాకు అనుమానాలు కలుగుతున్నాయి. క్షమాపణ చెప్పినట్లుగా రికార్డు చేయండి. మేం దాన్ని చూడాల్సి ఉంది'అంటూ ధర్మాసనం స్పష్టం చేసింది. మంత్రి షా ప్రకటనలపై ఏర్పాటైన ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) ఆగస్టు 13వ తేదీలోగా నివేదికను తమకు అందజేయాలంది. ఈ సందర్భంగా సిట్ అధికారి ఒకరు 27 మంది ఇచ్చిన వాంగ్మూలాలను సీల్డ్ కవర్‌లో అందజేశారు. వీటిపై తాము దర్యాప్తు చేపట్టినట్లు ఆ అధికారి చెప్పారు. షా ప్రకటనలు కాకుండా ఇదే విషయంలో ఇతరులు చేసిన అనుచిత ప్రకటనలను రికార్డు చేయాలని ధర్మాసనం సిట్‌ను ఆదేశించింది. కున్వర్ విజయ్ షాను మంత్రిపదవికి రాజీనామా చేయించాలంటూ కాంగ్రెస్ నేత జయా ఠాకూర్ వేసిన పిటిషన్‌ను ధర్మాసనం తోసిపుచ్చింది. షా గతంలో చేసిన ఇటువంటి అనుచిత ప్రకటనలపైనా సిట్ దర్యాప్తు చేస్తుందని పేర్కొంటూ తదుపరి విచారణను ఆగస్టు 18వ తేదీకి వాయిదా వేసింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ముగ్గురు సభ్యులతో కూడిన సిట్‌ను మధ్యప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మేలో కేంద్రం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌పై కల్నల్ సోఫియా, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్‌లు మీడియాకు జరుగుతున్న పరిణామాలను ఎప్పటికప్పుడు మీడియాకు వెల్లడిస్తూ ప్రజల దృష్టిని ఆకర్షించారు. వీరిపై మంత్రి కున్వర్ విజయ్ షా అనుచిత వ్యాఖ్యలు చేయడంతో కేసు నమోదైంది.

16 నెలల్లో 981 మంది రైతుల ఆత్మహత్య

కర్ణాటక ప్రభుత్వంపై మండిపడ్డ బీజేపీ

బెంగళూరు: 2024 నుంచి 2025 మధ్యకాలం వరకు 981 మంది రైతు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఇది కర్ణాటక ప్రభుత్వ అధికారిక గణాంకాలే చెబుతున్నాయి. ఈ ఆత్మహత్యల్లో 825 మంది అర్హులైన రైతులు కాగా, 138 మంది ఇతర కారణాల వల్ల మరణించినట్లు తెలుస్తోంది. వీరిలో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు 807 కుటుంబాలకు పరిహారం చెల్లించింది. 18 కేసుల్లో పరిహారం ఇంకా పెండింగ్‌లో ఉంది. రాష్ట్రంలోని హవేరి జిల్లాలో అత్యధికంగా 128 మంది రైతు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఆ తరువాత మైసూరులో 73, ధార్వాడ్‌లో 72, బెలగావిలో 71 మంది రైతు ఆత్మహత్యలు నమోదయ్యాయి.

ప్రభుత్వ వైఫల్యమే కారణం : బీజేపీ

కష్టాలు పెరిగి రైతులు ఆత్మహత్య చేసుకోవ డానికి కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బి.వై.విజయేంద్ర ఆరోపించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే రైతు ల్లో భయాందోళనలు నెలకొన్నాయని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వ్యవ సాయ రంగంలో ప్రగతి లేకుండా పోయిందని మండిపడ్డారు. రైతులకు ప్రయోజనం చేకూర్చే పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసిందన్నారు. బీజేపీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం ప్రధాన్ మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన ద్వారా 52 లక్షల మంది రైతులకు సహాయం చేసిందని పేర్కొన్నారు.

బీజేపీ వాదనలను ఖండించిన కాంగ్రెస్..

బీజేపీ వాదనలను కాంగ్రెస్ ఖండించింది. రైతుల ఆత్మహత్యలకు కేంద్ర ప్రభుత్వం కూడా కారణమైందని కాంగ్రెస్ ఎమ్మెల్యే అర్షద్ ఆరోపించారు. రాష్ట్రంలో పురుగు మందుల కొరత చాలా ఉందని, ఈ విషయంపై ఇప్పటికే కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాసిందని తెలిపారు. కనీస మద్దతు ధర పెంచుతానని హామీ ఇచ్చిన ప్రధాని మోదీ ఆ విషయాన్ని మరిచారని ఆరోపించారు.

బ్యాంకాక్‌లో కాల్పుల కలకలం

ఆరుగురి మృతి ● ఆత్మహత్య చేసుకున్న దుండగుడు

బ్యాంకాక్: థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లో సోమవారం ఓ వ్యక్తి ఐదుగురిని కాల్చి చంపాడు. వ్యవసాయ ఉత్పత్తులతో పాటు ఆహారాన్ని విక్రయించే ఓర్ టోర్ కోర్ మార్కెట్‌లో ఈ ఘటన జరిగింది. నలుగురు సెక్యూరిటీ గార్డులను, ఒక మహిళను కాల్చి చంపిన దుండగుడు చివరకు తనను తాను కాల్చుకున్నాడు. దీంతో మృతుల సంఖ్య ఆరుకు చేరింది. బ్యాంకాక్‌లోని ప్రధాన పర్యాటక కేంద్రంగా సందర్శకులను ఆకట్టుకునే చతుచక్ మార్కెట్‌కు కొద్ది దూరంలోనే ఈ ఓర్ టోర్ కోర్ మార్కెట్ ఉంది. దుండగుడు వరుస కాల్పులు జరుపుతుండగా ప్రజలు తమ ప్రాణాలు కాపాడుకోవడానికి పరుగెత్తుతున్న దృశ్యం, మృతదేహాలు వీధిలో చెల్లాచెదురుగా పడి ఉన్న దృశ్యం మార్కెట్ సీసీటీవీ కెమెరా ఫుటేజీలో కనిపించింది. కాల్పుల తర్వాత నిందితుడు ఆత్మహత్య చేసుకున్నాడని, అతడిని గుర్తించడానికి పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ప్రస్తుతం థాయ్‌లాండ్, కంబోడియా మధ్య సరిహద్దు ఘర్షణలు జరుగుతున్న నేపథ్యంలో ఘర్షణలకు, కాల్పులకు ఏదైనా సంబంధం ఉందా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. థాయిలాండ్‌లో కాల్పులు చాలా సాధారణం. నియంత్రణ అమలులో లోపాల కారణంగా ఇక్కడ తుపాకీలు పొందడం చాలా సులభం. గత కొన్ని సంవత్సరాలుగా ఇక్కడ తుపాకీ హింస విపరీతంగా పెరిగింది. ఈ ఏడాది మేలో థాయ్‌లాండ్‌లోని యు థాంగ్ జిల్లాలో 33 ఏళ్ల వ్యక్తి కాల్పులు జరిపాడు. ఈ దాడిలో ముగ్గురు మరణించారు. 2023 అక్టోబర్‌లో బ్యాంకాక్‌లోని సియామ్ పారగాన్ మాల్‌లో 14 ఏళ్ల బాలుడు జరిపిన కాల్పుల్లో ఇద్దరు మరణించారు.చాలా మంది గాయపడ్డారు. 2022 అక్టోబర్‌లో జరిగిన మరో దారుణ సంఘటన జరిగింది. థాయ్ మాజీ పోలీసు ఒకరు పిల్లల సంరక్షణ కేంద్రంలో జరిపిన కాల్పుల్లో 24 మంది పిల్లలు సహా దాదాపు 36 మంది మరణించారు.



ఘటన స్థలంలో అగంతకుడు

డింపుల్ యాదవ్‌పై ముస్లిం బోధకుడి వ్యాఖ్యల వివాదం

ఆందోళన చేపట్టిన ఎన్డీయే ఎంపీలు

న్యూఢిల్లీ/లక్నో: సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ డింపుల్ యాదవ్‌పై ముస్లిం మత బోధకుడు అనుచిత వ్యాఖ్యలు చేయడం వివాదాస్పదంగా మారింది. అధికార ఎన్డీయే ఎంపీలు పార్లమెంట్ కాంప్లెక్స్ వద్ద సోమవారం దీనిపై నిరసన తెలిపారు. ఈ వ్యవహారంపై సమాజ్‌వాదీ పార్టీతోపాటు ప్రతిపక్షం మౌనంగా ఉండటమేంటని ప్రశ్నించారు. ఓ మసీదులో ఇటీవల జరిగిన సమావేశానికి ఎంపీ డింపుల్ యాదవ్ చీర ధరించి వెళ్లడంపై మౌలానా సాజిద్ రషీద్ అనే బోధకుడు ఎస్పీకి చెందిన ఇక్రా హసన్ అనే ఎంపీతో పోల్చుతూ టీవీలో చర్చా కార్యక్రమం సమయంలో చేసిన వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తమైంది. ఎంపీలు బీజేపీకి చెందిన బాన్సురీ స్వరాజ్, కాంగ్రెస్‌కు చెందిన రేణుకా చౌదరి సైతం ఖండించారు. పార్లమెంట్ కాంప్లెక్స్ వద్ద చేపట్టిన నిరసనలో పలువురు ఎన్డీఏ మహిళా ఎంపీలు కూడా పాల్గొన్నారు.

భారీ డ్రగ్ రాకెట్ గుట్టురట్టు

రూ.390 కోట్ల మెఫెడ్రిన్ పట్టుకున్న ముంబై పోలీసులు

ముంబై: ముంబై పోలీసులు భారీ మెఫెడ్రిన్ రాకెట్ గుట్టురట్టు చేశారు. అంతర్జాతీయ మార్కెట్‌లో రూ.382 కోట్ల విలువుండే సుమారు 187 కిలోల మెఫెడ్రిన్ అనే మాదకద్రవ్యాన్ని పట్టుకున్నారు. డీసీపీ(జోన్ 10) దత్తా నలవాడే తెలిపిన వివరాలివీ..పశ్చిమ ముంబైలోని సకినక ప్రాంతంలో ఏప్రిల్‌లో 52 గ్రాముల మెఫెడ్రిన్‌ను స్వాధీనం చేసుకుని ఓ వ్యక్తిని అరెస్ట్ చేశారు. అతడిచ్చిన సమాచారంతో మరో ముగ్గుర్ని అరెస్ట్ చేసి, రూ.8 కోట్ల విలువైన 4.53 కిలోల మెఫెడ్రిన్‌ను పట్టుకున్నారు. వీరి ద్వారా సలీం ఇంతియాజ్ షేక్‌ను అరెస్ట్ చేశారు. ఇతడిని వెంటబెట్టుకుని ఈ నెల 26న కర్నాటకలోని మైసూరులోని మెఫెడ్రిన్ ఉత్పత్తి యూనిట్ గుట్టురట్టు చేశారు. అక్కడున్న రూ.320 కోట్ల విలువైన 192 కిలోల మెఫెడ్రిన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ తెలిపారు.

నిత్యం డ్రగ్స్.. రోజంతా మత్తులోనే

ఇరాన్ సుప్రీం నేత ఖమేనీపై మొస్సాద్ వ్యాఖ్యలు

టెల్ అవీవ్: ఇజ్రాయెల్ గూఢచార విభాగం మొస్సాద్ సంబంధ సోషల్ మీడియా ఖాతాలో ఇరాన్ సుప్రీం నేత అయెతొల్లా ఖమేనీ గురించి తీవ్ర వ్యాఖ్యలు వివాదం రేపుతున్నాయి. ఖమేనీ పాలనకు తగిన వ్యక్తి కారని, డ్రగ్స్‌కు బానిసై ఎప్పుడూ మత్తులోనే జోగుతుంటారని ఆరోపించింది. పర్షియన్ భాషలోని ఈ అకౌంట్‌ను @Mossad Spokesman గా గుర్తించారు. ఇది 'మొస్సాద్ ఫార్సి'గా కూడా పేరుతెచ్చుకుంది. అచ్చు మొస్సాద్ అధికార చానెల్ అకౌంట్ మాదిరిగానే కనిపిస్తుంది. ఇరాన్ లక్ష్యంగా ఇందులో పలు వివాదాస్పద వ్యాఖ్యలు ప్రత్యక్షమవుతుంటాయి. ఇరాన్‌కు ఇబ్బంది కలిగించేలా ఆ దేశ ప్రభుత్వ రహస్య సమాచారం వంటివి ఇందులో కనిపిస్తుంటాయి. అంతేకాదు, పలువురు ముఖ్య నేతలు, అధికారుల గురించిన రహస్య క్విజ్ పోటీలను సైతం ఈ అకౌంట్ నిర్వహిస్తుంటుంది. శుక్రవారం @MossadSpokesman ఎక్స్ అకౌంట్‌లో..' రోజులో సగం నిద్రకు, మరో సగం డ్రగ్స్‌కు బానిసై గడిపే వ్యక్తి దేశాన్ని ఎలా నడపగలరు?..నీళ్లు, కరెంటు, జీవితం'అంటూ పేర్కొంది. అయితే, ఇందులో ఖమేనీ పేరును మాత్రం ప్రస్తావించలేదు. ఇరాన్‌లో కనీస మౌలిక సదుపాయాలైన నీళ్లు, విద్యుత్ కొరతలతోపాటు నిత్యం కనిపించే ప్రజాందోళనలను పరోక్షంగా పేర్కొంది. ఈ పోస్టుకు 48 గంటల్లోనే 1.80 లక్షల మంది స్పందించారు. గత నెలలో ఇజ్రాయెల్–ఇరాన్ మధ్య 12 రోజులపాటు కొనసాగిన సంక్షోభం సమయంలో ఈ అకౌంట్‌లో ఇరాన్ నూతన సైనిక కమాండర్ ఎవరో చెప్పాలంటూ సవాల్ విసరగా ఒక వ్యక్తి కచ్చితమైన పేరును వెల్లడించడం విశేషం. ఈ అకౌంట్‌లో గతంలోనూ ఇలాంటి రెచ్చగొట్టే పోస్టులే ఉండేవి. డ్రగ్స్ వాడే వారు నాయకత్వం వహించగలరా అంటూ ప్రశ్నించింది. ఇందులో ప్రత్యేకంగా అయెతొల్లా ఖమేనీ పేరును ప్రస్తావించనప్పటికీ ఆ తీవ్రత, కంటెంట్‌ను బట్టి ఇరాన్ సుప్రీం లీడరే టార్గెట్ అన్న విషయం తేలిగ్గా ఎవరికైనా అర్థమవుతుంది. పర్షియా భాషలో ఉన్న ఈ పోస్టులను ఆటో–ట్రాన్స్‌లేషన్‌తో అందరూ చదవొచ్చు. ఈ అకౌంట్ తమదేనంటూ ఇజ్రాయెల్ అధికారికంగా ఎటువంటి ప్రకటనా చేయలేదు. అయినప్పటికీ ఇరాన్ ప్రజలే లక్ష్యంగా మొస్సాద్ నిర్వహించే మెసేజింగ్ చానెల్‌గానే చెబుతుంటారు.

ఆపరేషన్ రైజింగ్ లయన్ వేళ...

గత నెలలో ఇజ్రాయెల్ ఆపరేషన్ రైజింగ్ లయన్ చేపట్టిన వేళ ఈ అకౌంట్ వచ్చిన ఒక పోస్టు తీవ్ర వివాదానికి కారణమైంది. ఇజ్రాయెల్ చేసిన మొట్టమొదటి దాడిలో ఇరాన్‌కు చెందిన ఘులాం అలీ రషీద్ అనే మిలటరీ కమాండర్ చనిపోయారు. ఆ వెంటనే అలీ షాద్మానీ అనే ఆయన వారసుడు సైతం మృతి చెందారు. ఆయన స్థానంలో కొత్తగా నియమించిన కమాండర్ పేరును ఇరాన్ రహస్యంగా ఉంచింది. ఈ అంశంపై @Mossad Spokesman రెచ్చగొట్టే రీతిలో స్పందించింది. ఆ కమాండర్ ఎవరో తనకు తెలుసునంటూ, కొత్తగా నియమితులైన కమాండర్ పేరును తెలిస్తే చెప్పాలంటూ నెటిజన్లకు క్విజ్ పెట్టింది. 'ఇరాన్ ప్రభుత్వం ఖతమ్ అల్ అన్బియాకు కొత్త కమాండర్‌ను నియమించింది. భద్రత కోసం ఆయన పేరును వెల్లడించలేదు. మాకు అతడెవరో తెలుసు, అతడితో ఉండే వారి పేర్లూ తెలుసు. దురదృష్టవశాత్తూ ఇటువంటి విషయాలను ఇరాన్ ప్రజలకు ప్రభుత్వం తెలియనివ్వడం లేదు. ఆ కొత్త కమాండర్ పేరు తెలిస్తే దయచేసి చెప్పండి'అని కోరింది. దీనికి 2,300 మంది స్పందించారు. ఖమేనీ కుమారుడు మొజ్‌తబా ఖమేనీ తదితర పేర్లను కొందరు ఊహించి చెప్పగా మరికొందరు మాత్రం తిట్టిపోశారు. తీవ్ర హెచ్చరికలు చేశారు. ఇరాన్ సోషల్ మీడియా యూజర్ బెహ్నామ్ గొలిపొర్ మాత్రం కొత్త కమాండర్ పేరు అలీ అబ్దొల్లాహి అలియాబాది అంటూ కరెక్ట్‌గా గెస్ చేశారు. అతడి పేరును ప్రకటించిన మొస్సాద్ అకౌంట్..వ్యక్తిగతంగా తమను కలిసి, బహుమతి అందుకోవాలని కోరింది.

యూపీలోని మరో ఆలయంలో తొక్కిసలాట

ఇద్దరు మృతి, 32 మందికి గాయాలు

బారాబంకీ: ఉత్తరప్రదేశ్‌లోని బారాబంకీ జిల్లాలో ఉన్న ఓ ఆలయంలో చోటుచేసుకున్న తొక్కిసలాటలో ఇద్దరు చనిపోగా 32 మంది క్షతగాత్రులయ్యారు. హైదర్‌గఢ్‌లోని అవ్‌సనేశ్వర్ ఆలయంలో నిర్వహించే జలాభిషేకానికి సోమవారం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వానరాల ఆగడంతో విద్యుత్ తీగ తెగి భక్తులున్న ఆలయ ప్రాంగణంలోని మూడు ఇనుప షెడ్లపై పడింది. కొందరు షాక్‌కు గురికావడంతో భయభ్రాంతులకు గురై తొక్కిసలాటకు దారితీసింది. మొత్తం 32 మంది క్షతగాత్రుల్లో 26 మందిని స్థానిక ఆస్పత్రికి తరలించామని పోలీసులు తెలిపారు. తీవ్ర గాయాలైన ఆరుగురిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉందని చెప్పారు. ఆదివారం హరిద్వార్‌లోని మానసాదేవి ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో 8 మంది చనిపోగా పదుల సంఖ్యలో గాయాలపాలవడం తెల్సిందే.

ఆమిర్ ఖాన్ నివాసానికి ట్రెయినీ ఐపీఎస్‌లు

ముంబై: బాలీవుడ్ నటుడు ఆమిర్ ఖాన్‌ను ట్రెయినీ ఐపీఎస్ అధికారులు కలుసుకోవడం ఆసక్తికరంగా మారింది. ముంబైలోని బాంద్రా ప్రాంతంలో ఉన్న ఆమిర్ నివాసానికి ప్రొబెషనరీ ఐపీఎస్ అధికారులు వెళ్లారు. రక్షణగా మూడు పోలీసు వాహనాలు రాగా ట్రెయినీ ఐపీఎస్‌లున్న బస్సు ఆదివారం ఆమిర్ నివాసం నుంచి బయటకు వస్తున్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరలయ్యాయి. 'ఇది కేవలం మర్యాదపూర్వక సందర్శన. వారంతా ప్రొబేషనరీ ఐపీఎస్ అధికారులు. ఆమిర్ ఖాన్‌ను వారు కలవాలనుకున్నారు'అని ఓ అధికారి తెలిపారు. 'ట్రెయినీ ఐపీఎస్‌లు కొందరు ఆమిర్ ఖాన్‌ను కలవాలనుందని కోరారు. వారికి ఆమిర్ ఖాన్ తన ఇంట్లో ఆతిథ్యమిచ్చారు'అని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. గతంలోనూ పలు బ్యాచ్‌ల ఐపీఎస్‌లు ఆమిర్ ఖాన్‌తో సమావేశమయ్యారు. 1999లో సర్ఫరోష్ సినిమా విడుదల తర్వాత చాలా మంది ఐపీఎస్ ట్రెయినీలు ఆమిర్‌ను కలిశారని ఆ వర్గాలు పేర్కొన్నాయి.

ఇజ్రాయెల్ దాడుల్లో 36 మంది మృతి

డెయిర్ అల్–బలాహ్: ఇజ్రాయెల్ ఆర్మీ గాజా వ్యాప్తంగా సోమవారం జరిపిన వైమానిక దాడుల్లో 36 మంది పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారు. గాజాలో మానవతాసాయం అందించేందుకు వీలుగా ఇజ్రాయెల్ ఆంక్షలను సడలించిన మరునాడే ఈ దారుణం చోటుచేసుకోవడం గమనార్హం. మృతుల్లో నవజాత శిశువు కూడా ఉందని నాస్సెర్ ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. తమ ఆస్పత్రి మార్చురీకి ఏడు మృతదేహాలను తీసుకువచ్చారని సెంట్రల్ గాజాలో ఔదా ఆస్పత్రి తెలిపింది. ఆహార పంపిణీ కేంద్రానికి సమీపంలోనే ఈ ఆస్పత్రి ఉంటుంది. మరో 20 మంది క్షతగాత్రులకు కూడా చికిత్స చేసినట్లు ఈ ఆస్పత్రి వర్గాలు పేర్కొన్నాయి. మువాసి ప్రాంతంపై జరిగిన దాడిలో గర్భవతి, ఆమె బిడ్డ మరో 11 మంది మృతి చెందారు. ఖాన్‌యూనిస్‌లోని రెండంతస్తుల భవనంపై జరిగిన దాడిలో మరో 11 మంది చనిపోయారు. వీరిలో సగం మంది మహిళలు, చిన్నారులేనని నాస్సెర్ ఆస్పత్రి తెలిపింది. గాజాలోని వివిధ ప్రాంతాలపై జరిగిన దాడుల్లో మరో ఐదుగురు మృతి చెందినట్లు ఆరోగ్య విభాగం వెల్లడించింది. గాజాలో మానవతా సాయం అందించేందుకు వీలుగా రోజులో కనీసం 10 గంటలపాటు సైనిక కార్యకలాపాలను నిలిపివేయనున్నట్లు ఆదివారం ఇజ్రాయెల్ ప్రభుత్వం ప్రకటించడం తెల్సిందే.

5 వేల గంజాయి చాక్లెట్లు

- స్వాధీనం చేసుకున్న తమిళనాడు పోలీసులు
- ఏడుగురు బీటెక్ విద్యార్థులు సహా 11 మంది అరెస్ట్

చెన్నై: మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా తమిళనాడులోని చెన్నై పోలీసులు 26న చేపట్టిన భారీ ఆపరేషన్‌లో దిగ్భ్రాంతికర విషయాలు వెలుగు చూశాయి. సుమారు 100 మంది పోలీసులు ఏకకాలంలో 5 అపార్టుమెంట్లు సహా 12 ప్రాంతాల్లో సోదాలు చేపట్టి 5, 250 గంజాయి చాక్లెట్లను పట్టుకున్నారు. ఇందుకు సంబంధించి 11 మందిని అరెస్ట్ చేశారు. వీరిలో ఏడుగురు బీటెక్ విద్యార్థులు కావడం గమనార్హం. ఇంకా, 166 గ్రాముల గంజాయి, అనధికారికంగా నిర్వహిస్తున్న హుక్కా సెంటర్ల నుంచి సంబంధిత సామగ్రిని, అక్రమ పొగాకు ఉత్పత్తుల్ని సీజ్ చేశారు. గంజాయిని విక్రయించేందుకు వాడుతున్న 10 సెల్‌ఫోన్లనూ స్వాధీనం చేసుకున్నామని చెన్నై శివారులోని తాంబరం పోలీసులు తెలిపారు. వీరందరిపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశామన్నారు.గంజాయిని ఎక్కడి నుంచి తెచ్చారు? పంపిణీ నెట్‌వర్క్ వివరాలు..డ్రగ్స్ సిండికేట్‌లో ఎందరున్నారు? వంటి విషయాలను కూపీ లాగుతున్నామని వివరించారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 1,516 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, 318 మందిపై ఎన్‌డీపీఎస్ కింద కేసులు నమోదు చేశామన్నారు.

తమిళనాడులో పరువు హత్య

చెల్లిని ప్రేమించాడని దళిత యువకుడిని చంపిన అన్న

తిరునల్వేలి: తమిళనాడులో పరువు హత్య జరిగింది. తన చెల్లిని ప్రేమిస్తున్నాడని ఆగ్రహించిన సుర్జీత్ అనే వ్యక్తి, కవిన్ అనే దళిత యువకుడిని నరికి చంపాడు. ఈ ఘటన తిరునల్వేలిలో ఆదివారం జరిగింది. అనంతరం సోమవారం పోలీసుల ఎదుట లొంగిపోయాడు. మృతుడు 25 ఏళ్ల కవిన్ తూత్తుకుడి. ఐటీలో ఉద్యోగం చేస్తున్నాడు. సుర్జీత్ సోదరిని చాలా కాలంగా ప్రేమిస్తున్నాడు. కులాలు వేరుకావడంతో యువతి కుటుంబం కవిన్‌తో పెళ్లికి ఒప్పుకోలేదు. అయినా, కెవిన్ ఆదివారం ఆమెను కలవడానికి వెళ్ళాడు. కేటీసీ ఆసుపత్రి బయట యువతికోసం ఎదురుచూస్తుండగా ఆమె సోదరుడు సుర్జీత్ వచ్చి మాట్లాడాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. వెంటనే కొడవలి తీసిన సుర్జీత్.. ఆసుపత్రికి కేవలం 200 మీటర్ల దూరంలో కవిన్‌ను నరికి చంపాడు. వెంటనే అక్కడి నుంచి పారిపోయాడు. తరువాత పాలయంకోట్టై పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు. పోలీసులు కవిన్ మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్ట్‌మార్టం పరీక్ష కోసం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి పంపారు. అయితే, తమకు న్యాయం జరిగేవరకూ మృతదేహాన్ని తీసుకోబోమంటూ కవిన్ కుటుంబం, బంధువులు ఆస్పత్రి ఎదుట నిరసన చేపట్టారు. సుర్జీత్‌పైనే కాకుండా, పోలీసు బలగాల్లో పనిచేస్తున్న అతని తండ్రి శరవణన్, తల్లి కృష్ణకుమారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

డాగ్ బాబు సన్నాఫ్ కుత్తా బాబు!

బిహార్‌లో కుక్కకు రెసిడెన్స్ సర్టిఫికెట్

పట్నా: బిహార్‌లో రెవెన్యూ అధికారులు ఓ శునకానికి రెసిడెన్స్ సర్టిఫికెట్ జారీ చేశారు. డాగ్ బాబు పేరిట ఈ నివాస ధృవీకరణ పత్రం జారీ అయింది. ఇందులో అభ్యర్థి పేరు డాగ్‌బాబు అని, అతని తండ్రి పేరు కుత్తా బాబు, తల్లి పేరు కుత్తియా దేవి అని రాసి ఉంది. వీళ్ల ఇంటి చిరునామా కాలమ్‌లో 'మొహల్లా కౌలిచక్, వార్డు నంబర్–15, నగర పరిషత్, మసౌరీ పట్టణం''అని రాసి ఉంది. గోల్డెన్ రిట్రీవర్ జాతి వీధి శునకం ఫొటోతో ఈ ధృవపత్రం జారీచేశారు. ఈ రెసిడెన్స్ సర్టిఫికేట్‌పై అక్కడి రెవెన్యూ అధికారి మురారీ చౌహాన్ డిజిటల్ సంతకం ఉంది. ఇది 2025 జూలై 24న ఈ సర్టిఫికేట్‌ను జారీచేశారు. సంబంధిత ప్రభుత్వ పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో ప్రత్యక్షమవడంతో ఈ అంశం ఇప్పుడు బిహార్‌లో చర్చనీయాంశమైంది. ఢిల్లీకి చెందిన ఒక మహిళ పత్రాలకు ఈ సర్టిఫికేట్ జారీ కోసం దుర్వినియోగం చేసినట్లు తెలుస్తోంది. బిహార్‌లో ఓటర్ల జాబితా సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) నేపథ్యంలో శునకానికీ రెసిడెన్స్ సర్టిఫికెట్ జారీకావడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. ఎస్ఐఆర్ ఆమోదం పొందుతున్న సర్టిఫికెట్లలో ఇలాంటి వింతలు ఎన్నో ప్రత్యక్షమవుతున్నాయని స్వరాజ్ ఇండియా నేత యోగేంద్ర యాదవ్ సోషల్ మీడియా వేదికగా విమర్శించారు. 'మీరే చూడండి. జూలై 24వ తేదీన ఒక శునకానికి బిహార్‌లో నివాస ధ్రువీకరణ పత్రం జారీ చేశారు. రాష్ట్రంలో ఎస్ఐఆర్ ఆమోదం పొందుతున్న సర్టిఫికెట్లలో చాలా వరకు ఇలాంటివి ఉన్నాయి. అన్ని రకాల డాక్యుమెంట్లు ఉన్న ఓటర్లకు గతంలో జారీ అయిన ఆధార్, రేషన్ కార్డులు నకిలీవని అధికారులు ఓవైపు చెబుతూనే మరోవైపు ఇలా శునకాలకు నివాస ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తున్నారు''అని విమర్శకులు సంబంధిత శునకం సర్టిఫికెట్‌ను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్‌చేశారు. దీంతో ఈ విషయం ఇప్పుడు వైరల్‌గా మారింది. సర్టిఫికెట్ జారీపై అంతటి విమర్శలు రావడంతో పట్నా జిల్లా మేజిస్ట్రేట్ వెంటనే స్పందించారు. 'మసౌరీ జోన్‌లో డాగ్ బాబు పేరుతో నివాస ధ్రువీకరణ పత్రం జారీ చేసిన అధికారిపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేస్తున్నాం. దోషులైన ఉద్యోగులు, అధికారులపై శాఖాపరమైన, క్రమశిక్షణా చర్యలు తీసుకుంటాం''అని జిల్లా మేజిస్ట్రేట్ తన 'ఎక్స్'ఖాతాలో పోస్ట్ చేశారు.

'ఆర్థిక ప్రజాస్వామ్యం' దేని ద్వారా సాధ్యమవుతుంది?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ

ప్రాథమిక హక్కులు, ఆదేశిక నియమాలు

1. ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాల విరోధానికి కారణం?
   ఎ) రాజకీయ శూన్యాన్ని భర్తీ చేయడానికి న్యాయశాఖ ఆరాటం
   బి) లిఖిత రాజ్యాంగం
   సి) సాంఘిక, ఆర్థిక అసమానతలు
   డి) ముందుచూపు ఉన్న నాయకులు లేకపోవడం
2. ఆదేశిక సూత్రాలకు సంబంధించి ఆర్టికల్ 41లో లేని హక్కు ఏది?
   ఎ) పని హక్కు బి) ఆశ్రయ హక్కు
   సి) విద్యాహక్కు
   డి) ప్రభుత్వ సహాయ హక్కు
3. 'ఆదేశిక సూత్రాల అమలును ఏ ప్రభుత్వమైనా విస్మరిస్తే, వారు ఎన్నికల కాలంలో ప్రజల ముందు తప్పనిసరిగా జవాబుదారీయై నిలవాల్సి ఉంటుంది' అని వ్యాఖ్యానించిందెవరు?
   ఎ) జవహర్‌లాల్ నెహ్రూ
   బి) డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్
   సి) ఐవర్ జెన్నింగ్స్
   డి) వల్లభ్ భాయ్ పటేల్
4. మహాత్మాగాంధీ తత్వాన్ని ప్రతిబింబించే ఆదేశిక నియమాలు ఏవి?
   ఎ) సమాన పనికి సమాన వేతనం
   బి) ఉచిత న్యాయ సలహా
   సి) గోవధ నిషేధం
   డి) చారిత్రక కట్టడాల పరిరక్షణ
5. ప్రాథమిక విధుల కోసం రాజ్యాంగంలో ప్రత్యేక అధ్యాయం ఉండాలని సూచించిన సంఘం?
   ఎ) సర్కారియా బి) రాజ్‌మన్నార్
   సి) ఏఆర్‌సీ డి) స్వరణ్ సింగ్
6. ఆదేశిక నియమాలకు సంబంధించి కింది వాటిలో సరైనవి ఏవి?
   ఎ) వీటికి న్యాయ సంరక్షణ లేదు
   బి) ప్రభుత్వానికి మార్గదర్శక సూత్రాలు
   సి) వీటికి మరో పేరు న్యాయ సంరక్షణ లేని హక్కులు
   డి) పైవన్నీ
7. ఆదేశిక సూత్రాల అమల్లో ప్రస్తుతం ఉన్న ప్రతిబంధకాలు ఏవి?
   ఎ) ప్రపంచీకరణ బి) ఆర్థిక సరళీకరణ
   సి) ప్రైవేటీకరణ డి) పైవన్నీ
8. కింది వాటిలో కొత్తగా చేర్చిన ఆదేశికాలు ఏవి?
   ఎ) ఉచిత న్యాయ సలహా
   బి) పర్యావరణ పరిరక్షణ
   సి) పరిశ్రమ నిర్వహణలో కార్మికులకు భాగస్వామ్యం
   డి) పైవన్నీ
9. 'ప్రకరణ 39(బి, సి) నిర్దేశిక నియమాల అమలు కోసం చేసే చట్టాలు ప్రాథమిక హక్కులకు విరుద్ధమైనప్పటికీ చెల్లుబాటు అవుతాయి' అని ఏ రాజ్యాంగ సవరణ ద్వారా మార్పు చేశారు?
   ఎ) 24 బి) 23 సి) 42 డి) 44
10. విద్యాసంస్థల్లో ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించేదుకు ఏ అంశాన్ని ప్రాతిపదికగా తీసుకుంటారు?
    ఎ) కులం బి) పేదరికం
    సి) గ్రామీణ వాతావరణం
    డి) మతం
11. ప్రకరణ 19(1) ప్రకారం నిర్వహించే హిక్లిన్ టెస్ట్ (Hicklin Test) దేనికి సంబంధించింది?
    ఎ) సభ్యత, నైతికత బి) ప్రాణ నష్టం
    సి) భారత సమైక్యత డి) ఏదీకాదు
12. ప్రభుత్వ పాలనకు పాటించాల్సిన ముఖ్యమైన అంశాలేవి?
    ఎ) ప్రాథమిక హక్కులు
    బి) మానవ హక్కులు
    సి) శాసన సూత్రాలు
    డి) ఆదేశిక సూత్రాలు
13. ఆదేశిక సూత్రాల ముఖ్యోద్దేశం ఏమిటి?
    ఎ) నిరుద్యోగ నిర్మూలన
    బి) సంక్షేమ రాజ్యస్థాపన
    సి) పారిశ్రామికీకరణ
    డి) ఆర్థిక పురోభివృద్ధి
14. గ్రామ పంచాయతీల ఏర్పాటును ఎన్నో ఆర్టికల్ సూచిస్తోంది?
    ఎ) 40 బి) 41 సి) 42 డి) 43
15. 'ఆదేశిక సూత్రాల అమలు కోసం ప్రాథమిక హక్కులను పరిమితం చేయరాదు' అని ఏ కేసులో తీర్పు ఇచ్చారు?
    ఎ) గోలక్‌నాథ్ కేసు
    బి) కేశవానంద భారతీ కేసు
    సి) మినర్వా మిల్స్ కేసు
    డి) ఏదీకాదు
16. కింది వాటిలో ఉమ్మడి పౌరస్మృతిని తెలిపే నిబంధన ఏది?
    ఎ) 44 బి) 45 సి) 46 డి) 47
17. జతపరచండి.
    1. ఆర్టికల్ 40
    2. ఆర్టికల్ 41
    3. ఆర్టికల్ 42
    4. ఆర్టికల్ 43
    i. కార్మికులకు కనీస వేతనాలు
    ii. పని హక్కు
    iii. గ్రామ పంచాయతీల నిర్వహణ
    iv. పని చేయడానికి తగిన పరిస్థితులు, స్త్రీలకు ప్రసూతి సౌకర్యాల కల్పన
    ఎ) 1-iii, 2-ii, 3-iv, 4-i
    బి) 1-i, 2-ii, 3-iv, 4-iii
    సి) 1-ii, 2-i, 3-iv, 4-iii
    డి) 1-ii, 2-iii, 3-iv, 4-i
18. ఆదేశిక సూత్రాలు అంటే ఏమిటి?
    ఎ) ప్రభుత్వాలకు రాజ్యాంగం ఇచ్చిన ఆదేశాలు
    బి) రాష్ట్రాలకు కేంద్రం జారీ చేసే ఆదేశాలు
    సి) కేంద్ర, రాష్ట్ర సంబంధాలను నిర్వహించే సూత్రాలు
    డి) న్యాయ సాధనలను నిర్వహించే సూత్రాలు
19. ప్రాథమిక హక్కులకు, ఆదేశిక సూత్రాలకు మధ్య తేడా ఏమిటి?
    ఎ) ప్రాథమిక హక్కులు న్యాయ సాధ్యమైనవి, ఆదేశిక సూత్రాలు కావు
    బి) ఆదేశిక సూత్రాలు న్యాయ సాధ్యమైనవి, ప్రాథమిక హక్కులు కావు
    సి) ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు రెండూ న్యాయ సాధ్యమైనవి.
    డి) పైవేవీ కావు
20. 'ఆదేశ సూత్రాలు ఒక వాస్తవమైన మానసిక ప్రవృత్తుల చెత్తకుండీ' అని వ్యాఖ్యానించినవారెవరు?
    ఎ) అల్లాడి కృష్ణస్వామి అయ్యర్
    బి) టి.టి. కృష్ణమాచారి
    సి) కె.ఎం. మున్షీ
    డి) ఎన్. గోపాలస్వామి అయ్యంగార్
21. 'శాసన వ్యవస్థకు నిర్దేశిక నియమాలు కరదీపం లాంటివి' అని అభిప్రాయపడినవారెవరు?
    ఎ) ఎం.సి. చాగ్లా బి) ఎం.సి. సెతల్వాడ్
    సి) కె.టి. షా
    డి) డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్
22. కింది వాటిలో భారత రాజ్యాంగంలోని లక్ష్యాల సాధనకు తోడ్పడినవి ఏవి?
    ఎ) ప్రాథమిక హక్కులు
    బి) నిర్దేశిక నియమాలు
    సి) ప్రాథమిక విధులు డి) పైవేవీకాదు
23. కింది వాటిలో సరైంది.
    1. పురుషులకు, మహిళలకు సమాన పని, సమాన వేతనాన్ని ప్రోత్సహించేందుకు రాజ్యాంగంలో ఎలాంటి నిబంధన లేదు
    2. వెనుకబడిన తరగతులను రాజ్యాంగం నిర్వచించలేదు
    ఎ) 1 మాత్రమే బి) 2 మాత్రమే
    సి) 1, 2 సరైనవే డి) ఏదీకాదు
24. రాజ్యాంగాన్ని అనుసరించి సంఘాలు ఏర్పాటు చేసుకునే స్వేచ్ఛను ఏ విషయంలో నియంత్రించవచ్చు?
    ఎ) ప్రజా భద్రత
    బి) విదేశాల్లో స్నేహ సంబంధాల నిర్వహణ దృష్ట్యా
    సి) కోర్టు ధిక్కరణ విషయంలో
    డి) పైవన్నీ



25. 'ఆర్థిక ప్రజాస్వామ్యం' దేని ద్వారా సాధ్యమవుతుంది?
    ఎ) ప్రాథమిక హక్కులు బి) ప్రవేశిక
    సి) రాష్ట్ర విధానానికి సంబంధించిన ఆదేశిక సూత్రాలు
    డి) కేంద్ర జాబితా
26. ఆదేశిక సూత్రాలకు ప్రాథమిక హక్కులపై ఆధిక్యతను కల్పించేందుకు ఉద్దేశించిన రాజ్యాంగ సవరణ?
    ఎ) 25 బి) 42 సి) 44 డి) ఎ, బి
27. ప్రపంచీకరణ ఆర్థిక సరళీకరణ నేపథ్యంలో ప్రభావితమవుతున్న ఆదేశిక సూత్రాల స్వభావం ఏది?
    ఎ) సంక్షేమ స్వభావం
    బి) గాంధేయ స్వభావం
    సి) ఉదార స్వభావం
    డి) పైవన్నీ
28. కింది వాటిలో ఆదేశికాలకు సంబంధించిన వ్యాఖ్యల్లో సరైన జత ఏది?
    ఎ) ఆదేశికాలు నూతన పోకడలు - డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్
    బి) శుష్క వాగ్దానాలు - ఐవర్ జెన్నింగ్స్
    సి) రాజ్యాంగ లక్ష్యాల మేనిఫెస్టో- కె.సి. వేర్
    డి) పైవన్నీ
29. ఆదేశిక నియమాలు...
    ఎ) పౌరుల బాధ్యతలను తెలుపుతాయి
    బి) పౌరుల హక్కులను పరిరక్షిస్తాయి
    సి) న్యాయ పాలనలో ప్రాతిపదికలు
    డి) పరిపాలనలో మార్గదర్శకాలు
30. 'సంక్షేమ రాజ్య స్వభావం' అనే భావనను ఏ భాగంలో స్పష్టీకరించారు?
    ఎ) ప్రవేశిక బి) ప్రాథమిక హక్కులు
    సి) ఆదేశిక నియమాలు
    డి) ప్రాథమిక విధులు
31. కింది వాటిలో సరైంది ఏది?
    ఎ) ఆదేశిక సూత్రాలకు ప్రాథమిక హక్కులకు సంబంధం లేదు
    బి) ఆదేశిక సూత్రాలు ప్రాథమిక హక్కుల కంటే గొప్పవి
    సి) ప్రాథమిక హక్కులు ఆదేశిక సూత్రాల కంటే గొప్పవి
    డి) పరస్పర పోషకాలు
32. ఆదేశిక నియమాలకు కింద పేర్కొన్న ఏ లక్షణాన్ని ఆపాదించలేము?
    ఎ) న్యాయ సంరక్షణ
    బి) వ్యక్తి శ్రేయస్సు
    సి) స్వామ్యవాద తరహా లక్షణం
    డి) పైవన్నీ
33. ఆదేశిక నియమాలకు న్యాయ సంరక్షణ కల్పించలేదు. కారణమేంటి?
    ఎ) అమలు చేయడం సాధ్యం కాకపోవడం
    బి) అంత ప్రాముఖ్యమైనవి కాకపోవడం
    సి) ప్రాథమిక హక్కులకు న్యాయ సంరక్షణ ఉండటం
    డి) పైవన్నీ
34. కింది వాటిలో ఏ రాజ్యాంగ సవరణ ద్వారా కొత్త ఆదేశికాలు చేర్చలేదు?
    ఎ) 24వ సవరణ బి) 42వ సవరణ
    సి) 97వ సవరణ డి) పైవేవీ కాదు
35. ప్రాథమిక హక్కులకు, ఆదేశిక నియమాలకు మధ్య వివాదాన్ని ఎలా పేర్కొంటారు?
    ఎ) శాసనశాఖ -న్యాయశాఖ మధ్య వివాదం
    బి) కార్యనిర్వాహక శాఖ - న్యాయశాఖ మధ్య వివాదం
    సి) న్యాయశాఖ - ప్రజల మధ్య వివాదం
    డి) పైవన్నీ
36. కింది వాటిలో సరికాని జత ఏది?
    ఎ) ప్రాథమిక హక్కులు - ప్రభుత్వంపై పరిమితులు
    బి) ఆదేశిక నియమాలు - ప్రభుత్వ బాధ్యతలు
    సి) ప్రాథమిక విధులు - పౌరుల బాధ్యతలు
    డి) పైవేవీ కాదు
37. కింది వాటిలో సరైనవి ఏవి?
    1. ఆదేశిక నియమాల అమలు కోసం న్యాయస్థానాల జోక్యాన్ని కోరలేము
    2. వీటికి న్యాయ సంరక్షణ లేదు
    3. ఇవి సవరణలకు అతీతం
    4. ఇప్పటి వరకు ఒక్క ఆదేశిక నియమాన్ని కూడా రాజ్యాంగం నుంచి తొలగించలేదు
    ఎ) 1, 2, 3, 4 బి) 1, 2, 3
    సి) 1, 2, 4 డి) 2, 3, 4
38. కింద పేర్కొన్న ఏ ఆదేశిక సూత్రాలను సామ్యవాదేతర అంశాలుగా పరిగణించవచ్చు?
    ఎ) స్త్రీ, పురుషులకు సమాన జీవన అవసరాలు
    బి) మానవీయ పని ప్రదేశాలు
    సి) ఉచిత న్యాయ సలహా
    డి) యువతను దోపిడీ నుంచి రక్షించడం
39. ప్రాథమిక హక్కులు, ఆదేశిక నియమాల మధ్య ప్రస్తుతం ఎలాంటి సంబంధం ఉంది?
    ఎ) ప్రాథమిక హక్కులను ప్రభావితం చేసేలా ఏ ఆదేశిక నియమం అమలు చేసినప్పటికీ అవి చెల్లుబాటు కావు
    బి) సమానత్వ హక్కును ఉల్లంఘించేలా ఆదేశిక నియమాలు అమలు చేయరాదు
    సి) ఆదేశిక నియమాల్లో ప్రకరణ 39 (ఎ, బి) అమలు చేస్తూ చేసిన చట్టాలు ప్రాథమిక హక్కులకు విరుద్ధమైనప్పటికీ చెల్లుబాటు అవుతాయి
    డి) అన్ని విషయాల్లో ప్రాథమిక హక్కులదే పైచేయి అవుతుంది.
40. ఇంతవరకు అమలు కాని ఏకైక ఆదేశిక నియమం?
    ఎ) ప్రకరణ 44 బి) ప్రకరణ 49
    సి) ప్రకరణ 43 డి) పైవేవీకాదు

సమాధానాలు

1) ఎ; 2) బి; 3) బి; 4) సి; 5) డి; 6) డి; 7) డి; 8) డి; 9) ఎ; 10) ఎ; 11) ఎ; 12) డి; 13) బి; 14) ఎ; 15) ఎ; 16) ఎ; 17) ఎ; 18) ఎ; 19) ఎ; 20) బి; 21) బి; 22) బి; 23) డి; 24) డి; 25) సి; 26) బి; 27) ఎ; 28) సి; 29) డి; 30) సి; 31) డి; 32) ఎ; 33) ఎ; 34) డి; 35) ఎ; 36) డి; 37) సి; 38) సి; 39) సి; 40) ఎ.

రేచీకటి నివారణకు ఉపయోగించే కటకం?

ఇంద్రధనస్సు ఎల్లప్పుడూ సూర్యుడికి అభిముఖంగా ఏర్పడుతుంది. ఇందులో ఏడు వర్ణాలు ఉంటాయి. వీటిలో ఒకటైన ఇండిగో రంగును మనం చూడలేం. ఎగురుతున్న విమానంలోని పైలట్‌కు సంపూర్ణంగా గోళాకారంలో ఉన్న ఇంద్రధనస్సు కనిపిస్తుంది. ఒక వ్యక్తి వెనుక భాగం నుంచి వస్తున్న సూర్యకిరణాలు ఎదురుగా ఉన్న నీటి తుంపరలపై 42° కోణంతో పతనమైనప్పుడు కాంతి విశ్లేషణం చెందుతుంది. కాంతి విశ్లేషణం, సంపూర్ణాంతర పరావర్తనం, వక్రీభవన ధర్మాల ఆధారంగా అర్ధగోళాకారంలో ఇంద్రధనస్సు ఏర్పడుతుంది.

లేజర్ కిరణాలు

లేజర్ కిరణాలను ఉత్పత్తి చేయడానికి కావాల్సిన సూత్రాన్ని 1954లో సీహెచ్ టౌన్స్ అనే శాస్త్రవేత్త ప్రతిపాదించారు. దీని ఆధారంగా 1960లో టైడర్ మెమిన్ అనే శాస్త్రవేత్త తొలిసారిగా లేజర్ కిరణాలను ఉత్పత్తి చేశారు. వీటిని ఘన, ద్రవ, వాయు పదార్థాల నుంచి ఉత్పత్తి చేయవచ్చు. రూబీ స్ఫటికాన్ని ఉపయోగించి లేజర్ కిరణాలను ఉత్పత్తి చేశారు.

జడవాయువులైన హీలియం, నియాన్‌లను ఉపయోగించి హవిజవాన్ అనే అమెరికా శాస్త్రవేత్త లేజర్ కిరణాలను ఉత్పత్తి చేశారు. ఘన పదార్థాలను ఉపయోగించి ఉత్పత్తి చేసిన లేజర్ కిరణాల కంటే జడవాయువును ఉపయోగించి ఉత్పత్తి చేసిన లేజర్ కిరణాల శక్తి ఎక్కువ.

లక్షణాలు

సంబద్ధత: ఒక పదార్థం నుంచి ఉత్పత్తి చేసిన లేజర్ కిరణాల కంపన పరిమితి, తరంగదైర్ఘ్యం సమానంగా ఉంటాయి. ఈ లక్షణాలను సంబద్ధత అంటారు.

దిశానియత: ఒక పదార్థం నుంచి ఉత్పత్తి చేసిన లేజర్ కిరణం అత్యధిక దూరం ఒకే దిశలో ప్రయాణిస్తుంది. ఈ లక్షణాన్నే దిశానియత అంటారు.

ఏకవర్ణీయత: ఒక పదార్థం నుంచి ఉత్పత్తి చేసిన లేజర్ కిరణాల తరంగదైర్ఘ్యం ఎల్లప్పుడూ ఒకే విధంగా ఉండటం వల్ల ఒకే వర్ణాన్ని కలిగి ఉంటాయి. దీన్ని ఏకవర్ణీయత అంటారు.

తీవ్రత: లేజర్ కిరణాల తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

అనువర్తనాలు: లేజర్ కిరణాల శక్తిని పెంచుతూ, తగ్గిస్తూ అనేక అవసరాలకు ఉపయోగిస్తారు. ముఖ్య అనువర్తనాలు..

- భూమి నుంచి గ్రహాలు, ఉపగ్రహాల దూరాన్ని కచ్చితంగా లెక్కించడానికి లేజర్ కిరణాలను ఉపయోగిస్తారు.
- భూమి ఆత్మభ్రమణ వేగాన్ని లెక్కించడానికి ఉపయోగిస్తారు.
- ఈ కిరణాల సహాయంతో భూమి చుట్టూ పరిభ్రమిస్తున్న కృత్రిమ ఉపగ్రహాల కక్ష్య, ఎత్తును తెలుసుకోవచ్చు.
- ఘన పదార్థంలోని అణువుల సంఖ్యను లెక్కించడానికి వినియోగిస్తారు.
- అత్యంత దృఢమైన వజ్రం, ఉక్కు తదితర పదార్థాలను కోయడానికి, వాటికి రంధ్రాలు చేయడానికి లేజర్‌ను వినియోగిస్తారు.
- హైడ్రోజన్ బాంబులను విస్ఫోటం చెందించడానికి ఈ కిరణాలు ఉపయోగిస్తారు.
- లేజర్ కిరణాలను ఉపయోగించి పుప్పొడి రేణువుల కదలికలను పరిశీలించవచ్చు.
- సాంస్కృతిక కార్యక్రమాల్లో వాడతారు.
- స్పష్టమైన ప్రింటింగ్, జిరాక్స్ కోసం లేజర్ వినియోగిస్తారు.
- లక్ష్యాలను కచ్చితంగా గురిపెట్టడానికి, యుద్ధ రంగంలో శత్రువులను సంహరించడానికి వీటిని వాడతారు.
- వాహనాల వేగాన్ని లెక్కించే స్పీడ్ గన్‌లో లేజర్‌ను ఉపయోగిస్తారు.
- హాలోగ్రఫీ విధానంలో వాడతారు.
- ఆప్టికల్ ఫైబర్ ద్వారా సమాచార ప్రసారం కోసం వినియోగిస్తారు.
- వైద్యరంగంలో ఎండోస్కోపి, లాప్రోస్కోపి విధానంలో వాడతారు.
- లేజర్ కిరణాలను ఉపయోగించి రెటీనాపై ఏర్పడిన పొరను తొలగించవచ్చు.
- దంతాల చికిత్సలో ఉపయోగిస్తారు.
- మెదడులో ఏర్పడిన కణితులను తొలగించడానికి ఉపయోగిస్తారు.
- గుండె, ఊపిరితిత్తులు, పేగులకు సంబంధించిన వ్యాధులను నయం చేయడానికి వినియోగిస్తారు.
- సీడీ, డీవీడీల్లో సమాచారాన్ని నిల్వ చేసేందుకు లేజర్‌ను ఉపయోగిస్తారు.
- క్షిపణుల్లో మార్గనిర్దేశిత కిరణాలుగా, బార్ కోడ్‌ను ముద్రించడానికి, చదవడానికి లేజర్‌ను ఉపయోగిస్తారు.



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

ఫిజిక్స్

- లేజర్ సాయంతో పురాతన కట్టడాలు, విగ్రహాలను శుభ్రపరుస్తారు.
- వాతావరణంలోని వివిధ పొరల మధ్య ఉన్న కాలుష్య గాఢతను లెక్కిస్తారు.
- లేజర్ కిరణాలను ఉపయోగించే పద్ధతిని Lidar (లైట్ డిటెక్షన్ అండ్ రేంజింగ్) అంటారు.

గమనిక: లేజర్ కిరణాల ధర్మాలను అధ్యయనం చేసి, వాటిని ఉత్పత్తి చేయడానికి భారత అణుశక్తి సంఘం రాజా రామన్న సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీని ఏర్పాటు చేసింది. ఇది మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో ఉంది.

వర్ణపటం

- దృశ్య వర్ణపటంలోని వివిధ వర్ణాల తరంగ దైర్ఘ్యాన్ని కొలవడానికి వర్ణపట మాపకం (స్పెక్ట్రోమీటర్) ఉపయోగిస్తారు.
- దృశ్య వర్ణపటంలోని ఇండిగో రంగును మానవ కన్ను గుర్తించలేదు. ఊదారంగు వల్ల కంటిలోని రెటీనా దెబ్బతింటుంది. ఈ రెండు రంగులను మినహాయిస్తే మిగతా అయిదు రంగుల్లో(BGYOR)ని పసుపు వర్ణాన్ని 'మాధ్యమిక రంగు' అంటారు.
- వక్రీభవన గుణకం కాంతి తరంగదైర్ఘ్యానికి విలోమానుపాతంలో ఉంటుంది.

$$\mu \propto \frac{1}{\lambda}$$

కాబట్టి దృశ్య వర్ణపటంలో తక్కువ తరంగ దైర్ఘ్యం ఉండే ఊదారంగు వక్రీభవన గుణకం ఎక్కువ. తరంగదైర్ఘ్యం ఎక్కువగా ఉన్న ఎరుపు రంగు వక్రీభవనం తక్కువ.

- గాజు పలక ద్వారా చొచ్చుకెళుతున్న కాంతి కిరణాల వేగం వాటి తరంగదైర్ఘ్యానికి అనులోమానుపాతంలో ఉంటుంది. కాంతి గాజు ద్వారా ప్రయాణిస్తున్నప్పుడు VIBGYORలోని ఊదారంగు వేగం తక్కువగా, ఎరుపు రంగు వేగం ఎక్కువగా ఉంటుంది. కానీ శూన్యంలో లేదా గాలిలో ఈ ఏడు రంగుల వేగం కాంతి వేగానికి సమానం.
- కాంతి విశ్లేషణంలో ఏర్పడిన వివిధ వర్ణాల విచలనం తరంగదైర్ఘ్యానికి విలోమానుపాతంలో ఉంటుంది. కాబట్టి తరంగదైర్ఘ్యం తక్కువగా ఉన్న ఊదారంగు ఎక్కువగా విచలనం చెందుతుంది. రుజుమార్గాన్ని వదిలి వంగి ప్రయాణించడమే విచలనం.
- ఎరుపు రంగుకు తరంగదైర్ఘ్యం ఎక్కువగా, విచలనం తక్కువగా ఉండటం వల్ల ఇది దాదాపు రుజుమార్గంలో ప్రయాణిస్తుంది. కాబట్టి ఎరుపు రంగును ఎక్కువ దూరం నుంచి కూడా స్పష్టంగా చూడవచ్చు. అందువల్ల ప్రమాదాల నివారణ కోసం ఉపయోగించే సంకేతాలను సూచించడానికి ఎరుపు రంగును ఉపయోగిస్తారు.
- క్వాంటం సిద్ధాంతం ప్రకారం $\left(E = \frac{hc}{\lambda}\right)$ తరంగదైర్ఘ్యం తక్కువగా ఉన్న ఊదా రంగు శక్తి ఎక్కువగా, తరంగదైర్ఘ్యం ఎక్కువగా ఉన్న ఎరుపు రంగు శక్తి తక్కువగా ఉంటుంది.
- చీకటి గదిలో ఫొటోగ్రాఫిక్ ఫిల్మ్ డెవలప్ చేసే సమయంలో కనీస కాంతి కోసం ఎరుపు రంగు బల్బును ఉపయోగిస్తారు.

గమనిక: ఫొటోగ్రాఫిక్ ఫిల్మ్‌లను డెవలప్ చేయడానికి హైపో ద్రావణం (సోడియం థియోసల్ఫేట్) ఉపయోగిస్తారు.

- ఆకుపచ్చ రంగు తరంగదైర్ఘ్యం 5500 Å. ఈ తరంగదైర్ఘ్యం వల్ల ఆకుపచ్చ రంగుకు కొంత శక్తి లభిస్తుంది. అందువల్ల ఈ వర్ణం మన కంటిని చేరినప్పుడు ఒక రకమైన మానసిక ఉల్లాసాన్ని పొందుతాం.

వర్ణాలు - రకాలు:

రంగులు మూడు రకాలు. అవి:
1) ప్రాథమిక రంగులు
2) గౌణ రంగులు
3) సంపూరక రంగులు

ప్రాథమిక రంగులు: కాంతి విశ్లేషణంలో ఏర్పడిన ఏడు రంగుల్లో నీలం, ఎరుపు, ఆకుపచ్చ రంగులను ప్రాథమిక వర్ణాలు అంటారు.

గౌణ రంగులు: ప్రాథమిక రంగులు ఒకదానితో మరొకటి సమపాళ్లలో కలిస్తే ఏర్పడిన ఫలిత రంగును గౌణ వర్ణం అంటారు.

- ప్రతి ప్రాథమిక రంగు తన ద్వారా చొచ్చుకొని వెళుతున్న ఇతర ప్రాథమిక రంగులు లేదా గౌణ రంగులను పూర్తిగా శోషణం చేసుకుంటుంది. కాబట్టి మన కంటికి ఎలాంటి కాంతి చేరదు. ఫలితంగా వచ్చే రంగు నల్లగా ఉన్నట్లు కనిపిస్తుంది.

ఉదాహరణలు:

i) తెల్లటి సూర్యకిరణాల సమక్షంలో గులాబీ పుష్పం ఎరుపు రంగులో కనిపిస్తుంది. అదే పుష్పాన్ని ఆకుపచ్చ రంగు గాజు పలక ద్వారా పరిశీలిస్తే నలుపు రంగులో కనిపిస్తుంది.
ii) ఉదయించే, అస్తమించే సూర్యబింబం ఎరుపు రంగులో ఉంటుంది. దీన్ని ఆకుపచ్చ రంగు గాజు పలక ద్వారా చూస్తే నలుపు రంగులో కనిపిస్తుంది.
iii) ఆకుపచ్చ రంగు కళ్లద్దాలు ధరించిన వ్యక్తి ట్రాఫిక్ సిగ్నళ్లను పరిశీలిస్తే.. అవి ఆకుపచ్చ, నలుపు రంగుల్లో ఏకాంతరంగా మారుతున్నట్లు కనిపిస్తాయి.
iv) ఎరుపు రంగు గాజుపలక ద్వారా ఎర్రని లేదా తెల్లని వస్తువులను చూసినప్పుడు అవి ఎరుపు రంగులో కనిపిస్తాయి.

సంపూరక రంగులు: రెండు లేదా అంతకంటే ఎక్కువ రంగులు ఒకదానితో మరొకటి కలవడం వల్ల తెలుపు రంగు ఏర్పడితే వాటిని సంపూరక వర్ణాలు అంటారు.

ప్రాథమిక రంగులు ఒకదానితో మరొకటి సమపాళ్లలో కలిసినప్పుడు తెలుపు రంగు ఏర్పడటం దీనికి ఉదాహరణ.

ఎరుపు + నీలం + ఆకుపచ్చ = తెలుపు

- ప్రతి ప్రాథమిక రంగు దాని వ్యతిరేక గౌణ రంగుతో కలిసినప్పుడు తెలుపు రంగు ఏర్పడుతుంది.

మాదిరి ప్రశ్నలు

1. పోలరాయిడ్ కళ్లద్దాలు పనిచేయడంలో ఇమిడి ఉన్న ధర్మం?
   1) ధ్రువణం 2) వివర్తనం
   3) వక్రీభవనం
   4) పరిక్షేపణం
2. కిందివాటిలో ఏ ఖగోళ వస్తువుపై కాంతి పరిక్షేపణం జరగదు?
   1) అంగారకుడు 2) శని
   3) టైటాన్
   4) చంద్రుడు
3. స్పష్టదృష్టి కనిష్ఠ దూరం విలువ?
   1) 25 మీ. 2) 25 సెం.మీ.
   3) 23 మి.మీ. 4) 1 మీ.
4. అసమ దృష్టి నివారణకు ఉపయోగించే కటకం ఏది?
   1) కుంభాకార 2) పుటాకార
   3) స్థూపాకార
   4) ఏదీకాదు
5. రేచీకటి నివారణకు ఉపయోగించే కటకం?
   1) కుంభాకార 2) స్థూపాకార
   3) పుటాకార
   4) ఏదీకాదు
6. దర్పణాలు ఏ ధర్మం ఆధారంగా పని చేస్తాయి?
   1) రుజువర్తనం 2) పరావర్తనం
   3) వక్రీభవనం 4) వివర్తనం

సమాధానాలు:
1) 1; 2) 4; 3) 2; 4) 3; 5) 4; 6) 2.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. ఆప్టికల్ ఫైబర్ ఏ సూత్రం ఆధారంగా పనిచేస్తుంది? (గ్రూప్-2, 2012)
   1) సంపూర్ణ కాంతి శోషణ
   2) కాంతి సంపూర్ణాంతర పరావర్తనం
   3) వివర్తనం
   4) పరావర్తనం
2. ఎరుపు అద్దంలో ఒక పుస్తకం అట్టను చూసినప్పుడు అది ఎర్రగా కనిపిస్తే వాస్తవానికి ఆ పుస్తకం అట్ట రంగు ఏది? (గ్రూప్-2, 2011)
   1) ఎరుపు 2) తెలుపు
   3) ఆకుపచ్చ
   4) ఎరుపు లేదా తెలుపు

సమాధానాలు: 1) 2; 2) 4.

మీర్ ఉస్మాన్ అలీఖాన్ ఆస్థానంలోని హిందూ దివాన్ పేరు?


గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ చరిత్ర

మాదిరి ప్రశ్నలు

1. కట్టె మనది.. కలప మనది.. అడవి మనది... భూమి మనది! అనే నినాదంతో గోండులు, కోయలు, చెంచులను సంఘటితం చేసి పోరుబాటలో నడిపించింది ఎవరు?
   1) గాంగంటం దొర
   2) అల్లూరి సీతారామరాజు
   3) కొమరం భీమ్ 4) అగ్గిరాజు
2. వితంతు పునర్వివాహ సంఘాన్ని మద్రాసులో ఎప్పుడు ఏర్పాటు చేశారు?
   1) 1871 2) 1872
   3) 1873 4) 1874
3. మహారాష్ట్రులు, నిజాం మధ్య 1738లో జరిగిన యుద్ధం ఏది?
   1) బొబ్బిలి యుద్ధం
   2) ఔరంగాబాద్ యుద్ధం
   3) భోపాల్ యుద్ధం
   4) రెండో కర్ణాటక యుద్ధం
4. 1948 ఏప్రిల్‌లో ఏర్పాటైన లాయర్ల నిరసన సమితి అధ్యక్షుడు?
   1) వినాయకరావు విద్యాలంకార్
   2) జమలాపురం కేశవరావు
   3) వి.పి.మీనన్
   4) బొమ్మకంటి సత్యనారాయణ
5. స్వామి రామానందతీర్థ వ్యక్తిగత సత్యాగ్రహాన్ని ఎప్పుడు ప్రారంభించారు?
   1) 1941 2) 1940
   3) 1939 4) 1938
6. వందేమాతర ఉద్యమ కాలంలో జి.సుబ్రమణ్య అయ్యర్ సంపాదకత్వంలో వెలువడిన పత్రిక?
   1) దేశమాత 2) స్వదేశీ మిత్రన్
   3) ఆంధ్రపత్రిక 4) స్వరాజ్య
7. గోల్కొండ రాజ్యాన్ని మొగలు సామ్రాజ్యంలో ఔరంగజేబు ఎప్పుడు విలీనం చేశాడు?
   1) 1687 2) 1677
   3) 1697 4) 1667
8. 'యథాపూర్వస్థితి ఒడంబడిక' మీద నిజాం సంతకం చేసిన తర్వాత ఏ ప్రాంతం నుంచి భారత సైన్యాలు ఉపసంహరించుకున్నాయి?
   1) సికింద్రాబాద్ 2) బొల్లారం
   3) తిరుమలగిరి 4) పైవన్నీ
9. పోలీసు చర్య తర్వాత 1948లో నిజాం పాలన ముగిసింది. 'అఖిలాంధ్ర మహాసభ'ను 1949లో ఎవరు నెలకొల్పారు?
   1) అయ్యదేవర కాళేశ్వరరావు
   2) కట్టమంచి రామలింగారెడ్డి
   3) దేవులపల్లి రామానుజరావు
   4) బూర్గుల రామకృష్ణారావు
10. 'ముల్కీ' ఉద్యమం అంటే?
    1) ఆంగ్లేయులకు వ్యతిరేకత
    2) ఉర్దూ అభివృద్ధి
    3) ఉద్యోగాల్లో స్థానికులకే ప్రాధాన్యత
    4) రెవెన్యూ సంస్కరణలు
11. 'ఇండియన్ ముసల్మాన్స్' గ్రంథాన్ని రచించిన ఆంగ్లేయుడెవరు?
    1) హంటర్ 2) కర్జన్
    3) లిట్టన్ 4) రిప్పన్
12. 1911లో ఏర్పాటు చేసిన 'మన సంఘం' లక్ష్యం ?
    1) దళితుల పిల్లల్లో విద్యావ్యాప్తి
    2) బాల్య వివాహాలను వ్యతిరేకించడం
    3) జోగిని, మురళి, బసివి వ్యవస్థల నిర్మూలన
    4) పైవన్నీ
13. అధికార భాషా సంఘం ఏర్పాటైన సంవత్సరం ?
    1) 1965 జనవరి 27
    2) 1966 ఫిబ్రవరి 13
    3) 1966 మార్చి 27
    4) 1967 ఏప్రిల్ 25
14. 1958లో జాతీయ అభివృద్ధి మండలి ఎవరి నివేదికను ఆమోదించింది?
    1) అశోక్ మెహతా కమిటీ
    2) రాకేష్ మోహన్ కమిటీ
    3) బల్వంత్‌రాయ్ మోహతా కమిటీ
    4) స్వరణ్‌సింగ్ కమిటీ
15. శాతవాహనుల కాలంలో బుద్ధుడి జన్మకు సంకేతం?
    1) పద్మం 2) ధర్మచక్రం
    3) స్తూపం 4) బోధివృక్షం
16. ఏ ప్రాంతీయ సంఘాల ఆవిర్భావంతో 1885లో జాతీయ కాంగ్రెస్ ఏర్పాటైంది?
    1) మద్రాసు మహాజనసభ
    2) ఇండియన్ అసోసియేషన్
    3) బాంబే అసోసియేషన్
    4) పైవన్నీ
17. విద్వాన్ విశ్వం, తరిమెళ్ల నాగిరెడ్డి రాసిన ఏ గ్రంథం సామ్యవాద ప్రచారానికి తోడ్పడింది?
    1) నవ్య సాహిత్యమాల
    2) సాహిత్య దర్శనం
    3) ఆంధ్ర సాహిత్య విమర్శ
    4) సాహిత్యంలో దృక్పథాలు
18. 'కుమార సంభవం' రచయిత?
    1) కొక్కిలి 2) పావులూరి మల్లన్న
    3) అయ్యన మహాదేవి
    4) నన్నెచోడుడు
19. కాకతీయుల కాలంలో తీర్థులంటే?
    1) సేనానులు 2) మంత్రులు
    3) సైనికులు 4) దూతలు
20. భారతదేశంలో మొదటిగా భూమిని దానం చేసిన రాజవంశం ఏది?
    1) కళింగులు 2) పల్లవులు
    3) శాతవాహనులు 4) శకులు
21. 1950 ఫిబ్రవరిలో విశాలాంధ్ర మహాసభ ప్రథమ సమావేశం ఎక్కడ జరిగింది?
    1) కడప 2) వరంగల్
    3) హైదరాబాద్ 4) గుంటూరు
22. మీర్ ఉస్మాన్ అలీఖాన్ ఆస్థానంలోని హిందూ దివాన్ పేరు?
    1) సర్ కిషన్ ప్రసాద్
    2) పింగళి వెంకట్రామిరెడ్డి
    3) సర్ భగవంత్ ప్రసాద్
    4) పండిత్ రామదాస్
23. 1938లో ఉస్మానియా యూనివర్సిటీలో హిందూ విద్యార్థులు ప్రారంభించిన రాజకీయ ఉద్యమం ఏ పేరుతో ప్రసిద్ధి చెందింది?
    1) జాయిన్ ఇండియా మూవ్‌మెంట్
    2) స్టేట్ కాంగ్రెస్ సత్యాగ్రహం
    3) వందేమాతర ఉద్యమం
    4) ముల్కీ ఉద్యమం
24. తెలంగాణ పరిరక్షణ దినాన్ని ఎప్పుడు పాటించారు?
    1) 1968 జూలై 10 2) 1969 జూన్ 10
    3) 1966 ఆగస్టు 20
    4) 1969 సెప్టెంబర్ 13
25. అస్పృశ్యుల గురించి రాసిన మొదటి నవల 'మాలపల్లి....' 1921 వెలువడింది. దీని రచయిత ఎవరు?
    1) ఉన్నవ లక్ష్మీనారాయణ
    2) దాశరథి 3) ఆదిరాజు వీరభద్రరావు
    4) సురవరం ప్రతాపరెడ్డి
26. గ్రంథాలయ ఉద్యమ నాయకుడు?
    1) కొమర్రాజు లక్ష్మణరావు
    2) అయ్యంకి వెంకట రమణయ్య



    3) నారాయణరావు
    4) సురవరం ప్రతాపరెడ్డి
27. కింది వాటిలో సరైంది?
    1) బాదామి చాళుక్యులు మహారాష్ట్ర ప్రాంతాన్ని పాలించారు
    2) వేములవాడ చాళుక్యులు కరీంనగర్ ప్రాంతాన్ని పాలించారు
    3) ముదిగొండ చాళుక్యులు మధిర, మానుకోట, వరంగల్ ప్రాంతాల్ని పాలించారు
    4) పైవన్నీ
28. మీర్ ఖమ్రుద్దీన్ ఖాన్‌కు 'అసఫ్ జా' బిరుదును ప్రదానం చేసిన మొగల్ చక్రవర్తి?
    1) బహదూర్ షా 2) ఔరంగజేబు
    3) మహమ్మద్ షా 4) షాజహాన్
29. ఆనందభైరవి రాగాన్ని తొలుత ఉపయోగించిన వాగ్గేయకారుడెవరు?
    1) త్యాగరాజు 2) క్షేత్రయ్య
    3) సారంగపాణి 4) రామదాసు
30. తూర్పు దేశాల్లో వర్తకం చేసేందుకు ఆంగ్లేయ వర్తకులకు అనుమతి ఇచ్చిన ఇంగ్లండ్ రాణి?
    1) ఎలిజబెత్-2 2) ఎలిజబెత్-1
    3) విక్టోరియా-1 4) విక్టోరియా-2
31. హరిజనుల సమస్యలను, వాటి పరిష్కార మార్గాలను ప్రజల, ప్రభుత్వ దృష్టికి తేవడానికి భాగ్యరెడ్డి వర్మ నడిపిన వారపత్రిక?
    1) మిర్రర్ 2) హైదరాబాద్
    3) విశాఖ 4) కృష్ణ పత్రిక
32. నాగార్జునుడు ఎవరి సమకాలీనుడు?
    1) యజ్ఞశ్రీ శాతకర్ణి
    2) గౌతమీపుత్ర శాతకర్ణి
    3) రెండో శాతకర్ణి 4) హాలుడు
33. శాతవాహనుల కాలంలో 'కోలిక'లనే వారు?
    1) వ్యవసాయదారులు
    2) నూనె తీసేవారు
    3) నేతపనివారు 4) ధాన్య వర్తకులు
34. 'ఘటిక' అనేది?
    1) దేవాలయం 2) బౌద్ధారామం
    3) విద్యాకేంద్రం 4) నాట్య కళాశాల
35. దంధోళి అంటే?
    1) ఒక రకమైన కత్తి
    2) ఒక రకమైన బాణం
    3) శత్రువులపై రాళ్లు రువ్వే ఫిరంగి
    4) అశ్విక దళం
36. లుంబినీ వనంలో శిలాశాసనాన్ని ప్రతిష్ఠించినవారు?
    1) ఆచార్య నాగార్జునుడు
    2) అశోకుడు 3) ఆమ్రపాలి
    4) ఆర్యదేవుడు
37. 'లెంకలు' అంటే?
    1) శత్రురాజులు 2) అంగరక్షకులు
    3) నేతపనివారు 4) విదేశీయులు
38. 1857 తిరుగుబాటులో బ్రిటీష్ వారికి సహాయం చేసి 'స్టార్ ఆఫ్ ఇండియా' బిరుదు పొందిన నిజాం నవాబు?
    1) నిజాం ఉల్‌ముల్క్ 2) నసీరుద్దౌలా
    3) మహబూబ్ అలీఖాన్
    4) అఫ్జలుద్దౌలా
39. బోలు శబ్దం వచ్చే ద్వారబంధం ఎక్కడ ఉంది?
    1) వేయి స్తంభాల గుడి
    2) రామప్ప దేవాలయం
    3) లేపాక్షి దేవాలయం
    4) భీమేశ్వరాలయం
40. 'అనల్ మాలిక్' అంటే?
    1) నేనే దేవుణ్ని 2) నేనే రాజును
    3) అల్లాయే ప్రభువు 4) ప్రభువే అల్లా
41. నన్నయ భట్టుకు ఆంధ్ర మహాభారత రచనల్లో తోడ్పడ్డ కవి?
    1) పాల్కురికి సోమనాథుడు
    2) నారాయణ భట్టు
    3) పండితారాధ్యుల మల్లికార్జునుడు
    4) రావిపాటి త్రిపురాంతక కవి
42. అశోకుని శాసన భాగం బయల్పడిన ప్రాంతం?
    1) శాలిహుండం 2) ధరణికోట
    3) కొట్లాం 4) రాజుల మందగిరి
43. తెలంగాణలో ముల్కీ నిబంధనలు ఎప్పుడు ప్రవేశపెట్టారు?
    1) 1888 2) 1890
    3) 1895 4) 1885
44. జాగిర్దారీ విధానంలో భూములు ఎవరి స్వాధీనంలో ఉండేవి?
    1) ముక్తేదారులు 2) ఇనాందారులు
    3) ఇజారీదారులు 4) పైవారందరూ
45. మిలిటరీ సామాగ్రిని నిజాం ప్రభుత్వం ఏ సంస్థ నుంచి కొనుగోలు చేసింది?
    1) టాటా కంపెనీ
    2) అట్లాస్ ట్రేడింగ్ సంస్థ
    3) మహీంద్ర అండ్ మొహమ్మద్
    4) 2, 3
46. 1958లో ఏర్పాటు చేసిన తెలంగాణ ప్రాంతీయ కమిటీని రాష్ట్రపతి ఉత్తర్వు మేరకు ఎప్పుడు రద్దు చేశారు?
    1) 1974 జనవరి 1
    2) 1975 ఫిబ్రవరి 2
    3) 1974 డిసెంబర్ 4
    4) 1973 నవంబర్ 1
47. శాతవాహనుల కాలం నాటి సాంఘిక జీవనాన్ని తెలియజేసే గ్రంథం?
    1) గాథాసప్తశతి 2) కథా సరిత్సాగరం
    3) సుహృల్లేఖ 4) శూన్య సప్తశతి

సమాధానాలు

1) 3; 2) 4; 3) 3; 4) 4;
5) 2; 6) 2; 7) 1; 8) 3;
9) 1; 10) 3; 11) 1; 12) 4;
13) 3; 14) 3; 15) 1; 16) 4;
17) 1; 18) 4; 19) 2; 20) 3;
21) 2; 22) 1; 23) 3; 24) 1;
25) 1; 26) 1; 27) 4; 28) 3;
29) 4; 30) 3; 31) 2; 32) 1;
33) 3; 34) 3; 35) 3; 36) 2;
37) 2; 38) 4; 39) 2; 40) 2;
41) 2; 42) 4; 43) 1; 44) 4;
45) 4; 46) 1; 47) 1.

Teenagers without guidance can be easily..



BANK EXAMS

GENERAL ENGLISH

Directions (Q. 1 - 5): Which of the phrases (1), (2), (3), (4) and (5) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct?

1. The footprints might be done by burglars.
   1) Doing 2) made 3) worked 4) put 5) post
2. This problem can be solved by control pollution.
   1) controlled 2) controlling 3) continuous 4) continuing 5) controls
3. Manohar woke up late. Consequent he missed the train.
   1) Subsequent 2) Concurrent 3) In addition 4) Consequently 5) In spite of
4. They thanked to the family for helping them.
   1) thanks 2) thank 3) thank you 4) thanked 5) thanking
5. Teenagers without guidance can be easily influence.
   1) influences
   2) were influenced
   3) was influence
   4) influenced 5) influencing

Directions (Q. 6-10): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence, mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

6. In all (1)/ that excitement. (2)/ I had forgotten (3)/ to take my present for him. (4)/ No error (5)
7. The magic show last night (1)/ was a great success. (2)/ The news was published on the newspaper this morning. (3)/ It was well-written. (4)/ No error (5)
8. The teacher let us paint with our pencils. (1)/ But she did not allow us (2)/ to do exercises in the same way. (3)/ Instead, she wanted us to write with ink. (4)/ No error (5)
9. Last week, an unemployed man killed self (1)/ by jumping down from the roof of a flat. (2)/ He was stupid. (3)/ He must face up to realities. (4)/ No error (5)
10. Feeling bored after a day's work, (1)/ I and my friend decided (2)/ to go for a film (3)/ show at the INOX that night. (4)/ No error (5)

Directions (Q. 11-15): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

11. The court _____ all the three accused setting _____ the earlier order sentencing them to four years in prison.
    1) convicted, ahead
    2) acquitted, aside
    3) charged, above
    4) demanded, forth
    5) ruled, forward
12. Chandrayaan II the _____ project would be another _____ in the history of the country's space ventures.
    1) ambivalent, historical
    2) ambiguous, milestone
    3) ambitious, landmark
    4) ambition, rarity
    5) ambidextrous, feather
13. The bank _____ agricultural growth to be lower due to _____ an uneven rains.
    1) experience, lower
    2) predicts, heavy
    3) expects, deficit
    4) foretell, scarce
    5) outlooks, surplus
14. Foreign _____ look at India as one among _____ markets.
    1) business, many
    2) employees, growing
    3) employers, subsidiary
    4) tourists, sample
    5) investors, emerging
15. Excavations had ____ the _____ significance of the cannons.
    1) exposed, mastery
    2) rejoiced, importance
    3) told, prominent
    4) reformed, pointed
    5) revealed, historical

Directions (Q. 16-20): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A. CO and H_2 are the most common molecules in interstellar gas clouds.
B. Stars from inside relatively dense concentrations of interstellar gas and dust known as molecular clouds.
C. When the density reaches a certain point, stars form.
D. The deep cold also causes the gas to clump to high densities.
E. At these temperatures, gases become molecular meaning that atoms bind together.
F. These regions are extremely cold temperature about 10 to 20K, just above absolute zero.

16. What is the LAST sentence after rearrangement?
    1) C 2) B 3) D 4) E 5) F
17. What is the THIRD sentence after rearrangement?
    1) A 2) B 3) E 4) F 5) C
18. What is the FIRST sentence after rearrangement?
    1) A 2) C 3) B 4) E 5) D
19. What is the FIFTH sentence after rearrangement?
    1) B 2) C 3) D 4) E 5) F
20. What is the SECOND sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) E 5) F

Directions (Q. 21-25): Read the following passage carefully and answer the questions given below it.

For many people the first primitive testimonies of magnetite started from Peter Peregrinus in 1269 and it might be true but let me know about the person who has first found that stone that we now call a magnet, the story goes round a shepherd named Magnet and he first of all discovered the magnet when an iron tip of his crook was pulled towards the stone which we now call as a magnet. The magnetic field around our planet earth was measured to be 4.0 Gauss about 4,000 years and it is same even today so it can be said that it is one of the first natural force which man had discovered years ago. Cleopatra who is still remembered as the beautiful women of the world has been reported to wear a magnet on her forehead to avoid the signs of aging. And at that time the magnet was called as Lodestone. Scientists believe that birds are the only creatures that can see the magnetic field of earth and this force helps them in finding their home in the long distance flights. Usually the magnets are made up of iron or steel but we can also make very powerful magnets through special alloys of nickel, copper, cobalt and aluminum. Hammering a magnet results in demagnetization because the molecules inside the magnet gets scattered and thus lose their North and South Pole's alignment. The same phenomenon occurs when a magnet is heated on a flame. The modern medical science has also observed magnets to be quite affective in curing different diseases and thus for the treatment of many major diseases like cancer the affect of magnetism are utilized. Some veterinarians use magnets to retrieve a wire or any other metal body from the stomach of an animal. The earth magnet is also like a long bar of magnet that is located at the center of earth. The study of ocean floor core samples was carried out by some scientists and it was found that the giant vertebrates of our earth like dinosaurs died due to the decline of earth's magnetic field. So these were some interesting facts about magnets that have been found by many scientists after series of researches. The more the researches were carried on magnets and magnetic field the more fields of life started getting benefits from the magnets, till now all the industries including medical to latest technologies are getting benefits from magnets.

21. In ancient times magnet was also called as:
    1) a healing stone
    2) a powerful stone
    3) a miracle stone
    4) a lodestone
    5) mystery stone
22. Demagnetization occurs through
    1) hammering and heating
    2) lose of south pole
    3) loss of north pole
    4) repulsion between the molecules
    5) attraction between the molecules
23. Veterinarian is
    1) using his powers to remove wire
    2) cleans animals
    3) who treats animals
    4) recognize diseases
    5) cures cancer
24. The extinction of dinosaurs happened because
    1) man used his intelligence
    2) survival of the fittest
    3) struggle for existence
    4) decline of earth's magnetic field
    5) series of researches were carried
25. The natural force which man had discovered years ago
    1) was powerful in curing many diseases
    2) was not realized for a longer period of time
    3) still research is needed in this area
    4) enhanced its value over the years
    5) remains the same even after so many years

ANSWERS

1) 2	2) 2	3) 4	4) 4	5) 4
6) 4	7) 3	8) 4	9) 1	10) 2
11) 2	12) 3	13) 3	14) 5	15) 5
16) 1	17) 3	18) 3	19) 3	20) 5
21) 4	22) 1	23) 3	24) 4	25) 5

విద్య, ఉద్యోగ సమాచారం

ఐసీఎంఆర్ న్యూఢిల్లీలో యంగ్ ప్రొఫెషనల్ పోస్టులు

న్యూఢిల్లీలోని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్(ఐసీఎంఆర్) ఒప్పంద ప్రాతిపదికన యంగ్ ప్రొఫెషనల్-2 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం పోస్టుల సంఖ్య: 02
- అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్శిటీ 55 శాతం మార్కులతో పీజీలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. వయసు: 45 ఏళ్లు ఉండాలి.
- వేతనం: నెలకు రూ.42,000.
- ఎంపిక విధానం: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- దరఖాస్తు విధానం: ఈమెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- ఈమెయిల్: ncd2.icmrhq @gmail. com.
- దరఖాస్తులకు చివరితేది: 29.07.2025.
- వెబ్‌సైట్: https://www.icmr.gov.in